# హేతువాదం
# అపోహాలు, అపార్థాలు

## గుమ్మా వీరన్న

హేమా పబ్లికేషన్స్
చీరాల - 523 155

# హేతువాదం
# అపోహలు, అపార్థాలు

గుమ్మా వీరన్న

హేమా పబ్లికేషన్స్
చీరాల - 523 155

**హేతువాదం - అపోహలు, అపార్థాలు**
**Hetuvadam - Apohalu, Aparthalu**

రచయిత - గుమ్మా వీరన్న

ప్రథమ ముద్రణ - 2012

ప్రతులు - 1000

వెల -

- రచయితవి

ప్రచురణ - హేమా పబ్లికేషన్స్
చీరాల - 523155

ప్రతులకు - గుమ్మావీరన్న
5-4-1413, శారదానగర్
వనస్థలిపురం
హైదరాబాద్ - 500 070
సెల్ - 98666 81927

ఇ-మెయిల్ - gveeranna1952@gmail.com

* * *

నవోదయ బుక్ హౌస్
ఆర్యసమాజ్ ఎదుటి వీధి
కాచిగూడ, హైదరాబాద్

* * *

ఎడిటర్
హేతువాది
చీరాల - 523 155

ముద్రణ - అనుపమ ప్రింటర్స్
శాంతి నగర్
హైదరాబాద్
ఫోన్ - 14045263



**శ్రీ నర్రా కోటయ్య**

సహృదయులు శ్రీ నర్రా కోటయ్యగారు హేతువాద ఉద్యమంలో గత మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్నారు. కవిరాజు త్రిపురనేని రామస్వామిగారి భావాల ప్రభావంతో హేతువాదిగా మారారు. ప్రముఖ హేతువాదులు తాపీ ధర్మారావు వంటి వారితో వీరికి సన్నిహిత సంబంధాలున్నాయి. వీరు సాహితీ ప్రియులు. హేతువాద సాహిత్య అధ్యయనంతోపాటు రచయితలను ప్రోత్సహించడం వీరిలో ఉన్న సుగుణం. వీరు అనేక గ్రంథాల స్వీకర్త.

నర్రా కోటయ్యగారితో రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న నా స్నేహానికి, ఆత్మీయతా అనుబంధానికి జ్ఞాపికగా 'హేతువాదం-అపోహలు, అపార్థాలు' అనే నా పుస్తకాన్ని అభిమానంతో అంద జేస్తున్నాను.

గుమ్మా వీరన్న
రచయిత

# విన్నపం

మానవుడు ఎంత ప్రాచీనుడో హేతువాదం అంత ప్రాచీనమైనది. నియమ బద్ధమైన విశ్వం నుండి జీవపరిణామక్రమంలో హేతుత్వాన్ని సంతరించుకున్న మానవుడు తనలో హేతుత్వం పనిచేస్తున్నదని తెలియనినాడు సైతం దాన్ని నిరంతరాయంగా వినియోగించుకోగలిగాడు. తన చుట్టూ వున్న భౌతిక విశ్వంలో జరుగుతున్న అనేకానేక సంఘటనలకు కారణాలను వెదికే క్రమంలోనే దేవుళ్ళను, మతాలను సృష్టించుకొన్నాడు. దేవుళ్ళను తృప్తిపరిస్తే తన సమస్యలు, భయాలు తొలగిపోతాయని భ్రమించి వారికి బలులివ్వడం ప్రారంభించాడు. ఆ క్రమంలోనే పూజలు, భజనలు, ప్రార్థనలు, ఆరాధనలు చేస్తూ వేలాది ఆచార సాంప్రదాయాలను సృష్టించుకొన్నాడు. వాటిని వేలాది సంవత్సరాలుగా ఆచరిస్తూ వస్తున్నందువల్ల అవి అతని జీవితంలో భాగంగా మారిపోయాయి. చివరికి మనుషుల స్వరూప స్వభావాలను నిర్దేశించి, నియంత్రించే జన్యువులలో భాగంగా స్థిరపడిపోయే స్థితికి చేరుకున్నాయి. అందువల్ల మూఢనమ్మకాల రూపంలో కొనసాగుతున్న ఆచార సాంప్రదాయాలన్నీ అంత తేలికగా అంతరించిపోయే అవకాశాలు లేవని అర్థమవుతోంది.

విజ్ఞానవంతులైనవారు సైతం తమ విజ్ఞానాన్ని తమ వృత్తి వ్యాపారాల వరకే పరిమితం చేస్తున్నారు. మిగతా వ్యవహారాలలో మాత్రం తమ వివేకాన్ని నిద్రపుచ్చి ఆటవికదశకు సంకేతాలుగా మిగిలిపోయిన ఆచారాలనే కొనసాగించడానికి ఇష్టపడుతున్నారు. ఈ విధంగా జీవితంలో ద్వంద్వ ప్రమాణాలకు అలవాటు పడి పోతున్నారు. అందువల్లనే ఒకవైపు ఆధునిక విజ్ఞానం అందించే సకల సౌకర్యాలను అనుభవిస్తూనే మరోవైపు అంధవిశ్వాసాలను ఆచరిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

ఈ విషమ పరిస్థితుల నుండి మనుషులు బయటపడాలంటే ముందుగా వారి మెదళ్ళలో గూడుకట్టుకున్న బూజుపట్టిన మత భావాలను తొలగించవలసి వుంటుంది. అటువంటి బృహత్తరమైన కార్యాన్ని నెరవేర్చడానికి కావలసింది హేతువాద భావాలతో కూడిన భావవిప్లవోద్యమమే.

హేతువాద భావాలను ప్రచారం చేసే క్రమంలో చాలారకాలైన అపోహలు, అపార్థాలు చోటు చేసుకుంటున్నాయి. సరియైన హేతువాద భావాలకు బదులుగా నానారకాలైన అపోహలు, అపార్థాలు ప్రచారం పొందుతున్నాయి. అటువంటి అపోహలను, అపార్థాలను ప్రచారం చేస్తున్నది మతవాదులైతే వారి నైజాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. మతస్తులంతా హేతువాద భావాలంటే గిట్టని వారే.

అయితే కొందరు మాత్రం తాము మతాలకు, మత భావాలకు వ్యతిరేకమని చెబుతూనే హేతువాద భావాలకు వక్రభాష్యాలు చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. మరికొందరు అభ్యుదయ భావాల ముసుగులో మత భావాలను సమర్థించడానికి ప్రయత్నిస్తున్నారు.

సైన్సుకంటే కళలే గొప్పవని, సైన్సుకు పునాది కళలేనని, సైన్సులో ప్రయోగం ద్వారా శాస్త్రజ్ఞుడు ఒక స్థాయిలో సత్యాన్ని తెలుసుకుంటే, 'యోగం' ద్వారా యోగి మరోస్థాయిలో సత్యాన్ని తెలుసుకుంటాడని, సత్యాన్ని తెలుసుకోడానికి సైన్సు మాత్రమే చాలదని, కళలు, యోగం వంటి ఇతర సాధనాలు వున్నాయనే వాదాన్ని ప్రతిపాదిస్తూ ఎన్.వి.బ్రహ్మంగారు 'కళాశాస్త్ర వివాదంలో హేతువాది హేతువాదం' అనే గ్రంథాన్ని రాశారు.

ప్రకృతిలో వైరుధ్యాలున్నాయని, అవే మానవులలో సంఘర్షణలుగా పరిణమించాయని, విశ్వసించే తత్వానికి మూలం ప్రకృతిలోనే వుందని, కావున దాన్ని తొలగించడానికి వీలుకాదని, భయం ద్వారా తప్ప స్వేచ్ఛద్వారా మనుషులను మార్చలేమని పలురకాల అభిప్రాయాలతో డి.వి.ఆర్.కె.రావుగారు హేతువాది మాసపత్రికలో 2010 మే, జూన్, జులై సంచికలలో 'హేతువాద ఉద్యమ సాఫల్యం - సాధ్యాసాధ్యాలు' అనే శీర్షికన వ్యాసాలు రాశారు.



హేతువాదం పేరుతో కమ్యూనిస్టు సిద్ధానితాలను సమర్థించేవారు ఉన్నారు. హేతువాద ఆచరణకు సంబంధించి అనేక అపోహలను, అపార్థాలను సృష్టిస్తూ అవాకులు చవాకులు పేలుతూ హేతువాదుల గురించి విష ప్రచారాన్ని సాగించేవారు ఇంకోవర్గం. నాస్తితత్వాన్నే నాస్తికత్వంగా ప్రచారం చేసేవారు. హేతువాదాన్ని నాస్తిక వాదంతో సమానంగా భావించేవారు. భౌతిక వాదమంటే కూడుగుడ్డల వాదంగా కించపరిచేవారు. చాలా రకాలుగా అపోహలను, అపార్థాలను సృష్టించి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

వీటన్నిటినీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, విశ్లేషిస్తూ వివరించవలసిన బాధ్యత హేతువాద శ్రేయోభిలాషులందరి మీదా వుంది. ఆ బాధ్యతలో భాగంగానే నేను హేతువాదానికి సంబంధించిన అపోహలను, అపార్థాలను వివరిస్తూ చాలా కాలంగా 'హేతువాది' మాస పత్రికలో వ్యాసాలు రాస్తూనే వున్నాను. రాయవలసినవి ఇంకా చాలా మిగిలే వున్నాయి.

ఈ వ్యాసాలలో ప్రస్తావించిన ఆయా వ్యక్తుల పట్లగాని, సంస్థల పట్లగాని వ్యక్తిగతంగా నాకెటువంటి వ్యతిరేక భావమూ లేదని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. కేవలం వారు వెల్లడించిన భావాలలోని మంచి చెడ్డలకే నా విమర్శ పరిమితమైంది. ఈ పుస్తకంలో ఇతర వ్యాసాలతోపాటు ఎన్.వి.బ్రహ్మం గారు, డి.వి.ఆర్.కె.రావుగారు, ప్రొ॥ రామచంద్రయ్యగారు వెల్లడించిన భావాలపై నా విమర్శ సాగింది. బ్రహ్మంగారితో, డి.వి.ఆర్.కె. రావుగారితో నాకు మూడు దశాబ్దాల వ్యక్తిగత పరిచయం, స్నేహం వున్నాయి.

విమర్శలను విషయాలవరకే పరిమితం చేయడం నా విధానం. తప్పు భావాలను విమర్శించడం, తప్పు పద్ధతులను ఖండించడం, విషయపరంగా భేదాభిప్రాయాలను సహించడం హేతువాద విధానంగా భావిస్తాను. భావాల విమర్శలో పెద్దవారు, చిన్నవారు అనే తారతమ్యాలకుగాని, నా వారు, నీ వారు అనే అభిమాన దురభిమానాలకుగాని తావుండరాదు. నిరాధారమైన ఆరోపణలకు, వ్యక్తిగతమైన దూషణభూషణలకు దూరంగా వున్నపుడే ఆ విమర్శ సద్విమర్శ అవుతుంది. నా రచనలలో ఈ దృక్పథాన్నే అవలంబిస్తున్నాను.

ఈ పుస్తకంలోని కొన్ని వ్యాసాలలో అక్కడక్కడ చిన్న చిన్న మార్పులు చేర్పులు చేశాను. కొన్ని భావాలు పునరావృతమైనా అవి సందర్భోచితంగా ఉన్నందువల్ల వాటిని అలాగే వుంచాను.

ఈ గ్రంథంలోని వ్యాసాలు చాలావరకు హేతువాది పత్రికలో అచ్చయినవే.

ఈ వ్యాసాలను అచ్చువేసినందులకు 'హేతువాది' పత్రికా సంపాదకులకు నా కృతజ్ఞతలు.

90 సంవత్సరాల వయస్సులో వుండి కూడా ఓపికగా చదివి, ఈ గ్రంథానికి అమూల్యమైన 'పరిచయం' రాసిచ్చిన భారత హేతువాద సంఘం అధ్యక్షులు శ్రీ రావిపూడి వెంకటాద్రి మేష్టారుగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ గ్రంథాన్ని డి.టి.పి. చేసిచ్చిన మిత్రులు ఎమ్. శ్రీధర్‌గారికి, శ్రీమతి దామరాజు నాగలక్ష్మిగారికి, అందంగా అచ్చువేసిచ్చిన అనుపమ ప్రింటర్స్ మూర్తిగారికి నా ధన్యవాదాలు.

హేతువాద భావాలలో స్పష్టతకోసం రచించిన ఈ గ్రంథాన్ని పాఠకులందరూ తప్పక ఆదరిస్తారని ఆశిస్తాను సెలవు.

- గుమ్మా వీరన్న

హైదరాబాదు
తేది - 2-01-2012

# పరిచయం

హేతువాదం గురించి కొంతమందిలో అనేక తరహాల అపోహలు, అపార్థాలు వున్నాయి. అలా అపోహపడి అపార్థం చేసుకొనేవారిలో ముఖ్యంగా ప్రగతివాద ముద్రలో కొనసాగేవారు కూడా వున్నారు. ఇలా ఎందుకు జరుగుతోంది అనే ప్రశ్నను హేతువాద ముద్రల క్రింద చలామణి అయ్యేవారు వేసుకొని సమాధానాన్ని సమీకరించుకోవాలి.

1981లో రాజమండ్రిలో ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ ప్రథమ మహాసభలు ముగిసిన తరువాత ఆ సభలకు శ్రోతలుగా హాజరయిన కొంతమంది సనాతనులు 'ఆస్తిక హేతువాద సంఘాన్ని' యేర్పరచుకున్నారు. అంటే, హేతువాదమంటే నాస్తికత్వమేననీ, ఆస్తికతకు వ్యతిరేకమనీ వారు అర్థం చేసుకున్నారు. వారి దృష్టిలో మత మూలాలను అంగీకరించని వారంతా నాస్తికులే. 'నాస్తికో వేదనిందక..' అనేది వారి పడికట్టు పదం.

దేవుడి అస్తిత్వాన్ని అంగీకరించనివాడు నాస్తికుడని సామాన్యుడి భావం. సనాతనులంతా సామాన్యులేకాన అలావారు అర్థం చేసుకోవడంలో విడ్డూర మేమీలేదు.

కానీ, నాస్తికముద్ర క్రింద చలామణి అయ్యేవారిలో కూడా నాస్తికత్వం విషయంలో ఏకీభావం లేదు. ఏది 'ఉన్నది'గా మనకు 'కనిపిస్తున్నదో' అదంతా మన మనస్సు కల్పిస్తున్నదే తప్ప, వాస్తవంగా దానికి 'ఉనికి' లేదనేది ఒక నాస్తికత్వ వైఖరి. నాస్తిక నిర్ణయానికి చేరడానికి స్వేచ్ఛాలోచన అవసరం లేదని నియంతల వైఖరి. హేతువాదంతో, శాస్త్ర విజ్ఞానంతో పనిలేదంటూ, కేవలం మత మౌఢ్యాన్ని నిరాకరించడమే నాస్తికత్వమనే వారిది మరో వైఖరి. ఇంతేకాక, నాస్తిక ముద్ర క్రింద ప్రయాణించే వారిలో యితర తరహాల వారు కూడా వుండవచ్చు. అంటే, ఒక్క హేతువాదం విషయంలోనే కాక, నాస్తికత్వాది యితర తాత్వికాంశాల సందర్భంలో కూడా ఆయా వాదాలను పట్టుకొని ప్రాకులాడేవారిలో కూడా అపోహలు, అపార్థాలు వున్నాయన్నమాట. నిజానికి హేతువాద చింతనలో అలాంటి తికమకకు (confusion) తావు లేదు. దాని ద్వారా మానవవాద మార్గానికి చేరడంలో నాస్తికత్వం తొలి మజిలీ, భౌతికవాదం మలి మజిలీ.

హేతువాదం సిద్ధాంతం కాదు. అది సహేతుక ఆలోచనా విధానం. ప్రకృతిలోని సంఘటనల క్రమం ద్వారా అది మనిషికి సంక్రమించింది. విశ్వవ్యాప్తంగా మనకు దర్శనీయమవుతున్నదాన్ని పదార్థమనండి, ద్రవ్యమనండి, క్షేత్రమనండి - అదంతా సంఘటనల అనితరమైన వాస్తవిక జగత్తు సంఘటనల పూర్వాపరాలే మన అవగాహన లోకి వస్తున్నాయి. వాటి అనుస్పందనే హేతుత్వం. వాటిని మనం కారణకార్యాలుగా విభజించుకొని వ్యవహరిస్తున్నాం. అందువల్ల, కారణకార్యాలను విశ్వవాస్తవికతకు వెలుపల అన్వయించడానికి వీలులేదు. హేతువాద చింతనలో విశ్వం ఉనికికి వెలుపలి కారణాన్ని సంధించడానికి అవకాశంలేదు. అందువల్లనే మనం సృష్టికర్త (దేవుడు) వంటి అసంబద్ధ అహేతుక భావాలను వ్యతిరేకించవలసి వస్తుంది. ఇలా హేతువాదం నాస్తిక నిర్ణయానికి వచ్చినంత మాత్రాన హేతువాదమంటే నాస్తికత్వమని సమీకరించడానికి వీలులేదు.

కాని, లేని దేవుణ్ణి లేదనడంతో హేతువాదం సరిపుచ్చుకోదు. ఉన్నదేమిటో, అదియెలా ప్రవర్తిస్తున్నదో, దాని వల్ల వస్తుజ్ఞానం మనకు ఎలా లభిస్తున్నదో, ఆ జ్ఞానం వల్ల వాస్తవిక సత్యం ఎలా మనకు అందుతున్నదో వ్యక్తం చేసే భౌతిక వాదానికి దారితీస్తుంది. హేతు చింతన ద్వారానే మనం ఈ నిర్ణయానికి చేరతాం. అయితే, దీనికి తర్కాన్ని తగిలించడం సరయిన పద్ధతి కాదు. తర్కం ప్రతిపాదనల (premises) మీద నుంచి ఔగాములను నిర్ణయిస్తుంది. ప్రతిపాదనలు తప్పయినప్పుడు తార్కిక నిర్ణయం తప్పవుతుంది. ఈ పెడలాగుడును హేతువాదం ఆమోదించదు. అందువల్ల హేతువాదం, తర్కం ఒకటి కావు. అయినా, సరయిన ప్రతిపాదనల మీద నుంచి తార్కికంగా నిర్ణయాలు తీసుకోవచ్చు.

మరి హేతువాదానికి గమ్యమేమిటి? అనే ప్రశ్న వుంది. ఎప్పటికప్పుడు ముమ్ముందుకు సాగే మానవవాద మార్గమే హేతువాదం లక్ష్యం. నిజానికి, నాస్తిక భౌతిక వాదాలు కూడా హేతువాద మానవవాద పరిధిలోనివే. జ్ఞానానికి పరిమితి లేదు. దాని ద్వారా మనకు లభించే వాస్తవిక సత్యానికి కూడా పరిమితి లేదు. ఇతోధిక జ్ఞానం, ఇతోధిక సత్యానికి దారి తీస్తుంది. జ్ఞానమూ, సత్యమూ - రెండూ సాపేక్షాలే.

ఏనాటికానాడు మనం వాస్తవిక సత్యాన్ని గ్రహించడం వల్ల జగత్తులో జరిగే సంఘటనల్లో దేన్ని వరిస్తే మనకు కష్టం కాక సుఖం, నష్టం కాక లాభం, చెడు కాక మంచి చేకూరుతుందో మనకు అవగతమవుతుంది. కష్టాన్ని కాక సుఖాన్నీ, నష్టాన్ని కాక లాభాన్నీ, చెడును కాక మంచినీ ఎన్నుకునే స్వేచ్ఛ మనకు లభ్యమవుతుంది.



అంటే, సత్యం స్వేచ్ఛకు దారి తీస్తుంది. ఈ స్వేచ్ఛ మానవ విలువలన్నిటిలో అత్యుత్తమమైనది. ఆ స్వేచ్ఛే మన నడవడికకు ఉత్తమ మార్గాన్ని చూపుతుంది.

మనిషి తన శ్రేయస్సు కోసమే సంఘ దశను దాటి సమాజాన్నీ, వ్యవస్థలనూ నిర్మించుకున్నాడు. అవి సమరసంగా నడవాలంటే మనుషులు ఒకరి శ్రేయస్సుకు వ్యతిరేకంగా మరొకరు ప్రవర్తించరాదు. అదే సామాజిక నీతి. ఆ విధంగా హేతువాద ఆలోచనా పద్ధతిలో జ్ఞానం, సత్యం, స్వేచ్ఛ, నీతి అనేవి ఒక శ్రేణిలో నిలుస్తాయి. ఇదే మానవవాదానికి ఊపిరి.

దీన్ని ఇలా అర్థం చేసుకోజాలక పోవడం వల్లనే ఎంతో కొంత అభివృద్ధి సాధించిన ఆధునిక సమాజంలో సైతం మనుషుల మధ్య అంతరాలు చెరిగిపోలేదు. ఆధునిక విజ్ఞాన శాస్త్ర తాత్విక ఫలితాలు అంతంత మాత్రాన సామాజికులందరికీ అందజాలకపోవడం ఒక కారణం కావచ్చు. కాని, సాంకేతిక, విజ్ఞాన ఫలితాలు కొన్ని వెర్రితలలు వేసి మతాల మధ్య, జాతుల మధ్య చిచ్చు రేపి మనిషిని మరో భావదాస్య యుగంలోకి లాగుతున్నాయి. అందుకే హేతువాదులు సమగ్ర భావవిప్లవం రావాలనీ, అది సాంస్కృతిక విప్లవానికి దారి తీసి మానవ మనుగడను సుఖప్రదం చేయాలనీ కోరుకుని అందుకొరకు కృషి చేస్తున్నారు.

ఆధునిక విజ్ఞాన శాస్త్ర తాత్విక ఫలితాలకు దగ్గర కావలసిన మనిషి ఆ ఫలితాలనే వెనక్కు తిప్పి మత వైఖరిని సమర్థించుకొనే స్థాయికి దిగజారుతున్నట్లు కనిపిస్తోంది. గతంలో అభ్యుదయ భావోద్యమాలను నిర్మూలించి మతాలు నిలదొక్కుకున్న పరిస్థితిని ఈ సందర్భం గుర్తుచేస్తున్నది. ఇప్పుడు ఆధునిక విజ్ఞానాన్ని వ్యతిరేకించేవారు కొందరుండగా, ఆ శాస్త్ర విజ్ఞానాన్నే మత సమర్థనకు వినియోగించుకోడానికి మరికొందరు నడుం కట్టారు. అలాగే హేతువాదాన్ని, మానవవాదాన్ని వ్యతిరేకించేవారు కొందరుండగా, మరి కొందరు వాటి మౌలికాంశాలపై సంశయాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ వైపరీత్యాన్ని ఎదుర్కొని సవ్యమార్గాన్ని చేపట్టడానికి తాత్కాలిక సంస్కరణలు చాలవు. సంస్కరణ వాదం కొన్ని సామాజిక దౌష్ట్యాలను ఎదుర్కొని సంస్కరించింది కాని, సకల దౌష్ట్యాలకు మూలమయినా మతం జోలికి పోలేదు. మత మూలాలను మతతుల్యమైన ఉద్యమాల మూలాలను భావదాస్యాన్ని తొలగించనిదే స్వేచ్ఛా సమాజం సిద్ధించదు. ఏ తాత్వికాంశాలూ, సిద్ధాంతాలూ జిడ్డు కట్టకూడదు. దేన్ని ఆమోదించడానికయినా, లేక దేన్ని త్యజించడానికయినా స్వేచ్ఛయే మనిషికి మార్గం చూపాలి.

ఈ నేపథ్యంలోనే ఈ వ్యాస సంచయాన్ని అర్థం చేసుకోవాలి. తొలుత తీవ్రవాద ఉద్యమాల్లో వున్న గుమ్మా వీరన్నగారు 30 సంవత్సరాల క్రిందటే హేతువాద ఉద్యమానికి దగ్గరయ్యారు. అంతకు ముందే రచనకు అలవాటు పడ్డ వీరన్నగారు ఈ 30 సంవత్సరాలుగా "హేతువాది" మాసపత్రికలో ఎన్నో వ్యాసాలు వ్రాశారు. అందులో కొన్ని పుస్తకాలుగా సంకలనమయ్యాయి. ఇంకా సంకలనం కావలసిన వ్యాసాలు చాలా వున్నాయి. హేతువాద మానవవాదాల గురించి వీరన్నగారికి స్పష్టమైన అవగాహన వుంది. హేతువాది పత్రికలో అచ్చయిన వీరన్నగారి వ్యాసాలను చదివి, అవి నేనే వ్రాసి వీరన్నగారి పేరు పెట్టానని కొందరు మిత్రులు నన్నడిగారు. వీరన్నగారే స్వయంగా వాటిని వ్రాశారని తెలిశాక వారు విస్మయం చెందారు. దానికి కారణం వారి రచనల్లో కనిపించే స్పష్టత, అవగాహనలే.

అవి కాక వారి రచనల్లో స్వతంత్ర గ్రంథాలూ, అనువాదాలూ వున్నాయి. అయితే, ఎందులోనూ మిత్రులు వీరన్నగారు హేతువాద దృక్పథాన్ని తప్పలేదు. నిజానికి, వీరన్నగారి రచనల్లో అత్యధిక భాగం హేతువాదం పైన గల అపోహలు, అపార్థాల గురించే. అలాంటి కొన్ని వ్యాసాల గుచ్ఛమే ఈ "హేతువాదం - అపోహలు, అపార్థాలు".

వీరన్నగారు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘానికి అధ్యక్షులు. ఇన్నేళ్ళుగానూ ఆయన ప్రభుత్వ శాఖలలో ఉన్నత పదవుల్లో వుండిపోయారు. వీరన్నగారి మేధో వికాసం ప్రకారం ఆయన యెన్నడో హేతువాద సంఘ బాధ్యతలు చేపట్టి వుండవలసింది. అందుకే ఆయన ప్రభుత్వ పదవీ విరమణ అనంతరం ఆయనను ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ బాధ్యత వరించింది.

చాల జటిలమైన విషయాలను సరళమైన భాషలో వ్యక్తీకరించడం వీరన్నగారి ప్రత్యేకత. ఆయన రచనలేవీ హేతువాద మానవవాద మార్గాన్ని తప్పలేదు. అలా తప్పకుండా వ్రాయడమే వీరన్నగారి ప్రత్యేకత. ఆయన చాలా అపోహలకు, అపార్థాలకు సమాధానంగా చాలా వ్రాశారు. అందులో ఈ సంకలనంలోని వ్యాసాలు కొన్ని మాత్రమే.

రావిపూడి వెంకటాద్రి
29-12-2011, చీరాల

# వ్యాసక్రమం


| | |
|---|---|
| హేతువాదం - అపోహలు, అపార్థాలు | 15 |
| హేతువాద ఉద్యమ సాఫల్యం - సాధ్యాసాధ్యాలు | 50 |
| దేవుడున్నాడా లేడా ? | 73 |
| సత్యం - సాక్ష్యాధారాలు | 85 |
| తాత్విక విప్లవం | 93 |
| మూఢనమ్మకాలు - హేతువాద వైఖరి | 105 |
| సేవాకార్యక్రమాలు - హేతువాద వైఖరి | 112 |
| నియంతృత్వ మతానుకూల కమ్యూనిస్టులు హేతువాదులా? | 121 |
| హేతువాదం - మానవవాదం | 130 |

# హేతువాదం - అపోహలు, అపార్థాలు

హేతువాదం ఇటీవలి కాలంలో బహుళ ప్రచారం పొందుతున్న పదం. ప్రత్యేకించి మనరాష్ట్రంలో హేతువాద ఉద్యమం తాత్విక విప్లవ స్థాయిలో బలంగా వేళ్లూనుకుంటున్న తరుణం. హేతువాదం గురించి అనాదిగా వస్తున్న కొన్ని సంశయాలతో పాటు మరికొన్ని అపోహలు, అపార్థాలు ఈ దశలో మళ్లీ వినిపిస్తున్నందువల్ల వాటిని గురించి పరిశీలించాల్సిన అవసరం ఎంతయినా వుంది.

హేతువాదం ఒక వాదం కాదు. సిద్ధాంతం అంతకన్నా కాదు. అది కేవలం తర్కం కాదు, గతి తర్కం అంతకన్నా కాదు. నాస్తికత్వం కాదు. నాస్తితత్వమూ కాదు. మతాల విమర్శే దాని పని కాదు. సంస్కరణలతోనే అది ఆగిపోదు. మరయితే హేతువాదమంటే ఏమిటి?

అన్నిటికీ మూలమైనది భౌతిక వాస్తవికత. దాన్నే మనం ప్రకృతి అంటున్నాం, విశ్వమంటున్నాం. దాని ఉనికినే మనం నిత్యమంటున్నాం, అవ్యయమంటున్నాం, అనంతమంటున్నాం. దాన్ని గురించి మనకు అందుతున్న వాస్తవిక జ్ఞానాన్నే సత్యమంటున్నాం. ఈ భౌతిక వాస్తవికతే అనాదిగా అనంత రూపాలలో మనకు దర్శనమిస్తున్నది. అది నిరంతర పరిణామంలో వున్నది. ఆ పరిణామాన్ని మనం సంఘటనల రూపంలో చూస్తున్నాం. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ విశ్వాన్ని స్థలకాల అవిరతంగా అభివర్ణించాడు. ప్రదేశ (ఉనికి) కాలాల (పరిణామం) కొనసాగింపుగా విశ్వాన్ని అర్థం చేసుకోవాలి.

ప్రకృతి నుండి పరిణామక్రమంలో ఆవిర్భవించిన మానవుడికి ప్రకృతి తత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతున్న సాధనం సంక్లిష్ట నిర్మాణం పొందిన అతని మెదడే కాని మరొకటి కాదు. ప్రకృతి నియమబద్ధమైనది. అందుకే

అది మనకు అర్థమవుతున్నది. మౌలికంగా హేతువంటే ప్రకృతిలోని నియమ క్రమమే. ఆ నియమాలను మనం గ్రహిస్తున్నందువల్లనే అవి మనలో హేతుత్వంగా భాసిస్తున్నాయి. నియమాలను గ్రహించడమే జ్ఞానానికి నాంది పలకడం. జ్ఞానేంద్రియాల ద్వారా ప్రకృతిలోని సంఘటనలను గ్రహించినపుడు మెదడులో ఆలోచనలు ఏర్పడుతాయి. వాటి మధ్య సమన్వయం ఏర్పడినపుడు జ్ఞానం రూపుదిద్దుకుంటుంది.

ఈ కార్యకారణ సంబంధాన్ని, వాటి మధ్య సమన్వయాన్ని అర్థం చేసుకోవడం అంత సులభమైన పని కాదు. దేవుళ్లు, దయ్యాలు ఏర్పడటానికి కారణం కార్యకారణ సంబంధాలను అర్థం చేసుకోవడంలో పొరబడడమే. అనుభవం, జ్ఞానం పెరుగుతున్న కొలదీ అంతకు ముందు అర్థంకాని సంఘటనలు క్రమంగా అవగతమవుతుంటాయి. ఇది నిరంతర ప్రక్రియ. ఈ ప్రక్రియలో మానవునికి ఉపయోగపడుతున్న ఆలోచనా వైఖరినే హేతువాదమంటున్నాం. ఆలోచనల్లోని క్రమత్వాన్ని శాస్త్రం, లేక సైన్సు అంటున్నాం. హేతువాదం, సైన్సు పరస్పరం అభివృద్ధి చెందే అంశాలు. మన సౌలభ్యం కోసం సైన్సును వివిధ భాగాలుగా విభజించుకొన్నాం. అయినా ఆయా శాస్త్ర ఫలితాలను సమన్వయం చేసుకోగలుగుతున్నాం. దీన్నే తత్వశాస్త్రమంటున్నాం.

మానవుడు ప్రాయికంగా హేతువాది అయినప్పటికీ ఆధునిక సమాజంలో అతని వివేకాన్ని పనిచేయ నివ్వకుండా అడ్డుపడుతున్న అంశాలు అనేకం వున్నాయి. వాటిలో కులం, మతం, వర్గం, జాతి వంటి సమిష్టితత్వాలు, ఆ తత్వాల పేరిట ప్రచారమవుతున్న సిద్ధాంతాలు ప్రధాన అవరోధాలుగా నిలుస్తున్నాయి. అంతే గాక దేవుడు, అతని పేరిట అల్లబడిన అసంఖ్యాకమైన పుక్కిటి పురాణాలు, మూఢ విశ్వాసాలు మానవునిలోని హేతుత్వాన్ని పనిచేయనివ్వకుండా నిరోధిస్తున్న అంశాల్లో వున్నాయి. వీటన్నిటినీ అధిగమించి ఆలోచన చేయగలిగినపుడే మానవుడు జంతుస్థాయిని దాటి నిజమైన మానవుడు కాగలడు. అలా ఆలోచింపజేసి అతనిలో గూడు కట్టుకున్న అపోహలను, అపార్థాలను, అంధ విశ్వాసాలను, దుష్ట సంప్రదాయాలను, సమిష్టి మిథ్యావాదాలను పారదోలడమే హేతువాదం చేసే పని, చేయాల్సిన పని. ఆ పని జరిగిననాడు మానవుడు అనుకరణ, అనుసరణలను, బానిస మనస్తత్వాన్ని వీడిన నాడే స్వతంత్రాలోచనాపరుడు కాగలుగుతాడు.



దీన్ని బట్టి హేతువాదమంటే మనచుట్టూ జరుగుతున్న సంఘటనలను అర్థం చేసుకోవడానికి మానవునికి ఉపయోగపడుతున్న ఏకైక అభ్యుదయ సాధనమని అర్థమవుతుంది. ఇంతటి విస్తృతార్థాన్ని సంతరించుకున్న హేతువాదాన్ని ఏదో ఒక అంశానికి మాత్రమే పరిమితం చేయడం దాన్ని సంకుచిత పరచడమే అవుతుంది.

హేతువాదాన్ని ఏ అంశానికయినా సంధించవచ్చు. ఫలితాన్ని రాబట్ట వచ్చు. హేతువాదాన్ని విశ్వం యొక్క ఉనికికి సంధించినపుడు పదార్థవాదం, భౌతికవాదం, భౌతిక వాస్తవిక వాదం బయటపడతాయి. మాయావాదం, మిథ్యావాదం, భావవాదం మాయమవుతాయి. కుల, మత వర్గాది సమిష్టితత్వాలకు సంధించినపుడు అవి అసత్యాలుగాను, సంకుచిత తత్వాలుగాను తేలిపోతాయి. వ్యక్తివాదం వాస్తవమైంది గాను, విశిష్టమైంది గాను తేలుతుంది. బానిసత్వ, నియంతృత్వాలను హేతువాదం ముందు నిలబెట్టినపుడు అవి మానవ వ్యతిరేక తత్వాలుగాను, సమానత్వం, ప్రజా స్వామ్యం వాటికి ప్రత్యామ్నాయ విధానాలుగాను నిరూపితమవుతాయి.

హేతువాద లక్ష్యం మానవుడి శ్రేయస్సే. అంటే మానవుడే ప్రమాణమనే మానవవాదమే హేతువాద ధ్యేయం. మానవుడి జీవనసారం స్వేచ్ఛ. సత్యాన్వేషణ ద్వారా జ్ఞానార్జన చేయడం, జ్ఞానం ఆధారంగా అన్ని రంగాలలోని అడ్డంకులను తొలగించుకుంటూ స్వేచ్ఛ యొక్క పరిధులను నిరంతరం విస్తృతపరచుకుంటూ సాగడమే మానవ జీవితాదర్శం.

స్థూలంగా హేతువాద స్వరూప స్వభావాలు ఈ రకంగా వుంటే, హేతువాదాన్ని గురించి వినిపిస్తున్న సంశయాలు, అపోహలు, అపార్థాలు మరోవిధంగా వుంటున్నాయి. సైన్సును గురించి, శాస్త్రీయ దృక్పథాన్ని గురించి వినిపిస్తున్న ఆరోపణలు కూడా హేతువాద పరిధిలోకి వస్తున్నందువల్ల వాటిని గురించి కూడా మనం పరిశీలించాల్సిన అవసరం ఏర్పడుతుంది. ముందుగా ప్రధానమైన వాటిని కొన్నిటిని పరిశీలిద్దాం.

హేతువాదం అవశ్యంగా నాస్తికత్వానికి, నిరీశ్వర వాదానికి దారితీస్తుందా అనేది హేతువాదాన్ని గురించిన సందేహం. హేతువాదం ఆస్తికవాదం కాకపోయినా అజ్ఞేయవాదంగానో, తటస్థవాదంగానో ఎందుకు వుండకూడదనేది వారి సందేహంలోని సారాంశం.

దీనికి సమాధానం స్పష్టమే. హేతువాదం భౌతిక వాస్తవికతను సత్యంగా ఆమోదిస్తుంది. ఈశ్వరవాదం, ఆస్తికవాదం ఈ భౌతిక వాస్తవికతను మిథ్య అంటుంది. భౌతికవాస్తవికతను ఆమోదించని ఏ వాదాన్నయినా, ఏ తత్వాన్నయినా హేతువాదం తిరస్కరిస్తుంది. ఆస్తికవాదం దైవాన్ని భౌతికాతీతమైన శక్తిగా భావిస్తే, భౌతికాతీతమైనదేదీ వుండడానికే వీల్లేదంటుంది హేతువాదం. ప్రకృతికి బాహ్యంగాగాని, అతీతంగాగాని, అన్యంగా గాని ఏదీ వుండదని ఆధునిక విజ్ఞాన శాస్త్రాలు వివరించగలుగుతున్నాయి. ఒకవేళ వాదనకోసం అటువంటిది వున్నదని అంగీకరించినా దాన్ని గురించి చర్చించేదంతా భౌతికవాద పరిధిలోకే వస్తుంది. భౌతికాతీతమైనదేదయినా మన గ్రహింపులోకి రావడానికే అవకాశం వుండదు. మనిషి గ్రహించేది, వూహించేది, అనుభవించేది భౌతిక వాస్తవికతనే గాని భౌతిక నాస్తికతను కాదు.

మరోమాటలో చెప్పాలంటే అన్ని రకాల ఆస్తికవాదులు చెప్పే దైవ భావనలన్నీ భౌతికవాద పరిధిలోకి వచ్చేవే. అయితే వారికా విషయం తెలియనందువల్ల వారు ప్రకృతికి అతీతమైనదాన్ని గురించి చెబుతున్నామనుకుంటారు. అందుకే వారి భావవాదాన్ని తలక్రిందుల భౌతికవాదమని పేర్కొంటారు.

తేలిన విషయమేమంటే ఈశ్వరవాదం, ఆస్తికవాదం అనేవి భౌతిక వాస్తవికతను అపార్థం చేసుకోవడం వల్ల ఏర్పడిన పొరపాటు భావాలని. ఆ భావాలు తప్పయినపుడు నిరీశ్వర వాదం, నాస్తికవాదం సరియైనవిగా మనకు అర్థమవుతాయి. అయితే హేతువాదం నాస్తికవాదానికే పరిమితంకాదనీ, దానితోనే ఆగిపోదనీ గుర్తించాలి.

సైన్సు, శాస్త్రీయ దృక్పథం అవసరమే కాని, సత్యావిష్కరణకు సైన్సు ఒక్కటే సాధనం కాదని, సైన్సు అర్థం చెప్పలేని ప్రపంచాన్ని అర్థం చేసు కోవడానికి శాస్త్రీయేతర పద్ధతులపై ఆధారపడాలనే వాదం ఒకటి వినిపిస్తున్నది.

ఈ వాదమెలా వుందంటే మనం మెదడుతో మాత్రమే ఆలోచిస్తే మనకు అన్ని విషయాలు అర్థం కావని, అందువల్ల మనం హృదయంతోనో, గుండెతోనో, వూపిరితిత్తులతోనో ఆలోచించి (?) సైన్సుకు అందని విషయాలను అర్థం చేసుకోవాలన్నట్లుంది.



వాస్తవానికి మనిషికున్న ఆలోచనాంగం మెదడే. మెదడుతో కాక మరో అంగంతో ఆలోచించడం ఎలాగయితే అసాధ్యమో, సైన్సు ద్వారా కాక ఇతర విధానాల ద్వారా సత్యాలను తెలుసుకోగలమనడం అంతే అసాధ్యం. ఏ విషయాన్నయినా సైన్సు ద్వారానే అర్థం చేసుకోగలిగిన మేరకు అర్థం చేసుకోగలం. ఇతర సాధనాల మీద ఆధారపడాలని వాదించేవారు సైతం సైన్సు మీద మాత్రమే ఆధారపడినా, ఆ విషయాన్ని సరిగా గుర్తించనందువల్లనే అలా వాదించగలుగుతున్నారు.

సైన్సు పరిమిత ప్రపంచానికి సంబంధించిన పరిమిత సత్యాలనే తెలుసుకొంటుంది, నిజమే. అంతమాత్రాన తెలిసిన సత్యాలు అసత్యాలైపోవు. ఎప్పుడయినా సత్యం సాపేక్షమే. సంపూర్ణ జ్ఞాన భావన, సంపూర్ణ సత్య భావన అర్థరహితాలు. తెలుసుకున్న కొద్దీ తెలుసుకోవలసింది ఎల్లప్పుడూ మిగిలిపోతూనే వుంటుంది. అదే సమయంలో సత్యం, సమగ్రత దిశగా, సంపూర్ణదిశగా క్రమంగా ముందుకు సాగుతూ వుంటుంది. జ్ఞానానికి, సత్యానికి ఫుల్‌స్టాప్ లేదు.

దేన్ని గురించి తెలుకొంటే అంతా తెలుసుకున్నట్లవుతుందో, అదే బ్రహ్మ జ్ఞానమని బ్రహ్మవాదులు చెపుతారు. అంటే సర్వజ్ఞతకు బ్రహ్మజ్ఞానం గీటురాయన్న మాట. కాని, ఆ బ్రహ్మాన్ని తెలుసుకున్న వారెవ్వరూ లేరు. అది ఇదీ అని చెప్పిన వారూ లేరు. ఒకసారి బ్రహ్మదర్శనం చేసిన వారు దాన్ని గురించి యితరులకు చెపితే ఇతరులంతానూ సర్వజ్ఞులయ్యే వారే. కాని, అలా ఎన్నడూ జరగలేదు. దేన్నో దర్శించినట్లు భ్రమపడితే దార్శనికత లభించదు. దేన్ని గురించిన జ్ఞానమైనా క్రమాధికంగా వికసిస్తుంది. జ్ఞానమంతా లభ్యమైతే ఇంకా తెలుసుకోవలసింది వుండదు. జ్ఞాన సాధనకు ఆధునికయుగంలో బయలుదేరి పెంపొందుతున్న ప్రక్రియనే మనం సైన్సు అంటున్నాం. అది జ్ఞానసాధనను, సత్యావిష్కరణను సులభతరం చేయడమే కాక, విశిష్టం కూడా చేసింది. భ్రమల నుంచి వాస్తవాలను విడగొట్టి చూపింది. రెంటినీ విడమరచి వివరించింది. అందువల్ల మనం భ్రమలలో వుయ్యాలలూగే స్థితిని అధిగమించి వాస్తవాలను గ్రహించాలి. సత్యం వాస్తవికమన్న సత్యాన్ని గుర్తించాలి.

అందువల్ల దేన్ని అర్థం చేసుకోవాలన్నా సైన్సు మాత్రమే సాధనమవుతుంది గాని మరేదీ సాధనం కాజాలదు. మతాలు, మంత్రతంత్రాలు, మార్మికతత్వాలు సత్యసాధనాలు కాజాలవు.

సైన్సును, హేతువాదాన్ని మినహాయిస్తే ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి మరో సాధనమే లేదు. ఈనాటి వరకు అటువంటి నూతన సాధనాన్ని ఎవరూ కనిపెట్టిన దాఖలాలు లేవు. ఏనాటికైనా సైన్సును మించిన సాధనాన్ని మానవుడు కనిపెట్టగలడనుకోవడానికి కూడా ఆస్కారం కనిపించదు.

సైన్సు వస్తువుల యొక్క పొడవు, వెడల్పు, ఎత్తు, బరువు వంటి ప్రాథమిక లక్షణాలను మాత్రమే తెలుకోగలుగుతుందని, చల్లదనం, మెత్తదనం, సౌందర్యం వంటి ఆనుషంగిక లక్షణాలను, గుణాలను తెలుసు కోజాలదని మరో వాదన వినిపిస్తోంది. అటువంటి ఆనుషంగిక లక్షణాలను తెలుసుకోడానికి శాస్త్రీయేతర విధానాలైన యోగం, కళల వంటి వాటిపై ఆధారపడాలనే సూచన కూడా వారి వాదంలో వుంది.

వాస్తవంలో ఈ వాదన పరోక్షంగా మార్మిక తత్వాన్ని, మతతత్వాన్ని ప్రోత్స హిస్తున్నట్లే భావించవచ్చు. అన్నింటినీ కొలవడానికి ఒకే విధమైన ప్రమాణాలుండవు. పైగా అనుభూతులను కొలవకూడదు. వివరించుకుని అర్థం చేసుకోవాలి. అందువల్ల వస్తువుల ఆనుషంగిక గుణగణాలను పూర్తిగా ప్రతిబింబించేలా చేయలేకపోవచ్చు.

సంగీతం గురించి వివరించాలన్నపుడు సైన్సు వాటిని సాంకేతికంగా విడదీసి సంగీత పరికరాల నుండి వెలువడే శబ్ద తరంగాలను, వాటి పరిమాణాలలో తేడాలను వివరిస్తుందే గాని సంగీతం వల్ల ఆనందమెలా కలుగుతుందనే విషయాన్ని వివరించలేదని అంటున్నారు. అలాగే సౌందర్య విషయం కూడా అంతే నంటున్నారు, ఈ వాదనలోని లోపాల్ని పరిశీలిద్దాం.

శారీరక నిర్మాణాలలోని విశిష్ట లక్షణాలను సైన్సు చాలా వరకు వివరించగలుగుతుంది. శారీరక నిర్మాణంలోని తేడాలవల్లనే దృశ్య శ్రవణాది సంఘటనలను గ్రహించడంలో తేడాలు కలుగుతున్నాయి. వాటిని అనుభూతి చెందడంలో అంతరాలు ఏర్పడుతున్నాయి. ఈ అంతరాలను, తేడాలను సైన్సు వివరించగలదు. చల్లదనం, మెత్తదనం వంటి వాటిని కూడా అది విశ్లేషించగలదు.

సౌందర్యం వంటి ఆనుషంగిక గుణాలు ప్రధానంగా వస్తుగతం కన్న వ్యక్తిగతమే. వ్యక్తుల అభిరుచుల మీద ఆధారపడిన ఇటువంటి అంశాలన్నీ వ్యక్తికి, వ్యక్తికి విభేదించవచ్చు. వ్యక్తుల్లో ఇచ్ఛ పని చేస్తుంటుంది. ఆయా వ్యక్తులలోని



జ్ఞానస్థాయిని బట్టి, అలవాట్లను బట్టి అభిరుచులు మారిపోతుంటాయి. ఒకరికి నచ్చింది మరొకరికి నచ్చకపోవచ్చు. అందుకే మనుషులను విశిష్టమైన వ్యక్తులుగా గుర్తిస్తారు. అంత మాత్రం చేత సైన్సును వదలుకొని యోగాలను, కళలను ఆశ్రయించవలసిన పనిలేదు.

సైన్సు చెప్పలేని విషయాలనన్నిటినీ యోగాలు, కళలు వివరించి చెప్పగలవనడం పూర్తి అబద్ధం. అర్థం చేసుకోగలిగినదంతా, వివరించగలిగినదంతా శాస్త్రమే అవుతుంది. శాస్త్రానికి ప్రత్యామ్నాయం లేదు. యోగాలు, కళలు శాస్త్రానికి ప్రత్యామ్నాయం కాజాలవు. యోగాల ద్వారా, కళల ద్వారా నూతన సత్యాలు ఆవిష్కరించబడినట్లు చారిత్రకాధారాలు లభించడం లేదు. యోగాల ద్వారా, కళల ద్వారా ఎన్నెన్నో అద్భుతాలు, మహత్యాలు జరిగినట్లు, నూతన సత్యాలు ఆవిష్కరించబడినట్లు చెప్పేవన్నీ పుక్కిటి పురాణకథల వంటి కట్టుకథలేగాని వాస్తవాలు కావు.

మానవుడు తన సుఖసంతోషాల కోసం, సృష్టించుకున్న అనేకానేక అంశాలలో యోగాలు, కళల వంటివి కూడా ఉన్నాయి. వాటిని వినోద సాధనాలుగా వినియోగించుకోవచ్చునే గాని, సత్య సాధనాలుగా పరిగణించడానికి మాత్రం వీలుండదు. ఇలా అన్నందువల్ల వాటిని తిరస్కరించినట్లు కాదు. ద్వేషించినట్లు అంతకన్నా కాదు. వాటి స్థానాలను మదింపు వేయడంలో శాస్త్రానికి ప్రత్యామ్నాయంగా గాని, శాస్త్రం కంటే అధికంగా గాని వాటిని పరిగణించడానికి వీలు లేదని మాత్రమే అర్థం చేసుకోవాలి. వస్తువులు, వాటి లక్షణాలు, వ్యాపారాలు మానవుల ఇంద్రియాలతో సన్నికర్షత్వం పొందినపుడు ఏయే రకాల స్పందనలు ఏయే విధంగా కలుగుతాయో, ఏవిధంగా కలగడానికి వీలుందో, ఏయే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాటిని కృత్రిమంగా సైతం కల్పించడానికి వీలుందో సైన్సు వివరించగలదు. ప్రయోగరీత్యా ప్రదర్శించనూగలదు.

సైన్సు సత్యాలను కనుగొంటుంది గాని విలువలను నిర్ణయించలేదనే మరో ఆరోపణ వుంది. అంటే సైన్సు విషయాలను విశ్లేషిస్తుందే గాని ఏది మంచి, ఏది చెడ్డ, ఏది నీతి, ఏది అవినీతి అనే విలువల విషయంలో తటస్థంగా వుంటుందని వారి ఉద్దేశం. ఇది కూడా పూర్తిగా అపార్థ జనితమే.

విలువల ప్రస్తావన వచ్చినపుడు మనిషి బ్రతికి వుండడమే ఒక విలువ అవుతుంది. ఎందుకంటే అతడు ఏది సాధించాలన్నా ముందుగా జీవించి వుండాలి. అందుకే సత్యమైన అతని ఉనికి విలువగా మారుతున్నది. అంతేకాక అతని మనుగడ జంతుస్థాయి మనుగడ కాదు. జీవించాలంటే స్వేచ్ఛగా జీవించాలనే అర్థం. అందుకే జీవించాలనే వాంఛ ఎంతగా సత్యమో, అంతగానే అది విలువ కూడా. అందువల్ల సత్యానికి, విలువకు ద్వియాభావం లేదు. వాటి మధ్య "లేని ద్వియాభావాన్ని" వూహించడం వల్లనే సైన్సు విలువలను నిర్ణయించలేదనే అపోహ జనించింది.

స్వేచ్ఛగా జీవించడమే మానవుడికి ప్రధానం కాబట్టి, స్వేచ్ఛ మౌలిక విలువ అవుతున్నది. మిగతా విలువలన్నీ స్వేచ్ఛ నుండి నిష్పన్నమయ్యేవే. విలువలను ఆరోగ్యానికి సంబంధించిన విలువలుగా, సామాజిక జీవనానికి సంబంధించిన విలువలుగా, ఇంకా ఇతర విధాలుగాను విభజించుకోవచ్చు. వాటిలో భిన్నాభిప్రాయాలుండవచ్చు. అయితే సైన్సు విలువలను నిర్ణయించగలదనేది వాస్తవం.

పౌష్టికాహారం ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందనే సత్యాన్ని వైద్యశాస్త్రం చెబుతుంది. కాని ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సైన్సు ప్రత్యేకించి ఆదేశించదు కాబట్టి సైన్సు విలువలను నిర్ణయించ లేదనడం విడ్డూరం అవుతుంది. అలాగే నియంతృత్వం లోపభూయిష్టంగా వుందని, ప్రజాస్వామ్యం ఉన్నతమైందని రాజకీయశాస్త్రం విశ్లేషించి చూపుతుంది కాని ఆ రెండింటిలో ఫలానా విధానాన్ని పాటించడం మంచిదని ప్రత్యేకించి చెప్పదు కాబట్టి దానికి విలువలతో సంబంధం లేదనడం అనుచితం.

అందువల్ల సైన్సు సత్యాలను విశ్లేషించడంతోనే ఆగిపోదని, అది విలువలను కూడా నిస్సందేహంగా నిర్ణయించగలదని రుజువవుతున్నది.

హేతువాదం విశ్వ నియమాలకు ప్రతిరూపం. అందుకే విశ్వ నియమాన్ని హేతువు యొక్క మౌలిక స్వరూపంగా పరిగణిస్తున్నాం. విశ్వమంతటా అసంఖ్యాకమైన నియమాలు పనిచేస్తున్నాయి. అందుకే విశ్వాన్ని నియమబద్ధమైనదిగా భావిస్తున్నాం.

విశ్వం నియమబద్ధం కావడం వల్లనే దానిలో సంభవిస్తున్న సంఘటనలను మనం అర్థం చేసుకోగలుగుతున్నాం. ఎవరైనా ఈ విశ్వాన్ని, అందులోని సంఘటనలను అర్థం చేసుకోవాలంటే ఆధారం అందులోని నియమాలే. ఈ నియమాలను పరిశీలించి, పరిశోధించి, అధ్యయనంచేసి, అవగాహన చేసుకోవడమే ఆదిమానవుడి నుండి ఆధునిక మానవుడి వరకు అందరూ అవలంబిస్తున్న ఏకైక విధానం.



ఈ ప్రక్రియలో మనం గ్రహిస్తున్న విశ్వ నియమాలే మనలో జ్ఞానంగా రూపొందుతున్నాయి. ఈ విధంగా హేతువాదం జ్ఞాన సాధనమవుతున్నది.

విశ్వ నియామాలు పదార్థాన్ని ఆశ్రయించి వుంటాయి. పదార్థాంత గ్గతమైన ఈ నియమాలవల్లనే జరుగుతున్న సంఘటనల పరిణామక్రమాన్ని మనం అర్థం చేసుకోగలుగుతున్నాం.

మన సౌలభ్యంకోసం విశ్వాన్ని, అందులోని సంఘటనలను వందలాది శాఖలుగా విభజించుకుని వాటికి వేరు వేరు పేర్లు పెట్టుకున్నాం. ఖగోళశాస్త్రం, జీవశాస్త్రం, రసాయనశాస్త్రం, మనస్తత్వశాస్త్రం మొ॥ పేర్లతో మనం అధ్యయనం చేస్తున్నది విశ్వనియమాలనే.

వీటిలో కొన్ని నియమాలు సులభంగా అర్థమవుతుంటే మరికొన్ని సంక్లిష్టంగావుండి జటిలంగా వుంటున్నాయి. అయినా నిరంతర సత్యాన్వేషి, జ్ఞాన పిపాసియైన మానవుడు ఎంతటి సంక్లిష్టమైన అంశాన్నయినా, ఎంతటి జటిలమైన విషయాన్నయినా పరిశీలించకుండా, పరిశోధించకుండా వదిలిపెట్టలేదు. నిరంతరం తన సత్యాన్వేషణను సాగిస్తూనే వున్నాడు.

విశ్వంలో భాగమైన మానవుడు విశ్వ నియమాలనన్నిటినీ సంపూర్ణంగా తెలుసుకొని, ఇక తెలుసుకోవలసిందేమీ మిగలకపోవటమనేది అసాధ్యం, అసంభవం. అందుకే జ్ఞానం సాపేక్షమంటున్నాం. అయితే అది సమగ్రత దిశగా ప్రయాణం చేస్తున్నదని మనం గమనిస్తున్నాం.

వాస్తవంగా ఉనికిలో వున్నదంతా భౌతిక వాస్తవికతే (physical reality). పదార్థమన్నా, ద్రవ్యమన్నా, శక్తిఅన్నా అవన్నీ భౌతిక వాస్తవికతను ప్రతిబింబించేవే.

విశ్వ పదార్థమంతా నిరంతర పరిణామంలో వున్నది. పరిణామరహితమైనది విశ్వంలో లేనేలేదు. ఒకవేళ ఉందనుకున్నా అది మనగ్రహింపులోకి వచ్చే అవకాశంలేదు. జ్ఞాన సిద్ధాంతం (Epistemology) ఈ విషయాన్ని ధృవపరుస్తున్నది.

ఈ పరిణామాన్ని సక్రమంగా అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆయా నియమాలను అధ్యయనంచేసి అవగాహన చేసుకోవాలి. అప్పుడే ఏ పదార్థం ఏ పరిస్థితుల్లో ఎటువంటి మార్పునకు గురవుతుందో మన కర్థమవుతుంది.

ఈ నిరంతర పరిణామ ప్రక్రియలో మన సౌలభ్యంకోసం పరిణామాన్ని చిన్న చిన్న సంఘటనలుగా విభజించుకుంటున్నాం. ఆయా సంఘటనల పూర్వా పరాలను పరిశీలించి అందులో యిమిడి వున్న నియమాలను సూత్రాలుగా రూపొందించుకుంటున్నాం.

ఈ సూత్రాలకు భిన్నంగానో, విరుద్ధంగానో పరిణామం సంభవించినట్లు మనం గమనించినపుడు అటువంటి పరిణామాలకు కారణాలను పరిశీలించి, అధ్యయనం చేస్తాం. ఆ క్రమంలో వెలుగుచూసే సరికొత్త నియమాలను గుర్తించి, ఆ మేరకు పూర్వమేర్పరచుకున్న సూత్రాలను సవరించుకుంటాం. ఈ క్రమం ఆగిపోకుండా నిరంతరం కొనసాగుతూ వుంటుంది. ఇదే శాస్త్రీయ విధానం.

అలాకాకుండా మనం ఒకనాటి సూత్రాలనే పట్టుకొని వ్రేలాడుతూ, వాటికి భిన్నంగా మనకెన్ని రుజువులు ఎదురైనా గ్రహించకుండా, తదనుగుణంగా పాత అభిప్రాయాలను సవరించుకోకుండా మనోద్వారాలను మూసివేసుకుంటే అప్పుడా అభిప్రాయాలు వ్యవస్థీకృతమై కరుడుగట్టి స్తంభించిపోతాయి. అలా స్తంభించిపోయిన ఒకనాటి అభిప్రాయాలే నేడు మనకు భిన్నమతాల రూపంలో దర్శనమిస్తున్నాయి.

ఈ విషయాలన్నీ హేతువాదంలో ప్రాథమిక విషయాలు. వీటిని గురించి హేతువాదమిత్రులు ఎంతో విపులంగా అనేక గ్రంథాలలో వివరించడం జరిగింది.

హేతువాదం ప్రధానంగా భావవిప్లవోద్యమమని, ముందుగా మనుషుల భావాలలో మార్పును సాధించకుండా సమాజంలోని ఏ రంగంలోను ప్రగతిని సాధించలేమని, అందుకే ముందుగా వైజ్ఞానిక ప్రగతికి, సామాజికాభ్యుదయానికి అడ్డుగా నిలిచివున్న అంధవిశ్వాసాలను తొలగించవలసి వుంటుందని భావిస్తున్నాం. ఆ క్రమంలో హేతువాద సంఘం, ముఖ్యంగా ఆంధ్రాలో, గత మూడుదశాబ్దాలుగా తన కృషిని కొనసాగిస్తూనేవుంది.



ఈ క్రమంలో భాగంగానే హేతువాదంపై విభిన్నవర్గాలవారు చేస్తున్న ఆరోపణలను పరిశీలించి, వాటికి సమాధానాలు చెప్పడంద్వారా హేతువాదం గురించి ప్రచారమవుతున్న అపోహలను, అపార్థాలను తొలగించవలసివుంది.

తాత్వికంగా, తార్కికంగా కొన్ని ఎత్తుగడలు పన్ని, జిమ్మిక్కులుచేసి సామాజికుల్లో కొంత గందరగోళాన్ని, ఆయోమయత్వాన్ని సృష్టించడంద్వారా కొందరు మత పునాదులను మరింతగా పటిష్టపరచడానికి ప్రయత్నిస్తున్నారు.

ముందుగా ప్రచ్ఛన్న మతవాదుల వాదనలను గురించి తెలుసుకోవాలి. అప్పుడే కొందరిలో నెలకొన్న అపోహలు, అపార్థాలు తొలగిపోయి విషయాలకు సంబంధించి మరింత స్పష్టమైన అవగాహన ఏర్పడగలదు.

హేతువాదం, శాస్త్రీయదృక్పథం అవసరమే కాని సత్యావిష్కరణకు అవి చాలవని, కావున సత్యానికి సైన్సు ఒక్కటే సాధనం కాదని, సైన్సు అర్థం చెప్పలేని ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి శాస్త్రీయేతర పద్ధతులపై ఆధారపడాలనే వాదమొకటి వినిపిస్తున్నది.

ఈవాదం ఇంకా ఇలా కొనసాగుతుంది. శాస్త్రపద్ధతి ద్వారా తెలుసుకోగలిగింది అతిపరిమితమని, తెలుసుకోరానిదే అనంతమని, కావున శాస్త్రం సత్యాలను తెలుసుకుంటుందనడం తప్పు అని.

చివరికీవాదం ఎక్కడిదాకా పోతుందంటే - వస్తుపరమైన వాస్తవిక సత్యాన్ని శాస్త్రమే కాదు, మానవుని కందుబాటులో వుండే ఏ ఒక్క జ్ఞానప్రక్రియా ఏనాటికీ తెలుసుకోజాలదని తీర్మానిస్తుంది.

శాస్త్రజ్ఞుడు, యోగి, కళాకారుడు ఎవరి ప్రపంచం వారికి సత్యం, ఎవరి అనుభవం వారికి సత్యం: ఒకరి సత్యం వేరొకరికి తెలియవలసిన పనిలేదంటుందీ వాదం.

పైకి చూడ్డానికి ఈ వాదం హేతువాదం కన్న గొప్పదైనవాదంగా కనిపిస్తుంది. సత్యావిష్కరణకు సైన్సు మాత్రమే కాక అనేక సాధనాలున్నాయనే దాన్ని బట్టి సైన్సును మించిన వాదంగానూ కనిపిస్తుంది. ఈ వాదాన్ని విశ్లేషిస్తే అందులోని సత్యాసత్యాలు మనకు అవగతమవుతాయి.

సైన్సు అర్థం చెప్పలేని ప్రపంచాన్ని అర్థం చేసుకోడానికి శాస్త్రీయేతర పద్ధతులపై ఆధారపడాలని ఒకవైపు వాదిస్తూనే మరోవైపు శాస్త్రమే కాదు, మానవుని కందుబాటులో వుండే ఏ ఒక్క జ్ఞానప్రక్రియా వాస్తవికజ్ఞానాన్ని ఏ నాటికీ తెలుసుకోజాలదనడం పరస్పర విరుద్ధంగా లేదా?

ఏ ఒక్క జ్ఞానప్రక్రియా వాస్తవిక జ్ఞానాన్ని ఏనాటికీ తెలుసుకోజాలదని తీర్మానించుకున్నాక ప్రపంచాన్ని అర్థం చేసుకోడానికి శాస్త్రం మీదనో, శాస్త్రీయేతర పద్ధతుల మీదనో ఆధారపడాలనడం ఎందుకో?

జ్ఞానసముపార్జనకు శాస్త్రీయేతర పద్ధతులపై ఆధారపడాలన్నపుడు ఆ శాస్త్రీయేతర పద్ధతులకు జ్ఞానాన్ని సముపార్జించి పెట్టే సామర్థ్యం వున్నదనే అర్థం స్పురిస్తుంది. ఏ ఒక్క జ్ఞానప్రక్రియా, వాస్తవికజ్ఞానాన్ని ఏనాటినీ తెలుసుకో జాలదన్నపుడు శాస్త్రానికిగాని, శాస్త్రీయేతర సాధనాలకుగాని అటువంటి సామర్థ్యం లేదని అర్థమవుతుంది. ఈ రెండు ప్రతిపాదనలూ పరస్పర విరుద్ధమైనవనేది స్పష్టమవుతూనే వుంది. ఈ వైరుధ్యాన్ని పక్కన పెడితే ఈ వాదంలో వున్న సత్యమేమయినా బయటపడుతుందేమో చూద్దాం.

జ్ఞాన సముపార్జనకు శాస్త్రమొక్కటే చాలదన్నారు బాగుంది. ఎందుకంటే మానవావిర్భావం జరిగినప్పటి నుండి ఈనాటి వరకు జ్ఞానసాధనంగా వుంటూ వస్తున్నది శాస్త్రమేగాని మరొకటి కాదని మానవ వికాస పరిణామ చరిత్ర నిరూపిస్తున్నది.

మానవుడు తెలుసుకోవలసిన దానితో పోల్చుకున్నపుడు తెలిసినది అతి స్వల్పమని బోధపడుతుంది. బాధకూడా కలుగుతుంది. అటువంటి సందర్భంలో జ్ఞాన సముపార్జనకు శాస్త్రమేకాక ఇతర సాధనాలు కూడా వుంటే ఇంకా ఎక్కువగా జ్ఞానాన్ని మానవుడు ఆర్జించుకునేవాడుగదా అనే ఆశ కూడా కలుగుతుంది.

అయితే అటువంటి ఆశను, కోరికను మనం గొంతెమ్మ కోరిక అంటాం. జ్ఞానాన్ని గురించి, జ్ఞాన సాధనాలను గురించి కనీస అవగాహన వున్నవారికెవరికైనా అటువంటి ఆశలు, కోరికలు కలగవు. సైన్సును గురించి, హేతువాదం గురించి సరియైన అవగాహన లేనివారే అటువంటి గొంతెమ్మ కోర్కెల వలలో చిక్కుకుని కలలుగంటూ శుష్కవాదాలను సృష్టిస్తుంటారు.



శాస్త్రీయేతర సాధనాలు, శాస్త్రీయేతర పద్ధతుల ద్వారా సత్యాన్ని తెలుసు కోవచ్చుననుకోవడం భ్రమపూరితమైన భావమేగాని మరొకటి కాదు. వాస్తవానికి హేతువాదులు దేన్నీ గుడ్డిగా వ్యతిరేకించడంగాని, గుడ్డిగా నమ్మి అనుసరించడంగాని చేయరు. అంతేగాదు నూతన సత్యాలను ఆహ్వానించడంలో వారు అందరికంటే ముందువరుసలో వుంటారు.

ఇంతకూ సత్యావిష్కరణకు వారు ప్రతిపాదించే శాస్త్రీయేతర సాధనాలు ఏమిటనుకుంటున్నారు? కళ, యోగం, మతం స్త్రీయే ఎంత గొప్ప సాధనాలు!! హేతువాదులు, మానవవాదులు ఇంత గొప్ప సాధనాలను గురించి తెలుసుకోక పోవడం, అటువంటి శాస్త్రీయేతర పద్ధతులను అవలంబించకపోవడం ఎంత శోచనీయం !!

సైన్సును గురించి, హేతువాదం గురించి వీరికున్న అభిప్రాయాలు చాలా సంకుచితమైనవి కావడం వల్లనే వారీరకమైన పెడధోరణిలో పడిపోతున్నారు.

వాస్తవానికి హేతువాదాన్ని, సైన్సును, అన్ని రంగాలకు, అన్ని అంశాలకూ వర్తింపచేయవచ్చు. ఇవి పనిచేయకపోతే అటువంటి సందర్భాలలో ఇతర సాధనాలు పనిచేయడానికి అవకాశమే లేదు. హేతువాదం, సైన్సు, వీరికి పనికిరాకుండా పోవడానికి అసలు కారణం అవి లోపభూయిష్టమైనవి కావడం కాదు. కళలు, యోగాలు, మతాలు మొదలగు వాటిమీద వీరికున్న ప్రత్యేకమైన దురభిమానమే.

ఈ క్రమంలో పరిశీలించినపుడు ఎన్.వి. బ్రహ్మంగారు రచించిన పుస్తకం "కళాశాస్త్ర వివాదంలో హేతువాది హేతివాదం'లో హేతువాదాన్ని గురించిన అపోహలు చాలా చోటుచేసుకున్నట్లు గమనించవచ్చు.

వారికున్న అభిప్రాయాలను సత్యాలుగా చిత్రించడానికే కొన్ని నూతన వాదాలను సృష్టించినట్లు అర్థం చేసుకోవలసి వస్తుంది. ఈక్రమంలో పరిశీలించినపుడు శ్రీ ఎన్.వి. బ్రహ్మంగారు రచించిన పుస్తకం 'కళాశాస్త్ర వివాదంలో హేతువాది హేతివాదం'లో హేతువాదాన్ని గురించిన అపోహలు చాలా చోటుచేసుకున్నట్లు గమనించవచ్చు. వారి దృష్టిలో కళాకారుడు, యోగి ఎటువంటివాడో ఈ దిగువ వాక్యాలలో చూడండి.

'ప్రకృతిని శాస్త్రకారుడు వివేక స్థాయిలో అర్థం చేసుకుంటే కళాకారుడు ఉద్వేగస్థాయిలో అర్థం చేసుకుంటాడు'.

'ప్రకృతిని అవగాహన చేసుకోవడంలో ప్రయోగం ఒక్కస్థాయిని పట్టిస్తే, యోగం మరోస్థాయిని పట్టిస్తుంది'.

శాస్త్రజ్ఞుడు, కళాకారుడు, యోగి, ఎవరి సత్యం వారిది. ఒకరి సత్యం వేరొకరికి తెలియవలసిన పనిలేదనికూడా తీర్మానిస్తున్నారు.

ఎవరి సత్యం వారిదనే వాదం అర్థం లేనిది. మనం జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ వాదం శాస్త్రానికి ఏమాత్రం సరిపడదు. శాస్త్రీయ సత్యాలు సర్వులకూ ఒకే రకంగా దర్శనమిస్తాయి తప్ప ఒక్కొక్కరికి ఒక్కోరకంగా కనిపించవు. శాస్త్రీయ పద్ధతిలో జరిపే ప్రయోగాలు ఎక్కడ, ఎప్పుడు, ఎవరు జరిపినా ఒకేరకమైన ఫలితాలనిస్తాయే తప్ప భిన్న ఫలితాలనివ్వవు. అందుకే శాస్త్రీయ సత్యాలు విశ్వజనీనతను సంతరించుకుని, సర్వామోదయోగ్యంగా నిలుస్తున్నాయి.

ఎవరి సత్యం వారిదనే వాదం మతవాదానికి సరిగ్గా సరిపోతుంది. ఎందుకంటే మతవాదంలో వున్నన్ని వైరుధ్యాలను మనమెక్కడా చూడలేము. మతవాదుల 'సత్యాలు' ఒక్కో మతానికి ఒక్కోవిధంగా వుంటాయి. అంతేకాదు ఒకే మతంలోని వారికికూడా మనిషి మనిషికి 'సత్యం' మారుతుంటుంది. అందుకే వాటిని మనం మత సత్యాలనలేము, మత విశ్వాసాలంటాం.

ప్రకృతిని శాస్త్రకారుడు వివేకస్థాయిలో అర్థం చేసుకుంటే కళాకారుడు ఉద్వేగస్థాయిలో అర్థం చేసుకుంటాడనడం హాస్యాస్పదం. దేన్నయినా, ఎవరైనా అర్థం చేసుకోడానికి కావలసింది వివేకమేగాని ఉద్వేగం కాదు. ఉద్వేగంలో ప్రకృతిని అర్థం చేసుకునే అవకాశమే వుండదు. అటువంటప్పుడు ఉద్వేగస్థాయిలో కళాకారులు కనిపెట్టే సత్యాలుండవు. అందువల్ల కళాకారుల సత్యాలు, శాస్త్రజ్ఞుల సత్యాలు, మతస్థుల సత్యాలనేవి విడివిడిగా వుండవు.

సత్యాన్ని దర్శించడానికి వివేకమొక్కటే సరియైన సాధనంగాని కళలు, యోగాలు వగైరా సాధనాలు కావు, కాజాలవు.



ప్రకృతిని అర్థం చేసుకోవడంలో ప్రయోగం ఒకస్థాయిని పట్టిస్తే, యోగం మరోస్థాయిని పట్టిస్తుందనడం అబద్ధం, అర్థరహితం. అది యోగానికి ప్రయోగస్థాయిని కట్టబెట్టే కుటిల ప్రయత్నం. వాస్తవానికి యోగులు, కళాకారులు 'కనిపెట్టిన సత్యాల'నేవి ఏవీలేవు.

వేలాది సంవత్సరాల మానవచరిత్రలో కళాకారులుగాని, యోగులు కాని ఏ ఒక్క సత్యాన్ని కనిపెట్టిన దాఖలాలు లేవు. అయినా వారిని సత్య సాధకులుగా చిత్రించబూనడం వారి వివేకస్థాయిని తెలియజేస్తుంది.

కళలు వినోదసాధనాలేగాని, సత్య సాధనాలు కావు. అందువల్ల కళల ద్వారా సత్య సాక్షాత్కారం జరగదు. వాస్తవానికి వినోద సాధనాలైన కళలు కూడా అభివృద్ధి చెందడానికి ఉపయోగపడేది శాస్త్ర సత్యాలే. ఉదాహరనకు సర్కస్ కళాకారుడు చేసే సర్కస్ ఫీట్ల వెనుక పనిచేస్తున్నవి సైన్సు సూత్రాలేకాని వేరేమీ కావు. ఆయా సూత్రాల ఆధారంగానే అతడు ఆయా ఫీట్లను అద్భుతంగా ప్రదర్శించి అందరినీ ఆనందింపజేస్తున్నాడు. దీన్నిబట్టి మనకర్థమయ్యేదేమిటంటే కళలకుకూడా శాస్త్ర జ్ఞానమే పునాది అవుతుందికాని, శాస్త్రానికి కళలు పునాదికాలేవని. ఈ వాస్తవాన్ని తల్లక్రిందులుగా చేసి చూపడానికి వక్రభాష్యాలు చేస్తున్నారు.

"వాస్తవాంశాలుగా వస్తువుల ప్రాథమికగుణాలను మాత్రమే గ్రహించి, వాటి ఆనుషంగిక గుణాలను గణనలోకి తీసుకోకపోవడంలోనే శాస్త్రాలు పాక్షిక సత్యాలై పోయినై. అంటే అవి పాక్షికంగా అసత్యాలు కూడా అయినాయన్న మాటే". (కళాశాస్త్ర వివాదంలో హేతువాది హేతివాదం - పేజీ - 8)

అంటే శాస్త్రాలు వాస్తవాంశాలలోని ప్రాథమిక గుణాలను గ్రహించి, ఆనుషంగిక గుణాలను గ్రహించలేవనే ఆరోపణ. అటువంటి ఆనుషంగిక గుణాలను గ్రహించేది కళ అని తాత్పర్యం.

"శాస్త్రానికి లక్ష్యం వస్తు లక్షణాలలో కొలతల (పొడవు, బరువు) వంటి ప్రాథమిక గుణాలను పరిశోధించటమేననీ, కొలతలకందని (మెత్తన, చల్లన మొదలైన) అనుషంగిక గుణాలలో శాస్త్రానికి ప్రమేయం లేదనీ, ఒకవేళ వున్నా వాటిని కొలతల పరిభాషలోని కందించగల మేరకేననీ లోగడ ప్రస్తావించుకున్నాం". (క.వి.హే.హే. - పేజీ - 39)

విజ్ఞానశాస్త్రం క్రమంగా, నిరంతరంగా వికసిస్తూ, విస్తరిస్తున్నట్లు విజ్ఞానశాస్త్ర చరిత్రను పరిశీలిస్తే మన కర్థమవుతుంది. అంతేకాదు మానవుని కందుబాటులో వున్న ఏకైక జ్ఞానసాధనం శాస్త్రమే. ఆ శాస్త్రం కనిపెట్టిన సత్యాలతో ఏనాడూ సంతృప్తిపడి ఆగిపోదు. అలా ఆగిపోకుండా నిత్యనూతనమైన సత్యాలతో ముందుకు సాగిపోతూ వుంటుంది. ఆ క్రమంలో మునుపటి కంటె ఎక్కువ సత్యాలను తెలుసుకుంటూ, వాటి ఆధారంగా మానవాళి శ్రేయస్సు కుపయోగపడేవిధంగా ఎన్నో మహోపకారాలు చేస్తూ వస్తున్నది.

ఈ విషయాన్ని విస్మరించి శాస్త్రం కేవలం కొలతల ప్రపంచానికే పరిమితమైనదని ఆరోపించడం అర్థరహితం. అన్నిటినీ కొలతల పరిధిలో ఇమడ్చడానికి శాస్త్రం ఏనాడూ ప్రయత్నించలేదు. మానవుడు తన వివేకాన్ని ఉపయోగించి తెలుసుకోడానికి ఎన్ని మార్గాలున్నాయో వాటన్నిటిని శాస్త్రం కూడా సమర్థిస్తుంది, వినియోగిస్తుంది. అటువంటప్పుడు శాస్త్రం పొడవు, బరువు వంటి ప్రాథమిక గుణాలనే గ్రహిస్తుంది గాని మెత్తన, చల్లన వంటి ఆనుషంగిక గుణాలను గ్రహించదనడం అపోహ అవుతుంది.

అన్నిటినీ కొలవనవసరం లేదు. కొలవగలవాటిని కొలవవచ్చు. కొలవలేని వాటిని జ్ఞానేంద్రియాల సహాయంతో అనుభవించి తెలుసుకోవచ్చు. అదనపు సమాచారం, అదనపు అనుభవంతో మనకున్న పాత భావాలను ఎప్పటికప్పుడు సవరించుకుంటూ సాగిపోవచ్చు. ఇదే హేతువాద విధానం.

'కళాశాస్త్ర వివాదంలో హేతువాది హేతివాదం' పుస్తకంలో బ్రహ్మంగారు హేతువాదం మీద, హేతువాదుల మీద చేసిన విమర్శలు, ఆరోపణలు అన్నీ సత్యదూరాలే. ఆ పుస్తకంలోనూ మరికొన్ని భావాలను గమనించండి.

''హేతువాద పద్ధతిలో సాధనశుద్ధి ప్రధానం. శాస్త్రీయ పద్ధతికి లక్ష్యశుద్ధి కూడా ముఖ్యం. ఇది సూక్ష్మ దృష్టితో చూస్తేనే. స్థూలదృష్టికి హేతువాద పద్ధతి, శాస్త్రీయ పద్ధతి ఒకటే '' (క.వి.హే.హే. పేజీ. 8).

''కనుక హేతువాద పద్ధతిని వివరించుకుంటే శాస్త్రీయ పద్ధతిని వివరించు కున్నట్లు కాదు. కాని శాస్త్రీయ పద్ధతిని వివరించుకుంటే అందులోని ఒక అంగంగా హేతువాద పద్ధతిని వివరించుకున్నట్టే'' (క.వి.హే.హే. పేజి. 5).



హేతువాద పద్ధతి, శాస్త్రీయ పద్ధతి - ఈ రెండింటికున్న సంబంధాన్ని బ్రహ్మంగారు వక్రీకరించి చూపుతున్నారు. హేతువాద పద్ధతి శాస్త్రీయ పద్ధతిలో ఒక అంగం కానేకాదు. వాస్తవానికి శాస్త్రీయపద్ధతే హేతువాద పద్ధతిలో ఒక భాగం. మానవుడిలో అనాదిగా పనిచేస్తూ వస్తున్నది హేతువాదమే. అది క్రమంగా అభివృద్ధి చెందిన కొలది అనేక రంగాలలోని విషయాలను సక్రమంగా అర్థం చేసుకోడానికి మానవుడు రూపొందించుకున్న ప్రక్రియే శాస్త్రీయ పద్ధతి. శాస్త్రీయ పద్ధతి సత్య నిర్ధారణకోసం సర్వజనామోదయోగ్యంగా, బలీయంగా రూపొందిన విశిష్ట ప్రక్రియ. సత్య నిర్ధారణకు నేడు శాస్త్రీయ పద్ధతిని మించిన మరో ప్రక్రియ లేదంటే అతిశయోక్తి కాదు.

హేతువాద పద్ధతి నుంచి ఆవిర్భవించిన ప్రక్రియ శాస్త్రీయ పద్ధతి. అందువల్ల శాస్త్రీయ పద్ధతి హేతువాద పద్ధతిలో భాగమవుతుంది. కాని హేతువాద పద్ధతే శాస్త్రీయ పద్ధతిలో భాగమవుతుండనడం హేతువాదాన్ని సరిగా అర్థం చేసుకోకపోవడాన్నే సూచిస్తుంది.

అలాగే హేతువాద పద్ధతిలో 'సాధనశుద్ధి' ప్రధానమని, శాస్త్రీయపద్ధతిలో లక్ష్యశుద్ధి కూడా ముఖ్యమనడం హేతువాదపద్ధతిని సంకుచితపరచడానికి చేసిన ప్రయత్నంగానే భావించవలసి వుంటుంది. హేతువాద పద్ధతిలోనే సాధనశుద్ధితో పాటు లక్ష్యశుద్ధి కూడా యిమిడివుంది. హేతువాద లక్ష్యం మానవవాద మనడం అందుకే. ఆవిధంగా లక్ష్యసాధనాల మధ్య సమన్వయం కూడా వుంది.

శాస్త్రం, కళల గురించి బ్రహ్మంగారు అదే పుస్తకంలో ఇంకా ఇలా వివరిస్తున్నారు.

''ప్రధానంగా కళ అంతరంగ ప్రకృతినీ, శాస్త్రం బహిరంగ ప్రకృతినీ అభివ్యక్తం చేస్తుంటాయి''. (క.వి.హే.హే. పేజి.27)

''కళాకారునిది లోచూపు, శాస్త్రజ్ఞుడిది బయటిచూపు. కళాకారునిది అంతర్ జ్ఞానం. శాస్త్రజ్ఞుడిది బాహ్యజ్ఞానం''. (క.వి.హే.హే. పేజి.28)

కళ అంతరంగ ప్రకృతినీ, శాస్త్రం బహిరంగ ప్రకృతినీ అభివ్యక్తం చేస్తుంటా యనడం తప్పు. శాస్త్రం అంతరంగ ప్రకృతినీ, బహిరంగ ప్రకృతిని కూడా వ్యక్తం

చేస్తుంది. శాస్త్రం అంతరంగ ప్రకృతిని అభివ్యక్తం చేయదనుకోవడం కేవలం అపోహ మాత్రమే.

ప్రకృతిలోని అసంఖ్యాకమైన అంశాలతోపాటు మానవుడి అంతరంగ ప్రకృతిని తెలియజేసే విధానం శాస్త్రంలో లేదా? ఉంది. దానినే మనం మనో విజ్ఞానశాస్త్రంగా పరిగణిస్తున్నాం. అందువల్ల అంతరంగ ప్రకృతిని అభివ్యక్తం చేసేది కళ మాత్రమే అనుకోవడం ఎంత సత్యదూరమో స్పష్టమవుతూనే వుంది.

కళాకారునిది లోచుపు, శాస్త్రజ్ఞుడిది బయటి చూపు అనడం కూడా తప్పే. కళాకారునిది అంతర్‌జ్ఞానం. శాస్త్రజ్ఞుడిది బాహ్యజ్ఞానమనడం ఆయా విషయాలపట్ల వారికున్న అవగాహనా రాహిత్యాన్నే సూచిస్తుంది.

పై భావాలకు విరుద్ధంగా మరోచోట కళాశాస్త్రాల గురించి వారి వ్యాఖ్యానాలు చూడండి.

"స్థూలంగా చూస్తే శాస్త్రం జిజ్ఞాసా ఫలితం. కళ సృజన ఫలితం. శాస్త్రానిది ఆలోచన, కళది ఆచరణ". (క.వి.హే.హే. పేజి.27). ఈ భావాలు పూర్తిగా నిరాధారం.

శాస్త్రంలో సృజన లేదనడం, అది కేవలం కళకే స్వంతమనడం శాస్త్రాన్ని అపహాస్యం చేయడమే. ఆలోచన ద్వారానే సృజన ద్వారాలు తెరుచుకుంటాయి. ఆలోచన లేకుండా వుండే ఆచరణ ఆచరణ కాజాలదు. అది కళ అయితే కావచ్చు. ఆలోచనారహితమైన ఆచరణను అంధానుసరణగా హేతువాదులు పేర్కొంటారు. దానినే కళ అంటామంటే మనం అభ్యంతర పెట్టాల్సిన అవసరం కన్పించదు. కావున ఈవిధంగా పరిశీలించినా లోచూపు శాస్త్రజ్ఞుడిది, బయటిచూపు కళాకారుడిదని చెప్పవలసి వుంటుంది.

అలాగే విషయాలను విశ్లేషించి సత్యాన్ని తేల్చేది శాస్త్రమే కావున శాస్త్రానిది అంతర్‌జ్ఞానం, కళది బాహ్యజ్ఞానం అని కూడా చెప్పవలసి వుంటుంది. వాస్తవానికి శాస్త్రం బాహ్యాంతర ప్రకృతి సమస్తానికి వర్తిస్తుంది. జ్ఞాన ప్రక్రియకు శాస్త్రం సాధనమైనపుడు దాన్ని ఏదో ఒకదానికి పరిమితం చేయడమనేది సరియైన పద్ధతి కాజాలదు. కళది అంతర్‌జ్ఞానమని, శాస్త్రానిది బాహ్యజ్ఞానమని వ్యాఖ్యానించడం వాటిని వక్రీకరించడం కాక మరే మవుతుంది?



మరోచోట బ్రహ్మంగారు కళాశాస్త్ర చర్చజేస్తూ ఏమంటున్నారో పరిశీలించండి. "కళలు శాస్త్రాల నుంచి వుత్పన్నం కాలేదు. శాస్త్రాలే కళల నుంచి వుత్పన్నమయ్యాయి. వృత్తికళల నుంచి భౌతిక శాస్త్రాలు, వైద్యం, యుద్ధం, చేతిపనులు వంటి కళల నుంచి సాంకేతిక శాస్త్రాలూ, సంఘ నిర్మాణ కళల నుంచి మనో విజ్ఞానశాస్త్రాలూ వుత్పన్న మయ్యాయనడమే సమంజసం". అదే పుస్తకం (క.వి.హే.హే. పేజి. 30)

ఇది మరీ విడ్డూరంగానూ, హాస్యాస్పదంగానూ వుంది.

అదే పుస్తకంలో బ్రహ్మంగారు మరోచోట వ్యక్తం చేసిన భావాలు దీనికి విరుద్ధంగా వున్నాయి. "మానవ స్థాయిలో ప్రతి కళకు పునాది శాస్త్రంలోనే వుంటుంది. ప్రతిశాస్త్రం కళలోనే అభివ్యక్తమవుతుంది". (క.వి.హే.హే. పేజి.27)

ప్రతి కళకు శాస్త్రం పునాది అయినపుడు, కళలు శాస్త్రాల నుంచి వుత్పన్నం కాలేదనడం, శాస్త్రాలే కళల నుంచి ఉత్పన్నమయ్యాయనడం ఎలా సాధ్యపడుతుంది?

కళకు పునాది శాస్త్రమైతే శాస్త్రం నుండి కళలు వుత్పన్నమైనాయనడమే సమంజసమవుతుంది. కాని దాన్ని తల్లక్రిందులుగా చేసి చెప్పడం బహుశా 'కళానైపుణ్యం' కావచ్చు!

పునాదిమీద ఆధారపడి ఉపరితల నిర్మాణాలుంటాయి. అలాగే శాస్త్ర పునాదులమీద ఆధారపడి మాత్రమే కళలనే ఉపరితల నిర్మాణాలు వుంటాయి. దీనికి విరుద్ధంగా శాస్త్రాలన్నీ కళల నుంచి ఏర్పడ్డాయనడం ఉపరితల నిర్మాణాల మీద పునాది ఆధారపడి వుంటుందనడం వంటిదే.

నీతిని గురించి హేతువాదం, రాడికల్ హ్యూమనిస్టుల అభిప్రాయాలను తప్పుగా చిత్రీకరిస్తూ బ్రహ్మంగారు చేసిన వ్యాఖ్యానాలు సత్యదూరాలు.

"మానవుడు ఉన్నస్థితిని వర్ణిస్తుంది హేతుతత్వం, అతడు వుండవలసిన స్థితిని వివరిస్తుంది నీతితత్వం. ఉన్నస్థితి ఉండవలసిన స్థితికి తప్పనిసరిగా నడిపించగలదనుకోవటం నవ్యమానవవాదులు కనే కలలలో దివ్యమైనది" (క.వి.హే.హే. - పేజీ 31).

హేతుతత్వం మానవుడు ఉన్నస్థితిని మాత్రమే వర్ణిస్తుందనుకోవటం పొరపాటు అవగాహన. హేతుతత్వం వున్నస్థితిని మాత్రమే వర్ణించదు. అది భూత

వర్తమాన భవిష్యత్కాలాలలో మానవులు ఉండిన, ఉంటున్న, ఉండవలసిన విషయాలను గురించికూడా విశదీకరిస్తుంది.

బ్రహ్మంగారనుకుంటున్నట్లు ఉన్నస్థితి ఉండవలసిన స్థితికి తప్పనిసరిగా నడిపించగలదని హేతువాదులుగాని, నవ్యమానవ వాదులుగాని కలలుగనరు. కారణం అలా భావించడం అహేతుకమని వారికి తెలిసివుండడమే.

వాస్తవాలతో, హేతువుతో సంబంధం లేకుండా పగటి కలలు కనేవారు సమాజంలో అధికశాతమే వున్నారు. వారిలో మతవాదులు, మాయావాదులు, మార్మికవాదులు వుంటారేగాని మానవవాదులు, హేతువాదులు వుండరు.

''నీతిని హేతుబద్ధ నిర్ణయంగా ఏనాడో మార్చివేసారు రాడికల్ హ్యూమనిస్టులు. జగత్తు నియమబద్ధమనీ, నియమబద్ధమైన జగత్తు నుండి ఆవిర్భవించాడు కనుకనే మానవుడు హేతుబద్ధుడయ్యాడనీ, అంటే నిర్జీవ జగత్తులోని నియమబద్ధతే మానవుని మట్టంలో హేతుబద్ధంగా మారిందనీ, మానవుడు హేతుబద్ధుడు కనుకనే నీతిబద్ధుడవుతున్నాడనీ ఏనాడో రాడికల్ హ్యూమనిస్టులు తీర్మానించారు. నీతిని గురించి యిలాంటి హేతుబద్ధ నిర్ణయం మిగతావారి కెవరికీ లేదు. అయినా యిది మిగతావారికంటే రాడికల్ హ్యూమనిస్టులను నీతిమంతులను చేసినట్లు దాఖలాలు లేవు. అదే పుస్తకం (క.వి.హే.హే. 31వ పేజి).

హేతుత్వాభివృద్ధికి, వ్యక్తులలోని నైతిక ప్రమాణాల పెరుగుదలకూ అవినాభావసంబంధం వుందనేది విస్మరించడానికి వీలులేని చారిత్రక సత్యం.

ఈ వాస్తవం చరిత్రకారులు ఆమోదించినదే. 'మానవవాద దృక్పథంలో చరిత్ర' అనే రచనలో మోరిస్ గిన్స్ బర్గ్ యిలా అంటాడు. 'అభ్యుదయ సిద్ధాంతాలలో ఒక ప్రధానమైన విషయం సత్యంగా మిగిలి పోయింది. అదేమిటంటే - చారిత్రకాభివృద్ధిలో మానవుడు నిదానంగా హేతుమంతుడైనాడు. అతనిలో హేతుత్వం పెరిగినమేరకే అతడు నీతిమంతుడైనాడు'.

ఈ అభిప్రాయం హేతుత్వానికి - నైతికాభివృద్ధికి వున్న అవినాభావ సంబంధాన్ని స్పష్టం చేస్తున్నది. అందువల్ల నీతి హేతుబద్ధ నిర్ణయం కావడంలో తప్పులేదు, కాకపోవడమే తప్పు.



బ్రహ్మంగారు భావిస్తున్నట్లు నీతి అనేది హేతువుతో సంబంధం లేకుండా వుండే అంశం కాదు. నీతిని బ్రతికించేది హేతువే. హేతువును విడనాడితే మనిషి నీతిమంతుడైపోడు. ఉద్వేగాల స్వాధీనంలోనే అతడు వుంటాడు తప్ప ఉద్వేగాలు అతని స్వాధీనంలో ఉండవు. ఉద్వేగాలను అదుపులో వుంచుకునే శక్తిని ప్రసాదించేది హేతుత్వమేగాని మరొకటికాదు.

ప్రకృతి నియమబద్ధమై వుండకపోతే అది ఎవరికీ అర్థం కావటానికే వీలులేదు. అది అర్థమవుతున్నదంటేనే అది నియమబద్ధంగా వుందని అర్థం. ప్రకృతి నియమబద్ధతను గుర్తించడం హేతువాదంలో ప్రథమపాఠం.

ప్రకృతిలో భాగమైన మానవుడిలో ఆ నియమబద్ధత హేతుత్వంగా భాసిస్తుండటమూ వాస్తవమే. ప్రకృతిలో నియమబద్ధత లేకపోతే జ్ఞానం ఏర్పడడానికే అవకాశం లేదు. ఆదిమానవుడి నుండి ఆధునిక మానవుని వరకు అందరూ అవలంబిస్తున్న విధానం - ప్రకృతి నియమాలను మరింతగా అధ్యయనం చేస్తూ, అవగాహనా పరిధులను విస్తృతపరచుకోవడమే.

ప్రకృతిలో వున్న నియమబద్ధతను గుర్తించలేనివారు (ప్రచ్ఛన్న) మతవాదులే అవుతారు. నియమబద్ధతలో మహిమలకు, మహత్యాలకు తావుండదు. వైరుధ్యాలకు వీలుండదు. అందుకే మతస్తులు నియమబద్ధతను నిరాకరించి, ఏ సంఘటన జరిగినా 'దైవలీల' గా పరిగణించి ప్రచారం చేస్తుంటారు.

విలువలను గురించికూడా బ్రహ్మంగారి వాదం విపరీతమైనదనే చెప్పవలసి వస్తుంది. విలువలు హేతుబద్ధమైతే మనిషి పూర్తిగా సమాధి అవుతాడనేది వారి వాదం.

''నీతిని గూర్చిన హేతుబద్ధ నిర్ణయం ఇంత బ్రహ్మాండంగా పరిణమించగా ఇక విలువలన్నీ కూడ హేతుబద్ధం కావాలట. దానితో గాని మనిషి పూర్తిగా సమాధి కాడు. హేతుబద్ధత వివేక సంబంధమైనది. జీవపరిణామక్రమంలో వివేకం నిన్నగాక మొన్న కన్ను తెరిచింది. విలువలు ఉద్వేగ సంబంధమైనవి. వాటి పునాదులు ఏనాటినుంచో జంతుజగత్తులో కూడా వున్నట్లు స్పష్టంగా అర్థమవుతుంది. కాబట్టి విలువలు సహజాత లక్షణాలు. వాటిని హేతుబద్ధం చేయటమేమిటి?'' అని ప్రశ్నిస్తున్నారు. (క.వి.హే.హే. 32వ పేజి).

విలువలు ఉద్వేగ సంబంధమైనవనడం పొరపాటు అవగాహనే. అవి సహజాత లక్షణాలు కాబట్టి హేతుబద్ధం చేయటమేమిటని ప్రశ్నించడం అహేతుకమే గాక అమానుషం కూడా అవుతుంది. ప్రశ్నించరాదని కాదు నేనంటున్నది. విలువలను హేతుబద్ధం చేయరాదనడం మనుషులను జంతువుల స్థాయిలోనే మిగిలిపొమ్మనడం వంటిదవుతుందని నా భావం.

విలువలు మానవులకు సంబంధించినంత వరకు మనుషుల ఉనికితోనే ప్రారంభమవుతాయి. హేతువాదులు, మానవవాదులు స్వేచ్ఛను మౌలికవిలువగా గుర్తిస్తారు. స్వేచ్ఛా పరిధులను విస్తృతపరచుకునే ప్రక్రియలో మానవుడు అనేక విలువలను రూపొందించుకుంటూ వస్తున్నాడు.

సత్యం, ధర్మం, నీతి మొదలైన విలువలన్నీ హేతువుతో ముడిపడి వున్నవే. హేతువును విడనాడితే విలువలకు స్థానమెక్కడ ? ఉద్వేగాలను రెచ్చగొడితే విలువలు వృద్ధిచెందవు.

హేతువును సక్రమంగా ఉపయోగిస్తేనే జ్ఞానం లభిస్తుంది. జ్ఞానం బోధ పడినప్పుడే సత్యం రూపొందుతుంది. జ్ఞానం ఏర్పడినమేరకే విలువలు వికసిస్తాయి. విలువలు వికసించిన మేరకే వ్యక్తులు ఔన్నత్యాన్ని పొందుతారు. వ్యక్తుల ఉన్నతినిబట్టే సమాజోన్నతి ఆధారపడి వుంటుంది. ఇది హేతువికాస క్రమమేగాని ఉద్వేగాభివృద్ధి కాదు. వివేకం అదృశ్యమైతే విలువలు నశిస్తాయి. విలువలను ఉద్వేగాలకు పరిమితం చేస్తే అవి పతనమవుతాయి.

హేతువాదులు, మానవవాదులు, మతవాదులను గురించి చర్చిస్తూ బ్రహ్మంగారు చేసిన వ్యాఖ్యానాలు వారి అవగాహనా రాహిత్యానికి దర్పణం పడుతున్నాయి.

"ఈనాడు హేతువాదులమనీ, మానవవాదులమనీ భావించే చాలామంది ప్రముఖుల్లోలేని హేతువాదం, మానవవాదం ఈ మతవాదుల్లోనే స్పష్టంగా కనిపిస్తుంది." అదే పుస్తకం (క.వి.హే.హే. 37వ పేజి)

"హేతువాదం - నీతివాదం - మతవాదం - మానవవాదం - ఆస్తికవాదం - నాస్తికవాదం - కళావాదం - శాస్త్రవాదం - వగైరాలు అభ్యుదయదాయకాలా కాదా



అన్నది ఆయా ముద్రల మీద ఏమీ ఆధారపడి వుండదు. ఆ ముద్రలను తగిలించుకొన్న మనుషుల మనోవికాసంమీదా, సంస్కారంమీదా ఆధారపడి వుంటుంది. వాటికి జ్ఞానం మీటగా పనిచేస్తుంది." (క.వి.హే.హే. 37వ పేజి)

జ్ఞానంలో వైరుధ్యాలకు తావుండదు. పరస్పర విరుద్ధమైన భావాలను, పదాలను జ్ఞానం ఏకకాలంలో సమర్థించదు. మతవాదాన్ని, ఆస్తికవాదాన్ని సమర్థించేది జ్ఞానం కాజాలదు. అది జాడ్యమవుతుంది. దానిని హేతువాదులు, మానవవాదులు 'మతజాడ్య' మంటారు.

వాస్తవానికి నేటి మతాలన్నిటిలోని ప్రధాన లక్షణంగా ఈ ధోరణే వ్యాపిస్తున్నది. ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణికూడా. ఎప్పుడేది జరిగినా అన్నిటినీ సమర్థించుకోడాని కుపయోగపడే అవకాశవాద ధోరణి కూడా యిదే. ఇటువంటి మోసపూరిత వాదాలను చేపట్టడం వల్లనే మతాలింకా మనగల్గుతున్నాయి. ఇటువంటి వాదాలను ఎవరు ఏ పేరుతో సమర్థించినా అది మానవవాదం పట్ల అపచారం చేసినట్లవుతుంది.

సమగ్ర జ్ఞానమున్నవాడు ఆస్తిక వాదిగానీ, నాస్తికవాదిగానీ అభ్యుదయవాదిగా తేలగలడనడం ఆత్మవంచన, పరవంచన కూడా అవుతుంది.

మొత్తం మీద చెప్పదలచుకున్న దేమిటంటే - హేతువాదులుగాని, మానవవాదులుగాని కళలను వ్యతిరేకించరు, నిరాకరించరు, ద్వేషించరు. అయితే మానవులకు సంబంధించినంతవరకు కళలస్థానం ఏమిటి? ఎక్కడ ? అనే ప్రశ్న వచ్చినపుడు - వాటిస్థానం శాస్త్రానికి తరువాతదేగాని ముందుమాత్రం కాదని గుర్తుంచుకోవాల్సి వుంటుంది.

మరో విషయమేమిటంటే కళలు వినోదసాధనాలేగాని సత్య సాధకాలు మాత్రం కాజాలవనేది.

మానవుడి స్థాయిలో వివేకం యొక్క స్థానం అద్వితీయమైనది. ఎట్టి పరిస్థితులలోను వివేకాన్ని విడనాడడానికి వీలులేదు.

మానవులు ఏ రంగంలో అభ్యుదయాన్ని సాధించాలన్నా ప్రధానంగా ఆధారపడవలసింది వివేకం మీదనే. కళలు, మతాలు, యోగాలు - చాలావరకు

మార్మికతను సంతరించుకుని, అస్పష్టమైన భావాలను ప్రచారంచేస్తూ వస్తున్నాయి. తద్వారా సమాజంలోని వ్యక్తులలో వైరుధ్యాలతో కూడిన గందరగోళం చోటు చేసుకుంటున్నది. అటువంటి పరిస్థితులను మార్చుకోడానికి మానవజాతికున్న ఏకైక సాధనమే హేతుత్వం.

హేతువాదాన్ని అపార్థం చేసుకున్నవారిలో రకరకాల వింత ధోరణులు కనిపిస్తుంటాయి. అటువంటి వింత ధోరణుల్లో ఎటువంటి భావాలు చోటుచేసుకుంటాయో ముందుగా పరిశీలించి తెలుసుకోవాలి. అప్పుడే అవెంత అహేతుకమైనవో, ప్రమాదకరమైనవో గుర్తించడానికి వీలవుతుంది.

సమాజాన్ని ఉద్ధరించడానికే తాము సత్యాన్వేషణ సాగిస్తున్నా మంటూ బయలుదేరిన ప్రచ్ఛన్న మతవాదులు కొందరు ఎటువంటి సమస్యలను, సామాజిక సమస్యలుగా గుర్తిస్తున్నారో తెలుసుకుంటే ఆయా విషయాలపట్ల వారికున్న అవగాహన ఎంత లోపభూయిష్టమైనదో స్పష్టమవుతుంది.

వారి అనుభవం, అవగాహన ప్రకారం ఆధ్యాత్మిక, సాంఘిక సేవా కేంద్రాలన్నిటిలో ఒకటే ప్రధానమైన సమస్యవుందట. అదేమిటంటే - గోరా అనంతరం గోరా లేకపోవడం; కవిరాజు పిదప ఆయన ప్రతినిధి లేకపోవడం; మళయాళస్వామి, విద్యానంద, అనుభవానందస్వాముల పిదప అటువంటివారు లేకపోవడం; శ్రీరమణమహర్షి, అరవిందమహర్షి లేకపోవడం; జిడ్డు క్రిష్ణమూర్తి జిల్లెళ్ళమూడి అమ్మల స్థానాన్ని పూరించేవారు లేకపోవడం; పుట్టపర్తి సాయిబాబా అనంతరం ఆ స్థానాన్ని భర్తీచేసేవారు లేకపోవటం.

ఇదీ సత్యాన్వేషణ మండలివారి దృష్టిలో వున్న ప్రధాన సమస్య. ఈ ప్రధాన సమస్యను పరిష్కరించడానికే వారు సత్యాన్వేషణ సాగిస్తున్నారనేది స్పష్టంగానే అర్థమవుతున్నది.

నేరుగా మతోద్ధారకుల పేర్లను మాత్రమే వుటంకిస్తే వారి అసలు రంగు బయటపడుతుందనే - గోరా, కవిరాజులను కూడా వారితో పాటు కలుపుతున్నారు. ఇది కేవలం సత్యాన్వేషకులు తగిలించుకున్న ముసుగుమాత్రమే. ఇటువంటి ముసుగులు తగిలించుకున్నంత మాత్రాన హేతువాదులు, నాస్తికులు వీరి నిజస్వరూపాన్ని గుర్తించకపోరు.



ఎవరివల్లనైతే ఈ దేశం తరతరాలుగా ఆధ్యాత్మికంగా మోసానికి గురవు తున్నదో, వారి తరువాత మళ్ళీ అటువంటి మోసవిద్యలో ఆరితేరినవారు లేరని బాధపడడం, మొసలి కన్నీరు కార్చడం దేనిని తెలుపుతున్నదో వేరుగా చెప్పవలసిన అవసరం లేదనుకుంటాను. ఎవరి సిద్ధాంతాలేమిటో, భావాలేమిటో తెలుసుకోకుండానే పరస్పర విరుద్ధమైన భావాలను, సిద్ధాంతాలను ప్రచారం చేసిన వారినందరినీ ఒకేగాటకట్టి మాట్లాడటం - ఆయా వ్యక్తుల గురించి, విషయాల గురించి వారికున్న అవగాహనారాహిత్యానికి నిదర్శనం.

మనదేశంలో మళయాళ స్వాములకు, విద్యానంద, అనుభవా నందలకు కొదవలేదు. జిల్లెళ్ళమూడి అమ్మ, సాయిబాబా వంటి వారికీ కొదవలేదు. కాషాయ వస్త్రాలు ధరించిన కపట సన్యాసులు వీధి కొకరు దర్శనమిస్తారు. పురాణాలను ప్రచారం చేస్తూ, అజ్ఞానాన్ని పెంచుతున్న ఇటువంటి స్వాములను, సన్యాసులను కీర్తించే వారికీ ఈ దేశంలో కొదువలేదు.

అందమైన కథలల్లి, అసత్య భావాలను ప్రచారం చేయడానికి ఇక్కడ వున్నన్ని సదుపాయాలు మరేదేశంలోనూ వున్నట్లు కనిపించదు. ఇది చాలదన్నట్లు సత్యాన్వేషణ పేరుతో, లౌకికవాదం ముసుగులో మత ప్రచారాన్ని కొనసాగించడానికి మరికొన్ని శక్తులు బయలుదేరుతున్నాయి.

జనాన్ని ఆకర్షించడానికి వీరు హేతువాదులమీద, మానవవాదుల మీద, నాస్తికులమీద నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారు.

విజ్ఞాన శాస్త్రావిష్కరణలు ఆధారమని చెప్పుకునే నాస్తికులు, హేతువాదులు కూడా తమ అభిప్రాయాలకు ఆధారంగా వూహనో, మరో వ్యక్తి మాటనో ఆధారంగా తీసుకుంటున్నారనీ, ఈ విషయంలో మతస్తులు అంధ విశ్వాసులని చెబుతూ, వారు అదే మార్గంలో పయనిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అంతేగాక హేతువాదులు ఎం.ఎన్.రాయ్ నిర్ధారితాంశాలు మరల సరిచూడవలసిన పనిలేదంటున్నారని కూడా ఆరోపిస్తున్నారు.

హేతువాదులు కేవలం వూహలను, వ్యక్తుల మాటలను ఆధారంగా తీసుకోవడం లేదు. ఎం.ఎన్.రాయ్ నిర్ధారించిన అంశాలను మరల సరిచూడవలసిన

పనిలేదని ఏ హేతువాదులూ అనలేదు, అనలేరుకూడా. ఏ విజ్ఞానాన్నయినా సరే పరీక్షించవలసిన పనిలేదని అనడం మతస్థుల మార్గమేగాని, హేతువాదమార్గం మాత్రం కాజాలదు. కేవలం వూహలమీద, వ్యక్తుల మాటలమీద, గ్రంథాలలో పేర్కొన్న విషయాలమీద ఆధారపడేవన్నీ మతాలే. నేడు సమాజంలో పాతుకుపోయిన మతాలన్నీ ఈ లక్షణాలను పుణికిపుచ్చుకున్నవే.

మత నైజానికి భిన్నంగా హేతువాదం వివృతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తుంది. అన్ని మతాలు సంవృతమైన ఆలోచనా విధానాలకు నిదర్శనాలు.

స్వేచ్ఛాలోచనలను పెంపొందించే హేతువాదులు ఎం.ఎన్.రాయ్ నిర్ధారితాంశాలను మరల సరిచూడవలసిన పనిలేదనరు. ఎవరు నిర్ధారించిన అంశాలైనా అవి ఆధునిక విజ్ఞాన శాస్త్రం ముందు సత్యాలుగా నిలబడగలవా లేదా అన్నదే ప్రధానం. రాయ్ ప్రతిపాదించిన నవ్యమానవవాదంగాని, దాని తాత్విక భూమికగా వున్న భౌతిక వాస్తవికవాదంగాని ఆధునిక విజ్ఞానశాస్త్రం ముందు సత్యాలుగా నిలబడగలిగేవే. ఆ భావాలను మార్చుకోవలసినంతటి తీవ్రమైన శాస్త్రీయ పరిణామాలు ఇప్పటి వరకు విజ్ఞాన శాస్త్ర రంగంలో చోటుచేసుకోలేదు. కాబట్టి ఇప్పుడే ఆ భావాలను మార్చుకోవలసిన అవసరం కనిపించడం లేదని అర్థం.

భవిష్యత్తులో వైజ్ఞానిక రంగంలో వచ్చే మార్పులు నవ్యమానవవాద భావాలను, భౌతిక వాస్తవికవాద భావాలను తప్పులని తేలిస్తే ఆ మేరకు ఆయా భావాలను మార్చుకోడానికి మానవవాదులు, హేతువాదులు ఎల్లప్పుడూ సిద్ధంగా వుంటారు.

ఆధునిక విజ్ఞానశాస్త్రం భావవాదాన్ని, మతాలను సమర్థిస్తుందనేవారు ఇటీవలికాలంలో పాశ్చాత్యదేశాలలో బయలుదేరినట్లే మనదేశంలోనూ బయలుదేరుతున్నారు. అటువంటివారు హేతువాదులమీద, మానవవాదుల మీద నిరాధారమైన ఆరోపణలు చేయడం ద్వారా పదిమందిలో గుర్తింపు పొందాలని తాపత్రయ పడుతున్నట్లు కనిపిస్తుంది. ఇటువంటి విధానాలను ఇకనైనా విడనాడి వారి సిద్ధాంతాలను, భావాలను సూటిగా చెప్పుకోవడం మంచిది.



అయితే అటువంటివారికి ఏ భావాలు, సిద్ధాంతాలు స్పష్టంగా లేకపోవడం వల్ల వారు అయోమయంలో పడిపోయి ఇతరులను కూడా అయోమయానికి గురిచేస్తున్నారు. విషయపరమైన విమర్శలకు బదులుగా వ్యక్తిగత విమర్శలకు దిగడం వీరికి అలవాటుగా మారినట్లు కనిపిస్తుంది.

భౌతికవాదుల గురించి వీరికున్న అవగాహన లోపభూయిష్టమైనది.

భౌతికవాదులు మనిషి - మనస్తత్వము లన్నవాటికి ప్రాధాన్యత నివ్వక పదార్థం, పదార్థం అంటూ కొట్టుకులాడుతున్నారని ఆరోపిస్తున్నారు.

వాస్తవానికి మనిషికి - మనస్తత్వానికి ప్రాధాన్యత నిస్తున్నవారు భౌతికవాదులే. ఆ భౌతికవాదాన్ని అనుసరిస్తున్న హేతువాదులు, మానవవాదులు కూడా మనిషికి ప్రాధాన్యతనిస్తున్నవారే. మనిషికి ఏమాత్రం విలువ నివ్వనివారు మతస్తులే. మనుషులను మరో ఉన్నతమైన కల్పిత లక్ష్యానికి బానిసలుగా చేసివేయడం భావవాదుల సిద్ధాంతం. ఆ సిద్ధాంతాన్ని అనుసరించే పని ఆయా మతాలది, మతపీఠాలది, మఠాలది.

హేతువాద లక్ష్యం మానవవాదమే. మానవవాదంలో మనిషి తనకుతానే లక్ష్యం. కావున మనిషికి, మనస్తత్వానికి, భావాలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చేవారు హేతువాదులు, మానవవాదులు, భౌతికవాదులు. మనుషులను పశువులకన్నా హీనంగాచూసే సంస్కృతి మతాలదే.

భౌతికవాదులు పదార్థం, పదార్థం అంటూ కొట్టుకలాడుతున్నారని అపహాస్యం చేయడం చూస్తుంటే వీరికి పదార్థం గురించి, భౌతికవాదం గురించి కనీసావగాహనకూడా లేదనిపిస్తుంది.

పదార్థం ద్రవ్యం మాత్రం కాదట. ద్రవ్యమూ ఒక పదార్థమేనట. పదార్థాలు మౌలికంగా అయిదు రకాలట. అవి : వస్తుపదార్థం, ద్రవ్యపదార్థం, గుణపదార్థం, క్రియాపదార్థం, సంబంధపదార్థం !!

విజ్ఞానశాస్త్రాల గురించి ఏమాత్రం పరిచయమున్నవారైనా పదార్థాన్ని పై తెల్పిన విధంగా విభజించడాన్ని ఆమోదించలేరు.

విశ్వంలో వున్నదంతా పదార్థమే. అందుకే భౌతికవాదులు పదార్థం, పదార్థం అంటారు. ఏదయితే ఉనికి కలిగివున్నదో అదంతా పదార్థమే. దాన్నే ఆంగ్లంలో మేటర్ అంటాం. పదార్థ వాదమంటే మెటీరియలిజమే, భౌతికవాదమే.

భౌతికంగా అస్తిత్వం కలిగి వున్నదానినంతా పదార్థంగానే పరిగణిస్తాం. స్థూల, సూక్ష్మరూపాలలో దర్శనమిచ్చే పదార్థం శక్తిగాకూడా రూపాంతరం చెందుతుందని తెలుసుకున్నాం. ఆధునిక విజ్ఞానశాస్త్రం పదార్థ స్వరూప స్వభావాలకు చెందిన అవగాహనను పెంచింది. ఆ అవగాహన మేరకు రూపసహితంగా, రూపరహితంగా అనేక విధాలుగా తన ఉనికిని చాటుతున్న పదార్థ సర్వస్వానికి విస్తృతమైన అర్థాన్ని కల్పించడంకోసం భౌతిక వాస్తవికత అంటున్నాం.

ఈ భౌతిక వాస్తవికత చలనం లేనిది, మార్పులేనిది కాదు. ఇది నిరంతర చలనంలో వున్న పరిణామశీలి. ఆ పరిణామం నియమబద్ధం. ఆ నియమాలు భౌతిక వాస్తవికాంతర్గతమైనవి. ఈ భౌతిక వాస్తవికతకు భిన్నంగా, బాహ్యంగా దేనినీ వూహించడానికే వీలులేదు.

ఈ భౌతిక వాస్తవికతకు సంబంధించిన అత్యధిక వివరాలను తెలుసు కోవడమే శాఖోపశాఖలుగా విస్తరించిన విజ్ఞానశాస్త్రం చేస్తున్న ప్రయత్నం. సేకరించిన ఆ వివరాలను క్రమబద్ధీకరించి, సమన్వయపరచగా రూపొందిందే భౌతికవాద తత్వం. దానినే నేడు భౌతిక వాస్తవికవాద మంటున్నాం.

అందువల్ల పదార్థం ప్రకటించే ధర్మాలను, గుణాలను దాని లక్షణాలుగా గుర్తించాలి. ఆ ధర్మాలను, గుణాలను ఆ పదార్థం నుండి విడగొట్టి వాటికి గుణ పదార్థమని, క్రియా పదార్థమని, సంబంధ పదార్థమని పేర్కొనడం అవివేకమవుతుంది. ఎందుకంటే - అది ఆయాగుణాలు పదార్థానికి భిన్నంగా, అస్తిత్వాన్ని కలిగి వుంటాయనే భ్రమపూరితమైన భావాన్ని కల్గిస్తున్నది కాబట్టి.

హేతువాదం గురించి ఇప్పటి వరకు ప్రచురితమైన రచనలు అనేకం వున్నాయి. హేతువాద స్వరూప స్వభావాల గురించి హేతువాది పత్రికా ముఖంగా చర్చలు సాగుతూనే వున్నాయి. అనేక హేతువాద, మానవవాద అధ్యయన తరగతుల్లో ఈ విషయం చర్చించబడుతూనే వుంది. ఇంత జరుగుతున్నా ఇంకా హేతువాదం



గురించి అనేకుల్లో అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. అది సహజం, సంతోషదాయకం కూడా. ఎందువల్లనంటే సందేహాలు తలెత్తినపుడే వాటి నివృత్తికై ప్రయత్నాలు జరుగుతాయి. ఆ ప్రయత్నాల ఫలితంగా ఆయా అంశాల గురించి విషయపరంగా మరింత స్పష్టత ఏర్పడుతుంది. ఈ క్రమం నిరంతరం కొనసాగుతూనే వుంటుంది. ఈ ప్రక్రియలో మనం అస్పష్టత నుండి స్పష్టతకు, అసమగ్రత నుండి సమగ్రతకు, వున్నస్థాయి నుండి వున్నతస్థాయికి చేరుకోడానికి వీలవుతుంది.

ఇదే సందర్భంగా కొన్ని పర్యాయాలు విరుద్ధమైన ఫలితాలను పొందే ప్రమాదం కూడా లేకపోలేదు. దానికి ప్రధాన కారణం భావగ్రహణ, భావవ్యక్తీకరణ ప్రక్రియలో లోపమే.

ఈ భావగ్రహణ, భావవ్యక్తీకరణ సామర్థ్యం ఆయావ్యక్తుల జ్ఞాన స్థాయి మీద ఆధారపడి వుంటుంది. అందులోనూ తాత్విక విషయాలలో క్లిష్టమైన, జటిలమైన అంశాలను అర్థం చేసుకోవడంలో ఇది మరింత సత్యం. అందువల్లనే అనేక తాత్వికాంశాలను ఒక్కొక్కరు ఒక్కోవిధంగా అర్థం చేసుకుంటూ వుంటారు. ఆ క్రమంలో ఆ విషయంలో అనేక వైరుధ్యాలు ఏర్పడినపుడే అసలు సమస్య తలెత్తుతుంది. ఏవి వైవిధ్యాలో, ఏవి వైరుధ్యాలో గుర్తించడానికి కూడా వివేచనా సామర్థ్యం కలిగివుండాలి. జిజ్ఞాస, అధ్యయనం, ఆచరణ ఆ సామర్థ్యాన్ని పెంచుకోడానికి తోడ్పడతాయి.

మనం ఇంతకుముందు హేతువాదం గురించి ప్రచారమవుతున్న కొన్ని అపోహలను, అపార్థాలను పరిశీలించాం. అయినా పరిశీలించాల్సినవి ఇంకా అనేకం మిగిలే వున్నాయి. అన్నిటిని పరిశీలించడం ఒక్కసారికిగాని, ఒక్కరికిగాని సాధ్య పడదేమో అనిపిస్తుంది. ప్రస్తుతానికి మరో ఒకటి రెండు అంశాలను పరిశీలిద్దాం.

కొందరు ఆస్తిక, నాస్తిక చర్చ చేస్తూ ఇంతవరకు ఆస్తికత్వమూ రుజువు కాలేదు. నాస్తికత్వమూ రుజువు కాలేదనే వాదాన్ని ముందుకు తెస్తున్నారు. దానికి కారణంగా వారు చెబుతున్న దేమంటే - ఆస్తిక సిద్ధాంతానికి మూలమైన చైతన్యం నుండి పదార్థం సృష్టింపబడినట్లు ఏ ఆస్తికుడూ రుజువు చేయలేకపోయాడనీ, అదే విధంగా నాస్తిక సిద్ధాంతానికి, భౌతికవాద, హేతువాద సిద్ధాంతాలకు మూలమైన పదార్థం నుండి చైతన్యం సృష్టించబడినట్లు ఏ నాస్తికుడు, భౌతికవాది, హేతువాది

గానీ, ఏ శాస్త్రజ్ఞుడు గానీ రుజువు చేయలేకపోయాడనీ, వీటిని తేల్చడానికి ఇంకా ప్రయోగాలు మాత్రం సాగుతున్నాయని, ఇంకా ఏదీ రుజువు మాత్రం కాలేదని వాదిస్తున్నారు. మరి కొంచెం ముందుకెళ్లి ఆస్తికత్వం తప్పని రుజువైనంత మాత్రాన నాస్తికత్వం ఒప్పని రుజువైనట్లు కాదుగదా అని తర్కిస్తున్నారు.

ఈ వాదం పైకి చూడడానికి ఎంతో హేతుబద్ధంగా వున్నట్లు కొందరికి అనిపించవచ్చు కాని, లోతుగా విశ్లేషించి చూస్తే అందులో వున్న వాస్తవమెంతో మనం గ్రహించవచ్చు.

ఆస్తిక, నాస్తిక వాదాలు ఈనాటివి కావు. వేలాది సంవత్సరాల నుండే అది మానవ సమాజాలలో ఆవిర్భవించి నిరంతరాయంగా కొనసాగుతూనే వున్నాయి. ఆయా వాదాలను సమర్థించే వారు చెప్పే అనేకానేక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఏదో ఒక నిర్ణయానికి రావడానికి అవసరమైన సమాచారం మనముందుందనే విషయం మాత్రం యదార్థం. కావున వున్న సమాచారాన్ని ఆధారం చేసుకుని ఏదైనా నిర్ణయానికి రావడానికి ఎవరికైనా ఎటువంటి అభ్యంతరం వుండవనవసరం లేదు. అయినా ఏదో ఒకటి ఒప్పని చెప్పడానికి గాని, తప్పని చెప్పడానికిగాని వీలులేని పరిస్థితి వుందనడం వారి మానసిక వైఖరిని తెలియజేస్తుంది.

ఆస్తిక, నాస్తిక వాదులకు ప్రధాన అంశంగా వున్నచైతన్యం, పదార్థం - ఈ రెండింటిలో దేని నుండి ఏది సృష్టి అయింది అనే దాన్ని ముందుగా పరిశీలిద్దాం.

ఆధునిక విజ్ఞాన శాస్త్రం ఉనికి కలిగివున్నదాన్నంతా భౌతిక వాస్తవికతగా భావిస్తుంది.

భౌతిక వాస్తవికత పదార్థ, శక్తి రూపాలలో వుంటుంది. చైతన్యమనేది జీవి ప్రకటించే లక్షణంగానే ఆధునిక విజ్ఞాన శాస్త్రం గుర్తిస్తుంది. అంటే, సంక్లిష్టరూపంలోని పదార్థం ప్రకటించే ప్రత్యేకమైన లక్షణాలనే చైతన్యంగా భావిస్తుంది. కావున చైతన్యమనేది పదార్థ లక్షణంగానే అర్థం చేసుకోవాలి తప్ప, దానికి భిన్నంగా మాత్రం కాదు. చైతన్యమనేది పదార్థాన్ని ఆశ్రయించే లక్షణమైనపుడు అది ఆ పదార్థం లేకుండా వుండడానికి వీలుండదు. అంటే పదార్థరహితమైన చైతన్యం వుండదని తాత్పర్యం.

అందువల్ల పదార్థం ప్రాథమికమైనదని, చైతన్యం ద్వితీయమని అర్థం చేసుకోవాలి. ప్రాథమికమైన పదార్థం నుండే చైతన్యం ఆవిర్భవించినదనే



భౌతికవాదానికి, చైతన్యం ప్రాథమికమని, ప్రాథమికమైన చైతన్యం నుండే పదార్థం సృష్టించబడిందనే భావవాదానికి మధ్య గల వైరుధ్యం మనకు స్పష్టంగా అర్థమవుతుంది.

చైతన్యం నుండి పదార్థం సృష్టించబడినట్లు ఈనాటి వరకు ఏ ఆస్తికుడుగాని, భావవాదిగాని, శాస్త్రజ్ఞుడుగాని రుజువు చేయనిమాట నిజమే. అయితే, పదార్థం నుండే చైతన్యం ఆవిర్భవించినట్లు మాత్రం అనేక ప్రయోగాలు చేసి శాస్త్రజ్ఞులు రుజువు చేశారు.

భూమిపై జీవావిర్భావ దశలో వున్నటువంటి పరిస్థితులనే ప్రయోగశాలలో పునఃసృష్టిస్తూ ప్రయోగాలు చేసినపుడు నిర్జీవ పదార్థం నుండి జీవపదార్థం ఏవిధంగా ఏర్పడిందో తెలుసుకోడానికి వీలయింది. చికాగో విశ్వ విద్యాలయానికి చెందిన స్టాన్లీమిల్లర్, హెరాల్డ్ యూరీ అనే రసాయన శాస్త్రజ్ఞులు హైడ్రోజన్, మిథైల్, అమ్మోనియా, నీరు కలిపిన మిశ్రమాన్ని నిరంతరాయంగా విద్యుదావేశానికి గురిచేసారు. ఫలితంగా జీవపదార్థాణువుల పుట్టుకకు ఏవైతే కారణభూతమైనవో అటువంటి సంక్లిష్ట కర్బన సమ్మేళనాలు ఆవిర్భవించాయి. ఈ సంక్లిష్ట సమ్మేళనాలు స్వయం ఉత్ప్రేరకం (ఆటో కెటాలిసిస్) అనే ప్రక్రియ ద్వారా జీవపదార్థంగా మారినట్లు రుజువైంది. ఈ ప్రయోగాన్ని బట్టి నిర్జీవపదార్థం నుండి జీవపదార్థం ఏర్పడినట్లు రుజువైనందున పదార్థం నుండి చైతన్యం ఆవిర్భవించినట్లు రుజువైనట్లే.

దీనిని బట్టి పదార్థం నుండి చైతన్యం ఏర్పడినట్లు నేటి వరకూ ఏ నాస్తికుడు గానీ, భౌతికవాదిగాని, హేతువాదిగానీ, శాస్త్రజ్ఞుడుగానీ రుజువు చేయలేకపోయారనే వాదన తప్పు. రుజువు చేసారనేది సత్యమని అంగీకరించవలసి వుంటుంది. వాదన కోసం వాదన చేయాలనుకునే వారు ఎన్ని రకాలుగానైనా వాదన కొనసాగిస్తూనే వుండవచ్చు. కాని సత్యం మాత్రం వారికి సాక్షాత్కరించదు.

సాంప్రదాయం పేర కొన్ని ఆచార వ్యవహారాలు, విధి నిషేధ రూపమైన ప్రణాళికలతో కూడిన ఒక రకమైన జీవన విధానమూ, వందల వేలసంవత్సరాలుగా క్రమానుగతంగా సంతరించుకున్న సంస్కృతి, నాగరికతలూ, వీటన్నింటికి ఆధార స్థానములో ఒక తాత్విక యోచన-వీటన్నింటి సమాహారరూపమే మతమని కొందరు మతాన్ని నిర్వచించారు. బాగానేవుంది. అయితే పరస్పర విరుద్ధ సాంప్రదాయాలతో,

విరుద్ధ భావాలతో, విరుద్ధ తాత్విక యోచనలను కలిగియున్న విభిన్న మతాల ఆవిర్భావానికి, అవి కొనసాగడానికి కారణాలను మాత్రము వీరు తెలుసుకోడానికి ప్రయత్నించినట్లు కనిపించదు.

అయితే అశ్చర్యమేమిటంటే ఈ మతాన్ని తీసివేయడము ఎవరివల్లా కాదనీ, ఆ అవసరము కూడా లేదని వీరు అభిప్రాయపడటమే. అంతేగాదు మతం వల్ల అనర్థమేమి లేదని కూడా వీరు సెలవిస్తున్నారు.

మతం విషయంలో వారు ఇంకా ఏమి ఆశిస్తున్నారో చూస్తే వారి అసలు స్వభావం మనకు అవగతమవుతుంది. అది ఏమంటే - ప్రతి మతం ఎప్పటికప్పుడు వైజ్ఞానికమైన శాస్త్రీయ విధానాన్ని అందిపుచ్చుకుని తాత్వికపరంగాను, ధార్మిక పరంగాను అవసరమైనంతమేర మార్పులు చేర్పులు చేసుకుంటూ, ఆరోగ్యంగా వుంటూ మరింత సుసంపన్నం కావలసి వుందట.

దీనినేమనాలి? ఇది ప్రత్యక్షంగా మతాన్ని సమర్థించడం కాదా?. దీన్ని బట్టి మతం పట్ల వారికున్న అవగాహన ఎంత లోపభూయిష్టమైనదో అర్థమవుతూనే వుంది. మతం పట్ల వీరికున్న దురభిమానమే వీరిని ఆ భావాలకు  చేర్చి వుండవచ్చు.

వీరు మరోచోట మతాన్ని గురించి మరో రకంగా చెప్పడం పరస్పర విరుద్ధ భావాలను సమన్వయ పరచడానికి చేసిన విఫల ప్రయత్నంగా అర్థం చేసుకోవచ్చు.

వాస్తవానికి వైజ్ఞానిక శాస్త్రీయ విధానానికి, మతానికి చుక్కెదురు. ప్రపంచ విజ్ఞానశాస్త్ర చరిత్రలో అడుగడుగునా మత దౌష్ట్యం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. సత్యాన్ని నిరాకరించడం, అభివృద్ధిని నిరోధించడం మతాల నైజం. ఆయా శాస్త్రవేత్తలు ఆవిష్కరించిన విలువైన వైజ్ఞానిక సత్యాలను మతాలన్ని తిరస్కరించినవే. మత గ్రంథాలలోని భావాలకు విరుద్ధంగా ఎవరేమి చెప్పినా వాటిని అసత్యాలుగాను, చెప్పిన వారిని నేరస్థులుగాను భావించడం, భయంకరమైన చిత్ర హింసలతో వారిని శిక్షించడం, చంపడం అన్ని మతాలకు స్వభావరీత్యా సంక్రమించిన జాడ్యం. గెలీలియో, బ్రూనో వంటి శాస్త్రవేత్తలను హింసించిన సంఘటనలు శాస్త్రవిజ్ఞాన చరిత్రలో కోకొల్లలు. అటువంటి మతాలు వైజ్ఞానిక శాస్త్రీయ విధానాన్ని అందిపుచ్చుకోవాలనుకోవడం అవివేకం, భ్రమ మాత్రమే.



కరుడు కట్టిన భావాలతో మారణ హోమాలను సృష్టిస్తున్న మతాలు తాత్వికంగా, ధార్మికంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకుని సుసంపన్నం కావాలనుకోవడం మతాల వాస్తవ స్వభావాన్ని కప్పిపుచ్చడమే అవుతుంది. అంటే పులికి మేకతోలు కప్పే ప్రయత్నమన్నమాట.

సామాన్య జనాన్ని మోసం చేసేవారు సంఘంలో అనేకులుం టున్నారు. ఆ మోసగాళ్ళు తాము మోసం చేస్తున్న పద్ధతులు క్రమంగా ఒకదాని తరువాత మరొకటి బహిర్గతమవుతూ వుంటే సరికొత్త పద్ధతులలో మోసం చేయడానికి పూనుకొంటుంటారు. అన్ని రంగాలలో కంటే తాత్విక రంగంలోని మార్మికత, గందరగోళం చాలా ప్రమాదకరమైనవి. వాటివల్ల జనం శాశ్వత బానిసత్వంలోకి కూరుకుపోయి దోపిడీకి గురవుతారు.

లోకాన్ని ఉద్ధరించడానికే తాము అవతార మెత్తినట్లు ప్రజలను నమ్మించ డానికి సాయిబాబా వంటివారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భారీగా ప్రచారం చేసుకుంటుంటే వారి మోసాలను బహిర్గతం చేయవలసిన పాలకులు వారితో చేతులు కలిపి, వంతపాడి ప్రజలను వంచించడంలో సహకరించడం ఈ దేశ దౌర్భాగ్యం.

వైజ్ఞానిక నిజాయితీ అనేది తాత్వికులలో వుండవలసిన ప్రథమ లక్షణం. స్పష్టత అనేది రచయితలలో వుండవలసిన ప్రథమ లక్షణం. వైజ్ఞానిక నిజాయితీ లేకుండా, స్పష్టత లేకుండా తాత్విక విషయాలను గురించి చర్చించడంవల్ల ప్రయోజనం శూన్యం.

అందుకే ఈనాడు తాత్వికరంగంలో మార్మికవాదం సృష్టించిన అయోమయం, గందరగోళమే రాజ్యమేలు తున్నాయి. పరస్పర విరుద్ధమైన అంశాలను ఏకకాలలో సమర్థించే దుస్థితి సర్వత్రా దర్శనమిస్తుంది. మచ్చుకి ఈ క్రింది అంశాలను గమనించండి.

వీరు సాంప్రదాయక ఆస్తిక మార్గానికి చెందినవారు కాదట. అయితే నాస్తికత పేరున నేడున్న ఏ సంప్రదాయానికీ కూడా చెందినవారు కారట.

సాంప్రదాయక ఆస్తికులూ, సాంప్రదాయక నాస్తికులు కూడా సమగ్ర విప్లవానికి తగిన తాత్విక సిద్ధాంత దారుఢ్యమూ, ప్రణాళికా, ఆచరణా కలిగి లేరన్నది వారి స్వానుభవమట.

అయితే వీరు ఆస్తికులుగాని, నాస్తికులుగాని కానపుడు అజ్ఞేయ వాదులా అని మనకు సందేహం కలగవచ్చు. దాన్ని కూడా వారంగీకరించరు.

వీరు ఆస్తికత్వ, నాస్తికత్వాలను ఏకకాలంలో నిరాకరించగల, సమర్థించగల వారుగా కనిపిస్తున్నారు. పరోక్షంగా మతాన్ని సమర్థించే వీరు హేతువాదులను, నవ్య మానవవాదులను అభ్యుదయ వ్యతిరేకులుగా చిత్రించడానికి ప్రయత్నిస్తున్నారు.

హేతువాదం గురించి, నవ్య మానవవాదం గురించి వివరించే గ్రంథాలను అధ్యయనం చేసి, అవగాహన చేసుకున్నపుడు వారు ఇటువంటి విమర్శలకు దిగరు.

విషయపరంగా కొన్ని సందర్భాలలో వీరు వెల్లడించిన భావాలను పరిశీలిస్తే ఆయా విషయాలపట్ల వారికున్న దురవగాహనకు అద్దం పడతాయి. మచ్చుకు కొన్ని అంశాలను క్లుప్తంగా పరిశీలిద్దాం.

వీరు హేతువాదాన్ని గురించి వ్రాస్తూ ప్రత్యక్షం ద్వారా తెలుస్తున్నంత వరకు హేతుబదత్థాలోచన చేయాల్సిన పనిలేదని, బొత్తిగా ప్రత్యక్షాధారంలేని విషయాల్లోను హేతుబద్ధాలోచన చేయడం సాధ్యపడదని పేర్కొంటున్నారు.

అంతేగాక హేతువాద ప్రముఖుల్లో చాలామందిలో హేతుస్థానంలో ఎట్టి సంబంధాలలో వున్న రెంటిలో దేనిని హేతుస్థానంలో వుంచితేగాని సక్రమాలోచన సాధ్యపడదో నన్న అవగాహన లేనేలేదని విమర్శించారు.

మరోచోట హేతువాదులు హేతువుకు సర్వాధికృతను కట్టబెట్టటం అవగాహనాలోపం నుండి జనించిన వీరాభిమాన ఫలితమనీ వేలెత్తి చూపారు.

ఇదంతా చూస్తుంటే హేతువాదాన్ని గురించిన మౌలిక విషయాల్లోనే వారి అవగాహన లోప భూయిష్టమైనదని అర్థమవుతున్నది. ఇది వరకే చాలా సందర్భాలలో గ్రంథాలరూపంలోను, పత్రికల్లో, వ్యాసాలరూపంలోను అధ్యయన తరగతుల్లో చర్చల రూపంలోను హేతువాద స్వరూప స్వభావాల గురించి క్షుణ్ణంగా, అస్పష్టతకు తావీయకుండా చాలా స్పష్టంగా వివరించడం జరిగింది.

హేతువు యొక్క మౌలిక స్వరూపం ప్రకృతి నియమమని తెలుసుకోవాలి. ముందు ఈ భావం అర్థమయితే తప్ప హేతువు యొక్క వాస్తవస్థితి ఏమిటో, దాని స్వభావమేమిలో, దాని పరిధులేమిటో అర్థం కావడానికే వీలులేదు.



ప్రకృతి నియమబద్ధం కాకపోతే హేతువే లేదు, హేతువాదమూ లేదు. ఎవరికి ఏ రకమైన జ్ఞానమూ ఏర్పడే అవకాశమే లేదు. ప్రకృతి నియమబద్ధమయినందువల్లనే ఆ నియమాలను మనం గ్రహించగలుగుతున్నందువల్లనే మనకు ఆయా సంఘటనలకు, విషయాలకు సంబంధించిన జ్ఞానం ఏర్పడుతున్నది. పరిణామక్రమంలో నియమబద్ధమైన ప్రకృతి నుండి ఆవిర్భవించిన మానవులలో నియమబద్ధత అనేది హేతుత్వ రూపంలో భాసిల్లుతోంది.

ఈ హేతుత్వం సహాయంతోనే మనం ఆలోచించగలుగుతున్నాం. తప్పొప్పులను, సత్యాసత్యాలను నిర్ధారించుకోగలుగుతున్నాం. అంటే మన జ్ఞాన సముపార్జన ప్రక్రియలో హేతుత్వం పాత్ర అద్వితీయమైనది. ఇంతటి ప్రాముఖ్యాన్ని సంతరించుకున్న హేతుత్వాన్ని ప్రత్యక్ష జ్ఞానానికి అవసరంలేదని, పరోక్ష జ్ఞానానికే అవసరమని ఎలా భావించగలం ? ప్రత్యక్ష పరోక్ష జ్ఞానాలకూ హేతుత్వం అవసరమని గ్రహించాలి.

హేతువును ఏ స్థానంలో వుంచితే సక్రమాలోచన సాధ్యపడుతుంది, ఏ స్థానంలో వుంచితే సాధ్యపడదు అని తర్కించుకోవడంలో అర్థం లేదు. అది హేతుత్వస్థాయిని బట్టి వుంటుంది. ఆ హేతుత్వస్థాయి అదివరకే ఏర్పడిన జ్ఞానంమీద ఆధారపడి వుంటుంది.

అందువల్ల హేతువాదులు హేతువుకు సర్వాధికృతను కట్టబెట్టడం సక్రమమైన, సమగ్రమైన అవగాహనా ఫలితమేగాని అవగాహనా లోపం నుండి జనించిన వీరాభిమాన ఫలితం మాత్రం కాదని తెలుసుకోవాలి.

*(హేతువాది ఆగస్టు 1997 నుండి డిసెంబర్ 1997, ఫిబ్రవరి, మే, అక్టోబర్, 1998)*

# హేతువాద ఉద్యమ సాఫల్యం : సాధ్యాసాధ్యాలు

హేతువాది జూన్, జులై, ఆగస్టు 2009 సంచికలలో హేతువాద మిత్రులు, ఉద్యమ శ్రేయోభిలాషులు శ్రీ డి.వి.ఆర్.కె.రావుగారు 'హేతువాద ఉద్యమ సాఫల్యం-సాధ్యాసాధ్యాలు' అనే శీర్షికలో చర్చావేదికను ప్రారంభించారు. ఆసక్తికరమైన అనేక అంశాలను ఆయన తన వ్యాసంలో పొందుపరిచారు. అవి చర్చను మరింతగా రేకెత్తించే విధంగా వున్నాయి.

చర్చాంశం హేతువాదులకు, హేతువాద ఉద్యమాభిలాషులకు ప్రధానమైనది, ఆవశ్యకమైనది అయినందువల్ల అందులోని సత్యాసత్యాలను, మంచి చెడులను అందరూ సక్రమంగా అవగాహన చేసుకోవలసిందే. రావుగారు తన వ్యాసంలో వ్యక్తీకరించిన అనేక భావాలలో కొన్ని అపసవ్య ధోరణులు వున్నట్లు నేను గమనించాను.

హేతువాద ఉద్యమసాఫల్యతను చర్చిస్తూ రావుగారు ప్రారంభంలోనే హేతువాదమంటే ఏమిటనిగాని, ఫలానా విషయం హేతుబద్ధమా, కాదా, అని చర్చించడంగాని తన వ్యాసం ఉద్దేశంకాదని మనవి చేశారు.

మనం హేతువాదాన్ని గురించి ప్రత్యేకించి చర్చించకపోయినా, హేతువాద ఉద్యమసాఫల్యతను చర్చించే క్రమంలో సైతం మన హేతువాద వైఖరి తప్పక వ్యక్తమవుతుంది. హేతువాదమంటే మనకున్న అవగాహనే మన రాతలలో, చేతలలో ప్రతిబింబిస్తుంది.

హేతువాద ఉద్యమ సాఫల్యతను చర్చిస్తూ రావుగారు వ్యక్తీకరించిన భావాలలో కొన్ని అభ్యంతకరమైనవి వున్నట్లు నేను గమనించిన వాటిని స్థూలంగా దిగువన  తెలియజేస్తున్నాను.



1. 'సమాజం యావత్తూ హేతుసమ్మత ఆలోచన - ఆచరణల స్థితికి రావాలంటే 25-50-100 సంవత్సరాలుచాలవు, కొన్ని తరాలు పడతాయి' అనేటట్లయితే చేపట్టిన ఉద్యమం సాధించిన ఫలితాలను మనం ఏ నాటికీ అంచనావేయలేం.
2. 30 సంవత్సరాల ఉద్యమ చరిత్రలో సాధించిన లక్ష్యాలను కొలవడం ఏమంత కష్టమైన పనికాదు.
3. హేతువాదులమని చెప్పుకొంటున్న వారిలో ఎంతమంది సమాజంలోని ఇతర వ్యక్తుల్ని హేతువాదులుగా మలచగలిగారు?
4. హేతువాదులమని చెప్పుకునే కుటుంబాల్లో అందరూ హేతు వాదులేనా? కానపుడు, అంత సన్నిహితుల్నే చైతన్యపరచలేని మనం సమాజంలో ఏమాత్రమూ పరిచయంలేని వారిని, లేదా అతి స్వల్ప పరిచయం మాత్రమే వున్న వారిని ఏ విధంగా చైతన్య పరచగలమను కుంటున్నాము?
5. మనిషి మౌలికంగా హేతుమంతుడేనా?
6. వివేకంతోపాటు మతతత్వధోరణి కూడా పదార్థపరిణతి కారణంగా మనిషిలో సంప్రాప్తించి వుండితీరాలి.
7. విశ్వసించే తత్వం మనిషిలో హేతుతత్వం ప్రక్కనే సమాంతరంగా వుంటుందని మనం మరువకూడదు. మౌలికంగా వివేకం కన్న ముందుగా నమ్మేతత్వమే ఎక్కువ క్రియాశీలమని మనం గమనించాలి.
8. విశ్వసించే తత్వాన్ని మౌఢ్యం లేదా మతతత్వపోకడగా గుర్తించడం ఎంతవరకు సరి అయిన పని అని మనం ఆలోచించవలసి వుంది.
9. మనిషిని అహేతుకత్వానికి మళ్లించేదైన విశ్వసించేతత్వం సహజాత మైనపుడు దాన్ని ఎలా నివారించగలుగుతాము?
10. విశ్వంలోని నియమబద్ధతే మానవుడితో హేతుత్వంగా పరిణామం చెందిందినటానికి శాస్త్రీయాధారాలు లేవు.
11. పదార్థం మూలకాలన్నీ మనిషి శరీరంలోనే వున్నాయి గనుక వాటి ధర్మాలే అతనిలో వ్యక్తమైతీరాలి.

12. మనిషి పూర్వదశలో పదార్థం గనుక అతని శరీర ధర్మాలుగాని, మానసిక ధర్మాలుగాని మూలపదార్థంలోనే వుండితీరాలి.
13. పదార్థం ద్వంద్వమయం - క్రింద-మీద, దగ్గర-దూరం, తడి-పొడి, వేడి-చల్లదనం, గరుకు-నునుపు వగైరాలను మనిషిలో భౌతికత దృష్ట్యా మాత్రమేకాక స్వభావంలో కూడా - అంటే మెదడు ప్రవర్తనలో ఈ ద్వంద్వ ప్రవృత్తిని చూడవచ్చు. ఇష్టాఇష్టాలు, ప్రేమద్వేషాలు, క్రోధం-శాంతి వంటివి ఇందుకు కొన్ని ఉదాహరణలు.
14. పదార్థం అంతా ఆకర్షణ వికర్షణలు వ్యాపించడం వల్ల ఘర్షణతో మనుగడ సాగిస్తున్నది. మనుషుల్లో కూడా ఈ వైరుధ్యంవల్ల ఘర్షణ చెలరేగుతూనే వుంది.
15. ఆలోచనగాని, వివేకంగాని, హేతుత్వంగాని పదార్థంలోని నియమ బద్ధతకు పరిణతరూపం అని మనం అనేటట్లయితే మారని ఆలోచనా తత్వాన్ని (మౌఢ్యాన్ని) కూడా నియమబద్ధమే అనాలి.
16. పదార్థంలోని కదిలేతత్వం వివేకంగా పరిణితి చెందిందని చెప్పి దానిలోనే వున్న జడత్వం కదలని, ఆలోచన (మతతత్వం)గా పరిణితి చెందిందని ఎందుకు చెప్పలేము?
17. జంతుదశలో సహజాతంగా వుండి మనిషిగా పరిణామం పొందాక అతిబలీయంగా రూపొందిన స్వార్థమే మానవుని అసలైన మూలతత్వం.
18. భయనివృత్తికి బహుసంఖ్యాకులకు సహాయపడేది వివేకంకాదు, విశ్వాసమే. ఎక్కడ వివేకం లక్ష్యాన్ని సాధించలేదో అక్కడ విశ్వాసం సాధిస్తుంది.
19. పరిణామశీలి అయిన ప్రకృతిలో వైవిధ్యం, వైభిన్న్యం పదార్థ సహజ ధర్మాలు. అందుకే మనిషిలో భేదభావన తొలగింపతరం కాని అంశమై కూర్చుంది.
20. సహజాతాలను నియంత్రించడం దుస్సాధ్యం అయినందువల్ల మనుషుల్ని హేతుమంతులుగా తీర్చిదిద్దడం ఏమాత్రమూ సాధ్యంకాదు.
21. ఘర్షణలేని, సుఖసంతోషాలతో కూడిన సమాజస్థాపన మన లక్ష్యమైనా, స్వేచ్ఛను నియంత్రించి భయమూలకంగా మాత్రమే అది సాధ్యమవుతుంది. ఇది చేదుసత్యం.



రావుగారు తన వ్యాసంలో వెల్లడించిన ఇటువంటి భావాలన్నీ సరియైన హేతువాద దృక్పథాన్ని ప్రతిబింబించడం లేదు. దానికి కారణం విశ్వాన్ని గురించి, విశ్వంలోని పదార్థ ధర్మాలను గురించి, పదార్థ పరిణామాన్ని గురించి, పదార్థ నియమబద్ధత గురించి, పరిణామక్రమంలో ఆవిర్భవించిన మానవుడి స్వభావం గురించి, అతని ఆలోచనలు, భావాల గురించి, భావాల బలం, భావాల ప్రభావం, భావాల పరిణామంగురించి, సమాజంలోని మార్పులగురించి వారి అవగాహన భిన్నంగా వుండడమే.

హేతువాద ఉద్యమ సాఫల్యతను గురించి చర్చించే ముందు కొంతమేర చారిత్రక నేపథ్యంలోకి తొంగిచూడవలసిన అవసరం కనిపిస్తుంది.

మనకు తెలిసిన విశ్వం సుమారుగా 1370 కోట్ల సంవత్సరాలుగా పరిణామం చెందుతూవుందని, అందులో సూర్యకుటుంబంలోని భూమి వయసు సుమారుగా 460 కోట్ల సంవత్సరాలని, పదార్థపరిణామ క్రమంలో జీవం భూమిపై ఏర్పడింది. 350 కోట్ల సంత్సరాల క్రితమేనని, ఆ జీవపరిణామక్రమంలో లక్షలాది వృక్షజంతు జాతుల తరువాత అవతరించిన మానవుడి వయసు మాత్రం కేవలం పాతిక లక్షల సంవత్సరాలు మించదని ఆధునిక విజ్ఞానశాస్త్రం అంచనావేసింది. ఆదిమ మానవుడి దశను దాటి ఆధునిక మానవుడు అవతరించింది కేవలం మూడు లక్షల సంవత్సరాలలోపేనని తెలుస్తోంది.

అరణ్యాలలో ఎప్పుడు ఎటువైపునుండి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని అగమ్యగోచరమైన పరిస్థితులలో దుర్భరమైన జీవితాన్ని గడిపిన మానవుడు ఆ ప్రమాదాలనుండి ఎలా బయటపడగలిగాడు? ఆ అననుకూల పరిస్థితులను ఎలా అధిగమించగలిగాడు? ఆటవిక దశను దాటి నాగరికతను ఎలా నేర్చుకున్నాడు? ఎన్నెన్నో పరికరాలను సృష్టించుకొని తన ఉనికిని, శ్రేయస్సును ఎలా కాపాడుకో గలిగాడు?

ఇటువంటి ప్రశ్నలన్నిటికి ఒకటే సమాధానం కనిపిస్తుంది. అదే మానవుడిలో పరిణామ క్రమంలో ఏర్పడి క్రమంగా అభివృద్ధి చెందుతూ వున్న అతని మెదడే. అద్భుతమైన మానవుడి మెదడు తన చుట్టూ వున్న పరిసరాలను గ్రహించడానికి, గ్రహించిన వాటిని విశ్లేషించడానికి, సంఘటనల మధ్య సంబంధాలను గుర్తించడానికి,

తద్వారా ఆయా వస్తువులకు, సంఘటనలకు సంబంధించిన జ్ఞానాన్ని పొందడానికి ఉపయోగపడుతూ వస్తున్నది. జ్ఞానసాధనమైన మెదడు అభివృద్ధి చెందడంవల్లనే మనిషి మిగతా జంతుజాతులకంటె భిన్నగా, విలక్షణంగా వర్ధిల్లగలిగాడు.

మెదడుకున్న మరో విశిష్ట లక్షణం భావాల ఉత్పత్తి. ముందుగా భావాలు ఏర్పడడానికి భౌతిక సంఘటనలే ఆధారమవుతాయి. అంటే భావాలకు ముందే మనిషి వున్నాడు. మనిషికి ముందే విశ్వం వుంది. ఇదే భౌతికవాద సిద్ధాంతం.

మానవుడు విశ్వపరిణామక్రమంలో ఆవిర్భవించినందువల్ల అతడు అందులో భాగమవుతున్నాడు. అదేవిధంగా విశ్వపదార్థంలోని మూలకాలలో కొన్ని విశిష్టమైన రీతిలో సంయోగం చెందడంవల్లనే జీవం ఏర్పడింది. అందువల్ల అన్ని రకాల వృక్ష జంతుజాతులలోను, మానవుడిలోను ఆ మూలకాలు వుండడంలో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

అయితే ఇక్కడొక విషయాన్ని గమనించాలి. మూలకాలు విడివిడిగా వున్నపుడు వాటి లక్షణాలు, ధర్మాలు ఒకరకంగా వుంటాయి. అదే సంయోగం చెందినపుడు వాటి పూర్వలక్షణాలకు, ధర్మాలకు భిన్నమైన లక్షణాలను, ధర్మాలను ప్రదర్శించడాన్ని మనం చూస్తున్నాం. హైడ్రోజన్, ఆక్సిజన్‌లలో కనిపించని 'తడి' అనే లక్షణం ఆ రెండు మూలకాలు సంయోగం చెంది నీరుగా ఏర్పడినపుడు కనిపిస్తుంది.

అంటే పదార్థ పరిణామంలో మూలకాల సంయోగ వియోగాలవల్ల ఏర్పడే నూతన వస్తువులలో అంతకుముందులేని లక్షణాలు, ధర్మాలు నూతనంగా ఏర్పడడం జరుగుతుందని గ్రహించాలి. ఈ విషయాన్నే దాదాపు రెండువేల ఆరువందల సంవత్సరాలకు పూర్వమే మనదేశంలో వర్ధిల్లిన చార్వాకులు చక్కగా వివరించారు. ఆకు, వక్క, సున్నం కలిసినపుడు వాటిలో పూర్వంలేని ఎరుపురంగు నూతనంగా రావడం అటువంటిదేనని వారు ప్రతిపాదించిన స్వభావవాదం వల్ల తెలుస్తోంది.

దీన్నిబట్టి మనకొక విషయం స్పష్టమవుతుంది. పదార్థ పరిణామక్రమంలో పూర్వంలేని లక్షణాలు, ధర్మాలు నూతనంగా వచ్చి చేరుతుంటాయి. నిర్జీవపదార్థం నుండి జీవం ఏర్పడడం అటువంటిదే. ఆలోచించలేని పదార్థం నుండి ఆలోచించే మెదడు కలిగిన జీవులు ఏర్పడడం అటువంటిదే.



అంతమాత్రాన ఈనాడు జీవజాతుల్లో కనిపించే అన్నిరకాల లక్షణాలను, ధర్మాలను ఆ జీవజాతులు ఏర్పడకపూర్వం వుండే పదార్థానికి అంటగట్టడానికి వీలులేదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అన్నిరకాల పరిణామాలకు మూలమైనది పదార్థమే. విశ్వమంతా పదార్థమయమే. పదార్థానికి భిన్నంగా మరోదాన్ని వూహించడానికి కూడా అవకాశంలేదు. మనం ఎన్నిరకాల వూహలు చేసినా అవన్నీ ప్రాథమికంగా పదార్థరూపాలే తప్ప మరొకటి కాజాలవు.

అన్నిరకాల పరిణామాలకు పదార్థమే మూలమని చెప్పడం సరియైనదే. అయితే ఈనాడు మనం చూస్తున్న జీవులలోని సహజాతాలు (instincts), వివేకం (Rationality), సంకల్పం (free will) మొదలైన ధర్మాలన్నీ కూడా ఆదిమ పదార్థంలో వున్నాయనడంగాని, లేదా ఉండి తీరాలని తీర్మానించడం గాని సరియైన పద్ధతికాదు.

ఆ విధంగా తీర్మానించదలచుకుంటే మనుషులలో వుండే వివేకోద్వేగాలు, సంకల్పం, స్వార్థం, త్యాగం, సహకార భావం మున్నగు లక్షణా లన్నిటినీ విశ్వానికి ఆపాదించవలసివుంటుంది. జీవులకు, మానవులకు మాత్రమే పరిమితమైన ఈ లక్షణాలను విశ్వద్రవ్యానికి ఆపాదించడం పొరపాటు భావనగా తేలుతుంది. భావవాదుల కర్మవాదం అటువంటిదే. హేతువాదులు, భౌతికవాదులు కూడా అటువంటి తీర్మానాలను చేస్తే అది లౌకిక కర్మవాదంగానో, భౌతిక కర్మవాదంగానో మిగిలిపోతుంది. శ్రీ డి.వి.ఆర్.కె.రావుగారు తన వ్యాసంలో చేసిన వాదం, చూపిన ఉదాహరణలు అన్నీ ఈ కోవకు చెందినవే.

విశ్వం నియమబద్ధం అనేది వాస్తవం. ఈ విషయం ప్రతినిత్యం, ప్రతి ఒక్కరికి అనుభవంలోకి వస్తున్నదే. నియమరహితమైన వస్తువునుగాని, సంఘటననుగాని మనం ఒక్కదాన్ని కూడా చూపలేం. ఏదైనా అర్థంకాని సంఘటన వుందంటే అది నియమ రాహిత్యంగా వుందని కాదు. అందులో పనిచేసే నియమాలు మనిషికింకా పూర్తిగా అర్థం కాలేదని భావం.

సైన్సు చేస్తున్న పనంతా విశ్వంలోని నియమాలను నిరంతరం పరిశీలించడం, పరిశోధించడం, ప్రయోగాలద్వారా నిర్ధారించడమే. నూతన నియమాలు తెలుస్తున్నకొద్దీ ఆయా వస్తువులకు లేదా సంఘటనలకు సంబంధించిన మరింత జ్ఞానం మనకు లభించినట్లే.

నూతనంగా లభించిన జ్ఞానాన్ని పూర్వజ్ఞానంతో పోలిస్తే సాపేక్షంగా అది ఉన్నతమైనదీ, అభివృద్ధిచెందిందీ అవుతుంది. ఆ మేరకు ఆయా వస్తువులకు, లేదా విషయాలకు సంబంధించిన పూర్వ భావాలను మనం సవరించుకుంటూవస్తాం. ఈ విధంగా నూతనమైన జ్ఞానం ఆధారంగా పూర్వపుభావాలను మార్చుకొంటూ రావడమే హేతువాద విధానం. నూతన జ్ఞానం లభ్యమైన తరువాత కూడా పాతభావాలను ఆ మేరకు మార్చుకోకుండాపోతే ఆ పాతభావాలు వ్యవస్థీకరణ పొందుతాయి. దాన్నే అహేతుకత్వమంటాం. వ్యవస్థీకరణ పొందిన భావాలను మతంగా వ్యవహరిస్తున్నాం. ఆ విధంగా మారిన జ్ఞానం మేరకు మారని భావాలను మతంగాను, అటువంటి ధోరణిని విడనాడని వారిని మతతత్వవాదులుగాను పేర్కొంటాం.

ఇదే విషయాన్ని తార్కికంగా అన్వయించినపుడు మనకు మతాలన్నీ ఒకప్పటి జ్ఞానంగా అర్థమవుతాయి. అంటే ఒకప్పుడు హేతుబద్ధంగా వున్న విషయాలే తదనంతర కాలంలో అభివృద్ధి చెందిన జ్ఞానంతో పోల్చినపుడు హేతువిరుద్ధమైనవిగా తేలుతాయి. మతాలన్నీ వారివారి ప్రవక్తల ప్రవచనాలతోనో, ఆదేశాలతోనో ఆగిపోయినవే. భగవద్గీత, బైబిలు, ఖురాను వంటి మత గ్రంథాలలోని భావాలన్నీ వ్యవస్థీకరణ పొంది, మార్పులేకుండా మిగిలిపోయిన భావాలే. జడత్వాన్ని సంతరించుకున్నందువల్లనే అవి కరుడుగట్టిపోయాయి. కరుడుగట్టిన అటువంటి మృతభావాలను కాపాడటానికే వాటన్నిటికి దైవత్వాన్ని, అతీతత్వాన్ని అంటగడుతున్నారు మతస్తులు.

విశ్వం నియమబద్ధమైనదేకాని ఆ నియమబద్ధతే మానవులలో హేతుత్వంగా పరిణమించిందనడానికి శాస్త్రీయాధారాలు లేవన్నారు రావుగారు.విశ్వాన్ని మనం ఎలా అర్థం చేసుకోగలుగుతున్నాము? దానిలోని సంఘటనల మధ్య కార్యకారణ సంబంధాన్ని గుర్తించగలుగుతున్నందు వల్లనే. ఈ కార్యకారణ సంబంధాలను గుర్తించగలిగే సామర్థ్యాన్నే మనం హేతుత్వం (Rationality) అంటున్నాం. ఈ సామర్థ్యం జంతువులలో సహజతాలుగాను, మానవుడిలో వివేకంగాను దర్శనమిస్తున్నది. విశ్వ పరిణామక్రమంలో మానవుడు ఆవిర్భవించడం వల్ల పదార్థ ప్రధానలక్షణమైన నియమబద్ధత మానవుడిలోనూ ప్రతిబింబించడం సహజ పరిణామమే. దాన్నే మనం హేతుత్వంగా పరిగణిస్తున్నాం.



మానవుడు ప్రాయికంగా హేతువాది (Man is essentially rational).. అంటే మనుషులందరూ తమలోని హేతుత్వాన్ని వినియోగించుకోగల సామర్థ్యాన్ని కలిగివున్నారని అర్థం.

మనిషి మౌలికంగా హేతుమంతుడు కానట్లయితే అతనికి జ్ఞానం లభ్యమయ్యేదికాదు. అతడు అనేక మజిలీలను దాటుకుంటూ ఈనాటివరకు చేరేవాడుకాదు. ఆర్జించిన జ్ఞానం ఆధారంగా తన జీవితాన్ని సుఖమయం చేసుకునే వాడు కాదు. స్వేచ్ఛను అనుభవించేవాడుకాదు.

హేతుత్వంతోపాటు మతతత్వ ధోరణికి కూడా విశ్వంలో మూలాలను వెతకాలనడం అపార్థజనితమైన అభిప్రాయమే. విశ్వసించే ధోరణి గాని, మతతత్వ ధోరణిగాని, హేతుత్వంతోపాటు సమాంతరంగా ప్రక్కనే వుంటుందనడం, పదార్థ పరిణితిలో భాగంగా అది మనుషులకు సంప్రాప్తించిందనడం, విశ్వ పదార్థంలో నుండి వచ్చిన విశ్వసించేతత్వం ఒక సహజాతమైనపుడు దానిని ఎన్నటికీ నివారించలేమనడం అవగాహనా రాహిత్యానికి నిదర్శనమవుంది.

విశ్వాసమనేది హేతువుతోపాటు హేతువుకు విరుద్ధంగా ఏర్పడింది కాదు. అది పరిణామ క్రమంలో హేతుత్వంతోపాటు జీవులు సంతరించు కున్న లక్షణమూ కాదు. అందువల్ల హేతుత్వానికి నియమబద్ధత కారణమైనట్లు విశ్వాసానికి కూడా నియమబద్ధత కారణం కాజాలదు. ఒక స్థాయిలో హేతుత్వం నుండి రాబట్టినదే తదనంతర కాలంలో విశ్వాసంగా రూపొంది, నిలబడిపోవడం జరుగుతోంది. కావున విశ్వాసం ఒక ప్రత్యేకమైన లక్షణం కాజాలదు.

వివేకం జీవలక్షణమైనట్లు విశ్వాసం జైవిక లక్షణం కాదు. మనిషి ప్రాథమిక లక్షణం, ప్రధానలక్షణం హేతుత్వమే కాని, విశ్వాసంకాదు. మనిషి హేతుమంతుడయి నందువల్లనే ప్రతిదాన్ని ప్రశ్నించగలుగుతున్నాడు. విశ్వాసంలో ప్రశ్నలకు తావుండదు. వివేకం కన్న ముందుగా విశ్వాసమే ఎక్కువ క్రియాశీలమనడం సరికాదు. జిజ్ఞాన, ప్రశ్నించేతత్వమే మానవనైజం.

మిత్రులు డి.వి.ఆర్.కె.రావుగారు పదార్థ ధర్మాలను గురించి రాస్తూ ఇలా అన్నారు.

"పదార్థం ద్వంద్వమయం.... క్రింద-మీద, దగ్గర-దూరం, తడి-పొడి, వేడి-చల్లదనం, గరుకు-నునుపు...వగైరాలను మనిషిలో భౌతిక దృష్ట్యా మాత్రమేకాక స్వభావంలో కూడా, అంటే మెదడు ప్రవర్తనలో ఈ ద్వంద్వ ప్రవృత్తిని చూడొచ్చు. ఇష్టాయిష్టాలు, ప్రేమద్వేషాలు, క్రోధం-శాంతం, భయం-ధైర్యం, శక్తి-అశక్తి, స్వార్థం-త్యాగం, దయ-క్రౌర్యం, సానుభూతి-పగ... ఇందుకు కొన్ని ఉదాహరణలు". (హేతువాది జులై 2009-పేజి 354)

రావుగారు భావిస్తున్నట్లుగా పదార్థం ద్వంద్వమయంకాదు. విశ్వంలో జరిగే సంఘటనలను అర్థం చేసుకునే క్రమంలో మనం ఏర్పరచుకున్న భావాలలో ఇవి కొన్ని మాత్రమే. ఇవన్నీ పదార్థ స్థితిగతులను తెలియజేసేవే. వాటిలో ద్వంద్వత్వం లేదు. వైరుధ్యం అంతకంటె లేదు. అవన్నీ పదార్థ స్థితిగతులను సాపేక్షంగా తెలపడానికి ఉపయోగపడేవే కాని తద్భిన్నం కాదు.

క్రింద-మీద, దగ్గర-దూరం వగైరాలన్నీ వాటికవే నిరపేక్షమైనవి కావు. వాటికి యధాతథంగా ఎటువంటి అర్థమూ లేదు. ఒకదానికి 'క్రింద' అయింది దానికంటె క్రింద వున్నదానికి 'పైన' అవుతుంది. దగ్గర-దూరం, తడి-పొడి, వేడి-చల్లదనం మొదలైనవన్నీ కూడా ఇంతే. వీటిని సాపేక్షంగా మాత్రమే అర్థం చేసుకోగలం.

ఇటువంటి వాటిని ద్వంద్వాలుగా భావించడమేగాక మనిషి స్వభావంలో, మెదడులో ఇష్టాయిష్టాలు, ప్రేమద్వేషాలు వంటి ద్వంద్వ ప్రవృత్తిలో చూడవచ్చుననడం పూర్తిగా పొరపాటు అవగాహన అవుతుంది. విశ్వ పదార్థంలో వుండే స్థితిగతులకు, మనుషులలో వుండే రాగద్వేషాలకు సంబంధమే లేదు. అటువంటి పదార్థ స్థితిగతులన్నీ మనుషులలోని ద్వంద్వ ప్రవృత్తికి కారణాలుగా చూపడానికి ఎటువంటి ఆధారాలూ లేవు.

అదేవిధంగా పదార్థం అంతా ఆకర్షణ వికర్షణలు వ్యాపించడం వల్ల ఘర్షణతో మనుగడ సాగిస్తున్నదనడం, అదే మనుషులలో మానసిక అనుకూలత-ప్రతికూలత కారణంగా సంఘటితత్వం-వైరుధ్యం నెలకొని ఘర్షణ చెలరేగుతుందనడం కూడా పొరపాటు అవగాహనతో కూడుకున్నదే.

మనుషుల్లోని కోపతాపాలకు, కక్షలు కార్పణ్యాలకు, జాతివిద్వేషాలకు, యుద్ధపిపాసకు-వీటన్నిటికీ పదార్థంలోని ఆకర్షణ వికర్షణలే కారణమనడం పదార్థ



స్వభావాన్నీ, పరిణామ స్వభావాన్నీ పూర్తిగా అపార్థం చేసుకోవడమే అవుతుంది. అంతేకాదు రావుగారి ఈ వింతవాదనను కొనసాగిస్తే దాని తార్కిక పర్యవసానం ఎక్కడికి దారితీస్తుందో ఆలోచించండి.

మనుషుల్లోని అన్నిరకాల అవగుణాలకు, వారు చేసే అక్రమాలకు, అన్యాయాలకు, అకృత్యాలకు, అరాచకాలకు, సర్వభ్రష్ట కార్యకలాపాలకు నిర్జీవమైన ప్రకృతి పదార్థాన్నే కారణంగా చూపవచ్చు. మనుషులు చేసే తప్పులన్నిటినీ ప్రకృతి పదార్థానికి ఆపాదించవచ్చు. ఆ విధంగా తమతమ తప్పులన్నిటినీ సమర్థించుకోవచ్చు. అపుడు ఇది విపరీత ధోరణి అవుతుందేగాని హేతువాద ధోరణి మాత్రం కాదు. ఇదివరకే పేర్కొనట్లు ఇది భౌతిక కర్మవాదంగాని, లౌకిక కర్మవాదంగాని అవుతుంది.

మరోచోట రావుగారు పరిణామశీలి అయిన ప్రకృతిలో వైవిధ్యం, వైభిన్న్యం పదార్థ సహజధర్మాలని, అందుకే మనిషిలో భేదభావన తొలగింపతరంకాని అంశమై కూచుందని అన్నారు. వాస్తవానికి భేదభావన అన్నది మనుషులు అవివేకంతో సృష్టించుకున్నదేగాని మరొకటికాదు. ప్రకృతిలోని వైవిధ్యమే ఈ భేదభావనకు మూలమనడం, అందువల్లనే దానిని ఎన్నటికీ తొలగింపతరంకాని అంశంగా భావించడం పూర్తిగా తప్పు. వివేకవంతుడైన మనిషిని మరబొమ్మగా భావించడమే ఇందులో కనిపిస్తుంది. ఇది అపార్థానికి పరాకాష్ఠగా నిలుస్తుంది.

ఇక మనుషులమీద పరిసరాల ప్రభావం గురించి తన వ్యాసంలో రావుగారు వివరంగా, సోదాహరణంగా చర్చించారు. ఆ సందర్భంగా ప్రసిద్ధ మనస్తత్వవేత్త జె.బి. వాట్సన్ ప్రకటనను ఇలా ఉదహరించారు.

"మనిషిమీద పరిసరాల ప్రభావం విస్తారంగా వుంటుందనీ, ఆరోగ్యంగా తయారైవున్న ఒక అరడజనుమంది బిడ్డల్ని తనకిస్తే, ఏ ఒక్కరినైనా సరే తీసుకుని, ఏవిధంగా కావాలంటే ఆవిధంగా ఆశించిన రీతిలో తయారయేలా - అంటే డాక్టరుగాగాని, లాయరుగాగాని, కళాకారునిగాగాని, వ్యాపారవేత్తగాగాని - ఇంతేకాదు - ముష్టివానిగాగాని, దొంగగానైనా సరే, ఆ పిల్లవాని నైపుణ్యాలతోగాని, ఇష్టాయిష్టాలతోగాని, వృత్తిపరమైన అభిరుచులతోగాని, వాని పూర్వీకుల కులమతాలతోగాని ప్రమేయం లేకుండా శిక్షణ యిచ్చి రూపొందిస్తానని ఛాలెంజి చేసినట్లుగా వక్కాణించాడు." (హేతువాది, జులై 2009-పేజి-351)

ఈ రకమైన ప్రకటనలు, సిద్ధాంతాలు ఎన్నివున్నా అవి వాస్తవ దూరాలుగా మిగిలిపోవలసిందే. మనుషుల మీద ప్రకృతి పరిసరాల ప్రభావం, సమాజ పరిస్థితుల ప్రభావం విస్తృతంగా వుంటుందనడం వరకు సమంజసమే. అయితే ఆ పరిసరాలుగాని, పరిస్థితులుగాని మనిషిని పూర్తిగా శాసించలేవు. దానికి భిన్నంగా మానవుడే తన చుట్టూ వున్న పరిసరాలను, పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకోగలుగుతున్నాడు. వాటి ప్రభావం నుండి క్రమంగా బయటపడి అధిగమించగలుగుతున్నాడు. తన సంకల్పానుసారంగా, బుద్ధిబలంతో తానాశించిన లక్ష్యం దిశగా పయనించి, విజయాలను సాధించగలుగుతున్నాడు.

వాట్సన్ ప్రకటించినట్లు ఎవరినైనా, ఏ విధంగానైనా తానాశించినట్లు రూపొందించగలననుకోవడం పూర్తిగా సాధ్యమయ్యే పనికాదు. మనుషుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా వారిని మరొకరి ఇష్టానికి అనుకూలంగా మలచడానికి వారు మరమనుషులుకారు. జిడ్డు కృష్ణమూర్తిని థియోసాఫిస్టు (ఆస్తికుడు)గా మార్చాలని ప్రయత్నించిన అనిబిసెంట్ కృషి విఫలమై ఆయన నాస్తికుడయ్యాడు. ఇలాంటి ఉదాహరణలు ఎన్నయినా చూపవచ్చు.

నియంతల క్రింద బానిసలుగా బ్రతుకుతున్నవారు సైతం స్వేచ్ఛను కోరుకుంటారు. అందుకోసం తిరుగుబాట్లు చేస్తారు. స్వేచ్ఛకోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడటానికి సిద్ధపడతారు.

అందువల్ల మనుషులను వారి సంకల్పానికి విరుద్ధంగా మలచవచ్చునని భావించడమే సత్యదూరం. తల్లిదండ్రులు తమ పిల్లలను గొప్ప శాస్త్రవేత్తలుగానో, వ్యాపారవేత్తలుగానో, ఆదర్శ మేధావులుగానో చేయాలని ప్రయత్నిస్తే వారు మరోరకంగా రూపొందడాన్ని మనం చూస్తున్నాం. అందువల్ల పసిబిడ్డల్ని వాట్సన్‌గారికి అప్పగించి ఐన్‌స్టీన్ వంటి శాస్త్రవేత్తగానో, బుద్ధుని వంటి తత్వవేత్తగానో రూపొందించమంటే రూపొందించలేడు.

మానవుడి స్వభావం గురించి, మూలతత్వం గురించి రావుగారు చేసిన వ్యాఖ్యలు సమంజసంగా లేవు. దీన్ని గమనించండి.

'భయనివృత్తికి బహుసంఖ్యాకులకు సహాయపడేది వివేకం కాదు, విశ్వాసమే. ఎక్కడ వివేకం లక్ష్యాన్ని సాధించలేదో అక్కడ విశ్వాసం సాధిస్తుంది' అన్నారు.



వాస్తవానికి విశ్వాసం భయనివృత్తికికాక భయాన్ని సృష్టించడానికి బాగా ఉపయోగపడుతుంది. మతవిశ్వాసాలవల్ల అసంఖ్యాకమైన భయాలు వందలాది సంవత్సరాలుగా మానవజాతిని ప్రపంచవ్యాప్తంగా పట్టి పీడిస్తున్నాయి.

స్వర్గాలు, నరకాలు, పూర్వజన్మలు, పునర్జన్మలు, దెయ్యాలు భూతాలు, జాతకాలు, గ్రహఫలాలు, జ్యోతిష్యాలు, మొక్కుబడులు, చేతబడులు వంటి మూఢవిశ్వాసాలు మతాలు కల్పించినవే. వివేకం ద్వారా వాస్తవాలను తెలుసుకున్నవారే ఆయా విశ్వాసాలు కల్పిస్తున్న భయాలనుండి శాశ్వతంగా విముక్తి పొంద గలుగుతున్నారు.

దీనికి భిన్నంగా వివేకం కంటే విశ్వాసమే భయనివృత్తికి సహాయ పడుతుందనడం, వివేకం లక్ష్యాన్ని సాధించనిచోట విశ్వాసం సాధిస్తుందనడం విడ్డూరమే. మతాలన్నీ విశ్వాసంమీద ఆధారపడి నిర్మితమైనవే. మానవజాతిని విభజించడంలో, అసమానతలను సృష్టించడంలో, పరస్పర ద్వేషాలను రెచ్చగొట్టడంలో, హింసను ప్రేరేపించడంలో, యుద్ధాలను కల్పించడంలో, మారణహోమానికి పాల్పడడంలో మతాలన్నీ తమ లక్ష్యాలను సాధించినట్లే భావించవచ్చు. దేవుడి పేరిట ప్రజలను మోసపూరిత విధానాలతో దోపిడీచేసి కోట్లాది రూపాయలను ఆర్జించడంలో అవి విజయాన్ని సాధించినట్లు అంగీకరించవచ్చు. అవి చేస్తున్న మోసాలను సైతం ప్రజలు గుర్తించకుండా వారిని బ్రెయిన్‌వాష్ చేయడంలో లక్ష్యాన్ని సాధించినట్లు ఆమోదించవచ్చు. విశ్వాసాలు సాధించే విజయాలు ఇలాగే వుంటాయి.

30 సంవత్సరాల హేతువాద ఉద్యమ చరిత్రలో సాధించిన లక్ష్యాలను కొలవడం ఏమంత కష్టమైన పనికాదని సెలవిచ్చారు రావుగారు. సమాజం యావత్తూ హేతుసమ్మత ఆలోచన-ఆచరణల స్థితికి రావాలంటే మనిషి మనిషిలోనూ గూడుకట్టుకున్న జిడ్డు భావాలను తొలగించాలని, అందుకు 25-50-100 సంవత్సరాలు చాలవు. కొన్నితరాలు పడతాయనేట్టయితే చేబట్టిన ఉద్యమం సాధించిన ఫలితాలను మనం ఏనాటికీ అంచనా వేయలేమని కూడా పేర్కొన్నారు.

హేతువాద ఉద్యమం పట్ల వున్న అభిమానంతో, ఆశించిన ఫలితాలు, ఆశించిన స్థాయిలో, ఆశించినంత వేగంగా రావడంలేదనే అసంతృప్తితోనే వారావిధంగా

అంటున్నారని అర్థమవుతుంది. ఇక్కడ మనం గమనించవలసిన విషయం ఒకటుంది. మనిషి భావాలకు సంబంధించిన మార్పును, అతని ఆలోచనా విధానానికి సంబంధించిన మార్పును గణితబద్ధమైన ప్రమాణాలతో కొలవడం సాధ్యంకాదు. అయితే అతని మాటలు, రాతలు, చేతలను బట్టి కొంతవరకు అంచనావేయవచ్చు.

కేవలం హేతువాద సభలు, సమావేశాలకు హాజరయ్యేవారి సంఖ్యను బట్టి కూడా హేతువాద ఉద్యమం ఎంత పెరిగిందనే విషయాన్ని కొలవడం లోపభూయిష్టమవుతుంది. సభలకు హాజరయ్యే వారంతా హేతువాదాన్ని గురించిగాని, హేతువాద ఉద్యమలక్ష్యాన్ని గురించిగాని సక్రమంగా అర్థం చేసుకుంటారని భావించలేం.

ప్రముఖ హేతువాది, శ్రీలంక హేతువాద సంఘాధ్యక్షుడైన డా॥ ఎ.టి. కోవూర్ 1976లో మనరాష్ట్రంలోని పలుప్రాంతాలలో పర్యటించి హేతువాద ఉపన్యాసాలు చేశారు. బాబాల మహిమల బండారాన్ని బయటపెడుతూ అనేక ప్రదర్శనలిచ్చారు. ఆ సభలకు అన్నిచోట్ల జనం వేలసంఖ్యలో తరలివచ్చారు. కోవూర్ ఉపన్యాసాలు విని, ప్రదర్శనను తిలకించి వెళ్లారు. అంతమాత్రాన ఆ సభలకు హాజరైన ప్రజలంతా హేతువాదులని భావించలేం.

అయితే హేతువాద ఉద్యమాభివృద్ధిని ఎలా తెలుసుకోవాలి? అనే ప్రశ్న ఉదయించడం సహజం. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పుకోడానికి మనం మరోసారి చరిత్రలోకి వెళ్లాలి.

మానవుడెంత ప్రాచీనుడో హేతువాదం అంత ప్రాచీనమైందని చెప్పుకున్నపుడు ఆనాటి నుండి ఈనాటివరకు మానవుడార్జించుకున్న జ్ఞానం, సాధించిన అనేకానేక విజయాలు, పొందిన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, సుఖసంతోషాలు అన్నీ హేతుత్వ ఫలితాలుగానే చెప్పుకోవలసివుంటుంది. శాస్త్ర సాంకేతిక రంగాలలో అనూహ్యంగా కొనసాగుతున్న అభివృద్ధి అంతా మానవుడి వివేక ఫలితమే. ఒక్కమాటలో చెప్పాలంటే అన్ని రంగాలలోను మానవుడు సాధించిన అభివృద్ధి అంతా అతనిలోవున్న హేతుత్వానికే చెందుతుంది.

అయితే ఉద్యమాల విషయానికొస్తే హేతువాద ఉద్యమానికి, మిగతా ఉద్యమాలకు వున్న తేడా స్పష్టంగా తెలుస్తుంది.



సమాజంలో అనేక ఉద్యమాలు పుడుతున్నాయి, గిడుతున్నాయి. ఆర్థిక లాభాల కోసం కొనసాగే కార్మికోద్యమాలు, చట్టబద్ధమైన హక్కుల కోసం కొనసాగే పౌరహక్కుల ఉద్యమాలు, రాజకీయాధికారం కోసం సాగే రాజకీయోద్యమాలు, అవినీతి వ్యతిరేక ఉద్యమాలు, సంఘంలోని దురాచారాలను రూపుమాపాలని కొనసాగే సంఘ సంస్కరణోద్యమాలు, ప్రత్యేక రాష్ట్రోద్యమాలు వంటివి అనేకం వున్నాయి.

ఇటువంటి ఉద్యమాలలో శాశ్వత ప్రయోజనాలను ఆశించేవాటికంటే తాత్కాలిక ప్రయోజనాలకోసం కొనసాగే ఉద్యమాలే అత్యధికంగా వుంటున్నాయి.

దేశ స్వాతంత్ర్యం కోసం కొనసాగే స్వాతంత్ర్యోద్యమాలున్నాయి. మనదేశంలో కూడా దాదాపు శతాబ్దకాలంపాటు సాగిన భారత స్వాతంత్రోద్యమం ఆంగ్లేయులను దేశం నుండి వెళ్లగొట్టడానికి ఉపయోగపడిందిగాని స్వాతంత్ర్యోద్యమ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. స్వాతంత్రోద్యమకాలంలో లక్షలాదిమంది ప్రజలు నిస్వార్థంతో అమూల్యమైన త్యాగాలు చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం పణంగాపెట్టి పోరాటాలు జరిపారు.

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో మాత్రం ఆశించిన ఫలితాలు కనిపించలేదు. కులమత అసమానతలు అంతరించిపోలేదు. సమానత్వ భావన అంకురించలేదు. అంతం కావలసిన అవినీతి, బంధుప్రీతి అంతకంతకూ అభివృద్ధిచెందుతూ వచ్చింది. ఉన్నత విలువలు కొనసాగడానికి బదులుగా వున్న విలువలుసైతం పతనమైపోయాయి. స్వార్థం సర్వత్రా తిష్టవేసింది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నవారు ఆశించింది మాత్రం ఇది కాదని అందరికీ తెలుసు.

గత శతాబ్దకాలంలో అనేక దేశాలలో విస్తరించిన కమ్యూనిస్టు ఉద్యమం సైతం ఆశించిన లక్ష్యాన్ని సాధించకుండానే విఫలమైపోయింది. ఆయా కమ్యూనిష్టు దేశాలలో ఆర్థిక సమానత్వం పేరిట రాజకీయ నియంతృత్వాలు నిలదొక్కుకున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందని విశ్లేషించుకుంటే మానవుడి వివేక సంకల్పాలకు, భావాలకు, నైతిక విలువలకు ప్రాధాన్యతను, సముచిత స్థానాన్ని ఇవ్వకపోవడమేనని తేలుతుంది. అంటే భావవిప్లవంతో ముడిపడివున్న సాంస్కృతిక విప్లవాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమేనని తేలుతుంది.

అందువల్ల మనకొక విషయం మాత్రం స్పష్టంగా బోధపడుతుంది. సమాజంలో ఆశించిన మార్పురావాలంటే ముందుగా ఆ మార్పులకు సంబంధించిన భావవిప్లవం విజయవంతం కావాలి. అంటే మనుషుల మస్తిష్కాలలో తరతరాలుగా గూడుకట్టుకొన్న అజ్ఞానపూరితమైన, అభివృద్ధి నిరోధకమైన భావాలు పటాపంచలు కావాలి. ఆ పని జరగాలంటే హేతువాద భావవిప్లవోద్యమమొక్కటే శరణ్యం.

హేతువాద ఉద్యమం ప్రధానంగా తాత్విక భావవిప్లవోద్యమం. ప్రజల తాత్విక భావాలలో సమూలమైన మార్పురానంతవరకు వారి జీవిత దృక్పథంలో మార్పురాదు. జీవిత దృక్పథంలో మార్పురాకుండా ఉన్నతమైన జీవిత విలువలను గుర్తించడంగాని, ఆచరించడంగాని, ప్రోత్సహించడంగాని జరగదు. అందువల్లనే హేతువాద భావవిప్లవోద్యమం ప్రాధాన్యాన్ని సంతరించుకుంటుంది.

హేతువాద ఉద్యమం మిగతా ఉద్యమాలలాగా తాత్కాలిక ప్రయోజనాలను ఆశించి సాగేది కాదు. ఆర్థిక ప్రయోజనాలుగాని, రాజకీయాధికార ప్రయోజనాలుగాని ఇందులో వుండవు. ఆవేశాలను రెచ్చగొట్టే పద్ధతులుగాని, ఎత్తుగడల ద్వారా ప్రజలను ఆకర్షించే విధానాలుగాని హేతువాద ఉద్యమానికి చుక్కెదురు.

అందువల్ల హేతువాద ఉద్యమాన్ని సరియైన పునాదుల మీద నిర్మించడం అత్యంతావశ్యకమని గుర్తించాలి. ఆ విధంగా గుర్తించి దాన్ని సక్రమమైన మార్గంలో, సరియైన రీతిలో నడిపించడం కష్టసాధ్యమని అర్థమవుతుంది. అలా కాని పక్షంలో అనతికాలంలోనే ఏదోవిధంగా హేతువాద ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తే అది వ్యతిరేక ఫలితాలను ఇచ్చే ప్రమాదముంది. ఆ విధంగా ఉద్యమం భ్రష్టమైపోయే ప్రమాదంవుంది. అందుకే అటువంటి ప్రమాదం సంభవించకుండా హేతువాద ఉద్యమాన్ని కాపాడుకోవడం ప్రధానం.

ఇలా అంటున్నామంటే హేతువాద ఉద్యమం ప్రజల్లోకి వెళ్లరాదని అర్థంకాదు. హేతువాద ఉద్యమం ప్రజలలోకి వెళ్లాల్సిందే. వ్యాప్తి చెందాల్సిందే. అదే సమయంలో హేతువాద ఉద్యమ స్వరూప స్వభావాలకు, లక్ష్యాలకు భంగం కలుగకుండా చూసుకోవడం కూడా చాలా అవసరం. అంటే రాశి (Quantity) కోసం వాసి (Quality) ని వదలుకోరాదని భావం. దీన్ని బట్టి హేతువాద ఉద్యమం ఆశించిన విధంగా అభివృద్ధి చెందాలంటే ఎంతకష్టమో అర్థమవుతుంది. అందుకే సమాజంలో హేతువాద



భావాలు నిలదొక్కుకోవాలంటే పాతిక, యాభై సంవత్సరాలు చాలవని, తరాలు పడుతుందని చెప్పడంలో అంతరార్థమిదే. మనిషి వున్నంతకాలం ఇది వుంటుంది.

"హేతువాదులమని చెప్పుకొంటున్న వారిలో ఎంతమంది సమాజంలోని ఇతర వ్యక్తులను హేతువాదులుగా మలచగలిగారు? హేతువాదులుగా చెప్పుకునే కుటుంబాల్లో అందరూ హేతువాదులేనా? కానపుడు అంత సన్నిహితుల్నే చైతన్య పరచలేని మనం సమాజంలో ఏ మాత్రము పరిచయంలేని వారిని, లేదా అతిస్వల్ప పరిచయం మాత్రమే వున్న వారిని ఏవిధంగా చైతన్య పరచగల మనుకుంటున్నాము?" అనే ప్రశ్నలను లేవనెత్తారు మిత్రులు డి.వి.ఆర్.కె.రావు గారు.

ఇటువంటి ప్రశ్నలను వేస్తున్నపుడు మనం ఎవరిని హేతువాదులుగా భావిస్తున్నామో, ఎవరిని హేతువాదులుగా భావించాలో అనే విషయంలో మనకొక ప్రాతిపదిక వుంటుంది. దాని ప్రకారమే మనం ఫలానా వారు హేతువాదులని, ఫలానా వారు హేతువాదులుకారని అంచనాలకు వస్తుంటాం.

సాధారణంగా దేవుడు, మతం, కులం వాటిచుట్టూ అల్లబడిన అనేకానేక మూఢవిశ్వాలను వ్యతిరేకించేవారిని నాస్తికులుగా, హేతువాదులుగా పరిగణించడం జరుగుతుంది. వాస్తవానికి హేతువాదం పరిధి అంతకంటె చాలా విస్తృతమైనది. మానవుడు-సమాజం-ప్రకృతికి సంబంధించిన సర్వ విషయాలకూ అది వర్తిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే హేతువాదం వర్తించని విషయంగాని, అంశంగాని ఏదీలేదు.

నాస్తికులన్నా, హేతువాదులన్నా, మనవవాదులన్నా అంతా ఒకటే అనే భావం ప్రచారంలోవుంది. కాని అది నిజంకాదు. నాస్తికులంతా హేతు వాదులు కారు, హేతువాదులంతా మానవవాదులు కారు. అయితే మానవ వాదులందరు అవశ్యంగా హేతువాదులు, నాస్తికులు అవుతారు. హేతువాదులందరూ అవశ్యంగా నాస్తికులవుతారు. ఈ భేదాలను, వాటికి గల కారణాలను గ్రహించినపుడే ఆ విషయాలకు సంబంధించిన అవగాహన పెరుగుతుంది. ఆమేరకు స్పష్టత చేకూరుతుంది.

ఎటువంటి అవగాహనా లేకుండా నాస్తికులమని చెప్పుకున్నా, హేతు వాదులమని చెప్పుకున్నా, మానవవాదులమని చెప్పుకున్నా ప్రయోజనం శూన్యం.

కేవలం విశ్వాసం ఆధారంగా వుండే నాస్తికత్వం అటువంటిదే అవుతుంది. అంటే అవగాహనా రాహిత్యంతో కూడిన నాస్తికత్వమైనా, హేతువాదమైనా ఎందుకూ పనికిరాదని అర్థం.

నాస్తికత్వాన్ని బాగా ప్రచారంలోకి తెచ్చిన "గోరా"గారు అందరికీ తెలిసిన నాస్తిక నాయకుడే. అయితే అయన నాస్తికత్వం పేరుతో ప్రచారంచేసింది మాత్రం నాస్తికత్వంకాదు. హేతువాదం అంతకంటె కాదు. నాస్తికత్వంపేరుతో గోరా గారు ప్రచారంచేసింది మాత్రం భావవాదాన్నే. అంటే హేతువాదానికి, సైన్సుకి వ్యతిరేకమైన జగన్మిథ్యావాదాన్నే. ప్రపంచస్థాయి నాస్తికుడని పేరుపొందిన గోరాగారి విషయంలోనే ఇంత ఘోరం జరిగితే, ఇక సామాన్యుల సంగతి ఏమి చెప్పాలి.

ఇప్పటికీ విజయవాడలోని నాస్తిక కేంద్రంలో ప్రపంచ నాస్తిక మహాసభలు జరుగుతున్నాయి. అనేక దేశాల నుండి నాస్తికోద్యమ నాయకులు హాజరవుతున్నారు. అయినప్పటికీ ఏ ఒక్కరూ గోరాగారి నాస్తికత్వాన్ని ఖండించిన దాఖలాలు మాత్రం కనిపించడంలేదు. చివరికి నాస్తికత్వం పేరుతో జరుగుతున్న ప్రచారతతంగమంతా నాస్తికత్వ తాత్విక భావనలకు సంబంధంలేని వ్యవహారంగా మిగిలిపోయే ప్రమాదంలో పడిపోయింది. ఈ విషయంలో మరిన్ని వివరాలు కావాలనుకునేవారు రావపూడి వెంకటాద్రిగారు రచించిన 'నాస్తికత్వం-నాస్తితత్వం' అనే గ్రంథాన్ని పరిశీలించవచ్చు.

అందువల్ల మనం హేతువాదులమని చెప్పుకొన్నంత మాత్రాన సరిపోదు. హేతువాదానికి పునాదిగా నిలిచే తాత్విక భావాలను సక్రమంగా అవగాహన చేసుకోవాలి. అవగాహన చేసుకున్నంతమేర ఆచరణలో పెట్టగలగాలి.

నిత్యజీవితంలో అనేకవిషయాలలో అడుగడునా నిర్ణయాలు తీసుకోవలసి వుంటుంది. ఆ నిర్ణయాలలో మనకున్న హేతువాద అవగాహన ప్రతిబింబించాలి. అప్పుడే మనం నిజమైన హేతువాదులమవుతాం.

ప్రలోభాలకు లోనుకాకుండా వుండడం, అసూయాద్వేషాలకు అతీతంగా వుండడం కష్టసాధ్యమైన విషయాలే. అవి అందరికీ సాధ్య మయ్యేవికూడా కాదు. నాస్తికులు, హేతువాదులు, మానవవాదులు అందుకు మినహాయింపూ కాదు. అందుకే అటువంటి వాటికి సాధ్యమైనంత దూరంగా వుండగలిగిన వారే సమాజంలో



మిగతావారికి ఆదర్శంగా నిలువ గలుగుతారు. హేతువాద మానవవాదాలను జీవనవిధానాలనేది అందువల్లనే.

హేతువాదులమని చెప్పుకుంటున్నవారిలో ఎంతమంది సమాజంలోని ఇతర వ్యక్తుల్ని హేతువాదులుగా మలచగలిగారనే ప్రశ్నకు ముందుగా మనం ఏ మేరకు హేతువాదాన్ని అర్థంచేసుకుని ఆచరిస్తున్నాం, ఏ మేరకు ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడుపుతున్నాం అనే విషయాలనుబట్టే ఇతరులు మనవల్ల ప్రభావితులై, స్ఫూర్తిని పొందుతారని తెలుసుకోవాలి.

హేతువాదులమని చెప్పుకునే కుటుంబాల్లో అందరూ హేతువాదులేనా అంటే కాకపోవచ్చు అనేదే సమాధానం. కానపుడు సన్నిహితుల్నే చైతన్యపరచలేని మనం సమాజంలో ఏ మాత్రం పరిచయంలేని వారిని, లేదా అతి స్వల్ప పరిచయం మాత్రమే వున్న వారిని ఏ విధంగా చైతన్య పరచగలమని సందేహించడం పొరపాటు.

విషయాలను గ్రహించేశక్తి, అర్థం చేసుకొనే సామర్థ్యం అందరికీ సమాన స్థాయిలో వుండదు. అందువల్ల కుటుంబసభ్యులైనా హేతువాద విషయాలను గ్రహించి అర్థం చేసుకోలేకపోవచ్చు. అదే సమయంలో మన పరిచయంలోకి వచ్చే మిత్రులెవరైనా వాటిని గ్రహించి అర్థంచేసుకోవచ్చు. కుటుంబసభ్యులనే మార్చలేని వారు ఇతరులను ఎలా మారుస్తారని ప్రశ్నించడం వివేకవంతం కాజాలదు. మారగలిగిన వారే మారతారు.

ఇలా అన్నందువల్ల కుటుంబసభ్యులను హేతువాదులుగా మార్చరాదనే భావం రాదు. వారందరినీ మార్చగలిగితే మంచిదే. మారకపోయినా మార్చేప్రయత్నం చేయడంలో తప్పులేదు. కాని మారమని బలవంతపెడితే మాత్రం అది తప్పవుతుంది. వత్తిడిచేయడం, బలవంత పెట్టడం హేతువాదానికి విరుద్ధం. అది మత పద్ధతి.

జంతుదశలో సహజాతంగావుండి, మనిషిగా పరిణామం పొందాక అతి బలీయంగా రూపొందిన స్వార్థమే మానవుని అసలైన మూల తత్వమన్నారు రావుగారు. జీవించాలనే కోరిక మానవునితో సహా జీవజాతులన్నిటికి సమానమే. జీవున్నిటికి అది మౌలికమైన కోరిక. ఆ విధంగా మానవుడు బ్రతికి వుండడమే మౌలిక విలువ అవుతుంది. జీవించడమంటే ఆనందంగా జీవించడమే. స్వేచ్ఛ అంటే నిర్బంధ రాహిత్యమే. వ్యక్తులలోని శారీరక, మానసిక శక్తి సామర్థ్యాల వికాసాన్ని నిరోధించే

ఆటంకాలన్నీ క్రమంగా అదృశ్యం కావడమే స్వేచ్ఛగా నిర్వచించవచ్చు. ఆ విధంగా విలువలన్నిటికి మూల విలువ స్వేచ్ఛ అవుతుంది.

ఆ విధంగా మానవుడు స్వేచ్ఛగా జీవించాలనుకోవడం అతనిలోని స్వార్థంగా పరిగణిస్తే పరిగణించవచ్చు. ఆ మేరకు అతడు స్వార్థపరుడంటే ఆమోదించవచ్చు. అయితే అతనిలోని శక్తుల వికాసానికి అతడు సమాజంలోని తనవంటి సహచరుల మీద ఆధారపడుతున్నాడు. ఆ విధంగా సమాజంలోని మనుషులందరూ పరస్పరం ఒకరి మీద మరొకరు ఆధారపడి జీవించేవారే. సహకార భావం అనేది ఆ సందర్భంగా ఏర్పడేదే.

తనపట్ల ఇతరులు ఏవిధంగా ప్రవర్తించాలనుకుంటాడో అదే విధంగా తానుకూడా ఇతరులపట్ల ప్రవర్తించాలను కోవడంలోనే నైతిక భావన ఉత్పన్న మవుతుంది. ఈ భావమే సమాజంలో వ్యక్తుల మధ్య సహకారపూర్వక సంబంధాలు ఏర్పడడానికి, నైతికంగా ఉన్నతమైన జీవనాన్ని గడపడానికి పునాదిగా నిలుస్తుంది. మానవుడు తన స్వేచ్ఛాపరిధులను విస్తృతం చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

ఈ విధంగా తన సుఖసంతోషాలు ఇతరుల సుఖసంతోషాలతో ముడిపడి వున్నందువల్ల తనలోని స్వార్థాన్ని కొంతవరకు సడలించుకోడానికి సిద్ధమవుతాడు. ఆ క్రమంలోనే ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించని పద్ధతులను అలవరుచుకుంటాడు. అదే సమాజశ్రేయస్సుకు పూనాదిని ఏర్పరుస్తుంది. సమాజశ్రేయస్సును కోరుకోవడమే స్వార్థమయితే దానిని వివేకవంతమైన స్వార్థం (Enlightened self interest) అనాలి. అందువల్ల 'స్వార్థమే' మానవుడి మూల తత్వమను కోడానికి అవకాశం లేదు.

సహజాతాలను నియంత్రించడం దుస్సాధ్యం అయినందువల్ల మనుషుల్ని హేతుమంతులుగా తీర్చి దిద్దడం ఏమాత్రమూ సాధ్యం కాదనడం పొరపాటు అవగాహన అవుతుంది. మానవుడి ప్రస్థానం సహజాతాలవద్దనే ఆగిపోలేదు. వివేక సంకల్పాలు తోడయినందువల్ల మానవుడు అనేక విధాలుగా ఔన్నత్యాన్ని పొందగలిగాడు. ఆ క్రమంలో తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అడ్డుతగిలే ఆటంకాలను క్రమంగా అధిగమిస్తూ పురోగమిస్తున్నాడు.

హేతుమంతుడిగా అనూహ్యమైన విజయాలను సాధిస్తున్నాడు. తనలోని హేతుత్వానికి మెరుగులుదిద్ది స్వేచ్ఛా సమానత్వ సౌభ్రాతృత్వాలతో కూడిన సమాజానికి



రూపకల్పన చేస్తున్నాడు. అందువల్ల మనుషులను హేతువాదులుగా తీర్చిదిద్దడం ఏ మాత్రమూ సాధ్యం కాదనడం అపోహతో కూడిన అభిప్రాయమే అవుతుంది. మనుషులను హేతుమంతులుగా తీర్చిదిద్దడం కష్టసాధ్యమే కాని, అసాధ్యం కాదు. ప్రతి మనిషిలోను హేతుత్వం నివురుగప్పిన నిప్పులా వుంటుంది. నిప్పును కనపడకుండా చేసే నివురును తొలగిస్తే నిప్పు ప్రకాశిస్తుంది. హేతుత్వమూ అంతే.

ఘర్షణలేని, సుఖసంతోషాలతో కూడిన సమాజస్థాపన మన లక్ష్యమైనా, స్వేచ్ఛను నియంత్రించి భయం మూలకంగా మాత్రమే అదిసాధ్యమవుతుందన్నారు రావుగారు. ఇటువంటి ప్రకటనలను చూసినపుడు స్వేచ్ఛను అపార్థం చేసుకున్నారేమో అనిపిస్తుంది.

ఘర్షణలులేని, సుఖసంతోషాలతో కూడిన సమాజస్థాపన ఏ విధంగా సిద్ధిస్తుంది? స్వేచ్ఛను నియంత్రించి, భయాన్ని కలిగించడం ద్వారా అది ఏ విధంగా సాధ్యమవుతుంది?

ప్రకృతిలోనే ఘర్షణ మూలాలున్నట్లు ఒకవైపు పేర్కొంటూనే, మరోవైపు ఘర్షణలేని సమాజస్థాపన సాధ్యమవుతుందనడం పరస్పర విరుద్ధంగా కనిపిస్తుంది. ప్రకృతి పదార్థంలోనే వైరుధ్యాలున్నాయని, అవే మానవులలో ఘర్షణలకు కారణా లవుతున్నాయని భావించినపుడు వాటిని ఎన్నటికినీ తొలగించడానికి వీలులేనివిగానే భావించవలసివస్తుంది. పదార్థ ధర్మాలనుగానీ, పదార్థ నియమాలనుగానీ ఎవ్వరూ మార్చలేరుగదా?

కమ్యూనిష్టు సిద్ధాంతంలో కూడా ఇటువంటి అభిప్రాయలే వున్నాయి. ప్రకృతిలోనే వైరుధ్యాలున్నాయని, ఆ వైరుధ్యాల మధ్య సంఘర్షణ ద్వారానే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ సిద్ధాంతం పేర్కొంటుంది. సమాజం ఎల్లప్పుడూ రెండు వైరివర్గాలుగా చీలిపోయి వుంటుందని, ఆ వర్గాలమధ్య పోరాటం ద్వారానే (ఘర్షణద్వారానే) ఉన్నతమైన సమాజం ఆవిర్భవిస్తుందని సూత్రీకరిస్తుంది. అందువల్లనే మానవజాతిచరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే నంటాడు కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కారల్ మార్క్స్.

కమ్యూనిస్టు సిద్ధాంత లక్ష్యం మాత్రం వర్గరహిత సమాజమే. వర్గపోరాటాల ద్వారా వర్గరహిత సమాజాన్ని స్థాపించడానికే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులు గత

150 సంవత్సరాలుగా వర్గ పోరాటాలను చేస్తూనేవున్నారు. ఆ పోరాటాల పేరిట లక్షలాది మంది ప్రాణాలను బలిగొంటూనే వున్నారు. రాజ్యాధికారాన్ని సాధించిన దేశాలలోనూ ప్రజల స్వేచ్ఛను హరించి నియంతృత్వాలను స్థాపించి పాలనను కొనసాగిస్తున్నారు. తుపాకీగొట్టాలను ఎక్కుపెట్టి, ప్రజలను భయపెట్టి వారు సాగించే పాలనే కమ్యూనిస్టు పాలన!

ఇదంతా పరిశీలిస్తే ప్రజలను ఆకర్షించే తప్పుడు సిద్ధాంతాల వల్ల ప్రపంచ మానవాళి భయంకరమైన ప్రమాదాలలోకి నెట్టివేయబడి, నియంతృ త్వాలనే సమసమాజాలుగా భ్రమించే స్థితికి దిగజారిపోయింది. మత నియంతృత్వాలు, జాతి నియంతృత్వాలు, వర్గ నియంతృత్వాలు, పార్టీ నియంతృత్వాలే ప్రపంచ వ్యాప్తంగా రాజ్యమేలుతున్నాయి. ఇటువంటి సంకట పరిస్థితులనుండి బయటపడడానికి మానవుడి కున్న ఏకైక మార్గం మానవవాద, హేతువాద భావవిప్లవమే.

భయం పరాధీనతకు దారి తీస్తుంది. పరాధీనత బానిసత్వానికి బాటలు వేస్తుంది. బానిసత్వానికి అలవాటు పడిన మనిషికి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు రుచించవు. బానిసత్వాన్నే పరమానందగా పరిగణిస్తాడు. అందువల్ల స్వేచ్ఛను నియంత్రిచడం ద్వారాగాని, హరించడం ద్వారాగాని, భయాన్ని కల్పించడం ద్వారాగాని ఘర్షణలు లేని, సుఖసంతోషాలతో కూడిన సమాజ స్థాపన ఎన్నటికీ సాధ్యపడదు. అలా సాధ్యపడుతుందను కోవడం భ్రమజనితమే అవుతుంది.

హేతువాద ఉద్యమం మనం ఆశించిన స్థాయిలో, ఆశించినంత వేగంగా ప్రజల్లోకి వెళ్లడం లేదనే ఆవేదన సమంజసమే. అయితే దానికి నిరాశ చెందవలసిన అవసరం లేదు. మనది ఆధునిక విజ్ఞానం మీద ఆధారపడిన తాత్వికోద్యమం. ఆధునికవిజ్ఞానం అప్రతిహతంగా కొనసాగుతూ వుంది. స్థూలంగానైనా దాన్ని అధ్యయనం చేసి ప్రాథమిక విషయాలనైనా కొంతవరకు అవగాహన చేసుకోవడం హేతువాదులందరికీ ముఖ్యం. అదేవిధంగా ప్రాచీన తాత్వికరీతులను అర్థం చేసుకోవడం, మతాలను, మతసాహిత్యాన్ని చదివి వాటిలోని ప్రధాన సిద్ధాంతాలను తెలుసుకోవడం అవసరమవుతుంది. అప్పుడే మనకు తారసపడే వారు సంధించే ప్రశ్నలకు మనం సరియైన సమాధానాలను చెప్పగలుగుతాం. అదే అపమార్గాలలో నడిచేవారిని సరయిన మార్గంలో పెట్టడమంటే.



ఇంకో ముఖ్యవిషయం ఏమిటంటే హేతువాద ఉద్యమం గత 30సం॥లలో సాధించిన గొప్ప విజయమొకటుంది. అదే హేతువాద మానవవాదాలకు సంబంధించిన సాహిత్య సృష్టి. హేతువాద మానవ వాదాలకు సంబంధించి సమగ్రమైన, శాస్త్రీయమైన తాత్వికదృక్పథాన్ని ప్రతిబింబించే విశిష్టమైన సాహిత్యమది. హేతువాదం, నాస్తికత్వం, భావవాదం, భౌతికవాదం, మతవాదం, మానవవాదం, కర్మవాదం, లౌకికవాదం, గతితార్కిక భౌతికవాదం, భౌతికవాస్తవికవాదం, ఆధునిక విజ్ఞానశాస్త్రం వంటి అనేక అంశాలపై అనేక రచనలు వెలువడ్డాయి. ఈ అంశాలపై అనితర సాధ్యమైన, శాస్త్రీయవిశ్లేషణలతో కూడిన హేతువాద సాహిత్యం రావిపూడి వెంకటాద్రి గారి కలం నుండి 80 గ్రంథాలరూపంలో వెలువడింది. మరికొందరు మిత్రులు కూడా ఇటువంటి సాహిత్యాన్ని సృష్టించి హేతువాద ఉద్యమాభివృద్ధికి కృషిచేశారు.

ఈ సాహిత్యానికి విలువ కట్టలేం. అదేవిధంగా సమాజంపై దాని ప్రభావాన్ని కూడా తక్కువగా అంచనావేయలేం. ఇటువంటి సాహిత్యం సమకాలీన సమాజంలో యావద్భారత దేశంలేనే కనిపించదు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఇటువంటి రచనలు ఆధునిక తాత్విక రంగంలో వెలువడిన ఆణిముత్యాలు. ఈ రచనలన్నీ తెలుగుభాషకే పరిమితం కావడం శోచనీయం. మానవజాతి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నిటికీ సరియైన పరిష్కారమార్గాలను సూచించడంలో మార్గదర్శకాలుగా నిలిచే ఇటువంటి రచనలన్నీ తగినంత ప్రచారంలేకుండా మరుగున పడిపోవడం ప్రజల దౌర్భాగ్యం.

ఈ రచలన్నీ ఆంగ్లంతోసహా అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం కావలసిన అవసరం చాలా వుంది. మిత్రులు డి.వి.ఆర్.కె.రావుగారు వెంకటాద్రి గారి రచనలను (సూమారు డజను గ్రంథాలను) తెలుగు నుండి హిందీలోకి అనుదించడం అభినందనీయం. కొన్ని గ్రంథాలు ఇంగ్లీషులోకి, మళయాళంలోకి కూడా అనువదించబడినాయి. ఈ దిశగా ఇంకా చాల కృషి జరగవలసివుంది.

హేతువాదభావాలను ప్రచారం చేయడానికి గాను గత 28 సంవత్సరాలుగా నిర్విరామంగా, నిరాటంకంగా 'హేతువాది' మాస పత్రిక వెలువడుతోంది. 2007లో 'హేతువాది' రజతోత్సవాలను రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్, ఇంకొల్లులో జరుపుకుంది. వెంకటాద్రి గారే దాని సంపాదకులు. హేతువాద, నాస్తికవాద,

మానవవాద భావాలను ప్రచారం చేయడానికై వెలువడుతున్న ఇతర పత్రికల కంటె భిన్నంగా తాత్విక భావాలను ప్రతిభావంతంగా ప్రచారం చేస్తున్న పత్రిక 'హేతువాది' మాత్రమే అంటే అతిశయోక్తి కాదు. ఇది ఇతర పత్రికలను చులకన చేయడం కాదు. మన పత్రిక ప్రత్యేకతను, విశిష్టతను చాటడమే.

హేతువాద ఉద్యమానికి హేతువాద భావాలను అర్థంచేసుకుని ఆచరణలో పెట్టే సభ్యులు, అభిమానులే కీలకం. హేతువాద సాహిత్యం, 'హేతువాది' పత్రిక హేతువాద ఉద్యమానికి విశిష్టమైన సాధనాలు. ఇక కావలసిందల్లా నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా వుండడం. సంకల్ప బలం, కృషి, దీక్ష, పట్టుదల, చిత్తశుద్ధి వుంటే అవరోధాలన్నిటినీ అధిగమించి, పురోగమించగలుగుతాం.

మెరుగైన సమాజం కోసం కృషి చేసేవారు ఎల్లప్పుడూ కొద్దిమంది మాత్రమే వుంటారు. అందువల్ల కనీసం ఒకశాతం ప్రజలను ప్రభావితం చేయగలిగితే హేతువాద ఉద్యమం సఫలీకృతమైనట్లే. మనకు తగినన్ని ఆర్థికవనరులు లేకపోవడం, ఉద్యమానికి పూర్తికాలం పనిచేసే కార్యకర్తలు లేకపోవడం వంటి కొరతలున్నమాట వాస్తవమే.. ప్రింట్‌మీడియా, ఎలాక్ట్రానిక్ మీడియా హేతువాద భావాల ప్రచారానికి సహకరించకపోవడం, ప్రోత్సహించక పోవడం మన ఉద్యమానికి లోపమే. ప్రణాళికాబద్ధంగా లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించలేకపోవడం శోచనీయమే.

అయినా అధైర్యపడకుండా, ఆశావహదృక్పధంతో, అకుంఠిత దీక్షతో ఉద్యమ శ్రేయోభిలాషులందరూ కృషి చేస్తే ఈ అవరోధాలన్నిటినీ అధిగమించగలుగుతాం. శక్తి సామర్థ్యాలు, అవకాశాలు అందరికీ ఒకేలా వుండవు. అందువల్ల ఎవరికి వారు స్థానికంగా వారు చేయగలిగిన కార్యక్రమాలు చేయాలి. అవగాహనతో కూడిన సమిష్టికృషి తప్పక సత్ఫలితాలనిస్తుంది.

ఇదీ హేతువాద వైఖరి. అవగాహన. ఇందులో డి.వి.ఆర్.కె.రావుగారిని కించపరిచే ఉద్దేశం లేదు. వారు వెల్లడించిన భావాలలోని పొరపాట్లను మాత్రమే సరిదిద్దడానికి ప్రయత్నించాను.

*(హేతువాది, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ 2010)*

# దేవుడున్నాడా? లేడా?

దేవుడున్నాడా? లేడా? అనేది వేలాది సంవత్సరాలుగా మానవజాతిని వెంటాడుతున్న సమస్య. దేవుడున్నాడనేవారు, దేవుడు లేడనేవారు నాటి నుండి నేటి వరకు కొనసాగుతూనేవున్నారు. ఇరుపక్షాలవారు వారి వారి వాదనలను వినిపిస్తూనేవున్నారు. సమర్థించుకుంటూనే వున్నారు. ఇంతకి దేవుడున్నాడా లేడా అనే విషయం తేలిందా? సత్యం తెలిసిందా? అంటే అవుననే సమాధానం చెప్పవలసివుంటుంది.

దేవుడున్నాడనే వారిని ఆస్తికులని, దేవుడు లేడనే వారిని నాస్తికులని పేర్కొంటున్నాం. అయితే ఈ ఆస్తిక నాస్తిక వాదుల చర్చలో ఎవరు దేని మీద ఆధారపడుతున్నారనేది ప్రధానమైన విషయం. ఎవరైనా వాస్తవాలతో సంబంధం లేకుండా కేవలం 'విశ్వాసం' లేదా 'నమ్మకం' మీద ఆధారపడుతున్నట్లయితే ఆయా విషయాలమీద ఎటువంటి చర్చకూ తావుండదు. అలాకాక వాస్తవాల మీద, అనుభవాల మీద ఆధారపడి మాత్రమే వారి వాదనలున్నట్లయిదే ఆసక్తికరమైన చర్చకు ఆస్కారమేర్పడుతుంది.

ముందుగా ఒక విషయాన్ని మనం గమనించాలి. కేవలం వాదన మీద ఆధారపడి సత్యాసత్యాల మారిపోవు. అంటే ఉనికిలో వున్నది లేకుండా పోదు. లేనిది ఉనికిలోకి రాదు. ఉన్నదే వుంటుంది. లేనిది లేదు. అయినపుడు ఆస్తిక నాస్తిక చర్చ దేనికుపయోగపడుతుంది అని ప్రశ్నించుకుంటే ఆయా విషయాల గురించి వారికున్న అవగాహన ఎటువంటిదో తెలుస్తుంది. సత్యాన్వేషణలో అవగాహన స్థాయి మెరుగుపడుతుంది. ఏ విషయాన్ని గురించి తెలుసుకోవాలన్నా మనం ఆధారపడేది భౌతిక వాస్తవికత మీదనే అనే విషయం ముందుగా తెలుసుకోవాలి. దీన్ని గురించి తెలుసుకోవాలంటే 'భౌతికవాస్తవికత' అంటే ఏమిలో ముందుగా తెలియాలి.

మనచుట్టూ వ్యాపించి వున్న దాన్ని విశ్వం లేక జగత్తు అంటాం. విశ్వం పదార్థనిర్మితం. అది వస్తువులరూపంలో సంఘటనల రూపంలో మనకు దర్శనమిస్తున్నది. ఉనికిలో వున్న విశ్వమంతటిని భౌతిక వాస్తవికతగానే గుర్తిస్తున్నాం. పదార్థం పరమాణువుల కలయికతో కూడి వున్నది. అత్యంత సూక్ష్మమైన పరమాణు గర్భంలోని కేంద్రకం (న్యూక్లియస్), దాని చుట్టూ అత్యంత వేగంగా తిరుగులున్న ఎలక్ట్రానులు, ప్రోటానులు, ఇంకా న్యూట్రానులు, పాజిట్రానులు, తదితర సూక్ష్మకణాలతో కూడిన పదార్థం అంతా భౌతిక వాస్తవికతగానే గుర్తించాలి. ఉనికిలో వున్న ఈ విశ్వపదార్థం ఆద్యంతరహితం. నిరంతర పరిణామశీలం, నియమబద్ధం. కాంతి సెకనుకు సుమారు మూడులక్షల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఆ విధంగా సంవత్సరకాలంలో కాంతి ప్రయాణించే దూరాన్ని కాంతి సంవత్సరం అంటారు. వందల కోట్ల కాంతి సంవత్సరాల దూరం విస్తరించివున్న విశ్వమంతా భౌతికవాస్తవికతే. పదార్థం శక్తిగాను, శక్తి పదార్థంగాను రూపాంతరం చెందగలవు. పదార్థం (శక్తి) సృష్టింపబడదు, నాశనం చేయబడదు అనేది శక్తినిత్యత్వసూత్రం. (Matter can neither be created nor be destroyed. This is the law of conservation of mass and energy)

విశ్వం నియమబద్ధం (Universe is law governed). మనం ఏ వస్తువును తీసుకున్నా, ఏ సంఘటనను తీసుకున్నా విశ్వం నియమబద్ధమనే విషయం అనుభవపూర్వకంగా రుజువవుతున్నది. మనం వస్తువులను, సంఘటనలను అర్థం చేసుకుంటున్నామంటేనే విశ్వం నియమబద్ధమని అర్థమవుతుంది.

విశ్వం నిరంతర పరిణామ శీలం. విశ్వంలోని ఏ వస్తువును తీసుకున్నా అది పరిణామానికి (మార్పుకు) లోనవుతున్నదనే విషయం విశదమవుతుంది. పరిణామరహితమైన పదార్థం లేదు, వుండదు.

ఈ విధంగా ఉనికిలో వున్న విశ్వపదార్థమంతా నిరంతర పరిణామంలో వున్నందువల్ల దాన్ని అర్థం చేసుకోవడానికి మనం ఆయాపదార్థాలను, సంఘటనలను పరిశీలించి అందులోని నియమాలను గ్రహించగలుగుతున్నాం. మనం ఏ మేరకు పదార్థ నియమాలను, పరిణామ నియమాలను అర్థం చేసుకోగలిగితే ఆ మేరకు ఆయా పదార్థాలకు సంబంధించిన జ్ఞానం మనకు కలుగుతుంది. ఏమేరకు మన



పదార్థ జ్ఞానం పెరిగితే ఆ మేరకు ఆ పదార్థాన్ని మనకు అనుకూలంగా, ప్రయోజనకరంగా ఉపయోగించుకోవడానికి వీలు కలుగుతుంది. అంటే ఆ మేరకు మన స్వేచ్ఛాపరిధులు విస్తృతమవుతాయి.

ఈ విధంగా భౌతికవాస్తవికత (Physical Reality) గా వున్న విశ్వం సత్యం. ఈ సత్యాన్ని తెలుసుకున్నపుడు మనకు జ్ఞానమేర్పడుతుంది. తత్ఫలితంగా మనిషి స్వేచ్ఛా సంపన్నుడవుతాడు. ఆ మేరకు అతడు సమాజంలో సహకార భావంతో నీతిగా ప్రవర్తించగలుగుతాడు. ఈ విధంగా సత్యం, జ్ఞానం, స్వేచ్ఛ, నీతి అనేవి క్రమంగా వృద్ధి చెందుతూ సమాజ ప్రగతికి తోడ్పడుతాయి.

దేవుడు లేదా దైవం అనే భావన ఎప్పుడు ఎలా ఏర్పడింది అని ఆలోచిస్తే పరిణామ క్రమంలో అవతరించిన మానవుడు ఆలోచనా జీవిగా రూపొందిన తరువాతనే దైవ భావాన్ని సృష్టించుకున్నట్లు మనకు అర్థమవుతుంది. తన చుట్టూ జరుగుతున్న సంఘటనలకు కారణాలను కనిపెట్టే ప్రయత్నంలోనే మానవుడు దేవుడిని సృష్టించుకున్నాడని తెలుస్తుంది. క్రమంగా అతని పరిశీలన, అనుభవం పెరుగుతున్న కొలది అన్ని విషయాలలో అతని భావాలలో ఆమేరకు మార్పులు చోటు చేసుకొంటూవచ్చాయి. దైవ భావనలోనూ మార్పులొచ్చాయి. ఆ మార్పులు చివరికీనాడు నాస్తికత్వంగా నిలదొక్కుకున్నాయి. అంటే దేవుడి అస్తిత్వం రుజువుకాలేదు. కేవలం పరికల్పన (Hypothesis) గా ప్రారంభమైన దైవభావం హేతుమంతుడైన మానవుడి సృష్టిగానే తేలిపోయింది.

మానవుడు మృగదశలో వున్నపుడు కొండగానో, బండగానో, చెట్టుగానో, నిప్పుగానో వెలసిన దేవుడే మానవుడు వేటాడే దశలో మృగ రూపంలోను, పశుపోషణ దశలో ఆవుగాను, ఎద్దుగాను, ఆ తరువాత కాలంలో మనిషి గాను మార్పు చెందినట్లు మానవజాతి పరిణామ క్రమాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. ఈ పరిణామం మన దేశానికే పరిమితం కాదు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో, అన్ని జాతులలోను దేవుళ్ల అలా మార్పు చెందినట్లు తెలుస్తుంది. సమాజంలో స్త్రీపురుషులు స్థానాలను బట్టి దేవుడి సెక్సుకూడా మారింది. పురుషాధిక్యత వున్నపుడు దేవుళ్లు పురుషులుగాను, స్త్రీ ఆధిక్యత వున్న మాతృస్వామ్య వ్యవస్థలో దేవుళ్లు స్త్రీలు గాను వున్నట్లు చారిత్రక పరిశీలన ద్వారా తెలుస్తుంది.

## సైన్సు – మతం

అనుభవపూర్వకంగా సముపార్జించిన క్రమబద్ధమైన జ్ఞానాన్నే సైన్సు అంటాం. విశ్వం పదార్థమయమయినందువల్ల ఆ పదార్థ పరిశీలనే సైన్సు లక్ష్యంగా మారింది. ఆది మానవుడి నుండి ఆధునిక మానవుడి దాకా నిరంతరాయంగా జరుగుతున్నది ఈ పదార్థ పరిశీలనే. అనేక రూపాలలో, అనేక ధర్మాలను ప్రకటించే పదార్థాన్ని భౌతిక వాస్తవికతగా గుర్తిస్తున్నాం. సైన్సు పరిశీలించేది, పరిశోధించేది, ప్రయోగాలు జరిపేది ఈ భౌతిక వాస్తవికతనే. భౌతిక నాస్తికత అనేది లేదు. అందుకే అభౌతికత అనేది అపోహగా మాత్రమే మిగిలిపోతుంది. మనం గ్రహించేది, అర్థం చేసుకునేది, అనుభవించేది అంతా భౌతిక వాస్తవికతనే.

జ్ఞానమనేది భౌతికవాస్తవికత మీద ఆధారపడి మాత్రమే లభ్యమవుతుంది. భౌతిక వాస్తవికతను మనం మన జ్ఞానేంద్రియాల ద్వారా గ్రహిస్తున్నాం. గ్రహించిన సమాచారాన్ని మన మెదడు విశ్లేషించినపుడు ఆయా వస్తువులకు, సంఘటనలకు సంబంధించిన జ్ఞానం ఏర్పడుతుంది. ఆ జ్ఞానం ద్వారా ఆయా వస్తువులను మనం ఏ రకంగా ఉపయోగించుకోవచ్చో తెలుసుకుంటాం. ఇదే మానవుడికి స్వేచ్ఛను ప్రసాదిస్తుంది.

జ్ఞానమెల్లప్పుడూ సాపేక్షమే కాని సంపూర్ణం కాదు. సైన్సు ఎల్లప్పుడూ సాగిపోయేదే గాని ఆగిపోయేది కాదు. సైన్సు నూతన సత్యాలను స్వీకరించడానికి ఎల్లపుడూ సిద్ధంగా వుంటుంది. ఒక శాస్త్రీయసిద్ధాంతం ఎన్ని వేల సమస్యలను పరిష్కరించినప్పటికీ, ఆ సిద్ధాంత పరిధిలోని ఏ ఒక్క సమస్యను పరిష్కరించక పోయినా, ఆ సిద్ధాంతం ఆ మేరకు కొత్త సిద్ధాంత నిర్మాణానికి దారితీస్తుంది. "శాస్త్రపురోగతికి నిజమైన దోహదకారి ఏమిటంటే - ఒక సిద్ధాంతం ఎన్ని వేల సమస్యలను పరిష్కరించిందనేది కాదు. ఆ సిద్ధాంతం అనుభవంలో రుజువు కాకపోవటం మాత్రమే" అంటాడు ప్రసిద్ధ తాత్వికుడు కార్ల్‌పాప్పర్. అంటే ఏదైనా సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఒక్క రుజువు చూపగలిగినా చాలు. ఆ మేరకు దాన్ని సవరించి వివరించడానికి మరో నూతన సిద్ధాంతం అవసరమవుతుంది.

1820లో బోవార్డ్ అనే ఫ్రెంచి శాస్త్రవేత్త యురేనస్ గ్రహపథం న్యూటన్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా వుందని, అందువల్ల న్యూటన్ సిద్ధాంతమన్నా తప్పు కావాలి,



లేదా యురేనస్ గ్రహం సూర్యకుటుంబంలో చివరి గ్రహమన్నా అయివుండ కూడదన్నాడు. లెవరీస్ అనే శాస్త్రవేత్త యురేనస్ చివరిగ్రహం కాకపోతే చివరి గ్రహపథం ఎలా వుంటుందో న్యూటన్ సిద్ధాంతం ప్రకారం లెక్కించాడు. తరువాత గాలే అనే పరిశీలకుడు దూరదర్శని సాయంతో నెప్ట్యూన్ అనే గ్రహాన్ని గుర్తించి, అది లెవరీస్ నిర్ధారించిన గ్రహపథంలో వుందని రుజువు చేశాడు. ఇదే విధంగా ప్లూటో గ్రహం కూడా కనుగొనబడింది. ఇటీవల మరోగ్రహం కూడా వుందని కనుగొన్నారు.

అదేవిధంగా న్యూటన్ సిద్ధాంతాలను విశ్వాంతరాళాలకు అన్వయించి చూసినప్పుడు అవి సరిపడలేదని ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాలను ప్రతిపాదించాడు. అవి సత్యమని తేలాయి. ఈ విధంగా సైన్సులో పరమ సత్యాలకు తావుండదు.

విశ్వాన్ని అర్థం చేసుకోవడానికి కొన్ని ప్రధానమైన విషయాలను అవగాహన చేసుకోవాల్సి వుంటుంది. అటువంటి వాటిలో ప్రదేశం, కాలం అనేవి పదార్థాన్ని ఆశ్రయించి వుండే లక్షణాలే కాని, వాటికి విడివిడిగా స్వతంత్ర ఉనికిలేదని ఆధునిక విజ్ఞానం తేల్చింది. పదార్థ విస్తృతినే ప్రదేశమనీ, పదార్థ పరిణామాన్నే కాలమనీ భావించాలి. ప్రదేశ కాలాలు ఎల్లప్పుడూ కలిసే వుంటాయి. విడివిడిగా వాటికి అర్థమే వుండదు. మనం ఏ వస్తువును తీసుకున్నా అది మూడు కొలతలు కలిగి వుంటుంది. పొడవు, వెడల్పు, ఎత్తు లేదా లోతు. అయితే ప్రతి వస్తువు పరిణామం చెందుతూనే వుంటుంది. కాబట్టి ఈ పరిణామమే నాలుగవ కొలత. దానినే కాలమంటున్నాం ఈ విధంగా విశ్వం ప్రదేశకాలాల కొనసాగింపు అని ఐన్‌స్టీన్ పేర్కొన్నాడు.

పైన పేర్కొన్న విధంగా స్థల కాలాలను అవగాహన చేసుకున్నప్పుడు కేవల స్థలం, కేవలం కాలం అనేవి వుండవని అర్థమవుతుంది. అంటే పదార్థరహితమైన ప్రదేశం కాని, పరిణామరహితమైన పదార్థం కాని వుండవని తెలుతుంది. ఉనికి లేకుండా పరిణామంగాని, పరిణామం లేకుండా ఉనికిగాని వుండవు. ఉనికి పరిణామానికి లోబడే వుంటుంది. అందువల్ల విశ్వానికి భిన్నంగా, బాహ్యంగా, అతీతంగా, మార్పు లేకుండా ఏదీ వుండదు. ఇప్పటి వరకు మనం వివరించుకున్న విషయాలను బట్టి మనం ఏ విధమైన తాత్విక నిర్ణయాలకు రావచ్చునో గమనించండి. విశ్వం పదార్థమయం, భౌతికం. అది సృష్టింపబడదు, నాశనం కాదు. పదార్థం, శక్తి రూపంలో కూడా వుంటుంది. పదార్థ నిర్మితమైన విశ్వం సృష్టించబడలేదు. అలాగే

నాశనం కూడా కాదు. విశ్వం అనాది సిద్ధం, అవ్యయం, నియమబద్ధం, నిరంతర పరిణామశీలం. విశ్వం స్వయం కారణం. అంతర్గత కారాణాలవల్లనే అది పరిణమిస్తుంది. విశ్వానికి హద్దులు లేవు. విశ్వానికి బయట అనేది లేదు. విశ్వాన్ని నియమబద్ధమని ఆధునిక విజ్ఞానం కూడా నిరూపించింది. విశ్వంలో ఏ పదార్థాన్ని, లేదా వస్తువును తీసుకున్నా, ఏ సంఘటనను పరిశీలించినా అవన్నీ కొన్ని ప్రత్యేక నియమాలకు లోబడి జరుగుతున్నట్లు తేలింది.

అవన్నీ నియమబద్ధమైనందు వల్లనే వాటిని మనం గ్రహించి అర్థం చేసుకోగలుగుతున్నాం. విశ్వం విస్తరిస్తున్నట్లు తెలియడంతో ఒకప్పుడు విశ్వం కుచించుకుపోయిన సూక్ష్మగోళం గా వుండి, ఆ గోళం సుమారు 1370 కోట్ల సంవత్సరాల క్రితం 'బిగ్‌బ్యాంగ్' తో బ్రద్ధలై అనంతంగా విస్తరిస్తూపోతున్నదని తెలియడంతో రకరకాల విశ్వసిద్ధాంతాలు ఏర్పడ్డాయి. స్పందన విశ్వం, యధాస్థితి విశ్వం, విస్తరించే విశ్వం వంటి విశ్వసిద్ధాంతాలు బయలుదేరాయి.

ఎన్ని సిద్ధాంతాలున్నా దైవసిద్ధాంతాన్ని రుజువు చేసేది ఒక్కటీ లేదు. ఆధునిక విజ్ఞానం వివరిస్తున్న విశ్వతత్వంలో దైవసిద్ధాంతానికి అవకాశమే లేదు. భావవాదానికి, అభౌతిక వాదానికి ఆస్కారం లేదు. అందువల్ల దైవవాదం అజ్ఞానం మీద, విశ్వాసం మీద మాత్రమే ఆధారపడుతుంది. అయినా ఆస్తికులు, భావవాదులు లేదా దైవవాదులు చేసే వాదనలను, చూపే దృష్టాంతాలను నిష్పక్షపాతంగా, హేతుబద్ధంగా పరిశీలించి చూద్దాం. దేవుడంటే ఏమిటి? అనే ప్రశ్నకు ఒక్క సమాధానం కాక, అనేకం వినిపిస్తున్నాయి. అటువంటి వాటిలో సృష్టికర్త, విశ్వపాలకుడు, సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు అనే సమాధానాలు కొన్నయితే ప్రేమే దైవం, సత్యమే దైవం, మానవత్వమే దైవం అనేవి మరికొన్ని.

సైన్సు ప్రకారం ఏదీ సృష్టి చేయడానికి వీలులేనపుడు సృష్టికర్త వున్నాడనుకోవడం అసంబద్ధం, అహేతుకం, అనుభవ విరుద్ధం. వాదనా సౌలభ్యం కోసం సృష్టికర్త వున్నాడనుకుంటే, సృష్టికి పూర్వమే అతడు వున్నాడనుకోవాల్సి వస్తుంది. శూన్యం నుండి సృష్టి జరిగిందనుకోవాలి. పదార్థ నిత్యత్వాన్ని, ప్రదేశకాలాలను మనం సక్రమంగా అర్థం చేసుకుంటే సృష్టిభావన, సృష్టికర్త భావన కేవలం అపోహలని తెలుస్తుంది.



దైవభావనలు, సృష్టి భావనలు ప్రపంచమంతటా ఒకేలా లేవు. మతాన్ని బట్టి, మత శాఖలను బట్టి, అనేక రకాలుగా వున్నాయి. పరస్పర వైరుధ్యాలతో కూడా వున్నాయి. రూపగుణాలతో మానుషరూపంలోని వ్యక్తిగత దైవం వున్నట్లు ప్రచారం జరుగుతోంది. రూపగుణాల దేవుడు సర్వాంతర్యామి కాకుండా పోతాడు. నిరాకార నిర్గుణ దేవుడు లేకుండా పోతాడు. జగత్తులో జరుగుతున్న ప్రళయాలు, విలయాలు, కరువుకాటకాలు, దోపిడి పీడనలు, అకృత్యాలు, దుష్కృత్యాలు, దుర్మార్గాల గురించి దేవుడికి తెలియకపోతే అతడు సర్వజ్ఞుడు కాలేడు. తెలిసి నివారించలేకపోతే సర్వ సమర్థుడు కాలేడు. తెలిసి నివారించగలిగి కూడా నివారించకపోతే నిర్దయుడు, క్రూరుడు అవుతాడు. దేవుడికి ఆపాదించిన రకరకాల లక్షణాలన్నీ భక్తుల కల్పితాలే తప్ప, వాస్తవాలు కావు.

సత్యం, ప్రేమ, మానవత్వం వంటివి దైవం కాజాలవు. దేవుడనే భావన అతీత శక్తితోను, అద్భుతాలు మహత్యాలతోను ముడిపడి వున్నందువల్ల వాటిని రుజువులకు అతీతంగా భావించి విశ్వసిస్తున్నారు. లేని రుజువులను వున్నట్లుగా వూహించుకుని, కట్టుకథలను కల్పించి ప్రచారం చేస్తూవున్నారు. ఉదాహరణకు స్వర్గం, నరకం వంటి పరలోకాలు. అన్ని మతాలు కొన్ని తేడాలతో స్వర్గనరకాలను విశ్వసిస్తున్నాయి.

అతీతశక్తులు, మహత్యాలు ఇంతవరకు రుజువు కాలేదు. నియమబద్ధమైన విశ్వంలో అతీతశక్తులకు, మహత్యాలకు అవకాశమేలేదు. మహత్యాలుగా పేర్కొనే సంఘటనలను పరిశీలించి చూస్తే అవన్నీ ప్రకృతి నియమాలకు లోబడి జరిగేవేనని తేలుతుంది. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా ఏ సంఘటనా జరగదు. జరిగినట్లు మనం గమనిస్తే దానర్థం పదార్థ నియమాలలో సరికొత్త నియమాలు పనిచేస్తున్నట్లే. అంటే, ఆ మేరకు పరిశోధించి సరికొత్త నియమాలను తెలుసుకోవడం ద్వారా మరింత అభివృద్ధిని సాధించడమే.

పునర్జన్మ సిద్ధాంతం, కర్మసిద్ధాంతం వంటివి కూడా దేవుడున్నాడని రుజువు చేయడానికి మానవుడు కల్పించుకున్నవే. ఈనాటి వరకు పునర్జన్మ సిద్ధాంతంగాని, కర్మ సిద్ధాంతంగాని రుజువు కాలేదు. అందువల్ల వాటిద్వారా దేవుడున్నాడని భావించడానికి వీలు కాకుండా పోయింది. సత్యాన్వేషణ చాలా శ్రమతో కూడిన వ్యవహారం. విశ్వసించడం శ్రమలేని సుఖం. విశ్వాసి అజ్ఞానంలో సుఖాన్ని వెతికితే,

సత్యాన్వేషి విజ్ఞానంతో ఆనందాన్ని అనుభవిస్తాడు. ఈ ఆస్తిక నాస్తిక చర్చ మానవ జాతి వున్నంత వరకూ సాగుతూనే వుంటుంది.

## జీవం-ఆత్మ

మనకు అంతుబట్టని అలౌకిక, అభౌతిక, అతీత శక్తి దేహంలో ప్రవేశించడం వల్లనే జీవం ఏర్పడుతుందని, అది దేహాన్ని విడిచి వెళ్లడంతోనే జీవి నిర్జీవమవుతుందనే వాదం అత్యంత ప్రాచీనకాలం నుండి ప్రచారంలో వుంది. జీవం-నిర్జీవం, పదార్థం-శక్తి, దేహం-మనస్సు, అచేతనం-చేతనం అనేవి రెండు విభిన్న తత్వాలుగా భావించేవాటిని ద్వైతతత్వాలు అంటారు. దీనికి భిన్నగా పైన పేర్కొన్నవాటి మధ్య ఏకత్వాన్ని దర్శించేది ఏకత్వవాదం. జీవం కూడా పదార్థాన్ని ఆశ్రయించి వుండే ధర్మమే. పదార్థం ఒక విశిష్ట సంయోగంలో వున్నపుడు ఏర్పడే లక్షణమే జీవం. జీవం ప్రపంచంలో వున్న పదార్థం, నిర్జీవ ప్రపంచంలో వున్న పదార్థం ఒకటే కాబట్టి జీవప్రపంచం కూడా భౌతిక నియమాల బద్ధమేనని, భౌతికేతరం అనేది లేదని ఆధునిక విజ్ఞానశాస్త్రం తెలుపుతుంది. జగత్తులో మరెక్కడా కనిపించని జీవులు భూమిమీద మాత్రమే వుండటం భూమిమీద జీవం యేర్పడటానికి అనుకూలమైన పరిస్థితులు వుండటమే. 460 కోట్ల సంవత్సరాల క్రితం భూమి ఏర్పడినపుడు భూమి మీద జీవంలేదు. దాదాపు 100 కోట్ల సంవత్సరాలు గడిచాక, సుదీర్ఘమైన పదార్థ పరిణామక్రమంలో నిర్జీవ ద్రవ్యం నుండి జీవద్రవ్యం-దాని నుండి అర్ధజీవులు, ఏకకణజీవులు, బహుకణజీవులు, చెట్లు, జంతువులు, చివరకు మానవులు ఉద్భవించారు. బాక్టీరియా పెరిగి రెండు ముక్కలవుతుంది. వానపామును ముక్కలుచేస్తే ముక్కలు జీవిస్తాయి. బూజుని ఎన్ని ముక్కలు చేస్తే అన్ని విడిభాగాలుగా పెరుగుతాయి. ఆత్మ వాదులు దీనికేమంటారు? శరీర కణాల నుండి క్లోనింగ్ ప్రక్రియ ద్వారా కృత్రిమంగా ప్రయోగశాలలో జంతువులను సృష్టిస్తున్నారు. వీటన్నిటికీ ఆత్మలు ఎక్కడ నుండి లభిస్తాయి. కోమాలో వున్న వ్యక్తికి ఆత్మవున్నట్టా, లేనట్లా? ఇలా ఎన్ని ప్రశ్నలనైనా సంధించవచ్చు. వీటికి ఆత్మవాదులు సమాధానాలు చెప్పలేరు.

మనిషి పీల్చేగాలిని, మనిషి నీడను, అద్దంలో మనిషి ప్రతిబింబాన్ని, మనిషి మనస్సును, చైతన్యాన్ని ఆత్మగా భావించారు. కాని, అవేవి ఆత్మకాదని తేలింది.



ఆధునిక విజ్ఞానం మెదడు చేసే పనినే మనసంటుంది. (The function of the Brain is called Mind). మనసు, లేక బుద్ధి దేహధర్మమే. అందువల్ల దేహంతోపాటు మెదడు, దానితో పాటు పరిసరాల స్పృహ పెరుగుతుంది. ప్రత్యేకించి మెదడు అభివృద్ధి చెందని అత్యంత సూక్ష్మజీవులలోను పరిసరాల స్పృహను గమనించవచ్చు. బాక్టీరియాకు ఒకవైపు పోషక పదార్థాలను, మరో వైపు విషపదార్థాలను వుంచితే అది విష పదార్థాలనుండి దూరంగా జరగటం, పోషక పదార్థాలవైపు చలించటం చూడవచ్చు. దీనినే రసాయనిక చలనం (chemotaxis) అంటారు. సూక్షజీవులకు గల ఈ స్పృహను (consciousness) అత్యంత ప్రాథమిక స్థాయికి చెందిన మనసుకు ఉదాహరణగా చెపుకోవచ్చు. దేహ ప్రభావం మనసుమీద, మనసు ప్రభావం దేహం మీద వుంటాయి. అవి పరస్పర ప్రభావితాలు. జీవిలో కనిపించే ధర్మాలు మరల తిరిగి ప్రకటితం కాకుండా పోతే దాన్నే మరణం (death) అంటారు. అనుకూల పరిస్థితులు లేనపుడు అందులోని జీవం ప్రకటితం కాదు. అలాగే బాక్టీరియా అనుకూల పరిస్థితులేర్పడగానే జీవ లక్షణాన్ని ప్రదర్శించవచ్చు. యంత్రాలు చెడిపోలే విడి భాగాలను కొత్తగా అమర్చి బాగుచేసి నడిపించినట్లే మనుషుల అవయవాలు పాడయినపుడు కూడా గుండె, కాలేయం, మూత్రపిండాలు వంటి అనేక అవయవాలను అమర్చి పనిచేయిస్తున్నాం. జెనిటిక్ ఇంజనీరింగ్ ద్వారా జీవులలో జన్యువు (genes) మార్చటం ద్వారా కొత్తరకాల జీవులను సృష్టించగలుగుతున్నాం. రోగకారక జన్యువులను తొలగించటం ద్వారా రోగాలను రాకుండా చేయగలుగుతున్నాం. జన్యుసంబంధ లోపాలను సవరించ గలుగుతున్నాం.

వృక్షాలు కిరణజన్య సంయోగక్రియ (Photo synthesis) ద్వారా గాలిలోని కార్బన్‌డైఆక్సైడ్‌ను పీల్చుకుని పిండిపదార్థాన్ని తయారు చేసుకుంటాయి. నిర్జీవ పదార్థమైన వాటి నుండి సేంద్రియ పదార్థమైన పిండి పదార్థాలను తయారు చేసుకుంటున్నాయి. అంటే నిర్జీవ ద్రవ్యాన్ని జీవద్రవ్యంగా మార్చుకునే శక్తి జీవులకుంది. "మన ఆహారంలో తీసుకునే గ్లూకోజు జీర్ణాశయంలో చేరి ఎంజైములతో ప్రతీకరించే దాకా నిర్జీవ ద్రవ్యంగానే పరిగణిస్తా"మన్నాడు. ప్రఖ్యాత జీవశాస్త్రవేత్త జె.బి.ఎస్.హాల్డేన్. జీవమంటే పరిసరాలతో ప్రతీకరించుతూ వృద్ధిచెంది, తన ఆకారాన్ని కాపాడుకుంటూ, న్యూక్లికామ్లాలతో కూడిన జీవుల పునరుత్పత్తి ద్వారా తనగుణగుణాలను చాలావరకు

తన సంతానికి అందిస్తూ, మార్పు చెందటానికి అవకాశం గల పునరుత్పత్తి పొందే వ్యవస్థ అని తేలుతుంది. (Life is mutable, heritable reproductive system capable of reacting with the environment). జీవిదేహంలో ప్రాథమిక కణాన్ని జీవకణం అంటాం. అవి మనిషి దేహంలో సుమారు $10^{14}$ (కోటికోట్లు) వున్నాయని అంచనా. జీవులన్నిటిలోనూ కలిపి ఇప్పటికి 1500 రసాయనిక పదార్థాలను కనుగొన్నారు. జీవద్రవ్యంలోని ప్రధానమైన మూలకాలు ఆరే.అవి-బొగ్గు, హైడ్రోజన్, ఆక్సిజన్, నైట్రోజన్, ఫాస్పరస్, గంధకం. జీవకణాలలో కొన్నివందల ఎంజైమ్ లుంటాయి. వీటిని బయోకాటలిస్టులంటారు. ఒక ఎంజైమ్ ఒక సెకనులో సుమారు 100 పరమాణువులను తయారు చేయగలదని అంచనా.

జీవంలో మరో ప్రధానాంశమైన పునరుత్పత్తికి సహాయకారి జీవకణ కేంద్రకం (న్యూక్లియస్). ఈ న్యూక్లియస్‌లోనే జీవుల లక్షణాలను నిర్ధారించే జీనులుంటాయి. అత్యంత చిన్నబాక్టీరియా న్యూక్లియస్‌లోనే $10^{12}$ బిట్లు వుంటాయి. అందులోని సమాచారాన్ని క్రోడీకరించడానికి 10 కోట్ల పేజీలు అవసరమవుతాయి.

నిర్జీవ పదార్థం నుండి జీవం ఏర్పడిందని మొదటగా ప్రతిపాదించినవారు టి.హెచ్.హక్సలీ, జాన్ టిండార్‌లు. అయితే ఆ పరిణామం ఎలా జరిగిందో వారు వివరించలేక పోయారు. ఈ పరిణామాన్ని శాస్త్రీయంగా వివరించటానికి ప్రప్రథమంగా ప్రయత్నించినవారు రష్యన్ శాస్త్రజ్ఞుడు ఏ.వి.ఒపారిన్, బ్రిటిష్ శాస్త్రవేత్త జె.బి.ఎస్.హాల్డేన్‌లు. (1929).

భూమిపై ఏర్పడిన మొదటి వాతారవణంలో ప్రధానంగా మీథేన్, అమ్మోనియా, నీటి ఆవిరి వుండేవి. నిర్జీవమైన జూపిటర్ గ్రహంలో ఈనాటికి ఇలాంటి వాతావరణమే వుందని 1932లో కనుగొనడం ఈ వాదానికి బలాన్నిచ్చింది. నీటి ఆవిరి, కార్బన్‌డయాక్సైడ్, నైట్రోజన్‌లతో కూడిన వాతావరణం భూమిపై ఏర్పడిన రెండో వాతావరణంగా పరిగణిస్తారు. భూమికి దగ్గరలో వున్న బుధ, శుక్ర గ్రహాలపై ఇలాంటి వాతావరణమే ఇప్పటికీ వున్నట్లు పరిశోధనలు తెలుపుతున్నాయి.

1950 లోనే నోబెల్ బహుమతి గ్రహీత మెల్విన్ కాల్విన్ రేడియోధార్మిక అణువుల సమక్షంలో కార్బన్‌డయాక్సైడ్, నీటి ఆవిరిల మధ్య రసాయనిక ప్రక్రియలు



జరిగి ఫార్మిక్ ఆసిడ్, ఫార్మాల్‌డిహైడ్ మొదలైనవి తయారువుతాయని ప్రయోగ పూర్వకంగా రుజువు చేశాడు.

చికాగో యూనివర్సిటీకి చెందిన స్టాన్లీమిల్లర్, హెరాల్డ్‌యూరీ అనే రసాయన శాస్త్రజ్ఞులు హైడ్రోజన్, మీథేన్, అమ్మోనియా, నీరు కలిపిన మిశ్రమాన్ని నిరంతరాయంగా విద్యుదావేశానికి గురిచేయగా జీవ పదార్థాణువుల పుట్టుకకు మూలమైన సంక్లిష్ట కర్బన సమ్మేళనాలు ఏర్పడ్డాయి. ఈ సమ్మేళనాలే జీవపదార్థంగా మారినట్లు తెలుస్తున్నది. డార్విన్ పరిణామ సిద్ధాంతం అనేక జీవజాతుల పుట్టుకను, మానవుడి ఆవిర్భావాన్ని స్పష్టంగా వివరించగలిగింది.. ప్రతి జీవకణంలోను అత్యంత సన్నని దారాల్లాంటి క్రోమోజోమ్‌ల సెట్లు రెండు ఉంటాయని, ఒక్కో సెట్టులో వుండే క్రోమోజోమ్‌ల సంఖ్య వేర్వేరు జీవుల్లో వేర్వేరుగా వుంటాయని, మానవ జీవకణంలో 23 జతల క్రోమోజోమ్‌లుంటాయని ఆధుని విజ్ఞానం తెలుపుతుంది. ఈ దారాల్లాంటి క్రోమోజోమ్‌లో పూసల్లాగా అనేక జీనులుంటాయి. ఈ జీనులే సమస్త గుణగణాల్ని నిర్ధరిస్తాయి. అదే విధంగా వాతావరణ పరిస్థితులుకూడా జీవుల లక్షణాలను ప్రభావితంచేస్తాయి. జీనుల సముదాయంలో వచ్చే మార్పులను మ్యుటేషన్లు అంటారు. 1930లో రోనాల్డ్ ఫిషర్, హల్డేన్, సెవాల్ రైట్ అనే శాస్త్రజ్ఞులు జన్యుసిద్ధాంతాన్ని, ప్రకృతి వరణాన్ని సమన్వయపరిచి నూతన సమన్వయ పరిణామసిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. దీనినే నియోడార్వినిజం అంటారు.

ఒక జాతి నుండి విడిపోయిన చిన్న జీవ సమూహంలో వచ్చిన మార్పులు కొన్ని వేల తరాలలో తమపూర్వ జాలికి భిన్నంగా తయారవుతాయి. వాటి మధ్య లైంగిక వైముఖ్యం ఏర్పడినపుడు వాటిని వేర్వేరు జాతులుగా పరిగణిస్తాం. జీవజాతుల ఆవిర్భావం కొత్త భాషల అవిర్భావాన్ని పోలివుంటుంది. పరిణామం చిన్న మార్పులతోనే సాగుతుంది తప్ప పెద్ద గెంతులు వుండవు.

350 కోట్ల సంవత్సరాలకు ముందు భూమిపై జీవకణం ఉద్భవించిన నాటి నుండి జరిగిన జీవ పరిణామంలో దాదాపు 20 కోట్ల జీవ జాతులు ఉద్భవించాయని, కాలక్రమంలో పరిస్థితులకు తట్టుకోలేని అనేక జీవ జాతులు నశించి పోగా, చివరకు నేడు 20 లక్షల జాతులు మాత్రమే జీవ ప్రపంచంలో మిగిలి వున్నాయని అంచనా. పరిణామం పిండ దశలో ప్రతిబింబిస్తుందనే సూత్రాన్ని జర్మన్ శాస్త్రవేత్త వాన్‌బార్

కనుగొన్నారు. జీవులన్నింటిలో అంగ సారూప్యం జెనెటిక్ సారూప్యం, రసాయనిక సారూప్యం వుంది. వీటన్నిటి దృష్ట్యా జీవం పరిణామ క్రమంలో నిర్జీవం నుండి రూపొందిందే తప్ప ఎవరూ దానిని సృష్టించలేదని తెలుస్తుంది. ఈ విధంగా భౌతిక వాస్తవికతగా వున్న విశ్వం నిరంతరపరిణామంలో వున్నది. ఈ పరిణామక్రమంలోనే నిర్జీవ పదార్థం నుండి జీవపదార్థం ఏర్పడింది. క్రమంగా అనేక జీవ జాతులు రూపొంది కడకు మానవుడు అవతరించాడు. బుద్ధిశాలి అయిన మానవుడు అవతరించాక నిర్జీవ, జీవ పరిణామంతోపాటు భావ పరిణామానికి అవకాశమేర్పడింది.

ఈ విశ్వంలో సృష్టికర్తకు, విశ్వపాలకుడికి అవకాశంలేదు. అత్మలకు, పరమాత్మలకు, స్వర్గ నరకాలకు, పూర్వజన్మ పునర్జన్మలకు అవకాశం లేదు. దైవసిద్ధాంతాలకు, కర్మసిద్ధాంతాలకు ఆస్కారం లేదు. అభౌతికత్వానికి, అతీతశక్తులకు, మహత్యాలకు, దైవావతారాలకు తావులేదు. భౌతిక వాస్తవికతను అవగాహన చేసుకుంటూ, జ్ఞానాన్ని ఆర్జించుకుంటూ, స్వేచ్ఛాపరిధులను విస్తరించుకుంటూ, శాంతి సహకారాలతో కూడిన నైతిక జీవనాన్ని గడుపుతూ మానవుడు విశ్వమానవకళ్యాణాన్ని సాధించగలడని ఆశిద్దాం. ఆ బృహత్కార్యంలో మన వంతు కర్తవ్యాన్ని నిర్వహిద్దాం.

*(హేతువాది డిసెంబర్ 2007)*

# సత్యం - సాక్ష్యాధారాలు

ఏది సత్యం ఏదసత్యం అనే మీమాంస ఆదిమానవుడి నుండి ఆధునిక మానవుడిదాకా కొనసాగుతూ వస్తున్నదే. సత్యసాక్షాత్కారం కోసం అనేక సంవత్సరాలుగా మానవుడు అనేక విధాలుగా తన కృషిని కొనసాగిస్తూనే వున్నాడు. అయితే ఇంతకూ మానవుడు తనకృషిలో విజయం సాధించలేక అపజయం పాలయ్యాడా అని ప్రశ్నించుకుంటే విజయం సాధించాడనే చెప్పవలసి వుంటుంది. ఆ విషయ మెటువంటిదో, తాను సాధించిన సత్య స్వరూపస్వభావా లెటువంటివో ముందుగా పరిశీలించి తెలుసుకోవాలి.

తాను నివసిస్తున్న భూమి, తన చుట్టూవున్న విశ్వాంతరాళం అందులోని గ్రహనక్షత్రాదిగోళాలు, అందులో నిరంతరం జరిగే పరిణామాలు, సంఘటనలు మానవుడిలో ఆసక్తినిరేపి, అనేక ప్రశ్నలను లేవనెత్తాయి. ఆయా సంఘటనలు, అవి ఆవిధంగా జరగడానికి గల కారణాలను అన్వేషించడం ప్రారంభించిన మానవుడు నిత్యసత్యాన్వేషిగా మారక తప్పలేదు. వాటిగుట్టు విప్పడంలో గట్టిగా నిలబడి అవిశ్రాంతంగా శ్రమించక తప్పలేదు. అతని శ్రమ వృథా కాలేదు. అతని కృషి ఫలిస్తూ వచ్చింది. ఒకటొకటిగా అనేక విశ్వరహస్యాలను ఛేదించగలిగాడు. సత్యాన్ని దర్శించగలిగాడు, జ్ఞానాన్ని ఆర్జించగలిగాడు.

ఈ క్రమంలో అతడు ఆదిలో తడబడ్డాడు. తప్పులుచేశాడు. దారీతెన్నూ కానరాక తికమకపడ్డాడు. అయోమయంలోనే అన్నింటికి కారణంగా ఒక శక్తివంతుడిని వూహించాడు. అతడినే దేవుడిగా భావించాడు. తనకు అర్థం కాని విషయాలన్నిటికీ సమాధానంగా ఆ దేవుడిని సృష్టించుకున్నాడు. తన కోరికలు నెరవేర్చే సాధనంగా దేవుడిని మలచుకున్నాడు. తనలో లేని గొప్పగుణాలను, శక్తిసామర్థ్యాలను దేవుడికి ఆపాదించాడు. అతడిని ప్రసన్నం చేసుకోడానికి స్తోత్రాలు, పూజలు,

ఆరాధనలు ప్రారంభించాడు. యజ్ఞయాగాది క్రతువులను నిర్వహించి బలులివ్వడం మొదలుపెట్టాడు.

మానవ నాగరికత చరిత్రను పరిశీలిస్తే కొద్ది తేడాలతో ప్రపంచవ్యాప్తంగా ఒక దశలో జరిగిన వాస్తవికతగా పై పరిణామాన్ని గమనించవచ్చు.

మానవుడిలో పరిశీలనాసక్తి, ఆలోచనాశక్తి క్రమంగా పెరిగింది. అనుభవం అనేక విషయాలు నేర్పింది. తన నమ్మకాలకు, అనుభవాలకు పొంతన లేకుండా పోతున్నదని క్రమంగా గ్రహించసాగాడు. అనుభవాల వెలుగులో పాత నమ్మకాలను మరోసారి పరిశీలించుకున్నాడు.

తాను ముందు వూహించిన కారణాలకంటే భిన్నమైన, బలమైన, నిర్దిష్టమైన, స్పష్టమైన కారణాలు కనిపించసాగాయి. తనచుట్టూ జరుగుతున్న సంఘటలన్నీ కార్యకారణ సంబంధాన్ని కలిగి వున్నాయని గ్రహించాడు. ఆ కార్యకారణాలను అధ్యయనం చేయడం ద్వారా ఆయా సంఘటనలను సక్రమంగా అర్థం చేసుకోగలిగాడు. అతని అవగాహన స్థాయి క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఆ మేరకు సత్యాన్ని మరింతగా గ్రహించగలిగాడు. సత్యాన్ని గ్రహించి మేర అతని జ్ఞానస్థాయి పెరిగింది. జ్ఞానం పెరిగిన కొద్దీ అతడు విశిష్టమైన వ్యక్తిగా రూపొందాడు. సంఘజీవిగా, నైతిక జీవిగా, స్వేచ్ఛాజీవిగా జీవించడం ప్రారంభించాడు.

సత్యమనేది ఉనికితో ముడిపడిన అంశం. ఉనికి (existence) లేనిది సత్యం కాజాలదు. మన చుట్టూ విస్తరించి, ఆవరించి వున్న విశ్వమంతా ఉనికి కలిగివున్నదే. ఈ ఉనికి వాస్తవమైనది. అది మన మనస్సు కల్పిస్తున్న భ్రమ కాదు. భ్రాంతి కాదు. అందుకే ఈ విశ్వాన్ని భౌతిక వాస్తవికతగా (Physical Reality) భావించాలి. దాని తత్వాన్ని భౌతికవాస్తవిక తత్వంగా పరిగణించాలి.

అడవుల్లో ముక్కుమూసుకుని తనస్సు చేస్తే సత్యదర్శనం కాదు. ధ్యానం చేయడం ద్వారా ఎవ్వరూ సత్యాన్ని పొందలేరు. యోగాలు, యాగాలు సత్యానికి మార్గాలు కావు. పూజలు, భజనలవల్ల, కీర్తనలు ప్రార్థనలవల్ల సత్యం లభ్యం కాదు.

విశ్వమంతా పదార్థమయం. పదార్థంలేని చోటు గాని, పదార్థంకాని వస్తువుకాని లేదు. వుండదు. పదార్థానికి ఆద్యంతాలు లేవు. అందుకే విశ్వానికి ఆద్యంతాలు



లేవంటాం. అది నియమబద్ధం, నిరంతర పరిణామశీలం. నియమబద్ధం కాని పదార్థాన్ని, పరిణామంలో లేని పదార్థాన్ని విశ్వంలో చూడలేం.

విశ్వం నియమబద్ధమైనందు వల్లనే దానిని మనం అర్థం చేసుకోగలుగుతున్నాం. విశ్వం మన గ్రహింపులోకి రావడం, అర్థం కావడమే అద్భుతమైన ప్రక్రియగా సుప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ అభివర్ణించారు. నియమబద్ధమైన విశ్వంలో పరిణామక్రమంలో ఆవిర్భవించిన వాడే మానవుడు. అందువల్లనే విశ్వంలోని నియమబద్ధత మానవుడిలోనూ ప్రతిబింబిస్తున్నది. మన శరీరంలోని అన్ని అవయవాలు నియమబద్ధంగానే పనిచేస్తున్నాయి. ఆ నియమబద్ధతే మానవుడి మస్తిష్కంలో హేతుత్వంగా భాసిస్తున్నది. అందుకే మానవులందరూ ప్రాయికంగా హేతువాదులవుతున్నారు.

సత్యానికి సంబంధించిన దాన్నే శాస్త్రం అంటాం. పదార్థం ఎలా ప్రవర్తిస్తుంది. పదార్థ విన్యాసం ఏ యే నిబంధనలను, నియమాలను అనుసరిస్తుంది? వివిధ పదార్థాంశాల సంయోగ వియోగాలవల్ల ఎటువంటి నూతన రూపధర్మాలుగల వస్తువులేర్పడు తున్నాయి? ఇత్యాది విషయాలను పరిశీలించి, పరిశోధించి, ప్రయోగాలు జరిపి నిర్ధారించేదే శాస్త్రం. దాన్నే సైన్స్ అంటున్నాం.

వివిధ క్షేత్రాలలో విస్తారంగా అభివృద్ధిచెందిన సైన్స్ ఆయా వస్తువుల, సంఘటనలలోని పదార్థ నియమాలను తెలుసుకోవడం ద్వారా మాత్రమే సాధ్యమయింది.

దీని వల్ల మనకు తెలిసే దేమిటంటే సత్యం పదార్థాన్ని ఆశ్రయించి మాత్రమే వుంటుందని, పదార్థానికి భిన్నంగా, బాహ్యంగా సత్యం వుండదని. దీనికి భిన్నంగా భావవాదులు, మాయావాదులు మాత్రమే అభౌతికత్వాన్ని గురించి మాట్లాడు తుంటారు. ఆత్మతత్వం, పరమాత్మ తత్వం అభౌతికమని వాదిస్తుంటారు. వాస్తవానికి మన గ్రహింపులోకి వచ్చేదంతా భౌతిక విశ్వానికి సంబంధించిందే గాని అభౌతికత కాదు. అభౌతిక అనేది లేదు. ఉండడానికి అవకాశం లేదు. ఉందంటే అది భౌతికం కాకతప్పదు. భౌతికమైనదంతా ఉనికి పరిణామాలను కలిగివుండక తప్పదు. నియమబద్ధం కాక తప్పదు.

అందువల్ల ఉన్న విశ్వపదార్థమంతా తెలుసుకోడానికి వీలుగా వున్నదే (చదీళిగీ-బిలీజిలి). తెలుసుకోడానికి వీలుకాని పదార్థం లేదని తెలుస్తుంది. అంతా జ్ఞేయమేగాని అజ్ఞేయం లేదు. నేడు తెలియనిది రేపు, రేపు తెలియనిది మరోనాడు తెలుస్తూనే వుంటుంది. అయితే మనిషి పరిమితుడయి నందువల్ల అతడు ఎంత తెలుసుకున్నా ఇంకా తెలుసుకోవలసింది ఎల్లప్పుడూ మిగిలే వుంటుంది.

మనం సత్యం గురించి ఎంత చెప్పుకున్నా, సైన్సు గురించి చెప్పుకున్నా కొందరికి ఇంకా సందేహాలు మిగిలేవుంటాయి. సందేహాలుండడం తప్పుకాదు, ఆరోగ్యకరం కూడా. అయితే ఆ సందేహాలు ఎన్నటికీ నివృత్తికావని, సైన్సు పరిధిలో వాటికి సమాధానాలు లభించవనీ ప్రచారం చేసే వర్గమొకటి బయలుదేరింది.

మతస్థుల మాదిరిగా కేవలం విశ్వాసంపై ఆధారపడకుండా ప్రతిదానికి సాక్ష్యాధారాలు కావాలనుకోవడం హేతువాద పద్ధతి, సైన్సు విధానం కూడా. సాక్ష్యాధారాలు లేకుండా దేనినీ గుడ్డిగా నమ్మరాదనేది హేతువాదంలో మొదటి మెట్టుగా భావించవచ్చు. అయితే దేనికి ఏది సాక్ష్యం? దేనికి ఏది ఆధారం అనేది ముందుగా తెలుసుకోవాలి.

మతస్థులుకూడా తమది కేవలం విశ్వాసంకాదని, తాముకూడా సాక్ష్యాధారాలపై ఆధారపడే సత్యాసత్య నిర్ధారణకు వస్తున్నామని ప్రగల్భాలు పలుకుతూ ప్రచారం చేయడం విడ్డూరంగా కనిపిస్తుంది. హిందూ, ముస్లిం, క్రైస్తవమతాలకు సంబంధించిన కొందరు ఇటీవల తమ ప్రచారాన్ని ఈ దిశగా కొనసాగిస్తున్నారు. తామంతా సత్యాన్వేషులమని సర్టిఫికెట్లిచ్చుకుంటున్నారు.

మరో విశేషమేమిటంటే ఈ మతస్థులంతా సృష్టివాదులే. ఆస్తికత్వం సత్యమా? నాస్తికత్వం సత్యమా? అనే చర్చను లేవదీసి, దేవుడున్నాడనే సత్యాన్ని రుజువు చేయాల్సిన బాధ్యతను తాము స్వీకరించకుండా, దేవుడు లేడని నిరూపించే బాధ్యతను నాస్తికులమీద పెడుతున్నారు. వాస్తవానికి దేవుడున్నాడని రుజువు చేయాల్సిన బాధ్యత ఆస్తికుల మీదే వుంటుంది. ఇంతవరకు ఏ ఆస్తికుడూ దేవుడువున్నాడని రుజువు చేయలేదు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలను చూపలేదు. అయినా ఇంకా నాస్తికత్వం రుజువు కాలేదంటారు.



భౌతిక వాస్తవికత అనేది విశాలమైన అర్థాన్నిచ్చేపదం. పదార్థ ఉనికినే భౌతికవాస్తవికతగా భావిస్తాం. పదార్థం ఎన్నిరూపాల్లోవున్నా, ఎన్నిస్థితులలో వున్నా, ఏ రకమైన ధర్మాలను కలిగివున్నా, ఏ నియమాలను కలిగివున్నా అవన్నీ భౌతికవాస్తవికతలో భాగంగానే పరిగణిస్తాం. అందువల్ల విశ్వాంతరాళంలో వందల కోట్ల కాంతి సంవత్సరాల దూరాలలో వున్న నక్షత్రాదిగోళాల ఉనికిని సైతం తెలుసుకుని, భౌతికవాస్తవికతలో భాగంగా గుర్తిస్తున్నాం. కాంతి చేరని కాలబిలాలను సైతం వాటి గుత్వాకర్షణశక్తి మూలంగా గుర్తించగలుగుతున్నాం. గురుత్వాకర్షణ క్షేత్రాలు, విద్యుదయస్కాంత క్షేత్రాలు మొదలైనవన్నీ కూడా భౌతికవాస్తవికతలో భాగాలే.

అదేవిధంగా సూక్ష్మవిశ్వంలోని అణువులు, పరమాణువులు, పరమాణు గర్భంలోని ప్రోటానులు, ఎలక్ట్రాన్లు, న్యూట్రానులు మొదలైన అత్యంత సూక్ష్మరేణువులను సైతం భౌతికవిశ్వంలో భాగంగా భావిస్తున్నాం. మన దిసనేత్రాలకు నేరుగా కనిపించని చాలావాటిని సాంకేతిక పరికరాల సహాయంతో వాటి ఉనికిని, లక్షణాలను, పర్యవసనాలను తెలుసుకోగలుగుతున్నాం.

అందువల్ల భౌతిక వాస్తవికత తప్ప విశ్వంలో మరేదీ లేదు. భౌతికవాస్తవికతను మించిన సత్యం లేదు. భౌతిక వాస్తవికతకు అతీతంగా గాని, బాహ్యంగా గాని, భిన్నంగా గాని మరొకటిలేదు. ఆత్మలు, పరమాత్మలు, పరలోకాలు, పునర్జన్మల వంటివన్నీ కేవలం విశ్వాసం మీద ఆధారపడినవే తప్ప వాటికి వాస్తవమైన అస్తిత్వం లేదు. వాటి ఉనికికి సంబంధించిన రుజువులు నేటికీ లభ్యం కాలేదు. ఏ మతస్థులూ వాటికి సంబంధించిన సాక్ష్యాధారాలను చూపలేదు. అయినా వాటిని సత్యాలుగా ప్రచారం చేస్తూ ప్రజలను వంచిస్తూనే వున్నారు.

నియమబద్ధమైన విశ్వంలో మహత్యాలకు తావేలేదు. అయినా మతాలన్నీ మహత్యాల మీద ఆధారపడి మనుగడ సాగిస్తున్నవే. మహిమలు, మహత్యాలన్నీ నియమరాహిత్యానికి నిదర్శనాలవుతాయి. విశ్వంలోని వస్తువులు, సంఘటనలు అన్నీ నియమబద్ధంగా వున్నందువల్ల ప్రతిదీ ఒక క్రమాన్ని అనుసరిస్తూ నియమబద్ధతను ప్రకటిస్తుంది. అందువల్లనే మనం వాటిని గ్రహించి అర్థం చేసుకోగలుగుతున్నాం. ఏదయినా ఒక సంఘటన మనకు తెలిసిన నియమాలకు భిన్నంగా జరుగుతున్నదంటే

అది నియమ విరుద్ధంగా జరుగుతున్నదని కాదు. అందులో మనకు తెలియని కొత్త నియమాలు పనిచేస్తున్నాయని అర్థం.

సైన్సు పరిశోధించి, ప్రయోగాలు జరిపి నూతన నియమాలను తెలుసు కొంటుంది. ఆ మేరకు నూతన సత్యాలు ఆవిష్కృతమవుతాయి. సైన్సు అభివృద్ధి అంతా ఇదే క్రమంలో జరుగుతోంది. పూర్వ విజ్ఞానానికి నూతన విజ్ఞానం అదనంగా వచ్చిచేరుతుంది. ఆ విజ్ఞానం నూతన సాంకేతికాభివృద్ధికి దోహదం చేస్తుంది. తద్వారా మానవుడికి నూతన సౌకర్యాలు, సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. మానవుడి స్వేచ్ఛా పరిధులు విస్తృతమవుతాయి. జ్ఞానం సాపేక్షమే కాని సంపూర్ణం కాదు. అయితే ఈ జ్ఞానం సమగ్రత దిశగా పయనిస్తుంది. జ్ఞానం అందుబాటులోకి వచ్చిన మేరకు మానవుడికి స్వేచ్ఛ లభిస్తుంది.

మతస్థులందరూ సృష్టివాదాన్ని విశ్వసిస్తున్నవారే. అవ్యయమైన విశ్వపదార్థంలో సృష్టి జరగడానికే అవకాశం లేదని, అందువల్ల సృష్టిభావనే తప్పని ఆధునిక విజ్ఞానశాస్త్రం రుజువు చేసింది. అయినప్పటికీ తమనుతాము సత్యవాదులుగా ప్రకటించుకుంటున్న సృష్టివాదులు తమవాదాని కనుకూలంగా ఎటువంటి సాక్ష్యాధారాలను చూపలేకపోయారు. శక్తి నిత్యత్వసూత్రమే (The law of conservation of mass and energy) సృష్టివాదం తప్పనడానికి సాక్ష్యంగా నిలుస్తున్నది. అయినా మతస్థులు సృష్టివాదాన్ని వదులుకోకపోవడం వారి పాక్షిక దృష్టికి, అశాస్త్రీయ వైఖరికి నిదర్శన మవుతుంది.

మతానికి, శాస్త్రానికి అనేక శతాబ్దాలుగా మహాసంగ్రామం కొనసాగుతున్నది. విశ్వానికి భూమికేంద్రమన్న మత విశ్వాసాన్ని కోపర్నికస్ సూర్యకేంద్ర సిద్ధాంతం బద్దలు కొట్టింది. డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం మతాలను చావుదెబ్బ తీసింది. ఐన్‌స్టీన్ సాపేక్షసిద్ధాంతంతో విశ్వ స్వరూపమే మారిపోయింది. ప్రదేశకాలాలు పదార్థ లక్షణాలని తేలడంతో విశ్వ అవగాహనలో మౌలికమైన మార్పువచ్చింది. విశ్వానికి బాహ్యమైనది, అతీతమైనది లేదని, ఉండడానికి అవకాశమే లేదని తేలిపోయింది. అదేవిధంగా విశ్వానికి ముందు ఏమి వుండేదనే ప్రశ్న అర్థరహితమై పోయింది.

జీవపరిణామ సిద్ధాంతానికి తగినన్ని సాక్ష్యాధారాలు లభించినందువల్లనే శాస్త్రప్రపంచంలోని శాస్త్రవేత్తలందరూ దానిని ఆమోదించారు. అటువంటి జీవపరిణామ



సిద్ధాంతాన్నే వ్యతిరేకిస్తూ, అభ్యంతరాలు లేవదీస్తూ ప్రచారం సాగిస్తున్న మతస్థుల వర్గమొకటి బయలుదేరింది. జీవమనేది నిర్జీవ ప్రపంచం నుండి పరిణామక్రమంలో ఆవిర్భవించలేదని, పరిణామ క్రమంలో ఒక జాతి నుండి మరొక జాతి రూపొందలేదని, జీవజాతులన్నిటిని భగవంతుడే సృష్టించాడని వాదిస్తున్నారు.

అయితే వారి వాదన కనుకూలంగా ఎటువంటి సాక్ష్యాధారాలను చూపించడం లేదు. జీవపరిణామ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఇంటలిజెంట్ డిజైన్ థియరీ (తెలివైన పథక సిద్ధాంతం)ని ప్రతిపాదిస్తున్నారు. సారాంశంలో ఇది సృష్టివాదాన్ని మరోపేరుతో ప్రతిపాదించడమే.

1925లో అమెరికాలో ప్రభుత్వ సహాయంతో నడిచే పాఠశాలల్లో జీవపరిణామ సిద్ధాంతాన్ని బోధించరాదనే చట్టాన్ని టెనెన్సి రాష్ట్రప్రభుత్వం చేసింది. జాన్ థామస్ స్కోప్స్ అనే టీచరు తరగతి గదిలో జీవపరిణామ సిద్ధాంతాన్ని బోధించి నందుకు శిక్షింపబడ్డాడు. ఇటీవలకాలంలో 2005లో కూడా అమెరికాలో సైన్సు మీద, డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం మీద మరోసారి దాడి జరిగింది. ఎన్నో వాదోపవాదాలు జరిగాయి.

ఎంతో సంక్లిష్టంగా వున్న అనేక అంశాలలో ఒక ప్రతిభావంతుడి మేధోరచన కనిపిస్తున్నదని, అటువంటి సంక్లిష్టమైన నిర్మాణాలు, జంతువులలో, మానవులలో కనిపించే విశిష్టమైన ప్రక్రియలు నిర్జీవ ప్రపంచం నుండి వాటంతటవే రూపొందజాలవని, డార్విన్ జీవపరిణామ సిద్ధాంతంలో పేర్కొనే సహజ ఎంపిక ద్వారా (Natural selection) అవి రూపొందడం అసాధ్యమనేదే ఇంటలిజెంట్ డిజైన్ థియరీ.(ID theory)

కోర్టులో ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జోన్స్ ఇంటలిజెంట్ డిజైన్ థియరీకి వ్యతిరేకంగా పటిష్టమైన భాషలో వివేకవంతమైన, ప్రతిభావంతమైన తీర్పును వెలువరించాడు. అతీతశక్తుల మీద ఆధారపడి పరిశీలించడానికి వీలుకాని ప్రాతిపదికలతో కూడిన ఆ సిద్ధాంతం సైన్సు పరిధిలోకి రాదని తీర్మానించాడు. సృష్టివాదంలోని సారాన్నే మరోరూపంలో ఐ.డి.థియరీలో జొప్పించారన్నాడు. జీవపరిణామ సిద్ధాంతంపై లేవనెత్తిన అభ్యంతరాలను శాస్త్రప్రపంచం దీటుగా ఎదుర్కొని, చక్కగా సమాధానాలిచ్చిందని వ్యాఖ్యానించాడు.

మతాల మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా వర్ధిల్లుతున్న సైన్సును ఆమోదించలేని మతస్థులు రకరకాల ఎత్తుగడలతో అనేక రూపాలలో సైన్సు సిద్ధాంతాలను తప్పుపట్టడానికి, తాము విశ్వసిస్తున్నదే నిజమైన సైన్సు అని నమ్మించడానికి అనాదిగా విఫలయత్నం చేస్తూనేవున్నారు. అప్రతిహతంగా, విజయపథంలో కొనసాగుతున్న సైన్సును మతాలు అడ్డగించే పరిస్థితి ఏనాడో దాటిపోయింది. విప్లవాత్మకమైన నూతన ఆవిష్కరణలతో ఆధునిక విజ్ఞానం అనూహ్యంగా అభివృద్ధి చెందుతున్నది.

ఆధునిక విజ్ఞానం పునాదిగా నిర్మితమయ్యే తాత్విక సిద్ధాంతాలు మాత్రమే మానవాళికి సరియైన జీవనవిధానాన్ని చూపగలవు. మతాలు కల్పించిన మూఢవిశ్వాసాలను, ప్రగతికి అవరోధాలుగా నిలిచిన అశాస్త్రీయ ఆచార సాంప్రదాయాలను నిర్మూలించగలవు. సంక్షోభంలోపడి కొట్టుమిట్టులాడుతున్న మానవాళికి సరియైన పరిష్కారమార్గాలను అందించగలవు. స్వేచ్ఛా సమానత్వ సౌభ్రాతృత్వ విలువలతో కూడిన నూతన సమాజాన్ని ఆవిష్కరింపజేయగలవు.

*(హేతువాది, అక్టోబర్ 2008)*

# తాత్విక విప్లవం

విశ్వమంటే ఏమిటి? విశ్వంలో జరుగుతున్న మార్పులేమిటి? ఆ మార్పులకు కారణాలేమిటి? ఆ మార్పులు ఏదయినా క్రమాన్ని అనుసరిస్తున్నాయా? లేదా? వాటిని మనం ఏవిధంగా అర్థం చేసుకోగలుగుతున్నాం?

సత్యమంటే ఏమిటి? అది సాపేక్షమా? నిరపేక్షమా? సత్యాన్ని తెలుసుకోడానికి మార్గాలేమిటి? జ్ఞానమంటే ఏమిటి? అది ఎలా లభిస్తుంది? మానవ జీవిత పరమార్థమేమిటి? ఇత్యాది ప్రశ్నలు అందరికీ కలగడం సహజం. ఇటువంటి ప్రశ్నలకు సమాధానం చెప్పే క్రమంలోనే తత్వం ఆవిర్భవిస్తుంది.

ఆదిమ మానవుడి నుండి ఆధునిక మానవుడిదాకా ఇటువంటి ప్రశ్నలకు సమాధానాలను అన్వేషిస్తూనే వున్నాడు. అందిన జ్ఞానం మేరకు అనుభవాన్ని మేళవించి సమాధానాలు చెప్పుకొంటున్నాడు. జ్ఞానం, అనుభవం పెరిగినకొలది ముందు చెప్పుకొన్న సమాధానాలతో సంతృప్తి చెందలేకపోతున్నాడు. నూతన అనుభవాల వెలుగులో నూతన సమాధానాలను చెప్పుకొంటూ సాగిపోతున్నాడు.

మానవుడు మౌలికంగా జిజ్ఞాసి. ప్రతి విషయంలోనూ ఏది, ఏమిటి? ఎందుకు? ఎక్కడ? ఎలా? అని ప్రశ్నించుకుంటూ, వాటికి సమాధానాలను కనుగొంటూ నిరంతర సత్యాన్వేషిగా సాగిపోతున్నాడు. అలుపెరుగని ఈ సుదీర్ఘ ప్రయాణంలో అతడు ఏనాడూ ఎక్కడా ఆగిపోలేదు. అన్ని మజిలీలను దాటుకుంటూ ముందుకు సాగిపోతూనేవున్నాడు.

దీనికి భిన్నంగా ఒకనాటి సమాధానాలతో సంతృప్తిచెంది ఇక అక్కడి నుండి ముందుకు కదలడానికి మనస్కరించనివారు అక్కడే ఆగిపోయారు. అలా ఆగిపోయిన వారి భావాలే మతంగా రూపాంతరం చెందాయి. నేటి ప్రపంచంలో కనిపించే

మతాలన్నీ ఆవిధంగా ఆగిపోయిన భావాలతో, సమాధానాలతో రూపొందినవే. వాటిని మార్చడానికి వీలులేని విధంగా మార్చివేయడం వల్ల అవి దైవ శాసనాలుగా నిలదొక్కుకోగలిగాయి.

మతాలకు భిన్నమైనది తత్వం. తత్వానికి శాస్త్రజ్ఞానం పునాదిగా వుంటుంది. శాస్త్రం సత్యాలను అన్వేషించి, పరిశీలన, పరిశోధన, ప్రయోగాలు జరిపి ఫలితాలను నిర్ధారిస్తుంది. ఆ విధంగా రాబట్టిన ఫలితాల వల్లనే ఆయా విషయాలకు, లేదా సంఘటనలకు సంబంధించిన జ్ఞానం ఏర్పడుతుంది. క్రమబద్ధమైన జ్ఞానాన్నే శాస్త్రం లేదా సైన్సు అంటున్నాం.

సైన్సు నేడు అనేక రంగాలలో వందలాది శాఖోపశాఖలుగా విస్తరించింది. ఆయా శాఖలలో సైన్సు వెల్లడిస్తున్న సత్యాలను అధ్యయనం చేసి, సమన్వయపరచి వాటన్నిటి సారాంశాన్ని తెలుపడమే తత్వశాస్త్రం చేసేపని. అందువల్ల తత్వశాస్త్రాన్ని శాస్త్రాలకు శాస్త్రం అంటారు. ఈ కారణంవల్లనే తత్వశాస్త్రానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడుతోంది.

వేలాది సంవత్సరాలుగా తాత్విక భావాలు ప్రపంచ వ్యాప్తంగా మానవులను విశేషంగా ప్రభావితం చేస్తున్నాయి. తాత్వికభావాలే ప్రతిమనిషికి ఒక ప్రాపంచిక దృక్పధాన్ని ఏర్పరుస్తాయి. ఆ ప్రాపంచిక దృక్పథమే ప్రతి ఒక్కరి జీవితంలో అడుగడుగునా తీసుకునే నిర్ణయాలలో, స్పందించే తీరులో, ప్రవర్తించేరీతిలో ప్రతిబింబిస్తుంటుంది. మనిషికున్న జ్ఞానం ఆధారంగా అతని తాత్విక అవగాహన రూపొందుతుంది. తాత్విక అవగాహనను అనుసరించే అతని జీవితం కొనసాగుతుంది.

భారతదేశానికి సంబంధించినంతవరకు తాత్విక భావాలను మనం పరిశీలించి నట్లయితే అనేక ఆసక్తికరమైన విషయాలు విదితమవుతాయి.

క్రీస్తుపూర్వం వెయ్యి సంవత్సరాలకు ముందే ఈ దేశంలో వేదాలు రూపొందినట్లు చరిత్రకారులు నిర్ణయించారు. వేదవాఙ్మయమంతా ప్రార్థనాగీతాలలో, స్తోత్రాలతో నిండివుంది. రుగ్వేదం పదవ మండలంలో మాత్రమే 121, 129 సూక్తాలలో విశ్వానికి సంబంధించిన తాత్వికపరమైన ముతకభావాలు, ప్రశ్నలు కనిపిస్తాయి. అంతకుమించి పెద్దగా చెప్పుకోదగ్గ విశేషాలు వేదాలలో ఏమీలేవనేది వాస్తవం.



అటువంటి వేదాలలో సర్వమానవాళికి, సర్వకాలలకు సంబంధించిన విజ్ఞానమంతా నిక్షిప్తమైవుందని ప్రగల్భాలు పలికే వారికి ఈ దేశంలో కొదువలేదు. దానికి తోడు మతనాయకుల చొరవతో, ప్రభుత్వ అండదండలతో కోట్లాది రూపాయలను ఖర్చుపెట్టి వేదవిశ్వవిద్యాలయాలను స్థాపిస్తున్నారు. వేదాలలో సూక్తాలకు వక్రభాష్యాలు చెప్పుకుంటూ విషప్రచారాన్ని కొనసాగిస్తూనే వున్నారు.

వేదాల తరువాత వచ్చిన ఉపనిషత్తుల్లో ఆసక్తికరమైన, జిజ్ఞాసాపూర్వకమైన తాత్విక చర్చ బ్రహ్మం చుట్టూ తిరిగినట్లు మనకు కనిపిస్తుంది. వైదిక కర్మకాండ విపరీతంగా పెరిగిపోయిన దశలో వేదాలను, కర్మకాండను, వాటి చుట్టూ అల్లబడిన మూఢవిశ్వాసాలను వ్యతిరేకిస్తూ బయలుదేరిన తాత్విక భావోద్యమాలే చార్వాక, బౌద్ధ జైనాది ఉద్యమాలు.

అవి వెల్లడించిన భావాలు ఆనాటి తాత్విక విప్లవభావాలే. చార్వాకులు ప్రథమ భౌతికవాదులు. వారి భౌతికవాదంలో స్వభావవాదం, చతుర్భూత చైతన్యవాదం, ప్రత్యక్ష ప్రమాణవాదం వున్నాయి. దేహాత్మవాదం, దైవం, ఆత్మల నిరాకరణ, పునర్జన్మ, పరలోకాల నిరాకరణ వున్నాయి.

బౌద్ధం 'ప్రతీత్యసముత్పాదవాదాన్ని' ప్రతిపాదించింది. లోకంలో ఏదీ తనంతట తాను సంభవించదు. ప్రతిదీ మరొకదానిపై ఆధారపడి సముత్పన్నమవుతుంది. ఈ విధంగా కార్యకారణ సంబంధం అనంతంగా కొనసాగుతుంది. దీనితే ప్రతీత్య సముత్పాదవాదమన్నారు.

బుద్ధుడు వ్యక్తిత్వానికి, నైతికశీలానికి, అహింసకు ప్రాధాన్యతనిచ్చాడు. దుఃఖనివారణ మార్గంగా అష్టాంగమార్గాన్ని ప్రతిపాదించాడు. అలౌకిక విషయాలపై ఆధారపడరాదన్నాడు. ప్రతివ్యక్తి తననుతానే ఉద్ధరించుకోవాలన్నాడు. దేనిని గుడ్డిగా విశ్వసించి, అనుసరించరాదనీ, సత్యాసత్యాలను అనుభవం ద్వారా మాత్రమే నిర్ధారించుకోవాలన్నాడు.

దాదాపు వెయ్యి సంవత్సరాలు దేదీప్యమానంగా వెలిగిన బౌద్ధం ప్రపంచ తాత్విక చరిత్రలోనే మకుటాయమానమైనది.

భారతీయ తాత్విక చరిత్రలో మరో ప్రధానఘట్టం దార్శనిక యుగం. కపిలుని సాంఖ్యం, కణాదుని వైశేషికం, గౌతముని న్యాయం షడ్దర్శనాలలో పేర్కొనదగ్గవి.

వస్తువు లేకుండా వస్తువు రాదనడం (నా వస్తునో వస్తుసిద్ధిః), మూలకారణానికి మరోమూలకారణం వుండదనడం (మూలే మూలాభావా దమూలం మూలం) సాంఖ్య దర్శనంలోని విశేషంగా చెప్పుకోవచ్చు. ప్రకృతికి కారణాన్ని ప్రకృతిలోనే చూడమంటుంది వైశేషిక దర్శనం. (కారణమితి ద్రవ్యే కార్య సమవాయాత్). సూక్ష్మమైన అణువుల కలయిక వల్లనే సమస్త పదార్థాలు ఏర్పడుతున్నాయన్న వైశేషికం అణువావాన్ని ప్రతిపాదించడం ఆ దర్శనం గొప్పతనాన్ని చాటుతుంది. మన ఇంద్రియాలతో బాహ్య ప్రపంచానికి సంబంధం ఏర్పడడం ద్వారానే వస్తు ధర్మాలు మన గ్రహింపులోకి వచ్చి జ్ఞానమేర్పడుతుందని న్యాయదర్శనం పేర్కొంది. (ఇంద్రియార్థ సన్నికర్షోత్పన్నం జ్ఞానం). ఇలా దర్శనసాహిత్యం నేటికీ సత్యంగా నిలబడగల తాత్విక భావాలను, భౌతికవాద సూత్రాలను వెల్లడించడం ఆనాటి చారిత్రక నేపథ్యంలో సామాన్యమైన విషయం కాదు.

దర్శనాల తరవాత అంతకంటె ఉన్నతమైన తాత్విక భావాలు రావలసిన తరుణంలో శుష్కమైన భావాలతో, కల్పితాలతో, కట్టుకథలతో మాయామంత్రాలతో, మహిమలతో నిండిన పుక్కిటి పురాణాలు వెలువడడం భారతీయ తాత్విక చరిత్రలో గొప్ప తిరోగమనంగా పేర్కొనవచ్చు. ఆనాటి పురోహితవర్గం తమ పబ్బం గడుపుకోడానికే స్వార్థంతో ఇటువంటి పౌరాణిక సాహిత్యాన్ని సృష్టించి, దానికి విశేష ప్రచారాన్ని కల్పించింది. దానితో జిజ్ఞాస, జ్ఞాన తృష్ణ నశించి క్రతువులకు, కర్మకాండకు ప్రాధాన్యం ఏర్పడింది. మూఢ విశ్వాసాలతో కూడిన ఆచార సంప్రదాయాలకు మరోసారి ప్రతిష్ఠాపన జరిగింది.

రామాయణ, భారత, భాగవతాది కాల్పనిక సాహిత్యం, పౌరాణిక సాహిత్యం రాజ్యమేలసాగింది. సుమారు గత రెండువేల సంవత్సరాలుగా భారతీయ సమాజాన్ని ప్రభావితం చేస్తున్నది, శాసిస్తున్నది, నడిపిస్తున్నది ఈ పౌరాణిక సాహిత్యమే అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

తాత్విక భావాలు మతాలను ఆశ్రయించడం వల్ల మతభావాలే తాత్విక భావాలుగా చలామణి కావడం ప్రారంభమైంది. ఈ విధంగా కర్మవాదం, పునర్జన్మవాదం, పరలోకవాదం బయలుదేరాయి. ఇవన్నీ ఆత్మ పరమాత్మల చుట్టూ పరిభ్రమించసాగాయి.



ఈ సందర్భంగా బాగా ప్రాచుర్యం పొందిన సిద్ధాంతాలలో అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం వంటివి వున్నాయి. జగన్మిథ్యావాదాన్ని ప్రతిపాదించిన శంకరుడు నిజజీవితంలో వర్ణాశ్రమ ధర్మాలను రక్షించడానికై దేశం నాలుగు దిక్కుల్లో నాలుగు శంకరపీఠాలను స్థాపించిపోయాడు. బౌద్ధ ఉద్యమాన్ని నిర్మూలించడానికి గట్టి కృషి చేశాడు.

ఆచార్య త్రయంగా ప్రసిద్ధులైన శంకర రామానుజమధ్వాచార్యులు బానిసత్వాన్ని నూరిపోసి అంధకారయుగ నిర్మాతలైనారు. ఈ బానిసభావాల వల్లనే భారతదేశం దాదాపు వెయ్యి సంవత్సరాలపాటు విదేశీయుల పాలనలో భయంకరమైన దాస్యాన్ని అనుభవించింది. ఇది చాలదన్నట్లు దేశంలో పలుప్రాంతాలలో బయలుదేరిన భక్తి ఉద్యమాలు కర్మవాదాన్ని, పలాయనవాదాన్ని ప్రచారం చేశాయి.

వీటన్నిటివల్ల మానవుడి జీవితం క్షణభంగురమని, మరణానంతర జీవితమే ప్రధానమనే వాదం సమాజంలో బాగా పుంజుకొంది. మోక్షాన్ని అందుకోవడమే మానవులందరి జీవిత లక్ష్యంగా మారింది. వర్తమాన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాల నుండి ఎలా విముక్తి పొందాలో ఆలోచించడం మాని అన్నిటిని 'దైవేచ్ఛ'కు వదిలివేశారు.

15, 16 శతాబ్దాలలో ఐరోపాలో రినైజాన్స్ ఉద్యమం గొప్ప ఫలితాలను అందించింది. రాజులు దైవాంశ సంభూతులనే భావం ఎగిరిపోయింది. దేవుడిని తిరస్కరించి అతని స్థానంలో మానవుడిని ప్రతిష్ఠించడానికి నాంది పలికింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి భావాలు ఆదరణ పొందనారంభించాయి. శాస్త్ర జ్ఞానానికి ప్రాధాన్యత పెరిగింది. ఉన్నతమైన రినైజాన్స్ భావాలు ప్రపంచాన్ని బాగా ప్రభావితం చేశాయి. హేతువాదానికి, మానవవాదానికి అంకురార్పణ జరిగింది.

అదేవిధంగా శాస్త్రరంగంలో అనూహ్యమైన మలుపులు చోటుచేసుకున్నాయి. కోపర్నికస్ సూర్యకేంద్ర సిద్ధాంతం, న్యూటన్ గురుత్వకర్షణ సిద్ధాంతం, డార్విన్ పరిణామవాదం, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం, మాక్స్‌ప్లాంక్ క్వాంటం థియరీ వంటివి

శాస్త్రాన్ని ఆధునిక అవతారం ఎత్తించాయి. దానితో పారిశ్రామిక విప్లవం, వ్యవసాయక విప్లవం,సాంకేతిక విప్లవాలు సాధ్యమై భూమి మీది మానవుడి జీవితరూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.

ఫలితంగా తాత్వికరంగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. వాటిలో ఆధునిక విజ్ఞానం మీద ఆధారపడిందీ, అత్యంత ప్రాధాన్యాన్ని కలిగిందీ మానవవాదతత్వం. దానినే హ్యూమనిజం అంటున్నాం.

మానవవాద తత్వంలో మానవుడు కేంద్ర బిందువు. అతడికే అగ్రస్థానం. మానవుడి భద్రతకు, శ్రేయస్సుకు భంగం కలిగించే అన్నిరకాల నిరంకుశ తత్వాలను, సిద్ధాంతాలను, విధానాలను మానవవాదం వ్యతిరేకిస్తుంది. స్వేచ్ఛకు, వ్యక్తివాదానికి అత్యంత ప్రాధాన్యాన్నిస్తుంది. మానవుడు తన కార్యకలాపాలకు, తన భవిష్యత్తుకు తానేకర్త. భౌతిక వాస్తవిక వాదమే మానవవాదంలో తాత్విక భూమిక వహిస్తుంది.

భౌతిక వాస్తవికవాదమనేది, భౌతికవాదానికి ఆధునిక విజ్ఞానం వెలుగులో మెరుగులు దిద్దడం వల్ల రూపొందినదే. భావవాదమనేది భౌతికవాద వికారమే.

## భౌతిక వాస్తవికవాదంలోని ప్రధానమైన తాత్వికాంశాలు :

### విశ్వం ఉనికి

విశ్వం పదార్థ నిర్మితం. పదార్థమంటేనే భౌతికద్రవ్యం అని అర్థం. మనం మన ఇంద్రియాల ద్వారా గ్రహించేదంతా భౌతికమైనదే. విశ్వం వాస్తవంగా ఉనికి కలిగి వున్నందువల్ల దాన్ని భౌతిక వాస్తవికతగా గుర్తిస్తున్నాం. పదార్థమయమైన వస్తుజాలమంతా భౌతికవాస్తవికతలో భాగమవుతుంది. పదార్థం ఏ రూపంలో వున్నా, ఏ దశలో వున్నా భౌతికవాస్తవికతను దాటిపోజాలదు. అందువల్ల అభౌతికతకు స్థానం లేదు.

విశ్వం కలకాదు, భ్రమకాదు, భ్రాంతికాదు. అది వాస్తవం. భావవాదులు పేర్కొంటున్నట్లు అది మాయకాదు. జగన్మిథ్యావాదులు, మాయావాదులు, ఆధ్యాత్మికవాదులు అందరూ జీవించగలుగుతున్నది భౌతికవాస్తవికత మీద ఆధారపడి మాత్రమే.



పీఠాధిపతులు, మఠాధిపతులు, జగద్గురువులు, బాబాలు భౌతికమైన గాలి, నీరు, ఆహారం లేకుండా జీవించడం లేదు. అనుభవించేది, కోరుకునేవి అన్నీ భౌతిక సుఖాలే. ప్రచారం చేసేది మాత్రమే దానికి పూర్తిగా విరుద్ధమైన మాయావాదాన్ని.

విశ్వం ఉనికికి కారణాలను అన్వేషించే క్రమంలో ఆవిర్భవించినవే చతుర్భూతవాదాలు, పంచభూతవాదాలు వగైరా. మూలపదార్థాలుగా ఆనాడు వారు భావించినవి మూలపదార్థాలు కావని తేలింది. మూలకణాలుగా భావించిన అణువులు, పరమాణువులు కూడా అంతిమ కణాలుకావని తేలింది. పరమాణు గర్భంలోనే దాదాపు రెండువందల రకాల సూక్ష్మ కణాలున్నట్లు తేలడంతో అంతిమకణాల అన్వేషణ ఇంకా కొనసాగుతూనేవుంది.

ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లు,పాజిట్రాన్లు, న్యూట్రాన్లు దశదాటి అత్యంత సూక్ష్మమైన క్వార్కులను నేడు మూలకణాలుగా భావిస్తున్నారు. ఇవే అంతిమ కణాలని భావించడానికి కూడా అవకాశం లేదంటున్నారు. ఇలా పదార్థం ఎంతటి సూక్ష్మదశకు చేరినా అది భౌతికవాస్తవికతలో భాగంగానే మిగిలిపోతుంది తప్ప అది అంతరించిపోదు, మాయమవదు.

### విశ్వపరిణామం

విశ్వం నిరంతర పరిణామశీలం. పరిణామం బహుముఖంగా అనుస్యూతంగా కొనసాగుతుంటుంది. విశ్వంలోని వస్తుజాలమంతా పరిణామ సహితమైనదే. పరిణామ రహితమైనదేదీ విశ్వంలో లేదు. ఈ పరిణామం పదార్థ అంతర్గత నియమాల ప్రకారమే జరుగుతున్నట్లు గుర్తించారు. పరిణామం ఆగిపోయేదికాదు. ఆపడం ఎవరితరమూ కాదు. గ్రహనక్షత్రాది చలనాలన్నీ ఈ పరిణామంలో భాగమవుతాయి. పైకి నిశ్చలంగా వున్నట్లు కనిపించే వస్తుజాలంలోనూ అంతర్గతంగా పరిణామం కొనసాగుతూనే వుంటుంది. పదార్థం పరిణామ క్రమంలోనే నూతన ధర్మాలను ప్రకటిస్తుంది.

### స్థలకాలాలు

పదార్థ విస్తృతినే స్థలమంటారు. పదార్థ పరిణామాన్నే కాలమంటారు. పదార్థం వ్యాపించి వున్నమేరకే స్థలమవుతుంది. పదార్థానికి భిన్నంగా, బాహ్యంగా, అతీతంగా స్థలమనే భావనకు అర్థంలేదు. అందువల్ల విశ్వానికి భిన్నంగా, బాహ్యంగా, అతీతంగా ఏదీ వుండడానికి అవకాశం లేదు. ఉన్నదంతా విశ్వంలో భాగమే అవుతుంది.

శూన్యమనే మాటకు అర్థం లేదు. విశ్వంలో శూన్యం లేదు. ఉనికితో సంబంధం లేనిది శూన్యమైతే అటువంటి శూన్యం వుండడానికి అవకాశం లేదు.

కాలమనే భావన పదార్థ పరిణామం వల్ల ఏర్పడుతుంది. సంఘటనలు పరిణామరహితంగా సంభవించవు. మార్పును సూచించేదే సంఘటన. పదార్థం ఒక దశ నుండి మరో దశకు చేరడాన్ని పరిణామమంటాం. మొదటి దశకు తరువాతి దశకు వున్న మార్పును సూచించడానికే కాలమనే భావాన్ని ప్రవేశపెట్టుకున్నాం. అందువల్ల పదార్థంలో మార్పు లేకపోతే పరిణామం లేనట్టే. పరిణామం లేకపోతే కాలం లేనట్లే.

ఈ విధంగా పదార్థ ఉనికి పరిణామలనే స్థలకాలాలుగా భావించాలి. అందువల్ల స్థలకాలాలనేవి పదార్థాన్ని ఆశ్రయించి వుండే లక్షణాలే తప్ప పదార్థానికి భిన్నంగా, బాహ్యంగా వుండేవికావు. ఈ విధంగా విశ్వంలోనే స్థలకాలాలుంటాయి తప్ప, స్థలకాలాలలో విశ్వం లేదు. ఉనికి పరిణామాలు విడివిడిగా వుండేవికావు. అవి ఎల్లప్పుడూ కలిసేవుంటాయి. ఉనికి లేకుండా పరిణామంకాని, పరిణామం లేకుండా ఉనికిగాని లేదు. అందువల్ల వాటి ధర్మాలుగా భావించే స్థలకాలాలు సైతం ఎల్లప్పుడూ కలిసే వుంటాయి. స్థలం లేకుండా కాలం, కాలం లేకుండా స్థలం వుండవు. Geometrical extension of matter is space and chronological extension of matter is time అన్నాడు ఎం.ఎన్. రాయ్. ఈ విధంగా విశ్వం స్థలకాలాల కొనసాగింపు అయింది.

### పదార్థ నిత్యత్వం

పదార్థం ఎల్లప్పుడూ ఉనికిలోనే వుంటుంది. దానిని ఎవ్వరూ నాశనం చేయలేరు. నూతనంగా పదర్థాన్ని ఎవ్వరూ సృష్టించలేరు. అందుకే అది అవ్యయమైంది. పదార్థ రూప ధర్మాలను మార్చగలమేగాని దాని అస్తిత్వాన్ని రూపుమాపలేము. పదార్థం శక్తిగా, శక్తి పదార్థంగా పరస్పరం మారుతుందే తప్ప అంతరించి పోవడం లేదు. దీనినే శక్తి నిత్యత్వ సూత్రమంటారు. దీని ప్రకారం ఏదీ సృష్టి కావడానికే వీలులేదు. నాశనం కావడానికీ వీలులేదు. అందువల్ల విశ్వం సృష్టింపబడలేదు. అది నాశనం కాదు.



### నియమబద్ధత

విశ్వం నియమబద్ధం. అంటే విశ్వంలోని ఏ సంఘటనను పరిశీలించినా, ఏ వస్తుజాలాన్ని పరిశోధించినా అవి కొన్ని ఖచ్చితమైన నియమాల ప్రకారమే జరుగుతున్నట్లు రుజువవుతుంది. ఈ నియమబద్ధత వున్నందువల్లనే వాటిని మనం అర్థం చేసుకోగలుగుతున్నాం. జ్ఞానాన్ని పొందగలుగుతున్నాం. ఏదయినా నియమరహితంగా ప్రవర్తిస్తున్నట్లు మనకు కనిపించినా అది నియమరాహిత్యం కాదు. అటువంటి ప్రవర్తనకు కారణమైన నియమాలను మనం గ్రహించలేకపోయామని అర్థం.

నియమబద్ధత అంటే భవిష్యత్తులో జరుగబోయేదంతా ముందే నిర్ణయమై వుంటుందనే కర్మవాదం కాదు. అది ప్రారబ్దవాదం. ఈ నియమబద్ధత విశ్వంలోని క్రమత్వానికి నిదర్శనం. సైన్సు పరిశీలించేది, పరిశోధించేది నియమబద్ధతనే. ఒక వస్తువుగాని, సంఘటనగాని ఎటువంటి నియమాలను అనుసరిస్తుందో తెలుసు కోవడం ద్వారానే వాటికి సంబంధించిన జ్ఞానం ఏర్పడుతుంది. నూతన నియమాలను తెలుసుకోవడం ద్వారానే శాస్త్రం పురోగమిస్తుంది. విశ్వ నియమాల అధ్యయనం వల్లనే ఆధునిక విజ్ఞానశాస్త్రం అప్రతిహతంగా పురోగమించగలుగుతున్నది. నూతన సత్యాలను ఆవిష్కరించగలుగుతున్నది. మానవవాదంలో ఇంతవరకు ప్రధానమైన కొన్ని తాత్వికాంశాలను స్థూలంగా చర్చించుకున్నాం. ఇపుడు వాటి ఫలితంగా మానవుల జీవితాన్ని ఏవిధంగా రూపొందించుకోవాలో చూద్దాం.

మానవవాదంలో అన్నిటికంటె ప్రధానం మానవుడే. కావున మానవుడి ఉనికి, భద్రత, శ్రేయస్సు, స్వేచ్ఛ అత్యంత ప్రధానమైనవిగా భావించాలి.

### స్వేచ్ఛ

మానవ జీవితసారం స్వేచ్ఛ. విలువలన్నిటికీ విలువ స్వేచ్ఛ. ఆదిమ మానవుడి నుండి ఆధునిక మానవుడిదాకా సాగిన పోరాటమంతా స్వేచ్ఛాపోరాటమే. క్రూర జంతువుల నుండి, ఆకలిదప్పుల నుండి, శీతోష్ణాల నుండి తనను తాను కాపాడుకోడానికి మానవుడు చేసిన పోరాటమంతా స్వేచ్ఛాపోరాటమే.

స్వేచ్ఛ అంటే ఎవడి ఇష్టం వచ్చినట్లు వాడు చేయడం కాదు. విశృంఖలత్వం అంతకంటె కాదు. మానవుడిలో దాగిన శారీరక, మానసిక శక్తిసామర్థ్యాల ప్రతిభా పాటవాల వికాసానికి అడ్డుతగిలే ప్రతిబంధకాలన్నీ క్రమంగా అదృశ్యమైపోవడమే స్వేచ్ఛ. ప్రతిబంధకాలు ఏ మేరకు అడ్డు తొలగిపోతే ఆ మేరకు అతని శక్తి సామర్థ్యాల వికాసానికి దోహదం కలుగుతుంది. స్వేచ్ఛా పరిధులు విస్తృతమవుతాయి.

మానవుడికి అన్ని సమస్యల నుండి, అన్ని బాధల నుండి విముక్తి కావాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయాది రంగాలలో కొనసాగుతున్న అసమానతల నుండి, వివక్ష నుండి, దోపిడీ పీడనల నుండి విముక్తి కావాలి.

రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకుంటే అన్ని సమస్యలు పరిష్కారమై విముక్తి లభిస్తుందని కమ్యూనిస్టులు భావిస్తున్నారు.

దానికోసం వారు సాయుధపోరాటాలను చేపడుతున్నారు. మతవాదులు మత రాజ్యాలను స్థాపించడానికి అన్ని రకాల కుట్రలకు కుతంత్రాలకు పాల్పడుతున్నారు. మానవవాదులు మాత్రమే భిన్నమైన విధానాన్ని అవలంబిస్తున్నారు. వారు శాంతియుతమైన భావవిప్లవ పోరాటాలను సాగిస్తున్నారు.

### వ్యక్తివాదం

మానవవాదంలోని మరో ప్రధానమైన అంశం వ్యక్తివాదం. వ్యక్తి సమాజానికి నమూనా. వ్యక్తులే సమాజ నిర్మాతలు. వ్యక్తులకు భిన్నంగా, అతీతంగా సమాజాన్ని వూహించలేము. స్వేచ్ఛను, కష్టసుఖాలను అనుభవించేది వ్యక్తులే. అందువల్ల ఒక సమాజం ఏ మేరకు అభివృద్ధి చెందిందో తెలుసుకోడానికి ఆ సమాజంలోని వ్యక్తులు వాస్తవంగా అనుభవిస్తున్న స్వేచ్ఛనుబట్టి నిర్ణయించాలి.

కులం, మతం, జాతి, పార్టీ వంటి సమష్టితత్వాలు బాగా బలం పుంజుకొన్నాయి. వాటిలో వ్యక్తులకు విలువ శూన్యం. సమష్టికి మాత్రమే ప్రాధాన్యత వుంటుంది. ఈ రకమైన విపరీత ధోరణలవల్ల వ్యక్తి మనుగడకే ముప్పు వాటిల్లుతోంది.

మానవవాదంలో అన్నిటికీ మానవుడే ప్రమాణం. అతనికి అతడే లక్ష్యం. మరో లక్ష్యానికి అతడు సాధనం కాదు. అందువల్ల మానవవాదంలో మాత్రమే వ్యక్తికి అత్యున్నతమైన అగ్రస్థానం అభిస్తుంది.



### నైతికవాదం

నైతిక విలువలు ఏ మేరకు అమలువుతున్నాయి అనే దాని మీద ఆధారపడి ఆ సమాజం ఔన్నత్యాన్ని పరిగణిస్తాం. అందువల్ల నైతికవాదానికున్న ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

అంతరంగానికి జరిపే విన్నపమే నీతి అని మానవవాదులు భావిస్తారు. ఒక మనిషి ఇతరులపట్ల ఏవిధంగా ప్రవర్తిస్తున్నాడనే విషయంలో నీతి ఆవిర్భవిస్తుంది. అడవిలో ఒంటరిగా వుండే వ్యక్తికి నీతి వర్తించదు. అతనికి నైతిక సమస్య ఉత్పన్నంకాదు.

నీతి సాపేక్షమా, నిరపేక్షమా అనేది అనేది చాలాకాలంగా నలుగుతున్న సమస్య. సాపేక్షనీతి నీతే కాదనేది మానవవాదుల అభిమతం. నీతి ఎప్పటికప్పుడు మారిపోయేది కాదు. ఒక వ్యక్తి మరొకరిని హింసించరాదు, హత్యచేయరాదు, అగౌరవపరచరాదు మొదలైనవి ఎల్లకాలాలకు, ఎల్లరికి వర్తించే నైతిక సూత్రాలే. కాలానుగుణంగా సమాజంలో వచ్చేమార్పులు ఎన్నివున్నా మౌలికనైతిక భావాలలో ఎటువంటి మార్పు వుండదు. సామాజిక అవసరాలరీత్యా వాటిని వ్యక్తపరిచేరీతిలో, విధానంలో తేడాలుండవచ్చు.

అవినీతి అనేది నేటి సమాజాన్ని పట్టిపీడిస్తున్న పెద్ద సమస్య. అవినీతి అంటే లంచాలు ఇవ్వడం, పుచ్చుకోవడం మాత్రమేకాదు. చిత్తశుద్ధిలేకపోవడమే అవినీతిగా భావించవచ్చు. వివేకవంతుడైన మానవుడు ఇతరులు తనపట్ల ఏవిధంగా ప్రవర్తించాలనుకుంటాడో తాను ఇతరుల పట్ల అదే విధంగా ప్రవర్తించడానికి ఉద్యుక్తుడవుతాడు. అలాకాక తనకొకనీతి, ఇతరులకొకనీతి అనుకున్నపుడే సమస్యలు ఏర్పడతాయి.

### లక్ష్యసాధనాలు

లక్ష్యసాధనాల మధ్య సమన్వయముండాలంటుంది మానవవాదం. దీనికి భిన్నంగా లక్ష్యం మంచిదయితే చాలు మార్గమేదయినా ఫరవాలేదనే సిద్ధాంతాలున్నాయి. కమ్యూనిస్టుల సిద్ధాంతం అటువంటిదే. సరియైన సాధనం ద్వారానే సరియైన లక్ష్యాని చేరగలుగుతాం. త్వరపడి అడ్డదారుల్లో ప్రయాణిస్తే అసలు లక్ష్యానే చేరుకోలేం.

**భావాల ప్రభావం**

భావాలు సామాజిక పరిణామంలో కీలకమైన పాత్రను పోషిస్తున్నాయి. భావాలు కూడా భౌతిక వాస్తవికతలో భాగాలే. వస్తువుల మీద నుండే అవి బయలుదేరుతాయి. ఒకసారి ఆ విధంగా ఏర్పడిన భావాలు స్వతంత్ర అస్తిత్వాన్ని సంతరించుకుంటాయి. ఉన్న భావాలపై నుండి నూతన భావాలు రూపొందుతాయి. మనుషులను ప్రభావితం చేయడంలో, చైతన్యవంతులుగా తీర్చిదిద్దడంలో భావాలదే ప్రధానపాత్ర.

ఇటువంటి భావాలను ఆర్థిక పునాది మీద ఏర్పడిన ఉపరితల నిర్మాణాలుగా భావించడం పూర్తిగా పొరపాటు. శాస్త్రచరిత్ర, తత్వచరిత్ర అంతా పూర్తిగా భావాల చరిత్రే. భావపరిణామం, సామాజిక పరిణామం సమాంతరంగా సాగిపోతుంటాయి. పరస్పరం ప్రభావితం చేసుకొంటుంటాయి.

ప్రతి సాంఘిక విప్లవానికి ముందు తప్పనిసరిగా సాంస్కృతిక విప్లవం జరగాలి. సాంస్కృతిక విప్లవం జరగాలంటే దానికి సంబంధించిన భావవిప్లవం జరగాలి. హేతువాద స్ఫోరకమైన అటువంటి భావవిప్లవం సంభవించకుండా సమాజంలో ఆశించిన ప్రగతి సాధ్యంకాదు.

మనం రాజ్యాంగాన్ని రాసుకున్నా, చట్టాలను రూపొందించుకున్నా, పార్టీలను ఏర్పరచుకున్నా, ప్రభుత్వాలను మార్చుకున్నా సమాజంలో ఆశించిన ఫలితాలు మాత్రం రావడంలేదు. దానికి కారణం సమాజనిర్మాతలైన ప్రజల భావాలలో మార్పురాకపోవడమే.

ప్రజలు తాత్వికంగా బానిస భావాలలో మగ్గుతున్నంతకాలం, వారి ఆలోచనా విధానంలో మౌలికమైన మార్పు రానంతకాలం సాంస్కృతిక విప్లవాలకు, సాంఘిక విప్లవాలకు తావులేదనేది స్పష్టం. అందువల్ల ఆధునిక విజ్ఞానశాస్త్రం మీద ఆధారపడి రూపొందిన తాత్విక విప్లవం ముందుగా విజయవంతం కావాలి. అప్పుడే మానసిక దాస్యంలో మగ్గుతున్న మానవుడు స్వేచ్ఛా మానవుడవుతాడు. మానవ విలువలతో కూడిన విశ్వమానవ సమాజం అవతరిస్తుంది.

*(హేతువాది, మే 2010)*

# మూఢనమ్మకాలు-హేతువాద వైఖరి

నేడు నిన్నగా, రేపు నేడుగా మారుతున్న కాల ప్రవాహంలో ప్రపంచం అనేక విధాలుగా పరిణామం చెందుతూ వుంది. ఈ పరిణామాన్ని స్థూలంగా పరిశీలించినా మనకు ప్రధానమైన రెండు ధోరణులు స్పష్టంగా కనిపిస్తాయి.

ప్రపంచవ్యాప్తంగా ఆధునిక విజ్ఞానం శాఖోపశాఖలుగా వర్ధిల్లుతున్నది. దాని పర్యవసానంగా శాస్త్ర సాంకేతికాభివృద్ధి అన్ని రంగాలలోనూ అప్రతిహతంగా కొనసాగుతున్నది. మన పూర్వీకులు కలలో కూడా కనీవిని ఎరుగని ఆధునిక సాధన సంపత్తి, వాటి ద్వారా చేకూరే సౌకర్యాలు, ప్రయోజనాలు నేడు మనకు అందుబాటులోకి వచ్చాయి. ఇది మానవజాతి గర్వించదగ్గ మొదటి ధోరణి.

దీనికి భిన్నంగా అశాస్త్రీయమైన, అహేతుకమైన మూఢ నమ్మకాలు ప్రపంచవ్యాప్తంగా వృద్ధి చెందుతున్నాయి. ఈ మూఢ నమ్మకాలు మానవ జాతి స్వేచ్ఛను హరించి, మానసిక బానిసత్వానికి బాటలు వేస్తున్నాయి. మనుషులు మూఢ విశ్వాసాల కోరల్లో చిక్కుకొని అనేక రకాల దోపిడీకి గురవుతున్నారు. ఇది మానవ జాతి గర్హించదగ్గ రెండవ ధోరణి. భారతదేశానికి సంబంధించినంతవరకు ఈ విషయాలను పరిశీలిస్తే పరిస్థితి మరింత దారుణంగా కనిపిస్తుంది. ఈ దారుణానికి కారణాలు కూడా స్పష్టంగానే కనిపిస్తాయి.

ఇక్కడ వర్ణవ్యవస్థ కులవ్యవస్థగా రూపాంతరం చెంది దాదాపు రెండువేల సంవత్సరాలుగా రాజ్యమేలుతోంది. ఈ కారణంగా ఇక్కడ విద్య కేవలం ఒక చిన్న వర్గానికే పరిమితమైపోయింది. సమాజంలో నూటికి తొంబయి అయిదు శాతం ప్రజలు తరతరాలుగా అక్షరాస్యతకు దూరమయ్యారు. విద్య నేర్చుకోవడానికి అనర్హులుగా పరిగణింపబడ్డారు.

ఆంగ్లేయుల పాలన ప్రారంభమైన తరువాతనే ఈదేశంలో విద్య అగ్రవర్ణ ఆధిపత్య సంకెళ్ల నుండి విముక్తి చెంది అందరికీ అందుబాటులోకి రాసాగింది. ఆంగ్లేయులు ఇక్కడ రాజ్యాధికారాన్ని కైవసం చేసుకుని, ఆర్థిక దోపిడీని కొనసాగించినా, మానసిక, సామాజిక వికాసానికి తోడ్పడే విద్యను ప్రవేశపెట్టి వైజ్ఞానిక భావ ప్రసారానికి పునాదులు వేశారు.

సనాతనధర్మం పేరిట పాశవికమైన, అమానుషమైన మనుధర్మశాస్త్రాలే ఈ సమాజాన్ని శాసించి, పాలించాయి. నేరస్తులను వర్ణాన్ని బట్టి శిక్షించే పద్ధతి వుండేది. ప్రపంచ మానవజాతి చరిత్రలోనే అత్యంత హేయమైన 'సతీసహగమన' దురాచారం అమలయ్యేది. బాల్యవివాహాలకు, బాలవితంతువులకు కొదువవుండేది కాదు. ఇటువంటి దురాచారాలను నిషేధిస్తూ చట్టాలు చేసి, వాటిని అమలుచేసినవారు ఆంగ్లేయులేననే విషయాన్ని మనం విస్మరించరాదు.

ఈ నేపథ్యంలోనే మనం మన సామాజిక జీవనాన్ని అంచనా వేసుకోవలసి వుంటుంది. ఆ విధంగా అంచనా వేస్తే నాటికి నేటికీ ఇక్కడ కొనసాగింది, కొనసాగుతున్నది అసత్యాలు, అసమానతలు, అధర్మాలు, అక్రమాలు, అన్యాయాలేనని స్పష్టమవుతుంది.

ఇటువంటి దారుణమైన పరిస్థితులకు దారితీసిందీ, ఆ పరిస్థితులు మారిపోకుండా ఎల్లకాలం కొసాగడానికి ఉపయోగపడిందీ, వేలాది మూఢవిశ్వాసాలకు జన్మనిచ్చిందీ ఇక్కడి మతాలు, మతభావాల. ఆ మతాలకు, మతభావాలకు నిలయమైన శ్రుతులు, స్మృతులు, పురాణాలే.

ఈ విషయాలను ముందుగా అర్థం చేసుకోకపోతే సమాజంలో చెలరేగిపోతున్న మూఢవిశ్వాసాలకు మూలాన్ని తెలుసుకోలేం. సనాతర ధర్మం పేరిట, ఆచార సంప్రదాయాలపేరిట ఈ దేశంలో వ్యాపించిన మూఢనమ్మకాల సంఖ్యకు పరిమితులే కనిపించవు. అవి పదులు, వందలు, వేలుకాదు, లక్షల్లో వుండవచ్చు.

ఈ మూఢ నమ్మకాల జాబితాలో మతాలు, కులాలు, దేవుళ్ల, దయ్యాలు, బాబాలు, స్వామీజీలు, జ్యోతిషం, వాస్తు, రాశిఫలాలు, గ్రహచారాలు, రంగురాళ్లు,



రుద్రాక్షలు, తాయెత్తులు, విభూతులు, మంత్రాలు, తంత్రాలు, బాణామతి, పూనకాలు, ముహూర్తాలు, సంఖ్యాశాస్త్రాల వంటివి ఎన్నెన్నో వున్నాయి.

వీటిలో నుంచి ఒక్కొక్క మూఢ నమ్మకాన్ని విడదీసి పట్టుకుని, దాన్ని ప్రచారం చేసేవాళ్లను వెంబడించి, వ్యతిరేకించి ఆవిధంగా దాన్ని రూపుమాపడానికి ప్రయత్నిస్తే అవి అంతంకావనేది తేలిపోయింది. అయినా మనం ఆ అనుభవాల నుండి ఏమీ నేర్చుకోలేకపోతున్నామనిపిస్తుంది. మళ్లీమళ్లీ పాత పద్ధతినే అనుసరిస్తున్నామని అర్థమవుతుంది.

నాస్తికులు, హేతువాదులు, మానవవాదులు అంటే కేవలం దేవుడు లేడని ప్రచారం చేసేవారనే అపప్రథ సమాజంలో నెలకొనివుంది. గతంలో హేతువాద సంఘంలోని మిత్రులు ఒకరిద్దరు పాములకు సంబంధించిన మూఢనమ్మకాలను పోగొట్టడానికని బహిరంగ వేదికలపై పాములను తినే కార్యక్రమాన్ని ప్రదర్శించేవారు. అది కొనసాగించినట్లయితే 'హేతువాదులంటే పాములను తినేవాళ్లు' అనే అర్థం స్థిరపడే ప్రమాదముండింది.

ఈ విషయాలన్నీ మనం ఎందుకు చర్చించుకుంటున్నామంటే నాస్తికులు, హేతువాదులు, మానవవాదులు వాస్తవానికి ఒక తాత్విక సిద్ధాంతానికి ప్రతినిధులు. ఆధునిక విజ్ఞానశాస్త్రాన్ని ప్రతిబింబించే శాస్త్రీయతత్వానికి, తాత్విక ధోరణికి కట్టుబడి పనిచేసేవారు. వారి చర్చలుగాని, ఉపన్యాసాలుగాని, ప్రదర్శనలుగాని, ఇతర కార్యక్రమాలుగాని అటువంటి వైఖరిని ప్రతిబింబించేటట్లు వుండాలి. అలాలేని పక్షంలో పెడర్థాలకు, విపరీతార్థాలకు బలైపోయే ప్రమాదం పొంచి వుంటుందని మాత్రమే మనవిచేస్తున్నాను.

నాస్తికులు, హేతువాదులు, మానవవాదుల ప్రధాన కార్యక్రమం బాబాల బండారాన్ని బయటపెట్టడమో, మరో మూఢనమ్మకాన్ని వ్యతిరేకించడమో మాత్రమే కారాదు.

ఇటీవలి కాలంలో విశేష ప్రచారం పొందిన వాటిలో 'శాంభవి' ఉదంతం ఒకటి. 'కల్కి భగవాన్' ఉదంతం మరొకటి. ఈ రెండు ఉదంతాలలోను కొన్ని వారాలు

లేదా నెలలపాటు మీడియాలో సాగిన వాదోపవాదాలు అందరెరిగినవే. ఆ వివరాల్లోకి వెళ్లడం అప్రస్తుత మనుకుంటాను. గతంలో జ్యోతిష పండితుల గురించి, వాస్తు పండితుల గురించి కూడా మీడియాలో చర్చలు జరిగాయి.

నేనిక్కడ చెప్పదలచుకున్నది నాస్తికులు, హేతువాదులు, మానవవాదులు, మూఢవిశ్వాసాలను వ్యతిరేకించరాదని కాదు. బాబాల బండారాన్ని బయట పెట్టరాదనీ కాదు. ఎవరికి, ఏ స్థాయిలో చేతనైన కార్యక్రమాలను వారు చేపట్టడంలో ఎవరికీ అభ్యంతరం వుండనవసరం లేదు.

ఇక్కడ మనం విస్మరించకుండా గుర్తించుకోవాల్సిన విషయం ఒకటుంది. ఒక విషవృక్షాన్ని నిర్మూలించాలంటే దాని ఆకులనో, కొమ్మలనో నరికితే సరిపోదు. అలాచేస్తే అవి మళ్లీమళ్లీ చిగురిస్తూనే వుంటాయి. దాన్ని కూకటివేళ్లతో సహా పెకలించగలిగిన నాడే అది పూర్తిగా నాశనమవుతుంది. అదే విధంగా మనం చూస్తున్న, ఎదుర్కొంటున్న మూఢనమ్మకాలన్నీ మతమనే విషవృక్షానికి చెందిన ఆకులు, కొమ్మల వంటివే. వీటిని విడివిడిగా తొలగించుకుంటూ పోతూవుంటే అవి మళ్లీ చిగుళ్లు తొడుగుతూనే వుంటాయి.

కులాలను నిర్మూలించడానికి కులనిర్మూలన సంఘాలు ఏర్పడ్డాయి. వాస్తును వ్యతిరేకించడానికి వాస్తు నిజనిర్ధారణ కమిటీలు ఏర్పడ్డాయి. బాణామతి నిర్మూలించడానికి బాణామతి నిర్మూలన కమిటీలు ఏర్పడ్డాయి. వరకట్నాలను వ్యతిరేకించడానికి వరకట్న వ్యతిరేక సంఘాలు అవతరించాయి. మద్యపానాన్ని వ్యతిరేకించడానికి మద్యపాన వ్యతిరేక సంఘాలు పుట్టుకొచ్చాయి. వారి వారి పరిధుల్లో వారి కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. వాటిని మనం వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. అయితే వాటిలాగే మనం కూడా మన పరిధులను సంకుచితం చేసుకోరాదని మాత్రమే మనవి చేయదలిచాను.

హద్దూపద్దూ లేకుండా వ్యాపిస్తున్న మూఢనమ్మకాలను సమర్థించడానికి మతనాయకులతోపాటు రాజకీయ నాయకులూ పోటీపడుతున్నారు. వీరికి తోడు ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా కూడా రంగంలోకి దిగి మూఢనమ్మకాలను ప్రోత్సహించడంలో పోటీపడుతున్నాయి. ఇదంతా చూస్తుంటే మళ్లీ మనం మరో



అంధకారయుగానికి ఆహ్వానం పలుకుతున్నట్లే కనిపిస్తోంది. ఈ రోగం బాగా ముదిరిపోయి చికిత్సకు లొంగనంత క్లిష్టంగా తయారైంది.

మానవుడికి ఎన్ని జన్మలుంటాయి ?

ఏ రోజు తలస్నానం చేయాలి ?

అమ్మాయి ఏ తేదీన పుష్పవతి అయితే దాని ఫలితాలు ఎలా వుంటాయి ?

ఏరోజు ఏరంగు దుస్తులు ధరించాలి ?

ఏ దిక్కు ప్రయాణం చేస్తే మంచిది ?

ఏ దేవుడిని ప్రార్థించాలి ? ఏ మంత్రం జపించాలి ?

ఇటువంటి తలతిక్క ప్రశ్నలకు టీవీ ఛానల్‌వాళ్లు ఒక సిద్ధాంతితో సమాధానాలు చెప్పించే కార్యక్రమాన్ని రోజూ ప్రసారం చేస్తున్నారు. ఆ సిద్ధాంతి 'లాప్‌టాప్' వుపయోగించి లెక్కలు కట్టి మరీ సమాధానాలు చెపుతుంటాడు.

మేమేం తక్కువ తిన్నామా అని మరో ఛానల్ వాళ్లు నిత్యం రాశిఫలాలను చెప్పిస్తున్నారు. ఇంకో ఛానల్‌వాళ్లు ఏకంగా ప్రతి మూఢనమ్మకం వెనుక 'శాస్త్రీయ సత్యాన్ని?' 'శాస్త్రీయ సూత్రాన్నీ?' విడమరిచి చెప్పి ఆయా మూఢనమ్మకాలు ఎంత గొప్పవో తెలియజేస్తున్నారు. విజ్ఞాన సాధనాలుగా వుండవలసిన టీవీఛానళ్లు అజ్ఞానాన్ని ప్రచారం చేయడంలో పోటీపడుతుండడం విచారకరం. ఎంతటి దౌర్భాగ్యం ?

ఇటీవలి కాలంలో గుట్టురట్టయిన స్వామీజీలు ఎందరో వున్నారు. దక్షిణాదిన నిత్యానందస్వామి ఆధ్యాత్మిక ముసుగులో రాత్రివేళల్లో రాసలీలల్లో తేలియాడుతున్నట్లు రుజువు చేసే వీడియో చిత్రాలు బయటపడ్డాయి. ఉత్తరాదిన ఒక స్వామీజీ ధర్మ ప్రచారం ముసుగులో ఏకంగా వ్యభిచార వ్యాపారాన్నే నడుపుతున్నట్టు రుజువులు పోలీసుల చేతికి దొరికాయి.

ఒక సన్యాసి పసిపిల్లల గొంతుపై కాలుమోపి వారిని రోగాల బారి నుండి కాపాడతానని ప్రచారం పొందాడు. మరో వెధవ తన వద్ద మహిమలున్నాయని నమ్మి వచ్చిన భక్తులకు తన మూత్రాన్నే తాగిస్తున్నట్లు వార్తలొచ్చాయి. వీరి దుర్మార్గాలకు, దోపిడీలకు అంతులేకుండాపోయింది.

ఊరికొక బాబా, వీధికొక సిద్ధాంతి తయారవుతున్న తరుణమిది. బాణామతి చేస్తున్నారనే నెపంతో ఇటీవలి కాలంలో మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలలో అమాయకులను కట్టిపడేసి బహిరంగంగా సజీవదహనం చేసినట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా ఏమీ పట్టించుకోకపోవడమే ఈ ప్రభుత్వానికి చేతనైనది. అదే దాని స్వభావం. గతంలో పుట్టపర్తి సాయిబాబా మందిరంలో ఆరు హత్యలు జరిగినా కనీసం ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసి, విచారణ జరిపించలేదంటే దీన్ని ప్రజాస్వామ్య ప్రభుత్వమనగలమా ?

మూఢనమ్మకాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది. దేవుడు, మతం వ్యాపారవస్తువులుగా మారిపోయాయి. ఆ పేర్లతో వందల, వేలకోట్ల రూపాయల వ్యాపారం సాగుతూనే వుంది. ప్రజలు అజ్ఞానంలో వుంటేనే వారి వ్యాపారానికి అంతరాయం వుండదు. మతనాయకులకు, రాజకీయ నాయకులకు కావలసిందీ అదే.

మూఢనమ్మకాల పట్ల హేతువాదులు, మానవవాదుల వైఖరి మారాలి. గ్రామస్థాయి కార్యకర్త నుండి అంతర్జాతీయస్థాయి నాయకుడి వరకు అందరూ శాంభవి లాంటి ఉదంతాలను పట్టుకొని వూరేగితే ప్రయోజనం లేదు. బాబాలను వ్యతిరేకిస్తూ కూర్చుంటే లాభం లేదు.

వీటన్నిటికి మూలమైన మతాల మీద పోరాటం కొనసాగాలి. మతభావాలలోని, మతసిద్ధాంతాలలోని డొల్లతనాన్ని బహిరంగపరచాలి. మతభావాలకు నిలయంగా వున్న మత సాహిత్యంపై విమర్శకావాలి. ఆ విమర్శ ఆధునిక విజ్ఞానశాస్త్రం అందిస్తున్న తాత్విక ఫలితాల ఆధారంగా జరగాలి.

సనాతనవాదం ముసుగులో ఆధ్యాత్మికవాదం వెర్రితలలు వేసి సమాజాన్ని నిర్వీర్యం చేసింది. ప్రజలు తమలో సహజసిద్ధంగా వున్న హేతుత్వాన్ని, వివేకాన్ని వినియోగించుకోకుండా వారి మెదడు నిండా మూఢనమ్మకాలు ముసురుకున్నాయి. ఆచారసంప్రదాయాల పేరిట వారిని ఆలోచించనివ్వకుండా, ప్రశ్నించనీయకుండా కట్టిపడేస్తున్నారు. ప్రతిదాన్నీ గుడ్డిగా అనుసరించడం తప్ప గత్యంతరం లేని స్థితికి వారిని నెట్టివేశారు.



అందువల్ల నాస్తికులు, హేతువాదులు, మానవవాదులు అన్నిరకాల అహేతుకత్వాల నుండి, మూఢనమ్మకాల నుండి ప్రజలను విముక్తులను చేసే 'తాత్విక భావవిప్లవాన్ని' రగిలించాలి. అప్పుడే మానవులు మానసిక బానిసత్వం నుండి బయటపడగలుగుతారు. స్వేచ్ఛాసమతలతో కూడిన సమాజ నిర్మాతలవుతారు.

మహత్తరమైన, సుదీర్ఘమైన, ప్రణాళికాబద్ధమైన భావవిప్లవ పోరాటంలో హేతువాదులు, మానవవాదులు ప్రజలకు స్నేహితులుగా, తాత్వికులుగా, మార్గదర్శకులుగా నిలబడగలిగే శక్తిసామర్థ్యాలను సమకూర్చుకోవాలి. అదే మనముందున్న ఆదర్శం, కర్తవ్యం.

(హేతువాది నవంబర్ 2010)

## సేవా కార్యక్రమాలు-హేతువాద వైఖరి

విశ్వపరిణామక్రమంలో మానవుడు సంతరించుకున్న చాలా గుణాలలో సహకారగుణం కూడా ఒకటి. ఈ సహకారతత్వం వల్లనే మనుషులు ఆయా సందర్భాలలో ఒకరికొకరు సహకరించుకుంటూ వుంటారు. వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, న్యాయవ్యవస్థ వంటి చాలా వ్యవస్థలు రూపుదిద్దుకోడానికి మరోరకంగా చెప్పాలంటే సామాజిక వ్యవస్థ రూపు దిద్దుకోడానికి మానవులలోని వివేక సంకల్పాలతో కూడిన సహకారభావమే కారణంగా కనిపిస్తున్నది. ఈ సహకారతత్వమే మానవుడిలోని మానవతాభావాలకు ఆలంబనగా నిలుస్తుంది.

మానవతాభావం నుండి పుట్టిందే సేవాభావం. ఆపదలో వున్నవాళ్లను ఆదుకోవడం, ఆకలిగా వున్న వాళ్లకు అన్నం పెట్టడం, ఇబ్బందుల్లో వున్నవారికి సహాయపడడం వంటి కార్యాలన్నీ సేవా కార్యక్రమాలుగానే పరిగణిస్తాం. ఈ సేవా కార్యక్రమాల వెనుక మానవ సహజమైన జాలి, దయ, కరుణవంటి మానవతా భావాలే స్ఫూర్తిగా వుంటాయి.

దీనికి భిన్నగా మరోరకమైన సేవా కార్యక్రమాలను కూడా మనం చూస్తున్నాం. ఆదిమ మానవుడు విశ్వానికి కారణాన్ని అన్వేషించే క్రమంలో దైవభావాన్ని సృష్టించుకున్నాడు. ఆ దైవ భావానికి రూపాన్నిచ్చి దేవతా విగ్రహాలను సృష్టించుకున్నాడు. ఆ విగ్రహాలకోసం లక్షల సంఖ్యలో గుళ్లు, గోపురాలను నిర్మించాడు. వాటిలో దేవతా విగ్రహ మూర్తులను ప్రతిష్టించాడు. ఆ విగ్రహాలకు మంగళస్నానాలు, దీపధూపనైవేద్యాలు, అర్చనలు, అభిషేకాలు, వివాహాలు, ఊరేగింపులు, సుప్రభాతసేవలు, పవళింపుసేవలు అంటూ నిరంతర సేవాకార్యక్రమాలను కొనసాగిస్తూనే వున్నాడు. ఈ విగ్రహాలసేవే భగవంతుడిసేవగా భ్రమించాడు.



దేవుడికి మడిమాన్యాలంటూ వేలకోట్ల రూపాయల ఆస్తులు పోగుచేస్తున్నాడు. చివరికి దేవుడు, మతం, ఆచార వ్యవహారాలు, సేవా కార్యక్రమాలు అన్నీ వ్యాపారంగా మారిపోయాయి. దీన్ని అవకాశంగా తీసుకున్న ఒక వర్గం దేవుడిపేరుతో దోపిడీని కొనసాగిస్తున్నది. మతం ముసుగులో, సేవాకార్యక్రమాల ముసుగులో మఠాధిపతులు, పీఠాధిపతులు, బాబాలు, స్వామీజీలు అనేక రకాల అక్రమాలకు, చీకటి కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అయినా వీటిని అదుపుచేసేవారుగాని, ఆపేవారుగాని కనిపించడం లేదు. పైగా వాటిని ప్రోత్సహించడానికి మాత్రం రాజకీయ నాయకుల నుండి ప్రభుత్వాధిపతుల వరకు అందరూ పోటిపడుతున్నారు.

తమ కోరికలు తీరుస్తాడనుకున్న దేవుడు కడకు అతని విలాసాల కోసం తమను సాధనంగా వాడుకుంటున్న విషయం అర్థమవుతోంది. దర్శనంతో ప్రారంభమై అనేకరకాల పూజా కార్యక్రమాలతో ముగిసే సేవా కార్యక్రమాలన్నీ టిక్కెట్ల రూపంలో వ్యాపారంగా మారి ఆదాయాన్ని సమకూర్చిపెట్టే అద్భుత వనరులుగా మారిపోవడం అందరెరిగిన సత్యమే. పెట్టుబడి లేని వ్యాపారం దీనికి మించింది మరొకటి లేదు. ప్రజల అజ్ఞానమే ఈ వ్యాపారానికి పెట్టుబడి. దానికి మనదేశంలో కొదవలేదు.

సేవా కార్యక్రమాల గురించి చరిత్రలోకి వెళ్లి పరిశీలిస్తే, అవి వేల సంవత్సరాల నాడే రూపుదిద్దుకున్నట్లు విదితమవుతుంది. ప్రప్రథమంగా, సంఘటితంగా, క్రమశిక్షణాయుతంగా మానవసేవా కార్యక్రమాలను అమలుపరచిన ఘనత భారతదేశంలో క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో భావవిప్లవ మహోద్యమంగా నడిచిన బౌద్ధానికే దక్కుతుంది. సామాజిక సేవా కార్యక్రమాలను సాగించిన తొలి మిషనరీ మతం కూడా బౌద్ధమే. అయితే బౌద్ధులు మతతత్వవ్యాప్తికోసం సేవా కార్యక్రమాలను చేపట్టలేదు.

మానవ కల్యాణ్యాన్ని, మానవ శ్రేయస్సును కాంక్షించే బౌద్ధులు సేవా కార్యక్రమాలను చేపట్టినట్లు అర్థమవుతుంది. చెట్లు నాటించినా, చెరువులు తవ్వించినా ప్రజా సంక్షేమాన్నే దృష్టిలో పెట్టుకొని చేసినట్లు తెలుస్తుంది.

బౌద్ధంలోని మిషనరీ భావాన్ని అందిపుచ్చుకున్న క్రైస్తవం మధ్యయుగానంతరం విదేశాల్లో మత వ్యాప్తికోసం సాంఘిక సేవా కార్యక్రమాలను చేపట్టింది. భారతదేశంలో

అట్టడుగు కులాలకు చెందిన వారికి, అణగారిన వర్గాలవారికి క్రైస్తవ మిషనరీలు విద్య, వైద్యం వంటి సౌకర్యాలను అందించడం ద్వారా వారిని ఆకర్షించి తమ మతంలోకి మార్చుకోగలిగాయి. ఆనాటి నుండి ఈనాటివరకు మతమార్పిడి కోసం అన్ని మతాలు సాగిస్తున్న సేవా కార్యక్రమాలకు అంతు లేకుండాపోయింది. వేల కోట్ల రూపాయల ధనాన్ని వెదజల్లి అన్యమతాల వారిని తమమతాల్లోకి మార్చుకుంటూనేవున్నారు.

ఈ విధంగా ఏదో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష్యసాధనలో భాగంగానే సేవాకార్యక్రమాలను కొనసాగించే వాటిలో అనేక సంస్థలు వున్నాయి. చాలామంది వ్యక్తులూ వున్నారు. మతసంబంధమైన మఠాలు, పీఠాలతోపాటు, స్వయం సంఘాలు, సాంస్కృతిక సేవా సంఘాలు, సహకార సంఘాల వంటివి వున్నాయి. రాజకీయపార్టీలు చేపట్టే సేవా కార్యక్రమాలు కూడా ఈ కోవకు చెందినవే.

ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి, ప్రజలు పన్నుల రూపంలో కట్టే డబ్బుతో ప్రభుత్వాలు సంక్షేమ సేవా కార్యక్రమాలను చేపడుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ సేవా కార్యక్రమాలను చేపట్టాయి. వాటిలో ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక సేవా కార్యక్రమాలెన్నో వున్నాయి. అయినా, ఆశించిన ఫలితాలు మాత్రం సాధ్యం కాలేదు. దేశంలో ప్రజల దారిద్ర్యం అంతరించలేదు. నిరక్షరాస్యత, నిరుద్యోగం నిర్మూలన జరుగలేదు. విద్య, వైద్యం వంటి కనీసావసరాలే తీరలేదు. దీనికంతటికీ అవగాహనా రాహిత్యం, అవినీతి, చిత్తశుద్ధి లేకపోవడమే కారణంగా కనిపిస్తోంది.

ఇలా అంటున్నందువల్ల ఎవరూ సేవాకార్యక్రమాలను చేపట్టరాదనే భావంరాదు. దేశంలో సమస్యలకు కొదువలేదు. కోట్లాదిమంది ప్రజలు చాలా సమస్యలతో సతమతమవుతున్నారు. అందులో ఆకలి, దారిద్ర్యం వంటి ఆర్థిక సమస్యలేకాక అనారోగ్యం, నిరుద్యోగం, వరకట్నం, వ్యభిచారం వంటి సాంఘిక సమస్యలు, కులం, మతం, దైవం, సంప్రదాయం వంటి సాంస్కృతిక సమస్యలు వున్నాయి. స్త్రీ పురుష అసమానత్వం, తీవ్రవాదం, పర్యావరణ సమస్యలు, పతనమైపోతున్న మానవ విలువలు వంటి సమస్యలు చాలా వున్నాయి. ఈ సమస్యల నుండి ప్రజలను ఎవరు ఉద్ధరిస్తారు? ఎలా ఉద్ధరిస్తారు? అనేవి కీలకమైన ప్రశ్నలు.



అన్ని సమస్యలకు మా మతంలోనే పరిష్కారం లభిస్తుందని అన్ని మతాలు ప్రచారం చేసుకుంటున్నాయి. మాకు అధికారాన్ని కట్టబెడితే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని అన్ని రాజకీయ పార్టీలు వాగ్దానాలు చేస్తున్నాయి. ఎవరోవచ్చి, ఏదో చేస్తారని, తమ సమస్యలు పరిష్కరిస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ నిరీక్షణ అంతులేని నిరీక్షణగానే మిగిలిపోయింది.

సమాజంలోని సమస్యలకు హేతువాదులు, మానవవాదులు భిన్నమైన పరిష్కార మార్గాలను సూచిస్తున్నారు. సేవాకార్యక్రమాలు అవసరమైన వారికి వాటిని అందరూ అందించవలసిందే. వాటికి ఆస్తిక, నాస్తిక భేదాలతో సంబంధం లేదు. శారీరక, మానసిక వికలాంగులు, బాలలు, వృద్ధులు, రోగులు - ఇలాంటి వారికి సేవలు అవసరమవుతాయి. వారికి సేవలు అందించడానికి ఆస్తిక నాస్తిక తేడాలు పనికిరావు. హేతువాదులు, మానవవాదులు కూడా అటువంటి సేవాకర్యాక్రమాలను చేపడితే అందులో తప్పులేదు. ఎవరికి చేతనైన కార్యక్రమాలు వారు చేపట్టవచ్చు.

అయితే హేతువాదులు, మానవవాదులు సూచించే సామాజిక సమస్యల పరిష్కారమార్గమేమిటి? అని ప్రశ్నించుకుంటే సేవాకార్యక్రమాలు మాత్రం కాదు అని సమాధానం వస్తుంది.

సమాజం వ్యక్తుల సముదాయం. సమాజం బాగుండాలంటే సమాజంలోని వ్యక్తులు బాగుండాలని అర్థం. సమాజ నిర్మాతలైన వ్యక్తులు చైతన్యవంతులైతేనే సమాజం చైతన్యవంతమైనట్లు భావించాలి.

ప్రజాసమస్యలెన్ని వున్నప్పటికీ అన్నిటికీ మూలమైనది ఆయా సమస్యల గురించిన సరైన జ్ఞానం లేకపోవడమే. అంటే మానవుడు, సమాజం, ప్రకృతికి సంబంధించిన సరైన జ్ఞానం లేనపుడు వాటికి సంబంధించిన సమస్యలను కూడా సరిగా అర్థం చేసుకోలేము.

ప్రకృతి పరిణామక్రమంలో ఆవిర్భవించినవాడు మానవుడు. మానవులు పరస్పర అంగీకారంతో, సహకార భావంతో ఏర్పరచుకున్నదే సమాజం. సమాజానికి ముందే మనిషి వున్నాడు. మనిషికి ముందే ప్రకృతి వుంది. మానవుడు తన శ్రేయస్సు కోసం, సుఖసంతోషాల కోసం ఏర్పరచుకున్నట్టివే ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక

సంస్థలన్నీ. తాను సృష్టించుకున్న సంస్థలు తన ఆధీనంలో లేకుండాపోవడం ఒక వైపరీత్యమైతే, వాటికి తానే ఆధీనుడు కావడం మరోవైపరీత్యం.

మానవవాదంలో మానవుడే కేంద్రబిందువు. అటువంటి మానవుడిని దైవానికో, మతానికో, జాతికో, వర్గానికో, పార్టీకో అధీనుడిని చేయడం, వాటి సంక్షేమం, అభివృద్ధి కోసం మానవుడిని బలిచేయడం నేడు సర్వత్రా దర్శనమిస్తున్నది. అంటే సమిష్టికోసం వ్యక్తిని బలిచేయడం జరుగుతున్నది. ఇదంతా సమిష్టి మిథ్యావాదాల స్వభావమే. అందువల్ల ఏ పేరుతో కొనసాగినా సమిష్టి మిథ్యా వాదాలను మానవవాదం పూర్తిగా వ్యతిరేకిస్తుంది. నేడు మానవుడు ఏదోఒక సమిష్టి తత్వానికి బానిసగా మారిపోయాడు. దానికే తాను పూర్తిగా అంకితమైపోయి తన నిజస్వరూప స్వభావాలనే విస్మరించాడు.

తాత్వికంగా బానిస భావాలకు అలవాటుపడిన మనిషి తన నిజజీవితంలో ఎటువంటి పరిస్థితులలోనూ స్వతంత్రంగా వ్యవహరించలేడు. వ్యక్తిగత జీవితంలోను, సామాజిక జీవితంలోను స్వతంత్రంగా ఆలోచించలేడు. జగన్నాటకంలో తానొకపాత్రధారినని, జగన్నాటక సూత్రధారి ఎలా ఆడిస్తే అలా ఆడే మరబొమ్మలాంటి వాడినని తలుస్తాడు.

దీనికి భిన్నంగా మానవుడు తన జీవితానికి తానే కర్తనని భావించేది మానవవాదం. అందువల్ల తన భవిష్యత్తుకు, తన కార్యకలాపాలన్నిటికి తానే బాధ్యుడనని భావించేది మానవవాదం. మానవుడు పరిస్థితుల చేతిలో కీలుబొమ్మకాదని, ఆ పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకునేందుకు తనలోని వివేక సంకల్పాలతో కూడిన శక్తి సామర్థ్యాలను వినియోగించుకోగలడని మానవవాదం భావిస్తుంది.

ఈ విధంగా తాత్విక భావాలలో సమూలమైన మార్పును ఆశించేదే భావవిప్లవం. అటువంటి భావవిప్లవం కోసం కృషి సాగించేదే హేతువాద, మానవవాద ఉద్యమం. మానవజాతి చరిత్ర అంతా భావపోరాటాల చరిత్రే. ఆనాడు చార్వాకులు, బౌద్ధులు చేసింది భావవిప్లవ పోరాటమే. మనమీనాడు చేస్తున్నది భావవిప్లవ పోరాటమే. నేడు మనకు అందుబాటులో వున్న ఆధునిక విజ్ఞానం ఆనాడు వారికి లేకపోవడం ఒక్కటే స్థాయిలో వారికి మనకున్న వ్యత్యాసం.



మతాలు, మత విద్వేషాలు, మూఢ విశ్వాసాలు, మూఢాచారాలు, అధికార రాజకీయాలుగా అవతారమెత్తిన పార్టీరాజకీయాలు, అవి సాగిస్తున్న దోపిడీలు, అక్రమాలు, అన్యాయాలు, అవినీతి దేశాన్ని నిర్వీర్యం చేసి, అంధకారంలోకి నెట్టివేస్తున్నాయి. తీవ్రవాదం, ప్రాంతీయ విభేదాలు, హింస, మోసాలు, మనుషుల మనుగడకే ముప్పు తెస్తున్నాయి. భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

ఇటువంటి విపరీత, విపత్కర పరిస్థితులలో హేతువాదులు, మానవవాదులు, నాస్తికులు చేయవలసింది భావవిప్లవ పోరాటమేగాని సేవా కార్యక్రమాల ప్రచారం కాదు, కారాదు. అందువల్ల ఉద్యమానికి బాధ్యత వహించే ప్రతి ఒక్కరు ఈ విషయాన్ని అర్థం చేసుకోవలసిన అవసరం ఎంతయినా వుంది.

సంఖ్యాపరంగా అత్యంత స్వల్పంగా వున్న మనం ప్రాధాన్యతలను విస్మరించరాదు. నేత్రదానాలు, అవయవదానాలు, రక్తదానాల ప్రచారం కోసమో, ఎయిడ్స్ వ్యతిరేక ప్రచారాల కోసమో మనకున్న అత్యంత విలువైన స్వల్ప వనరులను, శక్తి సామర్థ్యాలను వెచ్చించడం వివేకవంతమైన చర్య అనిపించుకోదు. సమస్యల మూలాలలోకి వెళ్లి మనం కృషి చేయాలి.

సేవా కార్యక్రమాలను కీర్తికోసమో, మరోదానికోసమో చేస్తున్నవారు అనేకులున్నారు. నిస్వార్థంగా, నిజాయితీగా చేసేవారూ వున్నారు. మన ఉద్యమంలో అటువంటి వాటికి ప్రాధాన్యతలేదు, వుండదు.

సమాజంలోని వ్యక్తులు తాత్విక విప్లవం ద్వారా బానిస భావాల నుండి విముక్తులైనపుడు వారి సమస్యలను వారే పరిష్కరించుకునే శక్తి సామర్థ్యాలను సంతరించుకుంటారు. వారిని ఆ విధంగా తీర్చిదిద్దడానికి వారికి స్నేహితులుగా, తాత్వికులుగా, మార్గదర్శకులుగా వుండడమే హేతువాదుల, మానవవాదుల ప్రథమ కర్తవ్యంగా, ప్రధాన కార్యక్రమంగా వుండాలి.

కలిగించరాదు. సామాజిక శ్రేయస్సుకోసం స్వేచ్ఛపై స్వచ్ఛందంగా కొన్ని హేతువాద్ధమైన పరిమితులను విధించుకోవాలి.

మానవవాదంలో మరో ముఖ్యాంశం సెక్యులర్ నీతి. ప్రతి మనిషి ఇతరులపట్ల ఎలా ప్రవర్తిస్తున్నాడనే అంశంలోనే నీతి ఉత్పన్నమవుతుంది. ఇతరులు మన పట్ల ఏ

విధంగా ప్రవర్తించకూడదనుకుంటామో మనం ఇతరుల పట్ల ఆ విధంగా ప్రవర్తించకుండా వుండాలి. ఇదే నైతిక సూత్రానికి మూలం. ఇతరుల మనలను హింసించరాదు అనుకున్నపుడు మనం ఇతరులను హింసించకుండా వుండాలి. నీతి అనేది మానవుడి హేతుత్వంలో నుంచి ఏర్పడింది. అది జీవ పరిణామ క్రమంలో మానవులకు సంక్రమించింది. అందుకే అది సెక్యులర్ నీతి అవుతుంది. మానవుడు జ్ఞాన సంపన్నుడైన కొద్దీ అతని నైతిక విలువలు ఉన్నత ప్రమాణాలను అందుకుంటాయి. అతని స్వేచ్ఛాపరిధులు విస్తృతమవుతాయి.

లక్ష్య సాధనాల మధ్య సమన్వయముండాలనేది మానవవాదంలోని ముఖ్యసూత్రం. మంచి సాధనం ద్వారానే మంచి లక్ష్యాన్ని సాధించగలం గాని చెడుసాధనం ద్వారా మంచి లక్ష్యాన్ని చేరలేమంటుంది మానవవాదం. అంటే చెడు కార్యకలాపాలద్వారా సత్ఫలితాలను సాధించలేము. తప్పుడు విధానాలద్వారా, తప్పుడు పద్ధతుల ద్వారా సరియైన గమ్యాలను చేరుకోలేము.

మానవవాదం వ్యక్తికి అత్యంత ప్రాధాన్యాన్నిస్తుంది. అందువల్ల వ్యక్తి స్వేచ్ఛకు, శ్రేయస్సుకు భంగం కలిగించే వాటినన్నిటినీ అది నిరాకరించి, తిరస్కరిస్తుంది. వ్యక్తులే సమాజ నిర్మాతలు. వ్యక్తులకు భిన్నంగా, అతీతంగా సమాజాన్ని వూహించలేము. అందువల్ల సమాజ శ్రేయస్సు ఎల్లప్పుడూ వ్యక్తి శ్రేయస్సుతో ముడిపడి వుంటుంది. ఆ విధంగా ఒక సమాజం అభ్యుదయకరమైందా, కాదా అని నిర్ణయించాలంటే వాస్తవంగా ఆ సమాజంలో నివసిస్తున్న ప్రతి వ్యక్తి అభ్యుదయాన్ని కొలబద్ధగా తీసుకోవాలి. వ్యక్తులు ఏ మేరకు అభివృద్ధి చెందితే ఆ మేరకే ఆ సమాజం అభివృద్ధి చెందినట్లు భావించాలి.

మనుషులను కులాలవారీగా , మతాలవారీగా, వర్గాలవారీగా విభజించి వారి మధ్య విద్వేషాలను సృష్టించడం, ఆదేశాలను రెచ్చగొట్టడం అహేతుకం, అమానుషం. వీటిన్నిటికి అతీతంగా మనుషులంతా ఒక్కటే అనే సమానత్వ భావాన్ని, విశ్వజనీనతత్వాన్ని మానవవాదం ప్రోత్సహిస్తుంది. మనుషుల మధ్య పరస్పర సహకార భావాన్ని పెంపొందిస్తుంది. మన సుఖసంతోషాలు మన చుట్టూవున్న వారి సుఖసంతోషాలతో ముడిపడి వున్నాయని గుర్తించి, అందరి మధ్య ఐక్యతాభావాన్ని నెలకొల్పుతుంది. సమతా సమాజానికి నాంది పలికి, పునాదుల నేర్పరుస్తుంది.



మానవవాదం ప్రజాస్వామ్యభావాన్ని రాజకీయాల వరకే పరిమితం చేయదు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వమనే ప్రజాస్వామ్య భావాలను మానవుడి జీవన రంగాలన్నిటిలోను ప్రతిబింబించాలని ఆశిస్తుంది. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి వివేకవంతమైన విద్య ఒక్కటే సరియైన మార్గంగా భావిస్తుంది. ప్రజలు చైతన్య వంతులై తమ సమస్యలను తామే పరిష్కరించుకునేలా వారిని తీర్చిదిద్దుతుంది. అందువల్ల మానవవాదులంతా ప్రజలకు ధర్మకర్తలుగా, రక్షకులుగా వుండరు. మానవవాదులు ప్రజలకు స్నేహితులుగా, తత్వవేత్తలుగా, మార్గదర్శకులుగా మాత్రమే వుంటారు.

మనం రాజ్యాంగంలో ప్రతి పౌరుడు పాటించవలసిన ప్రాథమిక విధులను (Fundamental Duties) పొందుపరచుకున్నాం. అందులో అర్టికల్ 51 (ఎ) (హెచ్)లో ఇలా వ్రాసుకున్నాం.

It is the Fundamental duty of every citizen of India to develop scientific temper, humanism and the spirit of enquiry and reform.

అంటే శాస్త్రీయతత్వాన్ని, మానవవాదాన్ని, విచారణ మరియు సంస్కరణ శీలాన్ని పెంపొందించడం ప్రతి భారతీయ పౌరుడి ప్రాథమిక విధి. అయితే ఇంత స్పష్టంగా మనం రాజ్యాంగంలో పేర్కొన్నప్పటికి ఆచరణలో మాత్రం అందరం దీనికి విరుద్ధంగా ప్రవర్తించడం శోచనీయం.

అందరం శాస్త్రం అందిస్తున్న సకల సౌకర్యాలను హాయిగా అనుభవిస్తున్నాం. ఆచరణలో మాత్రం శాస్త్రీయతత్వానికి, శాస్త్రీయ దృక్పథానికి తిలోదకాలిస్తున్నాం. తద్విరుద్ధంగా మూఢ విశ్వాసాలను, అహేతుక భావాలను, అర్థం లేని ఆచారసాంప్రదాయాలను ప్రోత్సహిస్తున్నాం. అభ్యుదయానికి అడ్డుగోడలను సృష్టించుకుంటున్నాం. వందలవేల సంవత్సరాలు గడిచానా కృత్రిమమైన అహేతుకమైన కులమతాల ఊబి నుండి బయట పడలేక పోతున్నాం.

ఈ క్లిష్ట పరిస్థితుల నుండి బయటపడాలంటే హేతువాద భావాలతో కూడిన భావవిప్లవ మొక్కటే శరణ్యం. సమాజంలో ఏ మార్పు రావాలన్నా ముందుగా ఆ మార్పు మనుషుల మస్తిష్కాలలో రావాలి. అంటే ముందుగా మన భావాలలో సమూలమైన మార్పురావాలి. భావాలలో మార్పు రావడాన్నే భావ విప్లవమంటాం.

మనకెన్ని చట్టాలున్నా అవి సక్రమంగా అమలు కాకపోవడానికి కారణం మన భావాలలోనేవుంది. ఈ భావాలకు కారణ భూతమైన మన తాత్విక దృక్పథంలోనే ఉంది. అందువల్ల మనం ఆధునిక విజ్ఞానం అందించే తాత్విక దృక్పథాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని ముందుగా అలవరచుకోవాలి. అప్పుడే మన సామాజిక, సాంస్కృతిక జీవనంలో సరియైన మార్పులు చోటు చేసుకోగలవు. మనమంతా అటువంటి హేతువాద భావవిప్లవానికి, మానవవాద విలువలకై చిత్తశుద్ధితో, ఐక్యంగా కృషి చేద్దాం.

*(హేతువాది, జనవరి 2011)*

# నియంతృత్వ, మతానుకూల కమ్యూనిస్టులు హేతువాదులా?

**22**-9-2011 ప్రజాశక్తి దినపత్రికలో పి. ప్రభాకరరావుగారు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ''హేతువాదానికి, నాస్తికవాదానికి, హేతువాదులకు కమ్యూనిస్టు వాదులకు భేదం'' గురించి జనవిజ్ఞాన వేదిక నాయకులు, ''చెకుముకి'' పత్రికా సంపాదకులు ప్రొ॥ ఎ. రామచంద్రయ్యగారి వ్యాసం అచ్చయింది.

ఆ వ్యాసంలో హేతువాదం - హేతువాదుల గురించి, నాస్తిక వాదం - నాస్తికుల గురించి, కమ్యూనిజం - కమ్యూనిస్టుల గురించి, హేతువాదులకు - నాస్తికవాదులకు, హేతువాదులకు - కమ్యూనిస్టులకు మధ్యగల భేదం గురించి రామచంద్రయ్యగారు సరికొత్త భాష్యం చెప్పారు. అయితే ఆ భాష్యం అంతా సక్రమమైన అవగాహనతో కూడుకొన్నది కాదు. అందులో అనేక లోపాలున్నాయి. అవగాహనా రాహిత్యం వుంది. అది హేతువాదం మాత్రం కాదు. అదే జన విజ్ఞానమా?

రామచంద్రయ్యగారి వ్యాసంలో వెలిబుచ్చిన కొన్ని వింత భావాలను ఈ దిగువన యిస్తున్నాను. ఆయన కమ్యూనిస్టు వామపక్ష వ్యాఖ్యానాలను గమనించండి

నాస్తికవాదులనబడే వితండవాదులకన్నా ఇలా శాంతియుతమైన మత విశ్వాసాలున్న వారిపైనే వామపక్షవాదులకు గౌరవం ఎక్కువ.

ఆస్తికులు అనడం వేరు. ఆస్తికవాదులనడం వేరు. శాంతియుతమైన మత విశ్వాసాలున్నవాడే వామపక్ష వాదుల గౌరవానికి అర్హులు.

నాస్తికులు, నాస్తికవాదులు పూర్తిగా ఒకేరకం కాదు.

హేతువాద దృక్పథంతోనే నాస్తికులు ఏర్పడవచ్చును. కానీ హేతువాదులందరూ నాస్తికులు కారు. ప్రతి హేతువాదీ అభ్యుదయవాది కానక్కరలేదు. కానీ ప్రతి కమ్యూనిస్టు గొప్ప అభ్యుదయవాది.

శుద్ధ అభ్యుదయవాది, శుద్ధ హేతువాది, శుద్ధ నాస్తికవాది, శుద్ధ సంస్కరణవాది సమాజాన్ని, చరిత్రను, మానవ భవితను, నాగరికతను విడివిడి అధ్యాయాలుగా మాత్రమే చూస్తారు. ఆ అధ్యాయాల ఆధారంగానే వారి కార్యాచరణ వుంటుంది. మూలాల్లోకి వెళ్ళరు. అధ్యాయాల సమాకలనాన్ని (integrated) తీసుకోరు. మొత్తం పుస్తకంలోని కథా వస్తువును, నీతిని గ్రహించరు.

కమ్యూనిస్టు సమాజాన్ని నాగరికతను, మానవదైనందిన గమనాన్ని గతితార్కిక భౌతికవాదపు (Dialectical materialistic) దృక్కోణంలో చూస్తారు.

మానవ సంబంధాలన్నీ ఉత్పత్తి సంబంధాలుగా (Productive relations) గ్రహిస్తారు. ఆర్థిక, రాజకీయ సంబంధాలను నిర్దేశిస్తాయనీ, ఆ ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి సాధనాలు ఎవరి అజమాయిషీలో వున్నాయన్న సత్యం ఆధారంగా ఉంటాయనీ ఆకళింపు చేసుకొంటారు.

వర్గ దోపిడీలో భాగంగానే పీడిత వర్గం పీడిత వర్గాన్ని వివిధ రూపాల్లో కార్యశూన్యతను ప్రోత్సహించేందుకు పన్నాగాలు చేస్తుందనీ, మతం కూడా అందులో భాగమనీ గ్రహిస్తారు.

గతితార్కిక భౌతిక వాదం అంటే అన్ని శాస్త్రాల తుది తాత్పర్యం (Consolidated crux of all sciences) అంటే విజ్ఞానశాస్త్రాల సమిష్టి సారమన్నమాట.

విజ్ఞాన శాస్త్రం కళ్ళద్దాల్లోంచి ప్రపంచాన్ని పరిశీలించే రాజకీయ వారసత్వం, సామాజిక జీవనం బహుశా కమ్యూనిస్టులకు తప్ప మరే ఇతర రాజకీయ పార్టీలకు గానీ, సంస్థలకుగానీ లేదు.

ఎందుకని ప్రజలు శాస్త్రీయ దృక్పథం కోల్పోయారు? వంటి ప్రశ్నలకు పూర్తిస్థాయి హేతువులతో 'ఇందుకని' అంటూ జవాబు ఇవ్వగలిగిన కమ్యూనిస్టులు హేతువాదులకన్నా ఎన్నో రెట్లు అగ్రగణ్యులు.

జబ్బుల్ని నయం చేసేవి మిగిలిన వాదాలు కాగా జబ్బులేలేని ఆరోగ్యాన్ని ఇచ్చే కృషి కమ్యూనిస్టులది.

ఈ భావాలన్నీ పూర్తిగా లోపభూయిష్టమైనవే. తప్పు అవగాహనతో కూడుకున్నవే. హేతువిరుద్ధమైనవే. హేతువాదాన్ని అపార్థం చేసుకోవడంవల్లనే ఆయన అలాంటి



అభిప్రాయాలకు చేరారు. నాస్తికత్వాన్ని వితండవాదంగా పేర్కొనే జనవిజ్ఞానులు మతవాదులు తప్ప అభ్యుదయవాదులు కాలేరు.

హేతువాదం ఒక సిద్ధాంతం కాదు. ఒక వాదమూ కాదు. అదొక ఆలోచనా విధానం. జ్ఞాన సాధనం. అన్ని సంఘటనలకు మూల ప్రకృతి అయినట్లే అన్ని సిద్ధాంతాలకు, వాదాలకు ఎంతో కొంత మూలం హేతువాదమే అవుతుంది.

ప్రకృతి నియమబద్ధమైనది. (Law Governed) అన్ని సంఘటనలు ప్రకృతి నియమాలను అనుసరిస్తాయి. అందువల్లనే ఆయా సంఘటనలకు, లేదా వస్తువులకు సంబంధించిన జ్ఞానం మనకు కలుగుతుంది.

నియమబద్ధమైన ప్రకృతిలో కోట్లాది సంవత్సరాల పరిణామ క్రమంలో మానవుడు అవతరించాడు. ఆ క్రమంలోనే ప్రకృతిలోని నియమబద్ధతను మానవుడు సంతరించుకున్నాడు. దాన్నే హేతుత్వం అంటాం. అందువల్ల హేతువు జన్మస్థానం ప్రకృతి నియమమని తెలుస్తుంది.

ఈ విధంగా ప్రకృతిలోని నియమబద్ధతే మానవుడి స్థాయిలో హేతుత్వంగా భాసిస్తున్నది. హేతుత్వం పనిచేయడం వల్లనే మానవుడు తన చుట్టూ జరుగుతున్న అనేకానేక సంఘటనలకు కారణాలేమిటని ప్రశ్నించుకొంటున్నాడు. ఆ ప్రశ్నలకు సమాధానాలను అన్వేషిస్తున్నాడు. నిర్ణయాలకు రాగలుగుతున్నాడు. అతని పరిశీలన, జ్ఞానం, అనుభవం పెరుగుతున్నకొలది తన నిర్ణయాలను పునర్విమర్శించు కొంటున్నాడు. నిర్ణయాలను ఆ మేరకు సవరించుకుంటున్నాడు. తనలోని పాత భావాలను, అభిప్రాయాలను ఆ మేరకు మార్చుకొంటున్నాడు. ఈ క్రమంలో అతడు అవలంబిస్తున్న విధానమే హేతువాద విధానం. ఆలోచించే వైఖరే హేతువాద వైఖరి.

అందువల్ల హేతువాదం ఒకరు కనిపెట్టిన సిద్ధాంతం కాదు. అది ప్రకృతి నుండి సంక్రమించిన గుణమే. హేతువాదతత్వం మనుషులందరిలోనూ ప్రాయికంగా వున్న జీవతత్వమే. అందుకే మనుషులందరూ హేతువాదులవుతున్నారు. అంటే ప్రతి మనిషీ తనలో సహజ సిద్ధంగా వున్న హేతుత్వాన్ని వినియోగించుకోగల శక్తి సామర్థ్యాలను కలిగి వున్నాడని భావం.

హేతువాదం ఆవశ్యంగా భౌతికవాదానికి, నాస్తికత్వానికి దారితీస్తుంది. విశ్వమంతా భౌతిక వాస్తవికతగానే దర్శనమిస్తుంది. అందువల్ల జ్ఞానమంతా భౌతిక వాస్తవికతను గురించిన జ్ఞానమే. అభౌతికత అనేది లేదు. అందువల్ల మతస్తులు భావించినట్లు అభౌతిక శక్తులకు, అతీత శక్తులకు అవకాశమే లేదని తెలుస్తుంది. అందువల్ల హేతువాదం ఆవశ్యంగా భౌతికవాదంగా, భౌతిక వాస్తవిక వాదంగా తేలుతుంది. అది భావవాదానికి, ఆస్తికవాదానికి, మతవాదానికి, ఆధ్యాత్మికవాదానికి, కర్మవాదానికి, మార్మికవాదానికి, వ్యతిరేకంగా నిలుస్తుంది.

హేతువాదం సర్వ విషయాలకూ, సర్వకాలాలకూ వర్తిస్తుంది. ఈ రకంగా అన్ని సిద్ధాంతాలకూ, వాదాలకూ హేతువాదమే పునాది అవుతుంది. ఆయా సిద్ధాంతాల మంచి చెడులను బేరీజులేయడానికి హేతువాదమే ప్రమాణమవుతుంది. దీనికి భిన్నంగా హేతువాదాన్ని బేరీజు వేయడానికి మరే సిద్ధాంతమూ ప్రమాణం కాజాలదు.

హేతువాదాన్ని వివిధ విషయాలకు సంబంధించినపుడు పలురకాల ఫలితా లొస్తాయి. ఆ క్రమంలో హేతువాదాన్ని దైవభావానికి సంధించినపుడు ఆస్తికత్వం ఎగిరిపోయి, నాస్తికత్వం సిద్ధిస్తుంది. అందువల్ల నాస్తికత్వమనేది హేతువాదంలో తొలిమెట్టు మాత్రమే. నాస్తికత్వానికి హేతువాదమే జీవగర్ర అవుతుంది. కావున హేతువాదులందరూ ఆవశ్యంగా నాస్తికులవుతారు.

రామచంద్రయ్యగారు భావించినట్లు హేతువాదులందరూ నాస్తికులు కాదనడం, నాస్తికత్వం వైతండికమనడం శుద్ధ తప్పు. 'దైవం వున్నట్లు 'శాస్త్రీయపద్ధతి' (method of science) ప్రకారం రుజువైతే దైవ విశ్వాసాన్ని మనం ఆమోదించాలని హేతువాదం అంటుంది' అన్నారు వారు. శాస్త్రీయ పద్ధతి ప్రకారం రుజువైన దాన్ని ఆమోదించి స్వీకరిస్తుంది హేతువాదం. అయితే శాస్త్రీయ పద్ధతి ప్రకారం దైవం వున్నట్లు రుజువు కావడానికి అవకాశమే లేదంటుంది ఆధునిక విజ్ఞాన శాస్త్రం. ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేకుండా కేవలం వూహాపోహలమీద, విశ్వాసాల మీద ఆధారపడింది దైవభావం. భౌతిక వాస్తవికతతో సంబంధం లేకుండా అభౌతిక, అతీతత్వాలపై ఆధారపడేది దైవభావం. కావున ఏనాటికైనా దైవం ఉన్నట్లు రుజువు కాదు, కాజాలదు. అలా అవుతుందనుకోవడం, అవడానికి అవకాశం వుందనుకోవడం



ఆధునిక విజ్ఞానశాస్త్రాన్ని అపార్థం చేసుకోవడమే అవుతుంది. హేతువాదాన్ని, భౌతిక వాదాన్ని సక్రమంగా అర్థం చేసుకోకపోవడమవుతుంది.

'ప్రతి హేతువాదీ కమ్యూనిస్టు కాదు కానీ, ప్రతి కమ్యూనిస్టూ గొప్ప హేతువాది' అనీ, ప్రతి హేతువాదీ అభ్యుదయవాది కానక్కరలేదు కానీ, ప్రతి కమ్యూనిస్టూ గొప్ప అభ్యుదయవాది' అనీ సూత్రీకరించారు రామచంద్రయ్యగారు.

అవును. ఏ హేతువాదీ కమ్యూనిస్టు కాదు. కమ్యూనిస్టు అయినవాడు హేతువాది కాజాలడు. హేతువాదం జాతి కుల మత భేదాలతోపాటు వర్గ భేదాన్నీ, వర్గ వాదాన్నీ తిరస్కరిస్తుంది. నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తుంది. అందువల్ల కార్మిక వర్గ నియంతృత్వాన్ని ఆమోదించే కమ్యూనిస్టులు ఏరకంగానూ హేతువాదులు కాజాలరు. కమ్యూనిస్టులు గొప్ప హేతువాదులనుకోవడం హేతువాద స్వరూప స్వభావాలను సక్రమంగా అర్థం చేసుకోకపోవడమే.

మానవుడి శ్రేయస్సుకు, సంక్షేమానికి, స్వేచ్ఛాసంకల్పాలకు విలువనిచ్చి, వాటిని సాధించడానికి ఉపయోగపడేది అభ్యుదయమవుతుంది. అంతేగాని వర్గం పేరుతో, ఆర్థిక సమానత్వాన్ని ఎరజూపి, కార్మిక వర్గ రాజకీయ నియంతృత్వాన్ని స్థాపించే కమ్యూనిస్టు సిద్ధాంతం పూర్తిగా హేతువాద వ్యతిరేకమైనదే.

శుద్ధ అభ్యుదయవాది, శుద్ధ హేతువాది, శుద్ధ నాస్తికవాది, శుద్ధ సంస్కరణవాది సమాజాన్ని, చరిత్రను, మానవ భవితను, నాగరికతను విడివిడి అధ్యాయాలుగా మాత్రమే చూస్తారని, మూలాల్లోకి వెళ్ళరని, మొత్తాన్ని గ్రహించరని ఆరోపించారు రామచంద్రయ్యగారు.

అదేమిటి? ప్రతి కమ్యూనిస్టూ గొప్ప అభ్యుదయవాది అని సర్టిఫికెట్ ఇచ్చిన రామచంద్రయ్యగారు హేతువాద, నాస్తికవాదులతోపాటు అభ్యుదయవాది కూడా సమాజాన్ని చరిత్రను సరిగా అర్థం చేసుకోలేదంటున్నారు. గతితర్కమంటే ఇదేనేమో!

కమ్యూనిస్టులు సమాజాన్ని, నాగరికతను, మానవదైనందిన గమనాన్ని గతితార్కిక భౌతిక వాదపు (Dialectical materialistic) దృక్కోణంలో చూస్తారని సరిగానే చెప్పారు రామచంద్రయ్యగారు. కమ్యూనిస్టు సిద్ధాంతంలోని ప్రధాన లోపం కూడా గతి తార్కిక భౌతిక వాదమే అనే విషయాన్ని ముందుగా అర్థం చేసుకోవాలి.

గతితర్కమనేదాన్ని జర్మన్ భావవాద తత్త్వవేత్త హెగెల్ నుండి స్వీకరించాడు కారల్‌మార్క్సు. తలక్రిందులుగా వున్న గతితార్కిక భావవాదాన్ని తిరగతిప్పి దాని కాళ్ళపై నిలబెట్టడం ద్వారా గతితార్కిక భౌతిక వాదమైందని వివరణ కూడా ఇచ్చాడు మార్క్సు. వైరుధ్యాల తర్కమే గతితర్కం. 'యాంటీడూరింగ్', 'డయలెక్టిక్స్ ఆఫ్ నేచర్' అనే గ్రంథంలో ఏంగిల్స్ గతి తర్కాన్ని వివరించాడు. ఏంగిల్స్ గతి తార్కిక సూత్రాలను మూడుగా తేల్చాడు.

1) పరిణామాత్మక, గుణాత్మక పరస్పర పరిణామాల సూత్రం.

2) వైరుధ్యాల అంతస్సంగమ సూత్రం.

3) అభావ అభావ సూత్రం (Negation of negation)

ఈ సూత్రాలను జీవశాస్త్రం, గణిత శాస్త్రం, తత్వశాస్త్రం వంటి వాటికి, చరిత్రకు అన్వయించి వాటి పర్యవసానాలు ఎలా వుంటాయో కూడా వివరించారు. ఆ వివరణలన్నీ ఆయా శాస్త్రాలను అపార్థం చేసుకోవడంవల్ల సాధ్యమైనవే. గతితార్కిక సూత్రాలేవీ శాస్త్రీయమైనవి కావు. అందులో ఏ ఒక్క సూత్రాన్నీ ఆధునిక విజ్ఞానశాస్త్రాలు ఆమోదించవు.

అటువంటి గతితార్కిక భౌతిక వాదాన్ని "అన్ని శాస్త్రాల తుది తాత్పర్యమని (consolidated crux of all sciences), విజ్ఞానశాస్త్రాల సమిష్టిసారమని (Extract of sciences)" భావించడం విజ్ఞానశాస్త్రాలను అపహాస్యం చేయడమే అవుతుంది. హేతు విరుద్ధమైన గతితర్కాన్ని మతిలేని తర్కంగా భావించాలి. అయితే కమ్యూనిస్టులకు మాత్రం ఈ మతిలేని గతితర్కమే గతయింది.

మానవ సంబంధాలన్నీ ఉత్పత్తి సంబంధాలనీ, ఉత్పత్తి సంబంధాలే ఆర్థిక, రాజకీయ సంబంధాలను నిర్దేశిస్తాయనీ, ఆ ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి సాధనాలు ఎవరి అజమాయిషీలో వున్నాయన్న సత్యం ఆధారంగా వుంటాయనీ కమ్యూనిస్టుల సిద్ధాంతం.

అదేవిధంగా భౌతిక పరిస్థితులే అన్నిటిని నిర్ణయిస్తాయని చెప్పిన కమ్యూనిస్టు సిద్ధాంతం ఆ భౌతిక పరిస్థితులను ఆర్థిక పరిస్థితులకు పరిమితం చేసింది. ఆ విధంగా



అది ఆర్థిక నియతివాదం (Economic determinism)గా మారింది. సమాజానికి ఆర్థిక వ్యవస్థ పునాదిగా వుంటుందని, రాజకీయాలు, మతాలు, భావోద్యమాలు వగైరా అన్నీ ఆర్థిక పునాది మీద ఏర్పడిన ఉపరితల అంశాలనీ కమ్యూనిస్టు సిద్ధాంతం చెబుతుంది.

అయితే కమ్యూనిస్టులు చెబుతున్న ఈ సిద్ధాంతాలన్నీ తప్పని చరిత్ర రుజువు చేసింది. మతాలుగాని, భావోద్యమాలుగాని ఆర్థిక పునాది మీద ఏర్పడిన ఉపరితల అంశాలు కావు. ఆనాటి బౌద్ధం నుండి ఈనాటి హేతువాదం దాకా కొనసాగిన భావోద్యమాలేవీ ఆర్థిక పునాది నుండి ఏర్పడలేదని ఎవరికైనా అర్థమవుతుంది. కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రకారం ఆర్థికానికి లోబడి వుండవలసిన రాజకీయాలు ఆర్థికాంశలనే నిర్దేశించి నియంత్రిస్తున్నాయి. రాజకీయాధికారానికి ఆర్థికాధికారం వూడిగం చేస్తోంది.

ఈ విధంగా కమ్యూనిస్టు సిద్ధాంతం తప్పుల తడికల సిద్ధాంతంగా మాత్రమే మిగిలిపోయింది. కమ్యూనిస్టులు చెబుతున్నవేవీ ఆచరణలో రుజువు కాలేదు. మార్క్సు వూహించిన విధంగా పెట్టుబడిదారీ సమాజాల్లో కార్మికవర్గ విప్లవాలు విజయవంతం కాలేదు. దానికి పూర్తిగా భిన్నంగా జరిగింది. రాజ్యం అంతరించిపోలేదు. సరికదా చాలా శక్తివంతంగా తయారైంది. వర్గపోరాటాల ఫలితంగా వర్గరహిత సమాజం ఏర్పడలేదు. చారిత్రక అనివార్యంగా కార్మిక విప్లవాలు జరిగి, కార్మికవర్గ నియంతృత్వాలు ఏర్పడలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే కమ్యూనిస్టు సిద్ధాంతాలలో పేర్కొన్నవేవీ జరగలేదు. అవి జరిగేవి కావు.

ఈ విధంగా నియంతృత్వాన్ని ప్రతిపాదించే కమ్యూనిస్టు సిద్ధానితానికీ స్వేచ్ఛావాదంగా వున్న హేతువాదానికి సామ్యమేలేదు. అన్నటినీ వర్గ దృక్పథంతో చూసే కమ్యూనిస్టు సిద్ధాంతానికీ, మానవులను జాతి కుల మత వర్గాది సంకుచిత వైఖరికీ భిన్నంగా సమానత్వ భావనతో చూసే హేతువాదానికీ పొంతనలేదు. లక్ష్యాన్ని సాధించడానికి ఎటువంటి తప్పుడు మార్గాలను అనుసరించినా తప్పు లేదనే కమ్యూనిస్టు సిద్ధాంతానికి, మంచి లక్ష్యాన్ని సాధించాలంటే మార్గం కూడా మంచిదై వుండాలని భావించే హేతువాదానికి పోలికలేదు ఉన్నదంతా వైరుధ్యమే.

కావున ఏ విధంగా చూసినా కమ్యూనిస్టు సిద్ధాంతం హేతువాదం కంటె గొప్పదని భావించడానికి అవకాశమే లేదు. 'కమ్యూనిస్టులు హేతువాదులకన్నా ఎన్నో రెట్లు అగ్రగణ్యులని' ప్రగల్భించడం వారి అవగాహనారాహిత్యానికి నిదర్శన మవుతుంది.

నాస్తికత్వం, హేతువాదం, మానవవాదం వంటి అంశాలపై లోగడ పాతిక, ముప్ఫయి సంవత్సరాల క్రితం రంగనాయకమ్మ, సి.వి. వంటి కమ్యూనిస్టుల మధ్య వ్యతిరేకంగా, అనుకూలంగా వాదోపవాదాలు చెలరేగాయి. ఆ సందర్భంగా రంగనాయకమ్మగారు 'నాస్తికవాదం, హేతువాదం, నవ్యమానవవాదం', 'నీడతో యుద్ధం' అనే రెండు పుస్తకాలు రాశారు. వాటికి సమాధానాలుగా సి.వి.గారు' హేతువాద నాస్తికోద్యమం - రంగనాయకమ్మకు సమాధానం', 'హేతువాద నాస్తికోద్యమం - రంగనాయకమ్మకు మళ్ళీ సమాధానం' అనే పుస్తకాలు రాశారు.

వారిరువురి వాదాలను ఖండిస్తూ 'హేతువాదం - మార్క్సిజం' అనే పుస్తకాన్ని హ్యూమనిస్టు దృక్పథంతో నేను వ్రాశాను. అంతేకాక మార్క్సిజం, హ్యూమనిజం, హేతువాదం, నాస్తికత్వం మీద రావిపూడి వెంకటాద్రిగారు అనేక గ్రంథాలు రాశారు. ఆ పేర్లతో విడివిడిగా నాలుగు సంపుటాలు కూడా వెలువడ్డాయి. పూర్తి అవగాహనకు పైన పేర్కొన్న అన్ని గ్రంథాలను సంప్రదించవచ్చు.

హేతువాదానికి, నాస్తికవాదానికి, హేతువాదులకు, కమ్యూనిస్టువాదులకు వున్న భేదం అర్థం కావాలంటే ఆయా వాదాల తాత్విక నేపథ్యం ముందుగా అర్థం కావాలి.

అన్ని వాదాలకు పునాదిగా వుండే హేతువాదానికి లక్ష్యం మానవవాదం. మానవవాదం మానవుడిని కేంద్రస్థానంలో నిలిపి, అత్యంత విలువనిచ్చేది. మానవుడి శ్రేయస్సుకు, స్వేచ్ఛకు ప్రాధాన్యతనిచ్చేది. అతని సంకల్ప వివేకాలకు, భావాలకు, నీతికి విలువనిచ్చే సిద్ధాంతం.

ఆధునిక విజ్ఞానశాస్త్రాలు పునాదిగా గల మానవవాదమే నేటి ప్రపంచసమాజం ఎదుర్కొంటున్న సామాజిక, అర్థిక, రాజకీయ సమస్యలకు సరియైన పరిష్కార మార్గాలను సూచించగలదు. మౌలికంగా మానవుడి భావాలలో సమూలమైన



మార్పురానిదే సమాజంలోని ఏ రంగంలోనూ ఆశించిన మార్పులు సాధ్యంకావు. అందుకే మానవులు మతభావాలలో, మూఢవిశ్వాసాలలో చిక్కుకొని వున్నంతకాలం వాస్తవాలను గ్రహించలేరు. అభ్యుదయాన్ని సాధించలేరు. అందుకే హేతువాద భావాలతో కూడిన భావవిప్లవమే నేటి తక్షణావసరమని గుర్తించాలి. అటువంటి తాత్విక భావోద్యమాలకై కృషి చేస్తున్న హేతువాదులు, నాస్తికవాదులు, మానవవాదులు నిస్సంశయంగా నిజమైన అభ్యుదయవాదులవుతారు.

గతితార్కిక చట్రంలో చిక్కుకొని, ఆర్థిక నియతివాదాన్ని నమ్మి వర్గపోరాటాలను కొనసాగిస్తూ, రాజకీయాధికారాన్ని కైవసం చేసుకోడానికి నానారకాల ఎత్తుగడలను అనుసరిస్తూ వస్తున్న కమ్యూనిస్టు పార్టీలు ప్రజలకు, సిద్ధాంతానికి తిలోదకాలిచ్చి, కాలగర్భంలో కలిసిపోతున్నాయనేది కాదనలేని వాస్తవం. రామచంద్రయ్యగారితో సహా కమ్యూనిస్టులందరూ ఈ వాస్తవాన్ని గుర్తించి, ఆమేరకు తమ భావాలను మార్చుకోగలరని ఆశిద్దాం.

*(హేతువాది, నవంబర్ 2011)*

# హేతువాదం - మానవవాదం

"Knowing is a matter of logically tracing the lines of physical casuality from the contents of immediate experience outwards. Percepts are purely empirical entities. Concepts are synthetic. The former are automatically given. The latter are consciously constructed. Knowledge is a conceptual scheme born out of the insight into the nature of things., gained through critical examination, rational coordination and logical deduction of perpetual data." M.N.Roy. In science and philosophy.

'రేషనలిజం' అనే ఇంగ్లీషు పదానికి సమానార్థకంగా తెలుగులో 'హేతువాదం' అనే పదాన్ని వాడుతున్నాం. హేతువాదమనేది విస్తృతమైన అర్థాన్నిచ్చేపదం. నిజానికది వాదమూ కాదు. సిద్ధాంతమూ కాదు. అదొక ఆలోచనా విధానం. మనుషులందరిలోను ప్రతిబింబిస్తున్న మానసికవైఖరి.

విశ్వం అనంతం, నిత్యపరిణామశీలం, నియమబద్ధం. విశ్వ పరిణామ క్రమలో ఏర్పడిన సూర్యకుటుంబంలో భూగ్రహ మొకటి. దాదాపు 460 కోట్ల సంవత్సరాలకు పూర్వం ఏర్పడిన భూమి సుమారు వంద కోట్ల సంవతర్సరాలకు పైగా నిర్జీవ పదార్థ పరిణామ దశలోనే వుండిపోయింది. భూమి మీద వున్న సానుకూల పరిస్థితుల వల్ల సుమారు 350 కోట్ల సంవత్సరాల క్రితం సముద్ర జలాలపై ఆదిమ జీవం ఏర్పడినట్లు ఆధునిక విజ్ఞానశాస్త్రం ధ్రువపరిచింది.

ఆ విధంగా భూమి మీద జీవావిర్భావం జరిగిన తరువాత జీవ పరిణామం కొత్త పుంతలు తొక్కింది. అమిబా వంటి ఏకకణ జీవుల నుండి ప్రారంభమైన జీవపరిణామం లక్షల రకాల వృక్షజాతులు, జంతు జాతుల ద్వారా ప్రయాణించి, చివరకు కొన్ని లక్షల సంవత్సరాల క్రిందట హోమోసెపియన్స్ అనే మానవ జాతి ఆవిర్భావం వరకు కొనసాగింది.

ఈ క్రమంలోనే విశ్వంలోని నియమబద్ధత (Law governdress) జీవులలో ప్రవేశించింది. అదే మానవుడిలో హేతుత్వంగా (Rationality) భాసిస్తున్నది. హేతుత్వం



జంతువులలో సహజాతాలు (Instincts) గాను, మానవుడిలో విచక్షణ రూపంలోను ప్రతిబింబిస్తున్నది. అందుకే మనుషులందరూ హేతువాదులే అవుతున్నారు.

మన చుట్టూవున్న ప్రకృతిలో, పరిసరాలలో నిరంతరం జరుగుతున్న పరిణామాన్ని మన సౌలభ్యం కోసం సంఘటనలుగా (events) విభజించుకుంటున్నాం. వాటిని కార్యకారణాల రూపంలో అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాం. ఈ క్రమంలోనే అందరం హేతువాదాన్ని అవలంబిస్తుంటాం.

హేతువాదాన్ని గురించి తెలుసుకోడానికి, దాని స్వరూప స్వభావాలను గురించి తెలుసుకోడానికి ముందుగా దాని నిర్వచనాన్ని తెలుసుకోవాలి. హేతువాద నిర్వచనాలలో బ్రిటిష్ రేషనలిస్ట్ ప్రెస్ అసోసియేషన్ వారిచ్చిన నిర్వచనం సమంజసంగా, అత్యుత్తమంగా కనిపిస్తుంది. 1899వ సంవత్సరంలో వారు హేతువాదాన్ని ఈ విధంగా నిర్వచించారు.

"Rationalism may be defined as the mental attitude which unreservedly accepts the supremacy of reason and aims at establishing a system of philosophy and ethics verifiable by experience and independent of all arbitrary assumptions or authority".

"హేతువు సర్వాధిక్యాన్ని నిర్నిబంధంగా ఆమోదించే మానసిక వైఖరి. అన్ని అహేతుక భావాలకు ప్రమాణాలకు దూరంగా వుండి, అనుభవం ద్వారా మాత్రమే నిర్ధారణ చేసుకోడానికి వీలయిన తత్వజ్ఞానాన్ని, నీతి శాస్త్రాన్ని నిర్మించుకోవడమే దాని లక్ష్యం" అని హేతువాదాన్ని నిర్వచించవచ్చు.

ఈ నిర్వచనంలో మూడు మౌలికమైన అంశాలున్నాయి. మొదటిది హేతువు యొక్క సర్వాధిక్యతను ఎటువంటి షరతులు, నిబంధనలు లేకుండా ఆమోదించే మానసిక వైఖరి. రెండవది అనుభవం ద్వారా మాత్రమే నిర్ధారణ చేసుకోడానికి వీలయిన తత్వజ్ఞానాన్ని, నీతి శాస్త్రాన్ని నిర్మించుకోవడం. మూడవది అన్ని రకాల అహేతుక భావాలకు, నిరంకుశ విధానాలకు దూరంగా వుండడం.

ప్రాథమికంగా మనుషులందరూ హేతువాదులే అన్నపుడు మనుషులందరిలోను హేతువును సమర్థవంతంగా వినియోగించగల శక్తి సామర్థ్యాలున్నాయని భావం. అయితే మన సమాజంలో మన చుట్టూవున్న ఆచార సాంప్రదాయాలు మనలను తరతరాలుగా

ప్రభావితం చేస్తున్నందువల్ల మనం వాటికి బందీలయిపోతున్నాం. బానిసలుగా మారుతున్నాం. మనలో సహజసిద్ధంగా వున్న హేతుత్వాన్ని పని చేయనివ్వకుండా నిద్రపుచ్చుతున్నాం. ఆ విధంగా హేతువాదానికి తిలోదకాలిచ్చి అహేతుకమైన వాటిని ఆదరించి, ఆచరిస్తున్నాం.

ఈనాడు సమాజంలో అన్నిరంగాలలో మూఢ విశ్వాసాలు విలయతాండవం చేస్తున్నాయి. దానికి కారణం మనమంతా మనలోవున్న హేతుత్వాన్ని సక్రమంగా వినియోగించుకోకపోవడమే. హేతువాదం సర్వవిషయాలకు వర్తించే అంశమే. అయితే ఈనాడు కొందరు హేతువాదాన్ని కొన్ని విషయాలకే పరిమితం చేసి సంకుచిత పరుస్తున్నారు. మరి కొందరు హేతువాదాన్ని నాస్తికత్వంగా పరిగణిస్తున్నారు. అంతవరకే పరిమితం చేస్తున్నారు.

వాస్తవానికి హేతువాదం చాలా విస్తృతమైనది. దానికి పరిధులను నిర్ణయించి, పరిమితులను విధించలేము. ఆది మానవుడి నుండి ఆధునిక మానవుడిదాకా కొనసాగిన లక్షల సంవత్సరాల ప్రయాణంలో మానవుడి అభ్యుదయానికి దోహదం చేసింది అతనిలోని హేతుత్వమే కాని మరొకటి కాదు. అదే అతనిలోని వివేకానికి, విచక్షణాజ్ఞానానికి పునాదిగా మారింది.

మానవుడు ఒకనాడు తనకు అంతుపట్టని, అర్థంకాని అనేక అంశాలకు కారణంగా అనేక మంది దేవుళ్లను, అతీత శక్తులను వూహించి, సృష్టించుకున్నాడు. తదనంతరం తన పరిశీలనలో, పరిశోధనలో, అనుభవంలో తేలిన వాస్తవాలకు అనుగుణంగా తన అభిప్రాయాలను సవరించుకుంటూ, మార్చుకుంటూ వచ్చాడు. ఇది వేలాది సంవత్సరాలుగా మానవ జాతిలో కొనసాగుతున్న ప్రక్రియ. అదే హేతువాద విధానం.

ఇందుకు భిన్నంగా నూతన సత్యాల అవిష్కరణ జరిగిన తరువాత కూడా వాటిని ఆమోదించకుండా వుండడం, ఆ మేరకు తమ అభిప్రాయాలలో, ఆలోచనలలో మార్పులు చేసుకోకపోవడం వల్ల పాత భావాలు వ్యవస్థీకరణ పొందుతున్నాయి. అంతేగాక ఆ భావాలు అభ్యుదయానికి అడ్డు గోడలుగా మారుతున్నాయి.

ఒకపప్పుడు విశ్వానికి భూమే కేంద్రమని భావించారు. తరువాత కోపర్నికస్ (క్రీ.శ.1473 - 1543) రాకతో సూర్యకేంద్ర సిద్ధాంతం వచ్చింది. ఈ భావాన్ని



జీర్ణించుకోలేని ఆనాటి మత పెద్దలు గగ్గోలు పెట్టారు. "సూర్యుని నిలబెట్టి భూమిని దాని చుట్టూ తిప్పుతున్న నీచులను బంధించి, శిక్షించమని" ఉత్తర్వులు జారీ చేశారు. దాని ప్రకారం కోపర్నికస్, గెలీలియో, బ్రూనో వంటి గొప్ప శాస్త్రజ్ఞులకు శిక్షలు విధించి, చిత్రహింసలు పెట్టారు. బ్రూనోను క్రీ.శ.1600 సంవత్సరంలో సజీవంగా దహనం చేశారు. ఇలా ఎందరో శాస్త్రవేత్తలు మతమౌఢ్యానికి బలయ్యారు. అయినా శాస్త్రవేత్తలు ఏనాడు వెనుకంజవేయలేదు. విజ్ఞాన శాస్త్రం ఏనాడూ ఆగిపోలేదు.

చార్లెస్ డార్విన్, అల్బర్ట్ ఐన్‌స్టీన్ వంటి గొప్ప శాస్త్రవేత్తల రాకతో విజ్ఞాన శాస్త్రం కొత్త పుంతలు తొక్కింది. డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం శాస్త్రరంగంలో విప్లవాత్మకమైన మార్పులను తెచ్చాయి. ఈనాడు శాస్త్రం అన్ని రంగాలలోను అనూహ్యమైన విజయాలను సాధిస్తూ, అప్రతిహతంగా ముందుకు సాగిపోతున్నది. అంతరిక్షంలో గ్రహాంతరయానాలు సాధ్యపడుతున్నాయి. జీవశాస్త్రరంగంలో, వైద్యరంగంలో సాధించిన విజయాలు అపూర్వం, అద్భుతం. సాంకేతిక విప్లవం వల్ల పారిశ్రామిక ప్రగతి వేలరెట్లు పెరిగింది. సమాచార విప్లవం విజ్ఞానాన్ని సామాన్యులకు అందుబాటులోకి తెచ్చింది. కంప్యూటర్లు, సెల్ ఫోన్‌ల రాకతో ప్రపంచ స్వరూపమే మారిపోయింది.

ఈ విజయాల వెనుక దాగిన రహస్యమేమిటి అని ప్రశ్నించుకుంటే మనకు లభించే సమాధానం ఒక్కటే. మానవుడిలో దాగిన హేతుత్వం, సంకల్పం, జిజ్ఞాసలే దీనికి కారణమని స్పష్టంగా అర్థమవుతుంది. ఈ హేతువాద లక్ష్యమే మానవవాదం.

మానవవాదాన్ని చాలామంది మానవతావాదంగా భావిస్తున్నారు. మానవతావాదానికి, మానవవాదానికి మౌలికమైన తేడా వుంది. మానవాతావాదం (Humanitarianism) మానవులలో సహజ సిద్ధంగా వుండే జాలి, దయ, కరుణ వంటి అంశాలకే పరిమితమై వుంటుంది. కష్టాలలో వున్నవారిని చూసి జాలిపడడం, చేతనైన సహాయాన్నందించడం, పరోపకారం మానవతావాదంగా పరిగణించవచ్చు. అది ఆయా సందర్భాలలో మనుషులందరిలోను వెల్లడయ్యే తాత్కాలిక స్పందన మాత్రమే. అందులో సిద్ధాంతంగాని, స్పష్టమైన లక్ష్యంగాని వుండదు.

మానవతావాదానికి భిన్నమైనది మానవవాదం (Humanism). మానవవాదంలో మనిషికి ప్రాధాన్యత వుంటుంది. మానవుడు తనకు తానే లక్ష్యమని మరో లక్ష్యానికి

సాధనం కాదని మానవవాదం భావిస్తుంది. వ్యక్తి స్వేచ్ఛకు, వ్యక్తి శ్రేయస్సుకు అత్యంత ప్రాధాన్యాన్నిచ్చేది మానవవాద మవుతుంది. మానవవాదాన్ని ఈ విధంగా నిర్వచించవచ్చు.

"వ్యక్తికి ప్రథమస్థానాన్నిచ్చి, స్వేచ్ఛగా హుందాగా జీవించే మానవ హక్కును గుర్తించే మానసిక వైఖరి, తత్వమే మానవవాదం." మానవుడే అన్నిటికీ ప్రమాణం (Man is the measure of all things) అనేది దాని మౌలిక సూత్రం.

మానవుడు తన శ్రేయస్సు కోసం, సుఖసంతోషాల కోసం అనేక సిద్ధాంతాలను రూపొందించుకున్నాడు. అనేక సంస్థలను నిర్మించుకున్నాడు. తాత్విక, సామాజిక, ఆర్థిక, రాజకీయాది రంగాలలో ఎన్నెన్నో మజిలీలను దాటుతూ వచ్చాడు.

తాత్వికరంగంలో భావవాదం (Idealism), భౌతికవాదం (Materialism), ఆస్తికవాదం (Theism), నాస్తికవాదం (Atheism), అజ్ఞేయవాదం (Agnosticism), అనుభూతివాదం (Existentiatism), గతి తార్కిక భౌతిక వాదం (Dialectical Materialism), అద్వైతం (Non-dualism), ఏకత్వవాదం (Monoism), భౌతికవాస్తవిక వాదం (Physical Realism) వంటి సిద్ధాంతాలను ఏర్పరచుకుని సాగిపోతున్నాడు. తాను నమ్మిన తాత్విక సిద్ధాంతాలే తన దృక్పథాన్ని నిర్ణయిస్తున్నాయి. ఆ దృక్పథం ప్రకారమే ప్రతి విషయాన్ని నిర్ధారించుకుంటాడు. దాని ప్రకారమే నడుచుకుంటాడు.

మనిషి తాత్విక దృక్పథం మీద ఆధారపడే అతని సామాజిక, ఆర్థిక, రాజకీయ భావాలు వుంటాయి.

సమాజంలో నేడు కనిపిస్తున్న అసమానతలకు, అన్యాయాలకు, దోపిడీ దౌర్జన్యాలకు సమాజంలో నివసిస్తున్న పౌరులే కారణమని తెలుస్తుంది. ప్రతి మనిషి తన కర్మలకు, ప్రవర్తనకు తానే బాధ్యత వహించాలి. మానవవాదంలోని ముఖ్యాంశ మిదే. మానవుడే చరిత్ర నిర్మాత. అతని భవితవ్యానికి, మంచిచెడులకు అతడే కారకుడు.

మానవవాదంలో విలువలకు అత్యంత ప్రాధాన్యత వుంటుంది. జీవించి వుండాలనే కోరిక ప్రాణుల్నిటికి మౌలికమైన కోరిక. ఆ ప్రకారం మానవులు మానవులుగా జీవించాలనే కోరిక స్వేచ్ఛాపిపాస సారం. మానవ జీవన సారం స్వేచ్ఛ. స్వేచ్ఛ అంటే నిర్బంధ రాహిత్యం. విలువలన్నిటికి విలువ స్వేచ్ఛ.



వ్యక్తులలోని శక్తి సామర్థ్యాల వికాసాన్ని నిరోధించే ఆటంకాలన్నీ క్రమంగా అదృశ్యం కావడమే స్వేచ్ఛ. ఆకలిదప్పుల నుండి స్వేచ్ఛ ఆర్థిక రంగానికి సంబంధించినదైతే, అహేతుకమైన, నిర్బంధ పూరితమైన ఆచార సంప్రదాయల నుండి స్వేచ్ఛ సామాజిక రంగానికి సంబంధించినదవుతుంది. ప్రాథమిక హక్కులను అనుభవించడం రాజకీయ రంగంలోని స్వేచ్ఛ. స్వేచ్ఛ అంటే విశృంఖలత్వం కాదు. మన స్వేచ్ఛ ఇతరుల స్వేచ్ఛకు ఆటంకం కలిగించరాదు. సామాజిక శ్రేయస్సుకోసం స్వేచ్ఛపై స్వచ్ఛందంగా కొన్ని హేతుబద్ధమైన పరిమితులను విధించుకోవాలి.

మానవవాదంలో మరో ముఖ్యాంశం సెక్యులర్ నీతి. ప్రతి మనిషి ఇతరులపట్ల ఎలా ప్రవర్తిస్తున్నాడనే అంశంలోనే నీతి ఉత్పన్నమవుతుంది. ఇతరులు మన పట్ల ఏ విధంగా ప్రవర్తించకూడదనుకుంటామో మనం ఇతరుల పట్ల ఆ విధంగా ప్రవర్తించకుండా వుండాలి. ఇదే నైతిక సూత్రానికి మూలం. ఇతరుల మనలను హింసించరాదు అనుకున్నపుడు మనం ఇతరులను హింసించకుండా వుండాలి. నీతి అనేది మానవుడి హేతుత్వంలో నుంచి ఏర్పడింది. అది జీవ పరిణామ క్రమంలో మానవులకు సంక్రమించింది. అందుకే అది సెక్యులర్ నీతి అవుతుంది. మానవుడు జ్ఞాన సంపన్నుడైన కొద్దీ అతని నైతిక విలువలు ఉన్నత ప్రమాణాలను అందుకుంటాయి. అతని స్వేచ్ఛాపరిధులు విస్తృతమవుతాయి.

లక్ష్య సాధనాల మధ్య సమన్వయముండాలనేది మానవవాదంలోని ముఖ్యసూత్రం. మంచి సాధనం ద్వారానే మంచి లక్ష్యాన్ని సాధించగలం గాని చెడుసాధనం ద్వారా మంచి లక్ష్యాన్ని చేరలేమంటుంది మానవవాదం. అంటే చెడు కార్యకలాపాలద్వారా సత్ఫలితాలను సాధించలేము. తప్పుడు విధానాలద్వారా, తప్పుడు పద్ధతుల ద్వారా సరియైన గమ్యాలను చేరుకోలేము.

మానవవాదం వ్యక్తికి అత్యంత ప్రాధాన్యాన్నిస్తుంది. అందువల్ల వ్యక్తి స్వేచ్ఛకు, శ్రేయస్సుకు భంగం కలిగించే వాటినన్నిటినీ అది నిరాకరించి, తిరస్కరిస్తుంది. వ్యక్తులే సమాజ నిర్మాతలు. వ్యక్తులకు భిన్నంగా, అతీతంగా సమాజాన్ని వూహించలేము. అందువల్ల సమాజ శ్రేయస్సు ఎల్లప్పుడూ వ్యక్తి శ్రేయస్సుతో ముడిపడి వుంటుంది. ఆ విధంగా ఒక సమాజం అభ్యుదయకరమైందా, కాదా అని నిర్ణయించాలంటే వాస్తవంగా ఆ సమాజంలో

నివసిస్తున్న ప్రతి వ్యక్తి అభ్యుదయాన్ని కొలబద్ధగా తీసుకోవాలి. వ్యక్తులు ఏ మేరకు అభివృద్ధి చెందితే ఆ మేరకే ఆ సమాజం అభివృద్ధి చెందినట్లు భావించాలి.

మనుషులను కులాలవారీగా , మతాలవారీగా, వర్గాలవారీగా విభజించి వారి మధ్య విద్వేషాలను సృష్టించడం, ఆవేశాలను రెచ్చగొట్టడం అహేతుకం, అమానుషం. వీటిన్నిటికి అతీతంగా మనుషులంతా ఒక్కటే అనే సమానత్వ భావాన్ని, విశ్వజనీనతత్వాన్ని మానవవాదం ప్రోత్సహిస్తుంది. మనుషుల మధ్య పరస్పర సహకార భావాన్ని పెంపొందిస్తుంది. మన సుఖసంతోషాలు మన చుట్టూవున్న వారి సుఖసంతోషాలతో ముడిపడి వున్నాయని గుర్తించి, అందరి మధ్య ఐక్యతాభావాన్ని నెలకొల్పుతుంది. సమతా సమాజానికి నాంది పలికి, పునాదుల నేర్పరుస్తుంది.

మానవవాదం ప్రజాస్వామ్యభావాన్ని రాజకీయాల వరకే పరిమితం చేయదు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వమనే ప్రజాస్వామ్య భావాలను మానవుడి జీవన రంగాలన్నిటిలోను ప్రతిబింబించాలని ఆశిస్తుంది. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి వివేకవంతమైన విద్య ఒక్కటే సరియైన మార్గంగా భావిస్తుంది. ప్రజలు చైతన్య వంతులై తమ సమస్యలను తామే పరిష్కరించుకునేలా వారిని తీర్చిదిద్దుతుంది. అందువల్ల మానవవాదులంతా ప్రజలకు ధర్మకర్తలుగా, రక్షకులుగా వుండరు. మానవవాదులు ప్రజలకు స్నేహితులుగా, తత్వవేత్తలుగా, మార్గదర్శకులుగా మాత్రమే వుంటారు.

మనం రాజ్యాంగంలో ప్రతి పౌరుడు పాటించవలసిన ప్రాథమిక విధులను (Fundamental Duties) పొందుపరచుకున్నాం. అందులో అర్టికల్ 51 (ఎ) (హెచ్)లో ఇలా వ్రాసుకున్నాం.

It is the Fundamental duty of every citizen of India to develop scientific temper, humanism and the spirit of enquiry and reform.

అంటే శాస్త్రీయతత్వాన్ని, మానవవాదాన్ని, విచారణశీలాన్ని, సంస్కరణను పెంపొందించడం ప్రతి భారతీయ పౌరుడి ప్రాథమిక విధి.

అయితే ఇంత స్పష్టంగా మనం రాజ్యాంగంలో పేర్కొన్నప్పటికి ఆచరణలో మాత్రం అందరం దీనికి విరుద్ధంగా ప్రవర్తించడం శోచనీయం.



అందరం శాస్త్రం అందిస్తున్న సకల సౌకర్యాలను హాయిగా అనుభవిస్తున్నాం. ఆచరణలో మాత్రం శాస్త్రీయతత్వానికి, శాస్త్రీయ దృక్పథానికి తిలోదకాలిస్తున్నాం. తద్విరుద్ధంగా మూఢ విశ్వాసాలను, అహేతుక భావాలను, అర్థం లేని ఆచార సాంప్రదాయాలను ప్రోత్సహిస్తున్నాం. అభ్యుదయానికి అడ్డుగోడలను సృష్టించుకుంటున్నాం. వందలవేల సంవత్సరాలు గడిచినా కృత్రిమమైన అహేతుకమైన కులమతాల ఊబి నుండి బయట పడలేక పోతున్నాం.

ఈ క్లిష్ట పరిస్థితుల నుండి బయటపడాలంటే హేతువాద భావాలతో కూడిన భావ విప్లవమొక్కటే శరణ్యం. సమాజంలో ఏ మార్పు రావాలన్నా ముందుగా ఆ మార్పు మనుషుల మస్తిష్కాలలో రావాలి. అంటే ముందుగా మన భావాలలో సమూలమైన మార్పు రావాలి. భావాలలో మార్పు రావడాన్నే భావవిప్లవం అంటాం. మనకెన్ని చట్టాలున్నా అవి సక్రమంగా అమలు కాకపోవడానికి కారణం మన భావాలలోనే వుంది. ఈ భావాలకు కారణభూతమైన మన తాత్విక దృక్పథంలోనే వుంది. అందువల్ల మనం ఆధునిక విజ్ఞానం అందించే తాత్విక దృక్పథాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని ముందుగా అలవరచుకోవాలి. అప్పుడే మన సామాజిక, సాంస్కృతిక జీవనంలో సరియైన మార్పులు చోటు చేసుకోగలవు. మనమంతా అటువంటి హేతువాద భావ విప్లవానికి, మానవవాద విలువలకై చిత్తశుద్ధితో, ఐక్యంగా కృషి చేద్దాం.

*(ఖజానా లెక్కశాఖ స్వర్ణోత్సవ సంచిక, ఫిబ్రవరి 2009)*



## గుమ్మా వీరన్న

కర్నూలు జిల్లా, నందవరం మండలం, నాగులదిన్నె గ్రామంలో 1952 మే 22న జననం. ఎమ్మిగనూరులో హైస్కూలు విద్యను అభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ., ఎల్.ఎల్.బి. పట్టాలు తీసుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి అడిషనల్ డైరెక్టర్‌గా 2010 మేలో పదవీ విరమణ చేశారు.

1974 నుండి కమ్యూనిస్టు, నాస్తికోద్యమంలో పనిచేసి, 1980 నుండి హేతువాద మానవవాద ఉద్యమాలలో కొనసాగుతున్నారు. భారత హేతువాద సంఘానికి ఉపాధ్యక్షులుగా వున్నారు. 2010 జూన్ నుండి ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

హేతువాదం - భావవిప్లవం (1984), హేతువాదం - మార్క్సిజం (1987), నవ్య మానవవాదమీనాటి బాట (1996), స్వేచ్ఛ (2001), హేతువాదం - స్వరూప స్వభావాలు (2007), భారతీయ సంస్కృతి - తత్వం (2008 - పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ) మున్నగు స్వతంత్ర రచనలు చేశారు. రాడికల్ హ్యూమనిజం, గతి తార్కిక భౌతిక వాదం శాస్త్రీయమా?, మానవజాతికి మతమెందుకు?, ఆంధ్రప్రదేశ్‌లో మానవవాద ఉద్యమం వంటి అనువాద రచనలు చేశారు.

హేతువాద భావాల వ్యాప్తికి కృషి చేసినందుకుగాను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి నుండి 2008లో కవిరాజు త్రిపురనేని రామస్వామి అవార్డును అందుకున్నారు.

భావ విప్లవోద్యమం ద్వారా మానవవాద పునాదులపై సమాజ పునర్నిర్మాణానికి కృషి చేయడం జీవిత లక్ష్యం.



గుమ్మా వీరన్న

కర్నూలు జిల్లా, నందవరం మండలం, నాగుల దిన్నె గ్రామంలో 1952 మే 22న జననం. ఎమ్మిగనూరులో హైస్కూలు విద్యను అభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ., ఎల్.ఎల్.బి. పట్టాలు తీసుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి అడిషనల్ డైరెక్టర్‌గా 2010 మేలో పదవీ విరమణచేశారు.

1974 నుండి కమ్యూనిస్టు, నాస్తికోద్యమంలో పనిచేసి, 1980 నుండి హేతువాద మానవవాద ఉద్యమాలలో కొనసాగుతున్నారు. భారత హేతువాద సంఘానికి ఉపాధ్యక్షులుగా వున్నారు. 2010 జూన్ నుండి ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

హేతువాదం - భావవిప్లవం (1984), హేతువాదం - మార్క్సిజం (1987), నవ్య మానవవాదమీనాటి బాట (1996), స్వేచ్ఛ (2001), హేతువాదం - స్వరూప స్వభావాలు (2007), భారతీయ సంస్కృతి - తత్వం (2008 - పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ) మున్నగు స్వతంత్ర రచనలు చేశారు. రాడికల్ హ్యూమనిజం, గతి తార్కిక భౌతిక వాదం శాస్త్రీయమా?, మానవజాతికి మతమెందుకు?, ఆంధ్రప్రదేశ్‌లో మానవవాద ఉద్యమం వంటి అనువాద రచనలు చేశారు.

హేతువాద భావాల వ్యాప్తికి కృషి చేసినందుకుగాను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి నుండి 2008లో కవిరాజు త్రిపురనేని రామస్వామి అవార్డును అందుకున్నారు. భావ విప్లవోద్యమం ద్వారా మానవవాద పునాదులపై సమాజ పునర్నిర్మాణానికి కృషి చేయడం జీవిత లక్ష్యం.